

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 6.00

సంపుటి: 11
సంచిక: 286

ఆదివారం 6-1-2019

పట్టు బిగించింది...

ఆస్ట్రేలియాతో నాలుగో టెస్టులో భారత్ పట్టు బిగించింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లకు 236 పరుగులు చేసింది. మరో 2 రోజుల ఆట మిగిలి ఉన్న ఈ మ్యాచ్ 'డ్రా'గా ముగిసినా... భారత్ 2–1తో తొలిసారి ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్‌ను దక్కించుకుంటుంది.

–స్పోర్ట్స్‌లో



SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



నేడు ప్రేమ పరిమళించే రోజు

తొలి అడుగు తొలి ఆదివారమే

కొత్త సంవత్సరం అంటే కొత్త ప్రారంభం. కెరీర్‌లోకి, జీవితంలోకి లేదా ప్రేమలోకి తొలి అడుగు పడాలని అనుకుంటాం. అయితే ఉద్యోగంలోకి ఆఫీస్ మెట్లు ఎక్కినట్లుగా, జీవితంలోకి ఏడు అడుగులు నడిచినట్లుగా.. ముందుగా ప్రయత్నించి ప్రేమలోకి ప్రయాణించలేం. ఎక్కడి నుంచో ప్రేమ పరిమళం వచ్చి హృదయాన్ని తాకాలి. అక్కడికి మనసు వెళ్లిపోవాలి. అలా మొలకెత్తిన ప్రేమాంకురం జీవితాన్ని గుబాళింపజేస్తుంది. అయితే ప్రేమకు తొలి అడుగు కొత్త సంవత్సరంలో వచ్చే తొలి ఆదివారమే పడుతుందని ఆన్‌లైన్ డేటింగ్‌ల డేటా అధ్యయనంలో తాజాగా వెల్లడైంది. అందుకే జనవరిలో తొలి ఆదివారానికి 'డేటింగ్ సండే' అని డేటింగ్ డాట్‌కామ్‌లు పేరు పెట్టేశాయి. డేటింగ్ యాప్ 'హింజ్' గత రెండేళ్లుగా తన దగ్గరున్న 'యాక్టివిటీ డేటా'ను విశ్లేషించినప్పుడు ఆసక్తికరమైన ఈ సంగతి బయట పడింది! ఆ మెసేజ్‌లు, సంభాషణలు సునిశితంగా పరిశీలించినప్పుడు కొత్త సంవత్సరంలో వచ్చే ఫస్ట్ సండేలో చాలా మంది తొలిసారి కలుసుకున్నట్లు, తొలిసారి ముఖాముఖీ మాట్లాడుకున్నట్లు, తొలిసారి ఏదైనా ఇచ్చిపుచ్చుకున్నట్లు, తొలిసారి డిన్నర్‌కి వెళ్లినట్లు.. ఇలా ఎన్నో ఫస్ట్‌లు ఆ రోజునే జరగడాన్ని విశ్లేషకులు గమనించారు. 2017లో హింజ్ ద్వారా ఒకరికొకరు పరిచయం అయినవారిలో 41 శాతం మంది కన్నా ఎక్కువ మంది డేటింగ్ సండే నాడే హలో అంటూ పలకరించుకున్నారు. 2018కి ఆ సంఖ్య 59 శాతానికి పెరగడాన్ని బట్టి నిజంగానే ఈ రోజుకు ఏదో ప్రత్యేకత ఉందని అనిపిస్తుందని హింజ్ ప్రతినిధి ఒకరు అభిప్రాయపడ్డారు. అలాగే ఈ డేటింగ్ సైట్ ద్వారా ఒకరిపై ఒకరు ఆసక్తి చూపుకున్న వారిలో 2017లో కేవలం 36 మంది డేటింగ్ సండే రోజు 'డేటింగ్'కి ఒక రోజును ఫిక్స్ చేసుకోగా, అలా అదే రోజు ఫిక్స్ చేసుకున్న వారి శాతం 2018 నాటికి 62 శాతానికి పెరగడం విశేషం. ఈ ఏడాది జనవరిలో తొలి ఆదివారం (అంటే నేడే) ఈ శాతం మరింత పెరగవచ్చునని 'హింజ్' భావిస్తోంది. అంతే కాదు, ఇవాళ తొలిసారిగా ఏదైనా ముందడుగు వేయబోయే ప్రేయసీ ప్రియుల ప్రయత్నాలు కమ్మటి పరిమళంతో సాఫల్యం చెందాలని ఆకాంక్షిస్తోంది. అలాగే 'టిండర్', 'ఒకేక్యుపిడ్' డేటింగ్ యాప్‌లు కూడా తొలి నెలలో హృదయాల కలబోత కాస్త తరుచు ఉండడాన్నే గమనించినట్లు శారా యంగ్ అనే విశేష కథనాల వ్యాసకర్త 'ఇండిపెండెంట్' పత్రికలో రాశారు. మరికొన్ని జాతీయ పత్రికలు ఈ డేటింగ్ సండే గురించి రాస్తూ, అద్భుతంగా పరిమళించిన రెండు ప్రేమ కథనాలను కూడా ఉటంకించాయి.

జాతీయ పరిమళం

'లవ్ ఈజ్ బ్లైండ్' అంటారు. ప్రేమకు చూపు ఉండదట! మరి ఏముంటుంది? హృదయం. మరి హృదయానికైనా చూపు ఉండాలి కదా. ఉంటుంది కానీ పైపై చూపు ఉండదు. అంతర్నేత్రంతో చూస్తుంది. చూసినా అది రూపురేఖలు చూడదు. రూపాయలను చూడదు. కులమేంటో చూడదు. మతమేంటో కూడా చూడదు. ఉత్తరమా దక్షిణమా, తూర్పా, పడమరా, ఈ దేశమా, ఆదేశమా అని కూడా చూడదు. మరేం చూస్తుంది? ప్రేమను చూస్తుంది. ప్రేమను మాత్రమే చూస్తుంది. ఇందుకు ఒక నిదర్శనం సునీల్ పరిహార్, నెటాలీ.

వీళ్ల కథ రైలు పట్టాల మీద దొరకలేదు. రక్తపు ఉత్తరాల్లో దొరకలేదు. నదిలో దొరకలేదు. సముద్రంలో దొరకలేదు. కథలన్నీ చేరే కంచిలోనూ దొరకలేదు. మరెక్కడ దొరికింది? కాశీలో! ఉత్తరప్రదేశ్‌లోని కాశీలో. సునీల్‌ది కాశీ. నెటాలీది స్విట్జర్లాండ్! ఇద్దరి మధ్య దూరం 6913 కి.మీటర్లు. విమాన మార్గంలో 4290 మైళ్లు. స్విట్జర్లాండ్ నుండి ఇండియా రావాలంటే ఒక దారిలో ఇటలీ, గ్రీసు, టర్కీ, సిరియా, ఇరాక్ దాటి రావాలి. ఇంకో దారిలో ఆస్ట్రియా, రొమేనియా, టర్క్మెనిస్తాన్, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్ పాకిస్తాన్ దాటుకుని రావాలి. ఏం? అబ్బాయే ఇండియా నుంచి స్విట్జర్లాండ్ వెళ్లకూడదా... అంత ప్రేమ ఉంటే?! ప్రేమ ఉంది కానీ, వెళ్లే స్థోమత లేదు. టెన్త్ క్లాస్‌లో బడి మానేసి, బతుకు తెరువుకోసం బొమ్మలేసుకుంటున్న వాడు అంతదూరం ఎలా వెళ్లగలడు? అందుకే అమ్మాయే ఇండియా వచ్చేసింది. స్విట్జర్లాండ్‌లో చేస్తున్న టీచర్ ఉద్యోగం మానేసి మరీ సునీల్ కోసం ఇండియా వచ్చేసింది. సునీల్ కోసం కాదు. సునీల్ ప్రేమ కోసం. అంతగా అతడు ఆమెను ప్రేమించాడు. ఇద్దరూ మెయిల్స్ పంపుకున్నారు. ఫోన్‌లలో మాట్లాడుకున్నారు. చివరికి పెళ్లి చేసుకోవడం కరెక్ట్ అనుకున్నారు. ఇద్దరికీ రెండు దేశాల్లో ఎవరి కుటుంబాలు వారికి ఉన్నాయి. ఎవరి పెద్దలు వారికి ఉన్నారు. ఏడాది వయసున్న వీళ్ల ప్రేమ గురించి

రెండు దేశాల్లో, రెండు కుటుంబాలకీ వీళ్ల ప్రేమ గురించి తెలుసు. ఇండియా వెళ్తున్నానని నెటాలీ ఇంట్లో చెప్పి వచ్చింది. నెటాలీని ప్రేమించానని ఇంటికి తీసుకెళ్లి మరీ చెప్పాడు సునీల్. అలాగే పెళ్లి విషయం కూడా. కొడుకు మాట కాదనలేదు సునీల్ తల్లిదండ్రులు. అయితే పెళ్లి మాత్రం తమ కళ్లముందే జరగాలని ఆశపడ్డారు. రెండు దేశాల మధ్య పెళ్లంటే ఇంట్లో పెళ్లి పందిట్లో జరిగితే సరిపోదు. అందుకే సునీల్, నెటాలీ కలిసి కాశీకి దగ్గర్లోని టికంఘర్‌లోని అడ్మినిస్ట్రేటివ్ కోర్టులో అప్లికేషన్ పెట్టుకున్నారు. లాంఛనాలన్నీ (పెళ్లి లాంఛనాలు కాదు, అధికార లాంఛనాలు) పూర్తవడానికి రెండు నెలల సమయం పడుతుందనీ, అంతవరకు ఆగాలని అక్కడి అధికారులు చెప్పారు. అంతదూరం నుండి వచ్చిన దానిని ఎంతకాలమైనా ఆగుతాను అని నెటాలీ చిరునవ్వులు చిందిస్తుంటే ఆమె భుజానికున్న బ్యాగును సరిచేస్తూ ఆమెను ప్రేమగా అనుసరిస్తున్నాడు సునీల్.

చివరికి సునీల్‌ను నెటాలీ కలుసుకున్నది తొలిసారిగా అతడి గ్యాలరీలోనే. ఆ తర్వాతే వారిలో ప్రేమ చిగురించింది. ఆన్‌లైన్‌లో అతడి బొమ్మల్ని ప్రేమించిన నెటాలీ, లైఫ్‌లైన్‌లో అతడిని ప్రేమించడం మొదలుపెట్టింది. సునీల్ చక్కగా ఇంగ్లీషు మాట్లాడతాడు! నెటాలీ చక్కగా హిందీ అర్థం చేసుకోగలుగుతుంది. ఇక ప్రేమకు అడ్డేముంటుంది.

అంతర్జాతీయ పరిమళం

ప్రేమ ఏమైనా చేయగలదు. కానీ అది సినిమాల్లో మాత్రమే అన్నది చాలామంది నమ్మకం! ఐతే నిజ జీవితంలోనూ ప్రేమ మహిమను చూపించే సంఘటనలు అప్పుడప్పుడు జరుగుతుంటాయి. ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, కోమాలోకి వెళ్లిపోయి, మృత్యువు అంచులకు చేరిన ఒక వ్యక్తి, మళ్లీ స్పృహలోకి రావడమే కాదు, పూర్తిగా కోల్పోయిన తన జ్ఞాపకశక్తిని, తన ప్రేయసి ప్రేమతో కొన్నేళ్ల తర్వాత తిరిగి తెచ్చుకున్న అద్భుత గాథ ఇది.

కాలిఫోర్నియాకు చెందిన స్టీవార్ట్, క్రిస్సీ ప్రెయిట్ ప్రేమికులు. వాళ్లిద్దరి పెళ్లికి పెద్దల ఆమోదం కూడా లభించింది. మరి కొన్ని నెలల్లో వారి పెళ్లి కావాల్సింది. ఇద్దరూ తమ పెళ్లి గురించి కలలు కంటున్న సమయమది. కానీ పదేళ్ల క్రితం జూన్ 13న వారి కలలన్నీ కల్లలయ్యే సంఘటన జరిగింది. స్టీవార్ట్ తండ్రి సంబంధం మాట్లాడ్డానికి క్రిస్సీ ఇంటికెళ్లాడు. తర్వాత స్టీవార్ట్‌ను కూడా అక్కడికి రమ్మన్నాడు. స్టీవార్ట్ తన స్నేహితుణ్ని వెంటబెట్టుకుని కార్లో బయల్దేరాడు. ప్రేయసిని కలవబోతున్న ఉత్సాహంలో కారు స్పీడు పెంచాడు స్టీవార్ట్. కానీ ఇంకొన్ని కిలోమీటర్లలో అతని ప్రయాణం ముగియబోతుందనగా... పెద్ద ప్రమాదం. ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టాడు స్టీవార్ట్. కారు ధ్వంసమైంది. స్టీవార్ట్ అందులో ఇరుక్కుపోయాడు. స్నేహితుడు ఎలాగోలా బయటికొచ్చాడు. అంబులెన్స్‌కు ఫోన్ చేశాడు. అతి కష్టం మీద స్టీవార్ట్‌ను బయటకు తీసి, హాస్పిటల్‌కు తరలించారు. డాక్టర్లు చేయాల్సిందంతా చేశారు. మెదడుకు తీవ్ర గాయాలవడంతో స్టీవార్ట్ కోమాలోకి వెళ్లిపోయాడు. ఓ దశలో అతణ్ని కాపాడటం అసాధ్యమని వైద్యులు చేతులెత్తేశారు. కానీ క్రిస్సీ ఆశ చంపుకోలేదు. నిద్రాహారాలు మాని స్టీవార్ట్‌ను అంటిపెట్టుకునే ఉంది. అతనికి సపర్యలు చేసింది. ఆమె నమ్మకమే నిజమైంది. పది రోజుల తర్వాత స్టీవార్ట్ స్పృహలోకి వచ్చాడు.

స్టీవార్ట్ తెలివిలోకి వచ్చినప్పుడు అతనన్న మాటలు విని షాకైంది క్రిస్సీ. 'నాకు నువ్వెవరో తెలియదు. కానీ నిన్ను నేను ప్రేమించానని మాత్రం తెలుసు'... ఇవీ స్టీవార్ట్ తొలి పలుకులు. డాక్టర్లు అతని పరిస్థితి చూసి జ్ఞాపకశక్తి కోల్పోయాడని, గతమేదీ గుర్తుకు రాదని, ఇక అతనిది కొత్త జీవితమని చెప్పారు. ఈ మాటలకు క్రిస్సీ బాధపడలేదు. స్టీవార్ట్ బతకడమే గొప్ప అనుకుంది. అతణ్ని కంటికి రెప్పలా కాపాడుకోవాలని నిర్ణయించుకుంది. ఆ స్థితిలోనూ అతణ్ని పెళ్లాడింది. స్టీవార్ట్‌కు అన్నీ తానై వ్యవహరించింది. కొన్నాళ్లకే అతను శారీరకంగా మామూలు మనిషయ్యాడు. ఐదేళ్ల గడిచాక, ఆశ్చర్యకరంగా స్టీవార్ట్‌కు గతం కూడా గుర్తుకొచ్చింది. ఇప్పుడతను ఒకప్పటి స్టీవార్ట్ అయ్యాడు. జూలైలో స్టీవార్ట్, క్రిస్సీలకు కొడుకు పుట్టాడు. అతడికి ఆలివర్ అని పేరు పెట్టుకున్నారు. ఇన్నాళ్లూ భర్తను పసిపిల్లాడిలా కాపాడుకుంటూ వచ్చిన క్రిస్సీ, ఇప్పుడు తమ ముద్దుల పసివాడిని భద్రంగా చూసుకుంటోంది.

మీకూ ఒక ప్రేమ పరిమళం కావాలా?

ఒంటరి జీవితంలో విసుగొచ్చేసి, అమ్మాయి తోడు కావాలనుకున్నప్పుడు ఎవరైనా ఏం చేస్తారు? ఏ మ్యారేజ్ బ్యూరోనో సంప్రదిస్తారు. లేదంటే ఆఫీస్‌లో పనిచేసే అమ్మాయిల్లో ఒకరిని చూసి ప్రపోజ్ చేస్తారు. లేదంటే ఫేస్‌బుక్ లాంటి సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో ట్రై చేస్తారు. కానీ న్యూయార్క్‌కు చెందిన పెరినో మాత్రం కొత్త దారి ఎంచుకున్నాడు. నగరంలో మంచి జంక్షన్లు చూసి, ఫ్లై ఓవర్ పిల్లర్లకు 'లుకింగ్ ఫర్ ఏ గర్ల్ ఫ్రెండ్' అంటూ పెద్ద పెద్ద పోస్టర్లు 1500కు పైగా అంటించాడు. అందులో తన వివరాలు వెల్లడించడమే కాదు, ''నేను నిజంగా గర్ల్‌ఫ్రెండ్ కోసం చూస్తున్నా. ఇది జోక్ కాదు. ఒంటరి జీవితంతో విసిగిపోయా. నాకు సరిపడే పార్ట్‌నర్ దొరుకుతుందని ఆశిస్తున్నా. నేనొక ప్రొఫెషనల్‌ని, సృజనాత్మకంగా ఆలోచిస్తా. మీరేంటో నాకు తెలుసు. నా దృష్టిలో ప్రతి ఒక్కరూ అందమైనవారే. ఓ బలమైన బంధం కోసం ఎదురుచూస్తున్నా'' అంటూ ఓ సుదీర్ఘం సందేశం పెట్టాడు ఆ పోస్టర్లో. ఆసక్తి ఉన్నవాళ్లు సంప్రదించండంటూ చివర్లో తన ఫోన్ నంబర్ కూడా ఇచ్చాడు పెరినో.

పెరినో ప్రయోగానికి మంచి స్పందనే వచ్చింది. పోస్టర్లు అంటించిన నాటి నుండి కొన్ని రోజుల పాటు సగటున రోజుకు 130 కాల్స్ దాకా వచ్చాయతనికి. కొందరు ఆకతాయిలు ఫోన్ చేసి ఇబ్బంది పెడుతున్నప్పటికీ ఎక్కువ మంది అతని ప్రపోజల్ పట్ల సానుకూలంగా స్పందించారు. కొందరు మీ ఐడియా సూపరంటూ ప్రశంసిస్తే, ఇంకొందరు డేటింగ్‌కి రెడీ అన్నారు. అయితే డేటింగ్‌కి పిలిచినవాళ్లందరికీ ఖర్చు చేయడమంటే కష్టం కదా. అందుకే వాళ్లందరికీ ఓ కండీషన్ పెట్టాడు పెరినో. తొలి డేట్‌లో కేవలం కాఫీ మాత్రమే తాగుదాం. ఎవరి బిల్లు వారిది. మనసులు కలిస్తే రిలేషన్ మొదలుపెడదాం అన్నది అతని ప్రతిపాదన. ప్రస్తుతం రోజుకో అమ్మాయిని కలుస్తూ తనకు సూటయ్యే పార్ట్‌నర్‌ని ఎంచుకునే ప్రయత్నంలో ఉన్నాడు పెరినో. ఇంతకీ అతని వయసెంతో తెలుసా? 51. అంత వయసున్న పెరినోకే ఆ స్థాయిలో రెస్పాన్స్ వచ్చిందంటే, కుర్రాళ్లు కూడా ఇలాంటి పోస్టర్లు అతికిస్తే ఇంకెంత స్పందన ఉంటుందో!

సాక్షి స్పోర్ట్స్
ఆదివారం
6-1-2019



మాటలు మాత్రమేనా... ఇచ్చేదేమైనా ఉందా!

భారత యువ షూటర్ మను భాకర్ వివాదంలో చిక్కుకుంది. మను గత ఏడాది యూత్ ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలుచుకుంది. దానికి సంబంధించి హరియాణా క్రీడల మంత్రి అనిల్ విజ్ నాడు మనును అభినందించడంతో పాటు రూ. 2 కోట్లు ఇస్తామంటూ ట్వీట్ చేశారు. అయితే ఇప్పటి వరకు ఆమెకు డబ్బు అందలేదు. దాంతో మంత్రి పాత ట్వీట్‌ను మళ్లీ పోస్ట్ చేస్తూ మనూ... 'సర్, ఇది నిజమా కాదా చెప్పండి, కేవలం మాట వరసకు చెప్పిన అబద్ధపు వాగ్దానమేనా' అని వ్యాఖ్యను జోడించింది. మను ఇలా ప్రశ్నించడం మంత్రికి ఆగ్రహం తెప్పించింది. ఆమె వ్యవహరించిన తీరుపై క్షమాపణ చెప్పాలని కోరారు.

మరికొన్ని గంటల్లో...

సిరీస్ విజయానికి రంగం సిద్ధం

- సిడ్నీ టెస్టుపై భారత్ పట్టు
- తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 236/6
- కుల్దీప్‌కు 3, జడేజాకు 2 వికెట్లు

ఏ మూలనో వాన అడ్డుగా నిలుస్తుందనే అనుమానాలున్నా... సిడ్నీ టెస్టులో కోహ్లి సేన గెలుపునకు వచ్చిన ఢోకా ఏమీ లేదనిపిస్తోంది. తొలి రెండు రోజులు బ్యాట్‌తో, మూడో రోజు బంతితో ఆధిపత్యం చాటిన భారత్... క్రమంగా విజయానికి చేరువవుతోంది. వరుణుడు అడ్డుకుంటే తప్ప... ఏం చేసినా, ఓటమి తప్పించుకోలేని పరిస్థితిని ఆస్ట్రేలియాకు కల్పించింది. వాతావరణం, పిచ్ అనుకూలిస్తే... టీమిండియా ఆదివారమే మ్యాచ్‌ను ముగించినా ఆశ్చర్యం లేదు. లేదంటే సోమవారం...! తద్వారా, డిసెంబర్ 6న మొదలైన నాలుగు టెస్టుల సిరీస్ సమరానికి అద్వితీయమైన 3-1 గణాంకంతో ఘనంగా వీడ్కోలు పలకనుంది.



కుల్దీప్‌కు సహచరుల అభినందన

సిడ్నీ: భారీ స్కోరు సాధించి బ్యాట్స్‌మెన్ ఆత్మవిశ్వాసం ఇవ్వగా... బౌలర్లు తమవంతుగా బాధ్యత నెరవేర్చుతుండటంతో సిడ్నీ టెస్టుపై టీమిండియా పట్టు మరింత బిగించింది. ఇక్కడ జరుగుతున్న నాలుగో టెస్టులో మూడో రోజు వర్షం కారణంగా ఆట నిలిచే సమయానికి ఆతిథ్య ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసింది. ఓపెనర్ మార్కస్ హారిస్ (120 బంతుల్లో 79; 8 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించాడు. వన్‌డౌన్‌లో వచ్చిన లబ్‌షేన్ (95 బంతుల్లో 38; 7 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. ప్రస్తుతం మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ హ్యాండ్స్‌కోంబ్ (91 బంతుల్లో 28 బ్యాటింగ్; 3 ఫోర్లు); కమిన్స్ (41 బంతుల్లో 25 బ్యాటింగ్; 6 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. రెండు రోజుల ఆట మిగిలి ఉండగా భారత్ తొలి ఇన్నింగ్స్ స్కోరు (622/7 డిక్లేర్డ్)కు ఆ జట్టు ఇంకా 386 పరుగులు వెనుకబడి ఉంది. టీమిండియా బౌలర్లలో కుల్దీప్ (3/71) మూడు వికెట్లు పడగొట్టగా, జడేజా (2/62) రెండు తీశాడు. షమీ (1/54)కి ఒక వికెట్ దక్కింది. శనివారం వర్షం కారణంగా 16 ఓవర్లపైగా ఆట రద్దయింది. దీంతో ఆదివారం అరగంట ముందుగా మ్యాచ్ ప్రారంభం కానుంది.

శుభారంభం దక్కినా...

ఓవర్‌నైట్ స్కోరు 24/0తో శనివారం బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాకు ఓపెనర్లు హారిస్, ఖాజా (71 బంతుల్లో 27; 3 ఫోర్లు) నిలకడగా ఆడటంతో శుభారంభం దక్కింది. ఇద్దరిలో హారిస్ మరింత స్వేచ్ఛగా ఆడాడు. పిచ్ నుంచి పేసర్లకు సహకారం లభించకపోవడంతో కోహ్లి... బుమ్రాను ఆపి శనివారం ఐదో ఓవర్లోనే జడేజాను బౌలింగ్‌కు దించాడు. అయినప్పటికీ ఆసీస్ జోడీ పెద్దగా ఇబ్బంది పడలేదు. మరో ఎండ్‌లో కుల్దీప్‌కు బంతినివ్వడం లాభించింది. అతడి బౌలింగ్‌లో ఆఫ్ స్టంప్‌పై పడిన బంతిని ఆడే ప్రయత్నంలో టైమింగ్ తప్పిన ఖాజా... పుజారాకు క్యాచ్ ఇచ్చాడు. దీంతో 72 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఆసీస్ అనూహ్యంగా స్పిన్ ఆల్‌రౌండర్ లబ్‌షేన్‌ను వన్‌డౌన్‌లో పంపింది. బుమ్రా 146 కి.మీ. వేగంతో యార్కర్ సంధించి అతడికి స్వాగతం పలికాడు. అటువైపు 67 బంతుల్లో అర్ధ శతకం పూర్తిచేసుకున్న హారిస్... కుల్దీప్‌పై విరుచుకుపడి మూడు బౌండరీలు బాదాడు. లబ్‌షేన్ కూడా కుదురుకోవడంతో ఆసీస్ 122/1తో లంచ్‌కు వెళ్లింది. విరామం ముగిసిన వెంటనే కంగారూలకు పెద్ద దెబ్బ తగిలింది. నిలదొక్కుకున్న హారిస్... జడేజా బంతిని లేట్ కట్ చేసే యత్నంలో వికెట్ మీదకు ఆడుకున్నాడు. స్లిప్‌లో రహానే చురుకైన క్యాచ్ ద్వారా షాన్ మార్ష్ (8)నూ జడేజానే వెనక్కు పంపాడు. షమీ ఓవర్లో షార్ట్ మిడ్ వికెట్‌లో మరోసారి రహానే చక్కటి క్యాచ్ అందుకోవడంతో లబ్‌షేన్ వెనుదిరిగాడు. హ్యాండ్స్‌కోంబ్, హెడ్ (20) భారత బౌలర్లను 16 ఓవర్లపైగా కాచుకున్నారు. ఈ దశలో టీ విరామానికి ఒక ఓవర్ ముందు, తర్వాతి ఓవర్లో కుల్దీప్ మాయ చేశాడు. తొలుత అతడి ఫ్లయిటెడ్ డెలివరీని ముందుకొచ్చి షాట్ ఆడబోయిన హెడ్... రిటర్న్ క్యాచ్ ఇచ్చాడు. బ్రేక్ తర్వాత ఆసీస్ కెప్టెన్ పైన్ (5)నూ కుల్దీప్ బోల్తా కొట్టించాడు. ఫుల్ టాస్‌గా వచ్చిన బంతిని డ్రైవ్ చేయబోయి పైన్ ఔటయ్యాడు. దట్టమైన మేఘాలతో టీ బ్రేక్‌కు ముందు నుంచి దోబూచులాడిన వాన మూడో సెషన్‌లో ప్రతాపం చూపింది. దీంతో చివరి సెషన్‌లో 15.3 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ఈ వ్యవధిలో హ్యాండ్స్‌కోంబ్, కమిన్స్ మరో వికెట్ పడకుండా చూసుకున్నారు. జడేజా బౌలింగ్‌లో హ్యాండ్స్‌కోంబ్ ఎల్బీడబ్ల్యూపై టీమిండియా రివ్యూ కోరగా నాటౌట్‌గా తేలింది. ఆ వెంటనే వర్షం ప్రారంభమవడంతో ఆట ఆగిపోయింది.



పైన్ బౌల్డ్



హారిస్



మెక్‌గ్రాత్ చేతికి గులాబీ టోపీలు

సిడ్నీ టెస్టు మూడో రోజు భారత్, ఆస్ట్రేలియా ఆటగాళ్లు తమ సంతకాలతో కూడిన గులాబీ రంగు టోపీలను దిగ్గజ పేసర్ గ్లెన్ మెక్‌గ్రాత్‌కు తిరిగిచ్చారు. రొమ్ము క్యాన్సర్‌తో మృతి చెందిన మెక్‌గ్రాత్ భార్య జేన్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఫౌండేషన్‌కు నిధుల సమీకరణలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న తెలిసిందే. ఇందులో భాగంగా ఏటా జనవరిలో నిర్వహించే తొలి టెస్టులో ఆటగాళ్లు 'పింక్' కలర్‌లోని క్రీడా సామాగ్రితో మైదానంలో దిగుతారు. దీనికోసం భారత కెప్టెన్ కోహ్లి సైతం గులాబీ రంగు గ్రిప్‌తో బ్యాటింగ్‌కు దిగాడు. ఇదే సందర్భంలో మ్యాచ్‌కు ముందురోజు ఇరు జట్ల ఆటగాళ్లకు గులాబీ టోపీలు ఇచ్చారు. వీటినే ఆటగాళ్లు శనివారం తిరిగిచ్చారు. దీనిపై 'మైదానంలోనే కాదు... బయట కూడా భారత క్రికెట్ జట్టు అభిమానం పొందింది. అద్భుతమైన సహకారం' అంటూ మెక్‌గ్రాత్ ఫౌండేషన్ ట్వీట్ చేసింది.

ఆస్ట్రేలియాలో బౌలింగ్ కోసమని నేనేమీ మార్పులు చేసుకోలేదు. మెరుగైన టెస్టు బౌలర్‌గా ఎదిగేందుకు నాకు సమయం కావాలి. నెట్స్‌లో కంటే మ్యాచ్‌లు ఆడటం ద్వారానే ఇది సాధ్యం. ఎక్కువ మ్యాచ్‌లు ఆడితే బ్యాట్స్‌మెన్‌పై ఒక అంచనాకు వచ్చి అంతగా ఎదుగుతాం. ఒక లెగ్ స్పిన్నర్ మైండ్ సెట్ పరిమిత ఓవర్ల క్రికెట్ నుంచి టెస్టులకు మారాలంటే కనీసం 10 రోజులు పడుతుంది. – కుల్దీప్, భారత స్పిన్నర్

దూకుడుగా ఆడి స్పిన్నర్లపై పైచేయి సాధించడం ఎప్పుడైనా ఒక సవాలే. మా బ్యాట్స్‌మెన్ మంచి ప్రారంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. తొలి ఇన్నింగ్స్‌లో మేమింకా పోరాడుతున్నాం. టెస్టుల్లో నంబర్‌వన్ జట్టుపై ఆడటం అనుకున్నంత సులువేం కాదు. భారత్‌లా భారీ స్కోర్లు సాధించాలంటే మేం కొన్ని అంశాల్లో మెరుగవ్వాల్సి ఉంది. –మార్కస్ హారిస్, ఆసీస్ ఓపెనర్

మన గెలుపా? లేక 'డ్రా'నా?

ఓవైపు సిడ్నీలో ఆదివారం కూడా వర్షం పడే సూచనలున్నాయి. మరోవైపు పిచ్ బౌలింగ్‌కు అంతంత మాత్రంగానే సహకరిస్తోంది. మన బౌలర్ల కృషిని తక్కువ చేయడం అని కాకుండా... శనివారం ఆసీస్ బ్యాట్స్‌మెన్ పేలవ షాట్ల కారణంగానే ఎక్కువ శాతం వికెట్లు కోల్పోయింది. దీంతో టెస్టు ఫలితం ఏమిటన్నది ఆసక్తికరంగా మారింది. రెండు రోజుల ఆట మిగిలి ఉన్నా ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేస్తుందన్న ఆశలేదు. కనీసం ఫాలోఆన్ తప్పించుకోవాలన్నా చేతిలో ఉన్న నాలుగు వికెట్లతో 187 పరుగులు చేయాలి. ఇదీ అసాధ్యమే. ఈ నేపథ్యంలో ప్రత్యర్థిని ఆదివారం మొదటి గంటలోనే ఆలౌట్ చేస్తే టీమిండియా విజయావకాశాలు మరింత మెరుగవుతాయి. ఇప్పటికైతే సోమవారం వర్షం ముప్పు లేదని వార్తలు వస్తున్నాయి. ఇదే జరిగితే... రెండు రోజుల పాటు నిలవడం ఆసీస్ బ్యాట్స్‌మెన్‌కు కష్ట సాధ్యమే. అప్పుడు 3–1తో సిరీస్ కోహ్లి సేన వశం అవుతుంది. ఒకవేళ భారీ వర్షంతో ఎక్కువశాతం ఆట తుడిచిపెట్టుకుపోతే ఫలితం 2–1గా మారుతుంది.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 622/7 డిక్లేర్డ్;
ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: హారిస్ (బి) జడేజా 79; ఖాజా (సి) పుజారా (బి) కుల్దీప్ 27; లబ్‌షేన్ (సి) రహానే (బి) షమీ 38; షాన్ మార్ష్ (సి) రహానే (బి) జడేజా 8; హెడ్ (సి అండ్ బి) కుల్దీప్ యాదవ్ 20; హ్యాండ్స్‌కోంబ్ (బ్యాటింగ్) 28; పైన్ (బి) కుల్దీప్ 5; కమిన్స్ (బ్యాటింగ్) 25; ఎక్స్‌ట్రాలు 6; మొత్తం (83.3 ఓవర్లలో 6 వికెట్లకు) 236.
వికెట్ల పతనం: 1–72, 2–128, 3–144, 4–152, 5–192, 6–198. **బౌలింగ్:** షమీ 16–1–54–1; బుమ్రా 16–4–43–0; జడేజా 27.3–9–62–2; కుల్దీప్ యాదవ్ 24–6–71–3.

దక్షిణాఫ్రికా లక్ష్యం 41

రెండో ఇన్నింగ్స్‌లో పాక్ 294 ఆలౌట్

కేప్‌టౌన్: సొంతగడ్డపై మరో సిరీస్ విజయానికి దక్షిణాఫ్రికా చేరువైంది. పాకిస్తాన్‌తో జరుగుతోన్న రెండో టెస్టులో ఆ జట్టు గెలిచేందుకు రెండో ఇన్నింగ్స్‌లో 41 పరుగులు మాత్రమే చేయాల్సి ఉంది. మ్యాచ్ మూడో రోజు శనివారం పాక్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 294 పరుగులకు ఆలౌటైంది. అసద్ షఫీఖ్ (88), బాబర్ ఆజమ్ (72), షాన్ మసూద్ (61) అర్ధసెంచరీలు చేశారు. రబడ, స్టెయిన్ చెరో 4 వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీశారు. పాక్ ఇన్నింగ్స్ ముగియగానే అంపైర్లు ఆటను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 382/6తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా 431 పరుగులకు ఆలౌటైంది. ఆమిర్, షాహీన్ అఫ్రిదిలకు చెరో 4 వికెట్లు దక్కాయి. ఈ మ్యాచ్‌తో 431 వికెట్లు పూర్తి చేసుకున్న సఫారీ దిగ్గజం స్టెయిన్ అత్యధిక వికెట్ల జాబితాలో రిచర్డ్ హ్యాడ్లీ (431)ని సమం చేసి టాప్–10లో పదో స్థానానికి చేరుకున్నాడు.



సంధ్యకు స్వర్ణం

సాక్షి, విజయవాడ: ఆసియా అమెచ్యూర్ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్‌లో విజయవాడ అమ్మాయి గోలి సంధ్య మహిళల విభాగంలో విజేతగా నిలిచింది. నిర్ణీత తొమ్మిది రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో సంధ్య ఆరు పాయింట్లు సాధించింది. ఐదు గేముల్లో గెలిచిన ఆమె, రెండింటిని 'డ్రా' చేసుకొని... మరో రెండింటిలో ఓడిపోయింది. జావో యుజువాన్ (చైనా) రజతం, సన్ ఫురోంగ్ (చైనా) కాంస్యం గెలిచారు. ఈ విజయంతో సంధ్య ఈ ఏడాది మెక్సికోలో జరిగే ప్రపంచ అమెచ్యూర్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించనుంది.

ఫైనల్లో నిఖత్



సాక్షి, హైదరాబాద్: జాతీయ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ (51 కేజీలు) స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించింది. కర్ణాటకలోని బళ్లారి జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం జరిగిన సెమీఫైనల్లో నిఖత్ 5–0తో వాస్లల్ దుతి (ఆలిండియా పోలీస్)పై ఘనవిజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. నేడు జరుగనున్న ఫైనల్లో హరియాణాకు చెందిన పింకీ రాణీతో నిఖత్ జరీన్ అమీతుమీ తేల్చుకుంటుంది.

విజేత బోపన్న-దివిజ్ జంట

జోడీ కట్టిన తొలి ఏటీపీ టోర్నీలోనే టైటిల్



పుణే: ప్రొఫెషనల్ సర్క్యూట్‌లో జతకట్టిన తొలిసారే భారత టెన్నిస్ డబుల్స్ స్టార్స్ రోహన్ బోపన్న-దివిజ్ శరణ్ జంట టైటిల్‌ను హస్తగతం చేసుకుంది. శనివారం ముగిసిన టాటా ఓపెన్ ఏటీపీ–250 టోర్నమెంట్‌లో టాప్ సీడ్ హోదాకు న్యాయం చేస్తూ బోపన్న–దివిజ్ జోడీ విజేతగా నిలిచింది. 63 నిమిషాల పాటు జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో బోపన్న–దివిజ్ ద్వయం 6–3, 6–4తో ల్యూక్ బాంబ్రిడ్జ్–జానీ ఒమారా (బ్రిటన్) జోడీపై గెలిచింది. భారత జంట మూడు ఏస్‌లు సంధించి, ఒక డబుల్ ఫాల్ట్ చేసింది. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. బోపన్న కెరీర్‌లో ఇది 18వ డబుల్స్ టైటిల్‌కాగా... దివిజ్ శరణ్‌కు నాలుగోది. స్వదేశంలో మాత్రం దివిజ్‌కిదే తొలి టైటిల్ కావడం విశేషం. టైటిల్ నెగ్గిన బోపన్న–దివిజ్ జంటకు 29,860 డాలర్ల (రూ. 20 లక్షల 77 వేలు) ప్రైజ్‌మనీతో పాటు 250 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. టైటిల్ గెలిచే క్రమంలో ఈ భారత జంట క్వార్టర్ ఫైనల్, సెమీఫైనల్స్‌లో మారథాన్ సూపర్ టైబ్రేక్‌లలో విజయం సాధించింది. పేస్–వరేలాలతో క్వార్టర్స్ మ్యాచ్‌లో మూడో సెట్‌ను 17–15తో... బోలెలీ–డోడిగ్‌లతో జరిగిన సెమీస్‌లో 15–13తో భారత జంట గెలిచింది. తాజా విజయం వచ్చే వారం మొదలయ్యే ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌కు ముందు కావాల్సినంత ఆత్మ విశ్వాసం ఇచ్చిందని 38 ఏళ్ల బోపన్న వ్యాఖ్యానించాడు. గతేడాది జకార్తా ఆసియా క్రీడల్లో బోపన్న–దివిజ్ జంట స్వర్ణ పతకం నెగ్గిన అనంతరం 2020 టోక్యో ఒలింపిక్స్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ ఏడాది ప్రొఫెషనల్ సర్క్యూట్‌లోనూ జతకలిసి ఆడాలని నిర్ణయం తీసుకున్నారు.

అండర్సన్‌కు సింగిల్స్ టైటిల్ ...



టాటా ఓపెన్‌లో పురుషుల సింగిల్స్ టైటిల్‌ను ప్రపంచ ఆరో ర్యాంకర్ కెవిన్ అండర్సన్ (దక్షిణాఫ్రికా) సాధించాడు. 100వ ర్యాంకర్ ఇవో కార్లోవిచ్ (క్రొయేషియా)తో 2 గంటల 44 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో అండర్సన్ 7–6 (7/4), 6–7 (2/7), 7–6 (7/5)తో గెలుపొందాడు. 6 అడుగుల 8 అంగుళాల ఎత్తు, 95 కేజీల బరువున్న అండర్సన్ మ్యాచ్‌లో 21 ఏస్‌లు... 6 అడుగుల 11 అంగుళాల ఎత్తు, 105 కేజీల బరువున్న కార్లోవిచ్ 36 ఏస్‌లు సంధించడం విశేషం. మ్యాచ్ మొత్తంలో ఒక్క బ్రేక్ పాయింట్ కూడా నమోదు కాకపోవడం విశేషం. చివరి సెట్ టైబ్రేక్‌లో 39 ఏళ్ల కార్లోవిచ్ 5–2తో ఆధిక్యంలో ఉన్నప్పటికీ... ఆ తర్వాత తడబడి వరుసగా ఐదు పాయింట్లు కోల్పోయి ఓటమి చవిచూశాడు. విజేత అండర్సన్‌కు 90,990 డాలర్ల (రూ. 63 లక్షల 29 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.



సమీర్ వర్మ

సెమీస్‌లో ముంబై రాకెట్స్

అహ్మదాబాద్: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్) నాలుగో సీజన్‌లో ముంబై రాకెట్స్ సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఐదు జట్లతో తలపడిన ముంబై మూడింటిపై గెలిచి 19 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో నిలిచి సెమీస్‌కు అర్హత సాధించింది. శనివారం ఇక్కడ జరిగిన పోరులో ముంబై 5–0తో చెన్నై స్మాషర్స్‌ను చిత్తు చేసింది. పురుషుల సింగిల్స్ తొలి మ్యాచ్‌లో ముంబై ఆటగాడు ఆండెర్స్ ఆంటోన్‌సెన్ 15–14, 15–11తో రాజీవ్ ఒసెఫ్‌పై గెలిచాడు. చెన్నై 'ట్రంప్'మ్యాచ్ అయిన మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ కిమ్ జీ జాంగ్–బెర్నార్డ్ (ముంబై) జంట 15–14, 15–14తో క్రిస్ అడ్‌కాక్–గాబ్రియల్ అడ్‌కాక్ జోడీపై గెలవడంతో ముంబై 2–(–1)తో ఆధిక్యంలోకి వెళ్లింది. మహిళల సింగిల్స్‌లో చెన్నై ప్లేయర్ సుంగ్ జీ హ్యూన్ 15–7, 15–8తో అనురా ప్రభుదేశాయ్‌పై నెగ్గింది. ముంబై 'ట్రంప్'అయిన పురుషుల సింగిల్స్‌లో సమీర్‌వర్మ 12–15, 15–13, 15–9తో పారుపల్లి కశ్యప్‌పై గెలిచి 4–0తో విజయాన్ని ఖాయం చేశాడు. చివరి మ్యాచ్‌గా జరిగిన పురుషుల డబుల్స్‌లో కిమ్ జీ జాంగ్–లీ యాంగ్ డై జోడీ 15–8, 15–10తో ఆర్ చిన్ చుంగ్–సుమీత్ రెడ్డి ద్వయంపై గెలిచి 5–0తో ముగించింది. మరో మ్యాచ్‌లో బెంగళూరు రాప్టర్స్ 4–3తో నార్త్ ఈస్టర్న్ వారియర్స్‌పై గెలిచింది. నేడు ఢిల్లీ డాషర్స్‌తో పుణే సెవెన్ ఏసెస్, అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్‌తో హైదరాబాద్ హంటర్స్‌తో తలపడతాయి.



చాంప్ బెంగళూరు బుల్స్

ప్రొ కబడ్డీ లీగ్ ఫైనల్లో గుజరాత్‌పై గెలుపు

ముంబై: ప్రొ కబడ్డీ లీగ్‌లో నయా చాంపియన్ అవతరించింది. గత ఐదు సీజన్‌లుగా ఊరిస్తూ వస్తున్న టైటిల్ ఎట్టకేలకు బెంగళూరు బుల్స్ ఒడిలో వాలింది. టోర్నీ ఆసాంతం ఆకట్టుకున్న గుజరాత్ ఫార్చూన్ జెయింట్స్ చివరి క్షణాల్లో ఒత్తిడి తట్టుకోలేక చేతులెత్తేసింది. శనివారం ఇరు జట్ల మధ్య జరిగిన తుదిపోరులో బెంగళూరు 38–33తో గుజరాత్‌పై గెలిచి తొలిసారి ట్రోఫీని ముద్దాడింది. విరామ సమయానికి 16–9తో స్పష్టమైన ఆధిక్యంలో ఉన్న గుజరాత్ రెండో అర్ధభాగంలో అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకుంది. బెంగళూరు కెప్టెన్ రోహిత్ (1 పాయింట్) ఘోరంగా విఫలమైనా... పవన్ షెరావత్ 22 పాయింట్లతో దుమ్మురేపాడు. జట్టును ఓటమి అంచుల్లో నుంచి విజయ శిఖరాలకు చేర్చాడు. జట్టులో 3 పాయింట్లే రెండో అత్యధికం అంటే... పవన్ ఏ స్థాయిలో విజృంభించాడో అర్థమవుతోంది. గుజరాత్ ఫార్చూన్ జెయింట్స్ తరఫున సచిన్ కుమార్ 10, ప్రపంజన్, రోహిత్ గులియా చెరో 5 పాయింట్లు సాధించారు. విజేతకు రూ. 3 కోట్ల ప్రైజ్‌మనీ లభించగా... రన్నరప్ జట్టుకు రూ. 1.8 కోట్లు దక్కాయి. పీకేఎల్ ఏడో సీజన్ ఈ ఏడాది జూలైలో ప్రారంభం కానుంది.

భారత్ X థాయ్‌లాండ్

అబుదాబి: ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీలో నేడు భారత్ తొలి మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌తో ఆడనుంది. ఇప్పటి వరకు మూడుసార్లు ఈ టోర్నీలో పాల్గొన్న భారత్ 1964లో రన్నరప్‌గా నిలిచింది. ఆ తర్వాత రెండు సార్లు (1984, 2011) పాల్గొని గ్రూప్ దశలోనే వెనుదిరిగింది. 2011 టోర్నీలో ఆడిన వారిలో ప్రస్తుతం సునీల్ చెత్రీ మాత్రమే జట్టులో ఉన్నాడు. అప్పుడు ప్లేయర్‌గా బరిలో దిగిన చెత్రి ఈ సారి కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. **రాత్రి గం. 7 నుంచి స్టార్ స్పోర్ట్స్–2లో ప్రత్యక్ష ప్రసారం కానుంది.**

ఫెడరర్ జట్టుకే హాప్‌మన్ కప్



పెర్త్: అంతర్జాతీయ మిక్స్‌డ్ టెన్నిస్ టోర్నమెంట్ హాప్‌మన్ కప్‌లో రోజర్ ఫెడరర్–బెలిండా బెన్సిచ్ (స్విట్జర్లాండ్) జట్టు టైటిల్‌ను నిలబెట్టుకుంది. అలెగ్జాండర్ జ్వెరెవ్–ఎంజెలిక్ కెర్బర్ (జర్మనీ) జట్టుతో శనివారం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ ఫెడరర్–బెన్సిచ్ ద్వయం 2–1తో విజయం సాధించింది. తొలి మ్యాచ్‌లో ఫెడరర్ 6–4, 6–2తో జ్వెరెవ్‌ను ఓడించి స్విట్జర్లాండ్‌కు 1–0 ఆధిక్యాన్ని అందించాడు. అనంతరం రెండో మ్యాచ్‌లో కెర్బర్ (జర్మనీ) 6–4, 7–6 (8/6)తో బెన్సిచ్‌పై నెగ్గడంతో స్కోరు 1–1తో సమమైంది. నిర్ణాయక మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లో ఫెడరర్–బెన్సిచ్ జోడీ 4–0, 1–4, 4–3 (5/4)తో జ్వెరెవ్–కెర్బర్ జంటను ఓడించి విజేతగా నిలిచింది. మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌ను 'ఫాస్ట్ ఫోర్' పద్ధతిలో నిర్వహించారు. తొలి నాలుగు గేమ్‌లు గెలిచిన జట్టుకు సెట్ వశమవుతుంది. ఒకవేళ స్కోరు 3–3 వద్ద సమమైతే తొమ్మిది పాయింట్లున్న టైబ్రేక్ నిర్వహిస్తారు. ఈ విజయంతో మూడుసార్లు హాప్‌మన్ టైటిల్ గెలిచిన తొలి ప్లేయర్‌గా ఫెడరర్ రికార్డు సృష్టించాడు. 2001లో మార్టినా హింగిస్‌తో కలిసి తొలిసారి టైటిల్ సాధించిన ఫెడరర్, గతేడాది బెన్సిచ్‌తో కలిసి ఈ ఘనత సాధించాడు.

74 బంతుల్లో 140 పరుగులు

- 8 ఫోర్లు, 13 సిక్సర్లతో తిసారా పెరీరా మెరుపు సెంచరీ
- అయినా శ్రీలంక ఓటమి



తిసారా పెరీరా

మౌంట్ మాంగనీ: తొలి వన్డేలో ఐదు... రెండో వన్డేలో మరో ఐదు... తన బౌలింగ్‌లో తిసారా పెరీరా ఇచ్చిన సిక్సర్లు ఇవి! ఆ కసినంతా అతను రెండో వన్డేలో తన బ్యాటింగ్‌లో చూపించాడు. పదికి తోడు అదనంగా మరో మూడు సిక్సర్లు బాది వీర విధ్వంసం సృష్టించాడు. 74 బంతుల్లోనే 8 ఫోర్లు, 13 సిక్సర్లతో 140 పరుగులు చేసినా సరే శ్రీలంకను పరాజయం నుంచి తప్పించలేకపోయాడు. శనివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ 21 పరుగుల తేడాతో లంకను ఓడించింది. మూడు వన్డేల సిరీస్‌ను 2–0తో గెలుచుకుంది. ముందుగా కివీస్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 319 పరుగులు చేసింది. రాస్ టేలర్ (105 బంతుల్లో 90; 4 ఫోర్లు, 1 సిక్స్), మున్రో (77 బంతుల్లో 87; 12 ఫోర్లు, 2 సిక్సర్లు), నీషామ్ (37 బంతుల్లో 64; 5 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధ సెంచరీలు చేశారు. అనంతరం లంక 46.2 ఓవర్లలో 298 పరుగులకు ఆలౌటైంది. తిసారా జోరుకు తోడు గుణతిలక (71; 9 ఫోర్లు) హాఫ్ సెంచరీ సాధించాడు.

ఒక దశలో 16 పరుగుల వ్యవధిలో 5 వికెట్లు కోల్పోయిన శ్రీలంక స్కోరు 27 ఓవర్లు ముగిసేసరికి 128/7గా నిలిచింది. అయితే ఆ తర్వాత 19.2 ఓవర్ల పాటు ప్రతీ బౌలర్‌పై విరుచుకుపడుతూ పెరీరా జోరు కొనసాగింది. ఈ క్రమంలో 28 బంతుల్లో హాఫ్ సెంచరీ, 57 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ముఖ్యంగా సౌతీ ఓవర్లో అతను 4 భారీ సిక్సర్లతో చెలరేగడం ఇన్నింగ్స్‌కు హైలైట్‌గా నిలిచింది. చివరి మూడు వికెట్లకు 75, 51, 44 పరుగులు భాగస్వామ్యాలు నెలకొల్పిన తిసారా జట్టును గెలిపించలేకపోయాడు. 23 బంతుల్లో 22 పరుగులు కావాల్సి ఉండగా భారీ షాట్‌కు ప్రయత్నించి తిసారా లాంగాన్‌లో బౌల్ట్‌కు క్యాచ్ ఇవ్వడంతో లంక ఓటమి ఖాయమైంది.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 6.00

సంపుటి: 11
సంచిక: 286

SUNDAY Special

ఆదివారం 6-1-2019



జీవించా..

జయంతి బర్త్ డే సందర్భంగా 'సాక్షి' ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ

ఫ్యామిలీలో



ఎఫ్ఈఓ

మాల్యాను పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తుడిగా ప్రకటించిన ముంబై కోర్టు

- 11లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

శాసన సభాపతి ఎవరు?

- కొత్త స్పీకర్‌పై టీఆర్‌ఎస్‌లో చర్చ
- కేసీఆర్ నిర్ణయంపై ఉత్కంఠ
- వామ్మో స్పీకర్ పదవా! మాకొద్దంటున్న సీనియర్లు
- తెరపైకి పోచారం, ఈటల, పద్మ, కొప్పుల పేర్లు
- ఈ సమావేశాల్లో మంత్రివర్గ విస్తరణకు అవకాశం!



సాక్షి, హైదరాబాద్: కొత్త అసెంబ్లీ సమావేశాలు మొదలవుతున్న నేపథ్యంలో అసెంబ్లీ, ప్రభుత్వంలో పదవులపై చర్చ మొదలైంది. స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌తోపాటు కేసీఆర్ కొత్త మంత్రివర్గంలో ఎవరెవరికి చోటు దక్కుతుందనేది ఆసక్తికరంగా మారింది. జనవరి 18న స్పీకర్ ఎన్నిక జరగనుంది. జనవరి 17న కొత్త ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం తర్వాత స్పీకర్ పదవికి నామినేషన్ల ప్రక్రియ జరగనుంది. 17న లేదా అంతకు ముందు రోజే.. స్పీకర్ అభ్యర్థిని సీఎం కేసీఆర్ ప్రకటించనున్నారు. స్పీకర్ అభ్యర్థిగా ఎవరిని ప్రకటిస్తారనే విషయంపై టీఆర్‌ఎస్ సీనియర్ ఎమ్మెల్యేలలో చర్చ జరుగుతోంది. కేసీఆర్ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని పైకి చెబుతున్నప్పటికీ.. గత అనుభవాల నేపథ్యంలో స్పీకర్ పదవి విషయంలో సీనియర్లంతా విముఖంగా ఉన్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కొత్త స్పీకర్‌గా ఎవరుండొచ్చనేది ఆసక్తికరంగా మారింది. టీఆర్‌ఎస్ సీనియర్ ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్ (హుజూరాబాద్), పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బాన్సువాడ), పద్మా దేవేందర్‌రెడ్డి (మెదక్), కొప్పుల ఈశ్వర్ (ధర్మపురి) పేర్లు వినిపిస్తున్నాయి. గత అసెంబ్లీలో స్పీకర్ పదవికి బీసీలకు అవకాశం కల్పించగా...

మిగతా 2వ పేజీలో ▶

ఎవరితోనూ పొత్తు ఉండదు



వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే పోరాడతాం...

'సాక్షి టీవీ' ప్రత్యేక ఇంటర్వ్యూలో ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

- అసెంబ్లీలో ప్రజాస్వామ్యం ఖూనీ.. అందుకే ప్రజల్లోకి వెళ్లా
- ప్రభుత్వంపై మా పోరాటానికి క్లైమాక్స్ ఈ పాదయాత్ర
- చంద్రబాబుకు విలువలు, విశ్వసనీయత లేవు
- ఫిరాయింపుదారులను ఓడించండని తెలంగాణలో పిలుపునిస్తాడు
- ఏపీలో ఫిరాయింపు ఎమ్మెల్యేలను మంత్రులను చేస్తాడు
- నాలుగున్నరేళ్లు బీజేపీతో సంసారం.. ఇప్పుడు కాంగ్రెస్‌తో కాపురం
- ఏపీలో గోబెల్స్ ప్రచారం తప్ప ఏం అభివృద్ధి జరిగింది?
- ప్రత్యేక హోదా ఎవరు ఇస్తానంటే వారికే మా మద్దతు..
- ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోతే రాజీనామా చేసి వెళ్లిపోతా

వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని ఏపీ ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ప్రజలను, దేవుడిని నమ్ముకున్న తాము ఒంటరిగానే పోరాడతామని అన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా సాధించడమే తమ ప్రత్యేక ఎజెండా అని స్పష్టం చేశారు. పాదయాత్రలో ఎదురైన అనుభవాలతో పాటు సమకాలీన రాజకీయాలు, అధికార పార్టీ వైఫల్యాల గురించి తెలిపారు. పేద ప్రజలు పడుతున్న కష్టాలను తొలగించడానికి తానిచ్చిన నవరత్నాల హామీలనూ వివరించారు. విలువలను వదిలేసి చౌకబారు రాజకీయాలు చేస్తున్నారంటూ చంద్రబాబుపై విమర్శల వర్షం కురిపించారు. అంతర్జాతీయ రాజధాని పేరుతో అంతర్జాతీయ కుంభకోణానికి పాల్పడ్డారని ఎద్దేవాచేశారు. అన్ని రంగాలనూ అవినీతి మయం చేశారని విమర్శించారు. 23 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడమే కాకుండా వారిలో నలుగురికి మంత్రి పదవులిచ్చి ప్రజాస్వామ్యానికి పాతరేశారన్నారు. ప్రత్యేక హోదా విషయంలో మాటమార్చడం, నాలుగేళ్లపాటు అధికారాన్ని పంచుకుని ఇపుడు కొత్తగా కాంగ్రెస్‌తో కలసి కాపురం చేయడం వంటి ద్వంద్వ వైఖరులపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాజకీయ నాయకులకు విశ్వసనీయత అత్యంత ముఖ్యమని, ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే రాజీనామా చేస్తానని జగన్ మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు.

2017 నవంబర్ 6న ప్రారంభమైన ప్రజాసంకల్ప యాత్ర తుదిదశకు చేరుకున్న తరుణంలో 'సాక్షి టీవీ' తరఫున సీనియర్ జర్నలిస్టు దేవులపల్లి అమర్‌కు జగన్ ఇచ్చిన ఇంటర్వ్యూ పూర్తి పాఠం - 5లో

17న కొత్త అసెంబ్లీ

16న ప్రొటెం స్పీకర్‌గా మజ్లిస్ ఎమ్మెల్యే ముంతాజ్ ఖాన్ ప్రమాణం

- తర్వాతి రోజు ఆయన ఆధ్వర్యంలోనే కొత్త ఎమ్మెల్యేల ప్రమాణం
- నాలుగురోజుల పాటు శాసనసభ సమావేశాలు
- 18న స్పీకర్ ఎన్నిక.. అదేరోజు బీఏసీ భేటీ
- 19న ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం
- 20న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం
- ముహూర్తం ఖరారు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్




సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కొత్త శాసనసభ కొలువుదీరేందుకు ముహూర్తం ఖరారైంది. జనవరి 17న కొత్త ఎమ్మెల్యేల ప్రమాణస్వీకార కార్యక్రమం జరగనుంది. మజ్లిస్ ఎమ్మెల్యే (చార్మినార్) ముంతాజ్ ఖాన్ ప్రొటెం స్పీకర్ హోదాలో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో ప్రమాణం చేయిస్తారు. దీనికి ముందే.. ఈ నెల 16న సాయంత్రం ఐదు గంటలకు ముంతాజ్ ఖాన్ ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణం చేస్తారు. గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ రాజ్‌భవన్‌లో ముంతాజ్ ఖాన్‌తో ప్రమాణం చేయిస్తారు. మరుసటి రోజు శాసనసభ తొలి సమావేశం జరగనుంది. జనవరి 17న ఉదయం 11.30 గంటలకు

మిగతా 2వ పేజీలో ▶

ఉత్తరాయణ ఏకాదశి రోజున..

కొత్త శాసనసభ సమావేశాలపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ప్రజలు గొప్ప మెజారిటీతో తమను గెలిపించారని ఆ స్ఫూర్తితో ఉత్తరాయణ పుణ్యకాలంలో ఏకాదశి తిథినాడు శాసనసభ కార్యకలాపాలు ఆరంభించాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. సాధారణంగానే ముహూర్తాలకు ప్రాధాన్యత ఇచ్చే సీఎం కేసీఆర్ ఉత్తరాయణం ఆరంభంలో కొత్త సభ, స్పీకర్ ఎన్నిక వంటి కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించారు.



నేటి సంచికతో పాటు 'ఫన్‌డే' మ్యాగజైన్‌కు బదులుగా సాక్షి క్యాలెండర్ ఇస్తున్నాము. గమనించగలరు.

మే 3 నుంచి ఎంసెట్



వివిధ వృత్తివిద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (సెట్)లకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్‌ఈ) తేదీలను ఖరారు చేసింది. సెట్‌ల పరీక్షల సమయంతోపాటు వాటిని నిర్వహించే యూనివర్సిటీలను పేర్కొంటూ శనివారం ప్రకటన విడుదల చేసింది. కన్వీనర్ల నియామకం పూర్తయిన వెంటనే సెట్‌లవారీగా నోటిఫికేషన్లు విడుదల కానున్నాయి.

- వివరాలు 2లో



17న 'సహకార' నోటిఫికేషన్

- ఫిబ్రవరి రెండో వారంలో ప్యాక్స్ ఎన్నికలు
- అదే నెల 25కల్లా డీసీసీబీ, టెస్కాబ్ ఎన్నికలు పూర్తి
- 12 వేల బూత్‌లు, 40 వేల మంది సిబ్బందితో ఏర్పాట్లు
- మొత్తం ప్యాక్స్ ఓటర్లు 20 లక్షల మంది

- వివరాలు 2లో

అట్టుడుకుతున్న కన్నూర్

- బీజేపీ, సీపీఎం కార్యకర్తల పరస్పర దాడులు
- సీపీఎం వల్లే ఉద్రిక్తతలని బీజేపీ ఆరోపణ
- చట్టాన్ని గౌరవించాలని ఐరాస విజ్ఞప్తి

- వివరాలు 11లో

యూపీలో ఎస్పీ-బీఎస్పీ జట్టు!

- లోక్‌సభ ఎన్నికల కోసం కూటమి ఏర్పాటుకు అంగీకారం
- త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం
- కాంగ్రెస్‌కే అమేథీ, రాయ్‌బరేలీ..

- వివరాలు 11లో

సాక్షి
రౌండప్
2 నల్లగొండ | ఆదివారం | జనవరి | 6 | 2019
www.sakshi.com

1929, జనవరి 6న 18 ఏళ్ల వయసులో మదర్ థెరిసా కోల్‌కతాకు వచ్చి పేద ప్రజలకు, నిస్సహాయులకు సేవ చేయడం ప్రారంభించారు.





సూర్యుని సూపే.. సూది మందు!

సూర్యుని సూపే.. సూది మందు! అవును రెప్పవేయకుండా కొన్ని క్షణాలు ఉదయిస్తున్న బాల సూర్యున్ని లేదా అస్తమిస్తున్న పండు సూర్యున్ని చూడండి చాలు.. అన్ని రోగాలూ మాయమవుతాయని అంటున్నారు ఆస్ట్రేలియాకు చెందిన 'ఇన్‌స్టాగ్రామ్ వెల్‌నెస్ గురు' పేట్ ఈవెన్స్. ఆయన చెప్పే హెల్త్ టిప్స్‌కు ఫిదా అవుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోవర్స్ (2 లక్షల మంది) అమాంతం పెరగడంతో ఇటీవల ఆయన ఓ సెలబ్రిటీ అయ్యారు. 'నేను రోజూ సముద్రంలో మునిగి.. ఉదయం, లేదా సాయంత్రం వేళల్లో సూర్యున్ని రెప్పవాల్చకుండా చూస్తూ లీనమైపోతాను. ఉచితంగా శరీరానికీ, మెదడుకూ, ఆత్మకూ కావాల్సిన మెడిసిన్‌ను అందించడానికి ఈ భూమిపై ఉన్న అత్యంత శక్తివంతమైన పద్ధతిది' అని పేట్ గతనెల 16న ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. గతంలో పాలే డైట్‌కు మద్దతు ప్రకటించడం, సన్‌స్క్రీన్ లోషన్స్‌ను విషపూరితాలని, సమాజంలో అన్ని సమస్యలకూ ఫ్లోరైడ్ నీరే కారణమని చెబుతూ పేట్ పోస్టులు పెట్టి వైద్యుల నుంచి విమర్శలు కూడా ఎదుర్కొన్నారు. సూర్యుడి చిట్కాను కూడా వైద్యులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎండకు నిలబడితే ఓకే కానీ, నేరుగా కొన్ని సెకండ్ల పాటు సూర్యున్ని చూస్తే కళ్లు కోలుకోలేనంతగా పాడవుతాయని హెచ్చరిస్తున్నారు. అతని సూచన పాటించడం రిస్క్ అని, అయినా పాటిస్తామంటే మీ ఇష్టమని వారు సూచిస్తున్నారు.





ముఖమే కాన్వాస్

ఈ ఫొటోలో వ్యక్తిని చూడగానే ఏమనిపిస్తోంది.. ఆ ఏముంది.. స్మార్ట్‌ఫోన్‌లో ఏదో యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఫొటోను అలా మార్చేశారులే అనుకుంటున్నారా..? చూసిన వెంటనే అలాగే అనిపిస్తుంది కూడా.. అయితే మీరనుకున్నదంతా అబద్ధం. అందులో ఉన్న వ్యక్తి తన ముఖాన్నే కాన్వాస్‌గా మలుచుకున్నాడు. ఇదిగో ఇలా త్రీడీ చిత్రాలను తన ముఖంపైనే గీసుకోవడం అలవాటుగా మార్చుకున్నాడు. అతడి పేరు లూస్. మామూలుగానైతే ఇటలీలోని ఓ టీవీ చానల్‌లో 18 ఏళ్లుగా మేకప్ ఆర్టిస్టుగా పనిచేస్తున్నాడు. అయితే తను చేసే పనిలో ఎప్పుడూ ఆనందం వెతుక్కునే లూస్.. తనపైనే ప్రయోగాలు చేయడం ప్రారంభించాడు. దీంతో మొదటగా తన చేతులను కాన్వాస్‌గా మలుచుకుని భ్రమ కలిగించే బొమ్మలను గీయడం మొదలుపెట్టాడు. ఆ తర్వాత ముఖంపైనే త్రీడీ బొమ్మలు చిత్రించడం స్టార్ట్ చేశాడు. 2015లో తొలిసారి తన చేతిపై గీసిన ఇలాంటి ఫొటోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతో అది కాస్తా వైరల్ కావడం.. లూస్ ఒక్కసారిగా సెలబ్రిటీ అయిపోవడం చకచకా జరిగిపోయాయి.

17న 'సహకార' నోటిఫికేషన్

- ఫిబ్రవరి రెండో వారంలో ప్యాక్స్ ఎన్నికలు
- అదే నెల 25కల్లా డీసీసీబీ, టెస్కాబ్ ఎన్నికలు పూర్తి
- 12 వేల బూత్‌లు, 40 వేల మంది సిబ్బందితో ఏర్పాట్లు
- మొత్తం ప్యాక్స్ ఓటర్లు 20 లక్షల మంది

సాక్షి, హైదరాబాద్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ప్యాక్స్) ఎన్నికలకు ఈ నెల 17న నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ మేరకు రాష్ట్ర సహకారశాఖ రంగం సిద్ధం చేసింది. పంచాయతీ ఎన్నికలు ముగియగానే ఫిబ్రవరి రెండో వారంలో ఒకే రోజున 906 ప్యాక్స్‌లకు ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. అదే రోజున ఓట్ల లెక్కింపు కూడా చేపట్టి గెలుపొందిన కమిటీని ప్రకటించనున్నారు. ఆ వెంటనే తొమ్మిది డీసీసీబీలు, తొమ్మిది జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలతోపాటు టెస్కాబ్‌ల ఎన్నికలు పూర్తి చేయనున్నారు. ఈ ప్రక్రియంతా ఫిబ్రవరి 25కల్లా ముగించాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలకంటే ముందే ఎన్నికల ప్రక్రియ ముగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎన్నికల ప్రక్రియ ఏర్పాట్లను రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ముమ్మరం చేసింది. ప్రాథమిక సహకార సంఘాలకు ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితా కూడా తుది దశకు చేరుకుంది. రెండు జిల్లాలు మినహా మిగతా జిల్లాల నుంచి ఓటర్ల జాబితా ఎన్నికల అథారిటీకి అందింది. ఇందులో మొత్తం 18 లక్షల మందికిపైగా ఓటర్లు ఉన్నారు. మిగిలిన రెండు జిల్లాల నుంచి కూడా జాబితా వస్తే మొత్తం ఓటర్ల సంఖ్య 20 లక్షలకు చేరుకుంటుందని అధికారులు చెబుతున్నారు. సహకార సంఘంలో ఏడాది, అంతకంటే ఎక్కువ కాలం మెంబర్‌గా కొనసాగిన వారినే ఓటరుగా గుర్తించనున్నారు. పూర్తిస్థాయిలో అన్ని జిల్లాల నుంచి ఓటర్ల జాబితా రాష్ట్ర సహకారశాఖ రిజిస్ట్రార్ ఆమోదానికి పంపాల్సి ఉంటుంది. వాటన్నింటిపై రాష్ట్ర స్థాయిలో సహకారశాఖ ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను స్వీకరించనుంది. ఆ తరువాత తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. రాష్ట్రంలో ఉన్న ప్యాక్స్‌లకు పర్సన్ ఇన్‌చార్జీలు పాలక వర్గాలుగా కొనసాగుతున్నారు. వాస్తవానికి గతేడాది జనవరిలో కొన్ని, ఫిబ్రవరిలో కొన్ని ప్యాక్స్‌లకు పదవీకాలం ముగిసింది. దీంతో ఫిబ్రవరి రెండోవారంలో ఎన్నికలను నిర్వహించే సమయానికి పర్సన్ ఇన్‌చార్జీల పాలనకు సరిగ్గా ఏడాది పూర్తవుతుంది. మరోవైపు ఎన్నికలకు సంబంధించిన నిర్వహణ వ్యయాన్ని రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ నుంచి ఇవ్వనున్నారు. గతంలో ఎన్నికల అధికారి ప్రతిపాదనలు సమర్పించి సొసైటీ నుంచే ఖర్చు చేసే విధానం ఉండేది. అయితే అందులో లోటుపాట్లు, అవినీతి చోటుచేసుకుంటున్నందున ఇటీవల ఎన్నికల నిబంధనల్లో భాగంగా ఈ మేరకు సవరణ తీసుకువచ్చారు. 50 మంది కంటే తక్కువ ఓటర్లు ఉన్న సొసైటీలకు చేతులెత్తే పద్ధతిలో ఎన్నికలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా భద్రాచలం ప్యాక్స్‌కు చేతులెత్తే విధానంలోనే ఎన్నిక నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది.

బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు...

ప్యాక్స్ ఎన్నికలకు 12 వేల బూత్‌లను ఏర్పాటు చేస్తున్నారు. బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం దాదాపు 40 వేల మంది సిబ్బందిని వినియోగించనున్నారు. వివిధ శాఖల ఉద్యోగులు ప్యాక్స్ ఎన్నికల్లో విధులు నిర్వహించనున్నారు. ఎన్నికల ఏర్పాట్ల కోసం పంచాయతీ ఎన్నికల్లో తమ శాఖ ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలని ఇప్పటికే సహకారశాఖ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరింది.



శనివారం హైదరాబాద్‌లో హోంమంత్రి మహమూద్ అలీ దంపతులను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీ కవిత

మే 3 నుంచి ఎంసెట్

వృత్తి విద్యా కోర్సుల ఎంట్రన్స్‌ల తేదీలు ఖరారు
పరీక్షలవారీగా షెడ్యూల్ విడుదల చేసిన టీఎస్‌సీహెచ్‌ఈ

సాక్షి, హైదరాబాద్

వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (సెట్)లకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి (టీఎస్‌సీహెచ్‌ఈ) తేదీలను ఖరారు చేసింది. సెట్‌ల పరీక్షల సమయంతోపాటు వాటిని నిర్వహించే యూనివర్సిటీలను పేర్కొంటూ శనివారం ప్రకటన విడుదల చేసింది. సెట్‌ల నిర్వహణ యూనివర్సిటీల నుంచి కన్వీనర్ల నియామకం కోసం ముగ్గురు చొప్పున పేర్లు పంపించాలని సోమవారం ఆయా యూనివర్సిటీలకు లేఖలు రాయనుంది. వర్సిటీలు పంపించే మూడేసి పేర్లలో ఒకరి పేరును ఖరారు చేసి సెట్ కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించనుంది. కన్వీనర్ల నియామకం పూర్తయిన వెంటనే సెట్‌లవారీగా నోటిఫికేషన్లు విడుదల కానున్నాయి. మే 3 నుంచి 9 వరకు వరుసగా ఎంసెట్ పరీక్షలు జరుగుతాయి. తొలుత ఎంసెట్ ఇంజనీరింగ్ స్ట్రీమ్ నిర్వహించిన తర్వాత అగ్రికల్చర్ స్ట్రీమ్ పరీక్షలు జరుగుతాయి. టీఎస్ పీఈసెట్ మినహా మిగతా అన్ని పరీక్షలు కంప్యూటర్ ఆధారితంగానే జరుగుతాయి. టీఎస్ పీఈసెట్ మాత్రం శారీరక దృఢత్వం, నైపుణ్యాల ఆధారంగా నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు.



కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌ల షెడ్యూల్ ఇలా...

సెట్	యూనివర్సిటీ	పరీక్ష తేదీ	వారం	సమయం ఉదయం	సమయం మధ్యాహ్నం
టీఎస్ ఎంసెట్	జేఎన్‌టీయూహెచ్	మే-3, 4, 6 (ఇంజనీరింగ్)	శుక్ర, శని, సోమ	10.00-1.00	3.00-6.00
		మే- 8, 9 (అగ్రికల్చర్)	బుధ, గురు	10.00-1.00	3.00-6.00
టీఎస్ ఈసెట్	జేఎన్‌టీయూహెచ్	మే-11	శని	10.00-1.00	3.00-6.00
టీఎస్ పీఈసెట్	ఎంజీయూ, నల్లగొండ	మే-20	సోమ	-	-
టీఎస్ ఐసెట్	కేయూ, వరంగల్	మే-23, 24	గురు, శుక్ర	10.00-12.30	2.30-5.00
టీఎస్ లాసెట్	ఓయూ, హైదరాబాద్	మే-26	ఆది	11.00-12.30	-
టీఎస్ పీజీఎల్‌సెట్	ఓయూ, హైదరాబాద్	మే-26	ఆది	-	2.30-4.00
టీఎస్ పీజీఈసెట్	ఓయూ, హైదరాబాద్	మే-27, 29	సోమ, బుధ	10.00-12.00	2.00-4.00
టీఎస్ ఎడ్‌సెట్	ఓయూ, హైదరాబాద్	మే-30, 31	గురు, శుక్ర	11.00-1.00	3.00-5.00

మన్న-ఇ-వక్ఫ్ ద్వారా ఆర్థిక సాయం

వక్ఫ్‌బోర్డు పాలక మండలి నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా గల మన్న-ఇ-వక్ఫ్ ఆస్తుల ద్వారా లభించే ఆదాయంతో పేద రోగ పీడితులకు వైద్య సహాయం, నిరుపేదలకు ఆర్థిక చేయూత అందించాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డు పాలక మండలి సమావేశం నిర్ణయించింది. శనివారం హైదరాబాద్ హజ్‌హౌస్‌లోని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో చైర్మన్ మహ్మద్ సలీమ్ అధ్యక్షతన జరిగిన బోర్డు పాలక మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం సలీం వాటిని విలేకరులకు వెల్లడించారు. మన్న-ఇ-వక్ఫ్ ఆస్తులను అభివృద్ధి చేసి వాటి ద్వారా సమకూరే ఆదాయాన్ని ఆర్థిక చేయూత, ఉపాధి కల్పన తదితర కార్యక్రమాలకు వినియోగించాలని పాలక మండలి నిర్ణయించినట్లు తెలిపారు. వక్ఫ్ ఆస్తులపై న్యాయపరమైన చిక్కులు అధిగమించేందుకు పేరొందిన న్యాయవాదుల ద్వారా చర్యలు చేపట్టాలని తీర్మానించినట్లు చెప్పారు. వక్ఫ్ భూములకు సంబంధించిన 67 వేల ఎకరాల్లో 39 వేల ఎకరాలు మాత్రమే సర్వే పూర్తయినందున మిగతా వాటిని కూడా సర్వే పూర్తిచేయాలని నిర్ణయించినట్లు చెప్పారు.

రేపటి నుంచి తొలి విడత నామినేషన్లు

- 4,480 పంచాయతీల్లో ఎన్నికలకు జారీ కానున్న నోటీసులు
- 9వ వరకు నామినేషన్ల స్వీకరణ.. 21న తొలి విడత పోలింగ్

సాక్షి, హైదరాబాద్: పంచాయతీ ఎన్నికల సమరానికి సమయం ఆసన్నమైంది. మొదటి విడతలో 4,480 గ్రామ పంచాయతీలు, 39,832 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు రిటర్నింగ్ అధికారులు సోమవారం ఎన్నికల నోటీసులు జారీ చేయనున్నారు. ఆ వెంటనే తొలి విడత నామినేషన్ల అంకం ప్రారంభం కానుంది. తర్వాత రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఈ నెల 9 వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల పరిశీలన ముగించి ఆ తర్వాత అర్హులైన అభ్యర్థుల జాబితాలను ప్రకటించనున్నారు. 11న సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లపై అప్పీళ్లను స్వీకరించి, 12న వాటిని పరిష్కరించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ముగియనుంది. ఆ తర్వాత బరిలో నిలిచిన తుది అభ్యర్థుల జాబితాలను రిటర్నింగ్ అధికారులు ప్రకటిస్తారు. 21న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తొలి విడత పోలింగ్ జరగనుంది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించి ఫలితాలు ప్రకటించనున్నారు. అదే రోజు ఉపసర్పంచ్ ఎన్నికలు జరపనున్నారు. తొలి విడతలో 39 రెవెన్యూ డివిజన్లు, 197 మండలాల పరిధిలో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి.

వారందరికీ ఓటు..

జనవరి 1 నాటికి ఓటరుగా నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ పంచాయతీ ఎన్నికల్లో ఓటేసేందుకు అవకాశం లభించనుంది. జనవరి 1న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినందున, ఆ తేదీ నాటికి ఓటర్ల నమోదుకు వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుని తుది ఓటర్ల జాబితాలను తయారు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించింది. ఈ నెల 7న తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నారు.

17న కొత్త అసెంబ్లీ..

▶ మొదటి పేజీ తరువాయి

సభాకార్యక్రమాలు ప్రారంభమవుతాయి. దాదాపు రెండుగంటలపాటు ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకార కార్యక్రమం కొనసాగనుంది. అదే రోజున స్పీకర్ ఎన్నిక నిర్వహణ షెడ్యూల్‌ను ప్రకటన.. నామినేషన్ల ప్రక్రియ మొదలవుతుంది. జనవరి 18న స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. అనంతరం.. స్పీకర్ ఎన్నికపై ప్రొటెం స్పీకర్ ప్రకటన చేస్తారు. కొత్తగా ఎన్నికైన స్పీకర్‌ను.. శాసనసభా నాయకుడు సీఎం కేసీఆర్, ప్రతిపక్ష నేత, ఇతర రాజకీయ పక్షాల నాయకులు గౌరవసూచకంగా స్పీకర్ స్థానం వరకు తీసుకెళ్తారు. ఆ తర్వాత కొత్త స్పీకర్ అధ్యక్షతన శాసనసభ సమావేశాలు సాగుతాయి. ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే బీఏసీ (బిజినెస్ అడ్వయిజరీ కమిటీ) సమావేశాన్ని స్పీకర్ నిర్వహిస్తారు. తర్వాతి రోజు జరిగే గవర్నర్ ప్రసంగంపై బీఏసీ నిర్ణయం తీసుకుంటుంది. జనవరి 19న ఉభయసభల (శాసనసభ, శాసనమండలి)ను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగిస్తారు. జనవరి 20న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం ప్రవేశపెడతారు. గవర్నర్ ప్రసంగానికి శాసనసభ ధన్యవాదాలు తెలుపుతుంది. దీంతో శాసనసభ సమావేశాలు ముగుస్తాయి.

సిద్ధమైన అసెంబ్లీ

శాసనసభ సమావేశాలకు అనుగుణంగా అసెంబ్లీ కొత్త హంగులను సంతరించుకుంది. శాసనసభ, శాసనమండలితోపాటు అసెంబ్లీ ఆవరణ మొత్తాన్ని సరికొత్తగా తీర్చిదిద్దారు. అసెంబ్లీ ఆవరణలో కొత్త మొక్కలతో పచ్చదనం పెరిగింది. సమాచార, సాంకేతిక, విద్యుదీకరణతో ఆధునిక హంగులు సంతరించుకుంది. అసెంబ్లీ కార్యదర్శి వి.నరసింహాచార్యులు అన్ని మార్పులతో సభాప్రాంగణాన్ని సిద్ధం చేశారు. శాసనసభ వ్యవహారాల నిర్వహణ తీరును వివరించే పుస్తకాలను ఎమ్మెల్యేలకు పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేశారు. అసెంబ్లీ లోపల సైతం ఎమ్మెల్యేలు కూర్చునే సీట్లను, మైక్ సెట్లను ఆధునీకరించారు.

మజ్లిస్‌కు రెండోచాన్స్

మజ్లిస్ పార్టీకి శాసనసభలో అరుదైన అవకాశం దక్కింది. తెలంగాణ శాసనసభలో ప్రొటెం స్పీకర్‌గా ఆ పార్టీ ఎమ్మెల్యే ముంతాజ్‌ఖాన్ వ్యవహరించనున్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యే ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించడం ఇది రెండోసారి. మజ్లిస్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో 1984లో ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించారు. అప్పటి వరకు స్పీకర్‌గా వ్యవహరించిన టి. సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న అయిండ్ల భీంరెడ్డిలు నాదెండ్ల భాస్కర్‌రావు మంత్రివర్గంలో చేరారు. దీంతో అప్పటి శాసనసభ వ్యవహారాల కోసం సల్లావుద్దీన్ ఒవైసీ, బాగారెడ్డి ప్రొటెం స్పీకర్లుగా నియమితులయ్యారు. తాజాగా ముంతాజ్ ఖాన్ కొత్త సభకు నిర్వహణకు ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించనున్నారు.

శాసన సభాపతి ఎవరు?

▶ మొదటి పేజీ తరువాయి

ఈసారీ వారినే కొనసాగించాలని కేసీఆర్ భావిస్తున్నట్లు సమాచారం. అదే జరిగితే.. ఈటల రాజేందర్‌కే ఈ అవకాశం దక్కనుందని టీఆర్‌ఎస్ వర్గాలు భావిస్తున్నాయి. సీనియర్ ఎమ్మెల్యేగా శాసనసభ సభ వ్యవహారాలపై పూర్తిస్థాయిలో పట్టున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డికి అవకాశం ఇచ్చే విషయాన్నీ సీఎం పరిశీలిస్తున్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి విషయంలోనూ సీఎం ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆమెకు అవకాశం ఇస్తే మహిళను శాసనసభ అధిపతిగా నియమించారని టీఆర్‌ఎస్‌కు సానుకూలత ఉంటుందని పార్టీ అధిష్టానం భావిస్తోంది. ఎస్సీ వర్గానికి స్పీకర్ పదవికి ఇవ్వాలని భావిస్తే సీనియర్ కొప్పుల ఈశ్వర్ పేరును సైతం పరిశీలించే అవకాశం ఉంది. మంత్రివర్గ కూర్పు, లోక్‌సభ ఎన్నికల అభ్యర్థుల సమీకరణాల ఆధారంగా కొత్త వారి పేరు తెరపైకి వచ్చే అవకాశం ఉందని టీఆర్‌ఎస్ ముఖ్యనేతలు చెబుతున్నారు.

విస్తరణ ఉంటుందా?

అసెంబ్లీ సమావేశాలు, స్పీకర్ ఎన్నిక నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశాలు ఉన్నట్లు టీఆర్‌ఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఓసారి, తర్వాత మరోసారి మంత్రివర్గ విస్తరణ చేయాలని టీఆర్‌ఎస్ అధిష్టానం ఇప్పటికే నిర్ణయించింది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో తొలి విడత కేబినెట్ విస్తరణ జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరినప్పుడు అసెంబ్లీ సమావేశాలకు ముందే మంత్రివర్గ విస్తరణ కార్యక్రమం నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో జనవరి 16న మంత్రివర్గ విస్తరణకు అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. అసెంబ్లీ సమావేశాలు జరిగే రోజుల్లో మంత్రివర్గ విస్తరణకు అవకాశం ఉండొచ్చని భావిస్తున్నారు. అయితే మంత్రివర్గ విస్తరణపై టీఆర్‌ఎస్ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. ఒకవేళ కేబినెట్ విస్తరణ జరిగితే.. తొలి విడతలో 6 లేదా 8 మందికి మంత్రి పదవులు దక్కనున్నాయి. ఎస్సీ, ఎస్టీ వర్గాల నుంచి ఒక్కరు చొప్పన.. బీసీ, ఓసీ వర్గాల నుంచి ఇద్దరు చొప్పున మంత్రులుగా ప్రమాణం చేసే అవకాశం ఉంది. కొత్త మంత్రుల సంఖ్య ఎనిమిది ఉంటే బీసీ, ఓసీలలో ముగ్గురు చొప్పన ప్రమాణం చేయనున్నారు. సామాజిక, జిల్లాల సమీకరణాల ఆధారంగానే ఈ చేర్పులు ఉండనున్నాయి. డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్, విప్‌లు, ఇతర పదవులను దృష్టిలో పెట్టుకుని మంత్రివర్గ విస్తరణలో ఎవరికి అవకాశం ఇవ్వాలనే నిర్ణయం జరగనుంది.

అంచనాలివే

స్పీకర్: పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఈటల రాజేందర్, పద్మా దేవేందర్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్

మంత్రులు: వేముల ప్రశాంత్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి/జి.జగదీశ్‌రెడ్డి, టి.హరీశ్‌రావు, కేటీఆర్/ఎర్రబెల్లి దయాకర్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, టి.పద్మారావు గౌడ్, దానం నాగేందర్, కడియం శ్రీహరి/అరూరి రమేశ్, డీఎస్ రెడ్యానాయక్.

విద్యుత్ ఉత్పత్తిలో తెలంగాణ టాప్

- మరో నాలుగేళ్లలో నాలుగువేల మెగావాట్ల విద్యుత్
- ఉద్దేశపూర్వకంగా తప్పులు చేస్తే ఉపేక్షించం
- విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణలో జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

సాక్షి,హైదరాబాద్: విద్యుత్ ఉత్పత్తి, వినియోగంలో దేశంలోనే తెలంగాణ ముందుందని, భవిష్యత్ అవసరాల కోసం మరో నాలుగేళ్లలో నాలుగువేల మెగావాట్ల విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు రాష్ట్ర జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు చెప్పారు. రవీంద్రభారతిలో శనివారం జరిగిన విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీ-2019 ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యుత్ ఉత్పత్తి వాటా విషయంలో ఇతర రాష్ట్రాలు 58%గా ఉంటే.. తెలంగాణలో 80% వాటా ఉందన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో విద్యుత్ ఉత్పత్తిని పెంచడంతోపాటు ట్రాన్స్‌మిషన్ నష్టాలను 3.5% నుంచి 2.88 శాతానికి, డిస్ట్రిబ్యూషన్ నష్టాలను 16 నుంచి 11 శాతానికి తగ్గించడం అభినందనీయమన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా ఉద్యోగుల సమష్టి కృషితోనే సాధ్యమైందన్నారు. ఏ సంస్థకైనా ఆర్థిక విభాగం కీలకమైందని, ఎప్పటికప్పుడు ఉద్యోగులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుంటూ సంస్థ పురోగతికి పాటుపడాలన్నారు. మీటర్‌సేల్స్‌ను పెంచి, సాంకేతిక నష్టాలను మరింత తగ్గించాల్సిన బాధ్యత కూడా అకౌంటెంట్లపైనే ఉందన్నారు. ఏ ఉద్యోగి అయినా తప్పులు చేయడం సహజమేనని, కానీ ఉద్దేశ పూర్వకంగా తప్పులు చేస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారంలో సిబ్బంది నిర్లక్ష్యం

మీటర్ల మార్పిడి, కొత్త మీటర్ల జారీ, ఇతర సమస్యల పరిష్కారం విషయంలో ఈఆర్‌ఓ, ఏఈలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ రఘుమారెడ్డి ఆవేదన వ్యక్తం చేశా రు. ఈ విషయంలో ఉద్యోగులు తమ ధోరణి మార్చుకుని, సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు. తెలంగాణ విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ఉన్నతాధికారులు ఉద్యోగుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె యోచన విరమించుకోండి

- కార్మిక సంఘాలకు సింగరేణి యాజమాన్యం విజ్ఞప్తి
- లాభాలు ఆర్జిస్తున్న సమయంలో సమ్మెకు పోతే నష్టం

సాక్షి, హైదరాబాద్: విధానపరమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మె యోచనను విరమించుకోవాలని కార్మిక సంఘాల నాయకులకు సింగరేణి యాజమాన్యం విజ్ఞప్తి చేసింది. శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సంస్థ డైరెక్టర్ ఎస్.చంద్రశేఖర్ గుర్తింపు కార్మిక సంఘమైన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షుడు బి.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, ప్రాతినిధ్య సంఘం ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్యతో సమావేశమై సమ్మె యోచన విరమించాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఒక్క రోజు సమ్మె చేసినా కంపెనీకి ఇబ్బందులు వస్తాయన్నారు. రాష్ట్ర విద్యుదుత్పత్తికి అవసరమైన బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాల ప్రాధాన్యతను కార్మిక నేతలకు ఆయన వివరించారు. జాతీయ సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చినా.. డిమాండ్ల పరిష్కారం వాస్తవానికి సింగరేణి సంస్థ పరిధిలో లేదన్నారు. పెట్టుబడుల ఉపసంహరణ, కమర్షియల్ మైనింగ్ వంటివి సింగరేణిలో లేవని, ఇకపై ఉండబోవని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని బొగ్గు గనులతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లో మరో 6 బొగ్గు బ్లాకుల కోసం సింగరేణి సంస్థ ప్రయత్నిస్తోందనీ, తద్వారా 100 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. గతేడాది సాధించిన 620 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 646 లక్షల టన్నుల బొగ్గు రవాణా ఫలితంగా రూ.1,212 కోట్ల లాభాలు ఆర్జించామని, దీనిలో రూ. 328 కోట్లు విలువ చేసే 27 శాతం లాభాలను కార్మికుల వాటాగా పంపిణీ చేశామని గుర్తుచేశారు. ఈ ఏడాది ఇప్పటికే 455 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేశామని, మరో 215 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉందన్నారు. దీని కోసం రోజుకి కనీసం 2 లక్షల 15 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉందని తెలిపారు. గతేడాది కన్నా ఎక్కువ ఉత్పత్తి, ఎక్కువ లాభాలు సాధించబోతున్న తరుణంలో సమ్మెకు పోతే కంపెనీతో పాటు కార్మికులకు నష్టం వాటిల్లుతుందన్నారు. కార్మికులు విధులకు హాజరయ్యేలా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



పోస్టర్లు, కరపత్రాల విడుదల..

కార్మికులు సమ్మెకు పోవద్దని విజ్ఞప్తి చేస్తూ రూపొందించిన కరపత్రాలను, పోస్టర్లను శనివారం అన్ని ఏరియాలకు పంపారు. వీటిని ఆదివారం అన్ని గనులు, విభాగాల్లో పంపిణీ చేయనున్నారు.

ఇదం జగత్



నీ ఇంటికొస్తా.. నట్టింటికొస్తా..
ఇక్కడే స్పీచ్ ఇస్తా!! ఊరుకుంటానా..

ఫ్యాషనే వారి నినాదం



- దుస్తుల రంగులే వారి భావాలకు ప్రతీకలు
- అమెరికా కాంగ్రెస్‌లో 102 మంది మహిళా ప్రతినిధుల ప్రమాణం

అమ్మాయి అంటే పింక్ కలర్. కంటికి ఇంపుగా, మనసుకు హాయిగా అచ్చం అమ్మాయిల్లాగే సున్నితంగా ఆ రంగు చెరగని ముద్ర వేస్తుంది. కానీ, ఇప్పుడు పింక్ అంటే ఆహ్లాదం కాదు. గుండె లోతుల్లోంచి పొంగుకొచ్చే భావావేశం, ధిక్కారానికి గుర్తు, చేరుకోవాల్సిన లక్ష్యాలకు ప్రతీక, మహిళల పట్ల ఇప్పటివరకు చేసిన తప్పుల్ని సరిదిద్దుకోవడానికి సంకేతం. అవును అమెరికా కాంగ్రెస్‌కి కొత్తగా ఎన్నికైన మహిళా ప్రతినిధులు ఇదే విషయాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలనుకున్నారు. అమెరికా 116వ కాంగ్రెస్‌లో ప్రమాణస్వీకారమహోత్సవానికి హాజరైనప్పుడు ఒక్కొక్కరు ఒక్కో రీతిలో, వారి సంప్రదాయాలు ఉట్టిపడేలా, సంస్కృతికి ప్రతీకలుగా తయారై వచ్చారు. అదే తమ పోరాట ఆయుధమని స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. అలంకరణ అనేది బాహ్య అందాన్ని పెంపొందించడమే కాదు ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తుందని, సాంస్కృతిక గొప్పదనాన్ని చాటి చెబుతుందని వారంతా ముక్త కంఠంతో నినదిస్తున్నారు. ఫ్యాషన్‌ను ఇప్పుడు తమ పోరాటాలకు పంథాగా మార్చుకోవడం విశేషం.

రికార్డు స్థాయిలో 102 మంది ఎన్నిక..

అమెరికా ప్రతినిధుల సభకు జరిగిన ఎన్నికల్లో ఈ సారి రికార్డు స్థాయిలో 102 మంది మహిళలు ఎన్నికయ్యారు. గతంలో ఎన్నడూలేని విధంగా వెల్లువలా వీరి సంఖ్య పెరిగింది. అయినప్పటికీ సభలో ఇంకా పురుషాధిక్యమే కొనసాగుతోంది. అయినా తాము ఎందులోనూ తీసిపోమని చాటిచెప్పడానికి ప్రమాణస్వీకార ఉత్సవాన్నే వేదికగా చేసుకున్నారు మహిళా ప్రతినిధులు. నాన్సీ పెలోసి ముదురు గులాబీరంగు గౌనులో మెరిసిపోతూ సభకు వచ్చారు. ''పింక్ అంటే శాంతి, సహనం కాదు. దానికి అర్థం మారింది. ఈ రంగు మాలోని భావావేశాన్ని తట్టిలేపుతుంది. అమ్మాయిల పట్ల చేసిన తప్పులు సరిదిద్దుకోవాలని గట్టిగా నిలదీసి అడుగుతుంది'అని వ్యాఖ్యానించారు.

మహిళా ఓటు హక్కుకు వందేళ్లు..

ఈ ఏడాది అమెరికా ప్రజాస్వామ్య చరిత్రలోనే అత్యంత కీలకమైనది. మహిళలకు ఓటు హక్కు కల్పించి అమెరికాలో సరిగ్గా వందేళ్లు అవుతోంది. మహిళలకు ఓటు హక్కుకల్పిస్తూ 1919, జూన్ 4న కాంగ్రెస్ బిల్లును ఆమోదించారు. అందుకే మహిళా ప్రతినిధులందరూ తమ ప్రసంగాల్లో ఇదే అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. పొడవైన గౌను ధరించి వచ్చిన పాలస్తీనా అమెరికన్ రషీదా తాలిబ్ తన తల్లి లాంతర్ వెలుగులో అలాంటి ఎంబ్రాయిడరీ గౌనులు కుడుతూ ఎంత కష్టపడిందో ఉద్విగ్నభరితంగా చెప్పారు. డెబ్రా హాలండ్ రంగురంగుల పూసల గొలుసులు ధరించి వచ్చి తమ ప్రాంతంలో గల్లంతవుతున్న మహిళలు, వారి హత్యల గురించి ప్రస్తావించారు. ఆఫ్రికన్ అమెరికన్ మహిళఅయిన బార్బారా మెడ చుట్టూ స్టోల్‌ని వేసుకుని వచ్చి మహిళలు విభిన్న పంథాలో నడుస్తూ నిరంతరం క్రియాశీలకంగా ఉండాలన్నారు. ఇక సోమాలియా నుంచి శరణార్థిగా వచ్చి కాంగ్రెస్‌కు ఎన్నికైన ఇల్హాన్ ఒమర్ తెల్లరంగు గౌనులో వచ్చి తమ ప్రాంతంలో శాంతి స్థాపన ధ్యేయమన్నారు. రంగు రంగుల దుస్తులు, హొయలు చిందే ఫ్యాషన్లు.. ఇదంతా ఎవరినో ఆకర్షించాలని కాదు, పదిమందిలో గుర్తింపు పొందాలని అంతకంటే కాదు.. తాము ఏర్పాటు చేసుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి. ఆడదంటే అబల కాదు సబల అని చాటి చెప్పడానికే అంటున్నారు ఈ మహిళా నేతలు.

సలహాల పేరుతో శఠగోపం

- స్టాక్ మార్కెట్‌లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలంటూ వల
- ఇండోర్ వేదికగా సెబీ రిజిష్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజరీ కంపెనీల బాగోతం
- నగరానికి చెందిన నలుగురికి దాదాపు రూ.15 లక్షలకు పైగానే మోసం
- నాలుగు కంపెనీల డైరెక్టర్‌లను అరెస్టు చేసిన సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు
- ఆయా కంపెనీ బ్యాంక్ ఖాతాల్లోని రూ.3.62 కోట్లు ఫ్రీజ్ : సీపీ సజ్జనార్

సాక్షి, హైదరాబాద్: షేర్ మార్కెట్లో నమ్మకమైన సలహాలు..అంటూ వల విసిరి ఆ తర్వాత ప్యాకేజీలుగా టోకున సూచనలు ఇస్తామని బుట్టలో వేసుకొని చివరికి పెట్టుబడి పెట్టండి రూ.లక్షలు పట్టండి అంటూ శఠగోపం పెట్టిన నాలుగు బోగస్ కంపెనీల డైరెక్టర్లను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఇలా ఇండోర్‌లో నిర్వహిస్తున్న నాలుగు సెబీ రిజిష్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజరీ కంపెనీల డైరెక్టర్లను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకొని ట్రాన్సిట్ వారంట్‌పై శనివారం నగరానికి తీసుకువచ్చారు. షేర్ మార్కెట్‌లో లాభాలొస్తాయంటూ సలహాల పేరుతో రూ.15 లక్షల 61 వేలు మోసగించారని నలుగురు బాధితులు గతేడాది ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఈ కేసు వివరాలను గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో క్రైమ్స్ డీసీపీ జానకి షర్మిల, సైబర్ క్రైమ్ ఏసీపీ శ్రీనివాస్ కుమార్‌లతో కలసి పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ శనివారం మీడియాకు తెలిపారు.

మొదట టెలికాలర్లు... ఆ తర్వాత డైరెక్టర్లుగా

ఎంబీఏ చదివిన స్వప్నిల్ ప్రజాపతి, అఖిలేష్ రఘువంశీ, సంతోష్ సింగ్ పరిహార్, సాగర్ సాహూలు సెబీ విద్యా అనుబంధ సంస్థ అయిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెటీస్ నుంచి పీజీ డిప్లొమా కోర్సులు చేసి ఆ తర్వాత సెబీ వద్ద ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజరీ కంపెనీలుగా రిజిష్టర్ చేసుకున్నారు. ఈ సమయంలోనే వేర్వేరు ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజరీ కంపెనీలో టెలికాలర్లుగా పనిచేసిన వీరు ఆ అనుభవంతో వేర్వేరు సంవత్సరాల్లో కంపెనీలు ఎవరికి వారు ఏర్పాటు చేసుకొని నిర్వహిస్తు న్నారు. హైబ్రో మార్కెట్ రీసెర్చ్ ఇన్వెస్ట్‌మెంట్స్ అడ్వైజరీ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో వేటూస్ క్యాపిటల్.కామ్‌ను స్వప్నిల్ ప్రజాపతి, దఇక్విక్వామ్ ఫైనాన్షియల్ రీసెర్చ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో దఇక్విక్వామ్.కామ్ పేరుతో అఖిలేష్ రఘువంశీ, ట్రేడ్ బిజ్ రీసెర్చ్ పేరుతో ట్రేడ్‌బిజ్ఇండియా.కామ్ పేరుతో సంతోష్ సింగ్ పరిహార్, సఫల్ రీసెర్చ్ పేరుతో షఫల్‌రీసెర్చ్.కామ్ పేరుతోసాగర్ సాహూలు స్టాక్ మార్కెట్లలో అతి తక్కువ కాలంలో అనతి లాభాలంటూ డీమ్యాట్ ఖాతాదారులకు వల విసురుతున్నారు. ఇండోర్‌లోని విజయ్ నగర్ కాలనీలో ఐటీ కంపెనీలను తలదన్నేలా సకల సౌకర్యాలతో కార్యాలయాలను నిర్వహిస్తూ 530మంది టెలికాలర్లను నియమించుకొని రోజుకు వేలాది ఫోన్‌కాల్స్ చేస్తూ డబ్బును రెట్టింపు చేస్తామంటూ తియ్యటి మాటలతో కట్టిపడేస్తున్నారు. వీరి మాటలు నమ్మి మోసపోయిన చాలా మంది కార్యాలయాలకు వస్తే సెక్యూరిటీ గార్డులు, బౌన్సర్లు కనీసం లోపలికి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.

రూ.1.3 లక్షలు పెడితే నెలలో రూ.45 లక్షల లాభమంటూ...

స్టాక్ మార్కెట్‌లో డీ మ్యాట్ ఖాతాదారుల వివరాలు సేకరించిన వీరు టెలికాలర్లు ద్వారా ఫోన్‌కాల్స్ చేస్తారు. ఫలానా సమయంలో ఫలానా షేర్ ధర పెరుగుతుంది, తగ్గుతుందంటూ వారిని నమ్మిస్తారు. వీరు చెప్పినట్టుగానే షేర్ల ధరలు ఉండటంతో నమ్మిన వేలాది మంది లాభాల కోసం రూ.5,900ల రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించారు. ఇక దశల వారీగా సలహాల కోసమంటూ ఒక్కో రేటును నిర్ణయించి వేలల్లో డబ్బులను లాగుతున్నారు. అలాగే 45 రోజుల్లో రూ.2,75,00 ల లాభానికి రూ.22,499, రూ.7,50,000 లాభానికి రూ.33,999లను ప్రాజెక్టుల రూపంలో చార్జీలు, టెక్నికల్ రిపోర్టుల కోసం ఒక్కోదానికి రూ.3,999 చొప్పున 20 అంటే రూ.79,980లు వసూలు చేయడంతో పాటు 18 శాతం జీఎస్‌టీని కూడా బాధితుల నుంచి తీసుకుంటున్నారు. లాభాల కోసం సలహాలు పక్కనపెడితే డీ మ్యాట్ ఖాతా ద్వారా రూ.1,30,000లు పెట్టుబడి పెడితే నెల రోజుల్లో రూ.45 లక్షల లాభాలు వచ్చేలా చూస్తామని చెప్పడంతో పాటు చెల్లించే డబ్బులో 18 శాతం జీఎస్‌టీ, సెక్యూరిటీ డిపాజిట్ కింద 20 శాతం మొత్తం ముందుగానే వసూలు చేశారు. చివరి వరకు నెలలు గడుస్తున్నా సొమ్ములు వెనక్కి రాకపోవడంతో బాధితులు నష్టాల్లో కూరుకుపోయారు. ఈ కంపెనీలపై సెబీ వద్ద దాదాపు 800 వరకు ఫిర్యాదులు నమోదయ్యాయి. ఈ నాలుగు కంపెనీల మోసాలపై సెబీకి లేఖ రాస్తామని, వారికి వచ్చిన ఫిర్యాదుల చిట్టా తీసుకొని తెలంగాణ నుంచి ఎంత మంది బాధితులున్నారా అని తెలుసుకుంటామని సీపీ అన్నారు. అలాగే ఆయా కంపెనీ బ్యాంక్ ఖాతాల్లో ఉన్న రూ.3.62కోట్లను ఫ్రీజ్ చేసినట్లు వెల్లడించారు. ఇండోర్ వెళ్లి నిందితులను పట్టుకొచ్చిన ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, రామయ్య, ఎస్‌ఐ విజయ్ వర్ధన్‌లను సీపీ సజ్జనార్ ప్రశంసించారు.

ఇవీ ..తెలుసుకోండి...

నగరంతో పాటు ఏ ఇతర నగరాల్లోనైనా ఉన్న షేర్ ట్రేడింగ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజరీల సలహా తీసుకోవాలనుకుంటే వారి కార్యాలయానికి వ్యక్తిగతంగా వెళ్లాలి. అక్కడ అన్నీ తెలుసుకున్నాకే మంచిదని అనుకుంటే ముందుకెళ్లాలి. స్థానిక సెబీ అధికారుల వద్ద కూడా వారి వివరాలు తెలుసుకోవాలి.

నమ్మించి మోసగించారు..

నేను స్టాక్ మార్కెట్‌లో షేర్లు క్రయ విక్రయాలు చేస్తుంటాను. ఒకరోజు దఇక్విక్వామ్.కామ్ పేరుతో స్టాక్ మార్కెట్ సలహాలు ఇస్తామంటూ ఫోన్‌కాల్ వచ్చింది. నమ్మలేదు. అయితే ఉదయం 9.30 నుంచి 9.45 గంటల సమయంలో ఫలానా కంపెనీ షేర్ల ధరలు ఇంత వరకు పెరుగుతాయని చెప్పారు. అలా నేను వారం పాటు వారి సలహాలు చూశా. చివరకు నమ్మకం వచ్చాక విడతల వారీగా డబ్బులు ఇన్వెస్ట్ చేశా. చివరకు ఒకసారి నేరుగా లక్ష రూపాయలు ఇస్తే ఇన్వెస్ట్ చేస్తామని చెప్పి మోసం చేశారు. వారి కంపెనీలో ఒకరు ఒక షేర్లు కొన్నారంటే...మరొకరు ఇంకొక షేర్లు కొన్నారని సమాధానం చెప్పడంతో సైబరాబాద్ సైబర్ క్రైమ్‌ను సంప్రదించా.

- ఆదిత్య, బాధితుడు

చక్కదిద్దుకుంటున్న సీపీఎం

- బహుజన లెఫ్ట్ ఫ్రంట్‌ని విడిగానే నిర్వహించే యోచనలో సీపీఎం
- ఎన్నికల్లో కేడర్ ప్రలోభాలకు గురికావడంతో క్షేత్రస్థాయిలో చక్కదిద్దే పనిలో నిమగ్నం
- అందులో అవసరమైనపుడే రాష్ట్రపార్టీ జోక్యం చేసుకోవాలని నాయకత్వం ఆదేశం?

సాక్షి, హైదరాబాద్ : అసెంబ్లీ ఎన్నికల్లో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్‌ఎఫ్) పేరిట చేసిన ప్రయోగం నిరాశాజనక ఫలితాలు సాధించడంతో రాబోయే రోజుల్లో ఎలాంటి కార్యాచరణ చేపట్టాలనే దానిపై సీపీఎం కసరత్తు చేస్తోంది. ఈ ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో కొన్ని చోట్ల పార్టీ దెబ్బతిన్నట్టుగా నాయకత్వం దృష్టికి వచ్చినట్టు తెలుస్తోంది. ఎన్నికల సందర్భంగా కొన్ని చోట్ల కిందిస్థాయి నేతలు, కార్యకర్తలు ప్రలోభాలకు గురైనట్టుగా, ఇతర రాజకీయ పార్టీలు, ముఖ్యంగా అధికారపార్టీకి అనుకూలంగా వ్యవహరించారని నిర్ధారణకు వచ్చినట్టుగా తెలిసింది. శాసనసభ ఎన్నికల్లో పార్టీకి బాగా పట్టున్న నియోజకవర్గాలు, కొన్నేళ్లుగా సంప్రదాయ ఓటింగ్‌గా నిలిచిన ఖమ్మం, నల్లగొండ, వరంగల్, తదితర జిల్లాల్లోనూ కనీసం ఆశించిన మేర ఓట్లు కూడా పడకపోవడం పట్ల పార్టీలో ఆందోళన వ్యక్తమైనట్టు సమాచారం.సైద్ధాంతిక ప్రాధాన్యమున్న పార్టీగా ఎన్నికల సందర్భంగా క్షేత్రస్థాయిలో కొన్ని జిల్లాల్లో కిందిస్థాయి నాయకులు, కార్యకర్తల్లో బలహీనతలు బహిర్గతం కావడం ప్రమాదకర హెచ్చరికలుగా నాయకత్వం భావిస్తోంది. కొన్ని జిల్లాల్లో కిందిస్థాయి కేడర్‌లో లుకలుకలు స్పష్టం కావడం, పార్టీ సిద్ధాంతాలకు భిన్నంగా బూర్జువా రాజకీయపార్టీల్లో మాదిరిగా ప్రలోభాలకు లొంగిపోయే తత్వం కారణంగా కార్యకర్తల తీరు సక్రమంగా లేదని నిర్ధారించింది. ఈ నేపథ్యంలో ఈ బలహీనతలు అధిగమించేలా సత్వరం క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు చర్యలు చేపట్టాలని తీర్మానించింది. పూర్తిస్థాయిలో సైద్ధాంతిక అవగాహన కల్పించేలా శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని భావిస్తోంది. కిందిస్థాయి నుంచి అంకితభావమున్న కార్యకర్తలను తయారుచేసుకోవడంపై దృష్టి పెట్టాలని జాతీయనాయకత్వం ఆదేశించినట్టు తెలిసింది.

బీఎల్‌ఎఫ్‌ని విడిగా ఉంచితేనే మంచిది..

బీఎల్‌ఎఫ్‌ను పూర్తిగా భుజాన వేసుకోవడంతో సీపీఎంకు బీఎల్‌ఎఫ్‌కు ఎలాంటి తేడా లేదన్న అభిప్రాయం ప్రజల్లో ఏర్పడేందుకు ఆస్కారం ఏర్పడిందని పార్టీ జాతీయనాయకత్వం అభిప్రాయపడినట్టు తెలుస్తోంది. బీఎల్‌ఎఫ్ పరంగా కుల, సామాజికవర్గ ముద్ర ఉంటే పరవాలేదని, కమ్యూనిస్టుపార్టీగా సీపీఎంపై అలాంటి ముద్ర పడే పరిస్థితి రాకూడదని పేర్కొన్నట్టు తెలిసింది. ఇటీవల జాతీయపార్టీ ముఖ్యనేతలు సీతారాం ఏచూరి, ప్రకాష్ కారత్, బీవీ రాఘవులు సమక్షంలో జరిగిన రాష్ట్ర సెక్రటేరియట్, రాష్ట్ర కమిటీ భేటీలో ఈ అంశాలు చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. బహుజన లెఫ్ట్ పార్టీ (బీఎల్‌పీ)గా ఎన్నికల్లో పోటీచేసినందున దాని కార్యకలాపాలు విడిగా ఉంటేనే మంచిదని జాతీయనాయకులు పేర్కొన్నట్టు తెలిసింది. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్రపార్టీ భావిస్తోంది. పంచాయతీ ఎన్నికల్లో బీఎల్‌ఎఫ్ ప్రయోగాన్ని కొనసాగించాలని నిర్ణయించినా, పార్టీరహితంగా జరిగే ఈ ఎన్నికల్లో ప్రత్యక్ష ప్రమేయం లేకుండానే ముందుకు సాగాలని యోచనలో సీపీఎం ఉన్నట్టు తెలుస్తోంది.

ఫిర్యాదా? మేమే వస్తాం..

- నేరుగా బాధితుల ఇంటికే పోలీసులు
- కొత్త ఏడాదిలో పోలీస్ శాఖ వినూత్న ప్రయోగం
- ఎస్పీలు, డీసీపీలతో డీజీపీ వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, హైదరాబాద్: ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు పోలీస్ శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతోంది. ఇప్పటికే ఎన్నో టెక్నాలజీ పద్ధతుల్లో సర్వీస్ డెలివరీ వేగవంతం చేసిన పోలీస్ శాఖ ఇప్పుడు ప్రజల వద్దకే పోలీస్ సేవల పేరుతో ఏకరూప పోలీసింగ్ సేవలను విస్తరించేందుకు శ్రీకారం చుట్టింది. ప్రజల వద్దకు పోలీస్ పేరుతో 15 రోజుల పాటు అన్ని గ్రామాలు, పల్లెలు, కాలనీలు, అపార్ట్‌మెంట్లు, వ్యాపార సముదాయాలు.. ఇలా అన్ని ప్రాంతాల్లో సంబంధిత శాంతి భద్రతల విభాగం పోలీసులు పర్యటిస్తారు. అక్కడి ప్రజలతో సమావేశాలు ఏర్పాటుచేసి ఇంకా పోలీస్ శాఖ నుంచి ఎలాంటి సేవలు కావాలో ఆరా తీయనున్నారు. సంబంధిత సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశాలపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తారు. ఇలా ప్రజల నుంచి గుర్తించిన సమస్యలపై ఆయా జిల్లాల బాధ్యులుగా ఉన్న ఎస్పీలు, కమిషనర్లు, డీసీపీలతో సమావేశం నిర్వహిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు, కమిషనరేట్ల నుంచి వచ్చిన అంశాలపై డీజీపీ మహేందర్‌రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు.

నేరుగా ఇంటి నుంచే..

పోలీస్ సేవలను యాప్స్ ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన పోలీస్ శాఖ మరో అడుగు ముందుకు వేసి బాధితుల ఇంటి నుంచే ఫిర్యాదులు తీసుకోనుంది. అదే విధంగా అక్కడి నుంచే టెక్నాలజీ సహాయంతో ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేసేందుకు చర్యలు చేపట్టనుంది. గత నాలుగేళ్లలో బాధితులు ధైర్యంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదులు చేస్తున్నారు. అయితే కొన్ని మహిళా సంబంధిత నేరాల్లో బాధితుల ఇంటికే పోలీసులు వెళ్లి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ఇప్పుడదే రీతిలో టీఎస్ కాప్ యాప్ ద్వారా సంఘటనా స్థలం నుంచే కేసులు నమోదు చేసే వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారు.

డీజీపీ వీడియో కాన్ఫరెన్స్..

ఏకరూప పోలీసింగ్, ఏకరూప సర్వీస్ డెలివరీ విధానంపై డీజీపీ జిల్లా ఎస్పీలు, కమిషనర్లు, డీసీపీలతో శనివారం ఆయన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించినందుకు సంబంధిత అధికారులందరినీ డీజీపీ అభినందించారు.

పకడ్బందీగా పంచాయతీ ఎన్నికలు

- అందరూ సమన్వయంతో పనిచేయాలి
- కలెక్టర్లు, ఎస్పీలకు సీఎస్ జోషి ఆదేశం
- అసెంబ్లీ ఎన్నికల అనుభవంతో ముందుకెళ్లండి: డీజీపీ

సాక్షి, హైదరాబాద్: మూడు విడతల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు/పోలీసు కమిషనర్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి ఆదేశించారు. శనివారం సచివాలయం నుంచి పంచాయతీ ఎన్నికల సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని పంచాయతీ ఎన్నికల్లో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోలింగ్ సిబ్బందికి అనుకోని సంఘటనలు ఎదురైతే తక్షణమే స్పందించేలా ప్రత్యేక అధికారిని నియమించాలని, ఆ అధికారి వివరాలు పోలింగ్ సిబ్బంది ఉండాలని పేర్కొన్నారు.

కలెక్టర్లు సన్నద్ధతతో ఉండాలి...

పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సిబ్బంది, పోలింగ్ సామగ్రి, భద్రత ప్రణాళిక, అవసరమైన వాహనాలు, పోలింగ్ స్టేషన్లు/కౌంటింగ్ హాళ్లు/డిస్ట్రిబ్యూషన్/స్టోరేజ్ సెంటర్ల గుర్తింపు, బడ్జెట్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి.నాగిరెడ్డి సూచనలు చేశారు. 25 రోజుల్లో ఎన్నికలు పూర్తి కావల్సిన నేపథ్యంలో కలెక్టర్లు పూర్తి సన్నద్ధతతో ఉండాలన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని, పోలింగ్ స్టేషన్లు, వార్డులు ప్రజలకు తెలిసేలా సూచికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



శనివారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న సీఎస్ ఎస్‌కే జోషి

జిల్లాలో పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మొదటి, రెండో విడత ఎన్నికలు జరిగే పంచాయతీలకు రిటర్నింగ్ అధికారుల నియామకం, పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్, ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు మొదటి దశ శిక్షణ, కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ, మైక్రో అబ్జర్వర్ల నియామకం, మండలాలకు సహాయ ఎన్నికల వ్యయ పరిశీలకుల నియామకం తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. ఓటర్ల జాబితాలు, ఓటరు స్లిప్పుల ప్రచురణ పంపిణీ, బ్యాలట్ పేపర్ల ప్రచురణ, పేపర్ సీల్స్, సిరా అవసరమైనవన్నీ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జిల్లాల్లో ఎన్నికల సామగ్రి పంపిణీ, సేకరణ, ఓట్ల లెక్కింపు కేంద్రాల ఎంపికను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాల వారీగా పోలింగ్ స్టేషన్ల భద్రత ప్రణాళికలు రూపొందించుకోవాలని, సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వెబ్ కాస్టింగ్, వీడియో రికార్డింగ్, లైటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు.

అసెంబ్లీ ఎన్నికల అనుభవంతో..

అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ అనుభవంతో పంచాయతీ ఎన్నికల్లో కూడా పనిచేయాలని ఎస్పీలకు డీజీపీ మహేందర్‌రెడ్డి ఆదేశించారు. మూడు విడతల్లో జరగనున్న ఈ ఎన్నికల్లో పోలింగ్ సిబ్బందిని రొటేషన్ పద్ధతిలో వినియోగించుకోవచ్చని, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. అదనపు డీజీ జితేందర్ మాట్లాడుతూ, గ్రామాలు, ప్రాంతాలు, పోలీస్ స్టేషన్ల వారీగా బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా మొత్తానికి సెక్యూరిటీ ప్లాన్ ఉండాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ల వద్ద అవసరమైన బారికేడ్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్ రాజ్, హోం శాఖ ముఖ్యకార్యదర్శి రాజీవ్ త్రివేది, పంచాయతీ రాజ్ కమిషనర్ నీతూ ప్రసాద్, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి అశోక్ కుమార్ పాల్గొన్నారు.

క్యాట్‌లో వరంగల్ నిట్ అత్యుత్తమ ప్రతిభ

అత్యుత్తమ స్కోర్ సాధించిన విద్యార్థులు

సాక్షి, హైదరాబాద్: ఐఐఎం (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్) లలో ప్రవేశాలకు సంబంధించి గతేడాది నవంబర్‌లో జరిగిన క్యాట్ (కామన్ అడ్మిషన్ టెస్ట్) లో వరంగల్ నిట్ విద్యార్థులు అత్యుత్తమ స్కోర్ సాధించి సత్తా చాటారు. నిపున్ అగర్వాల్ (మెకానికల్) 99.92 స్కోర్ సాధించగా.. తరుణ్ కటకి (ఈఈఈ) 99.85, సమీర్ అహ్మద్ (సివిల్) 97.12, పార్థ్ గోస్వామి(సీఎస్ఈ) 97.04, గౌరవ్ మలిక్ (కెమికల్) 96, తపస్ దాస్ (ఎంఎంఈ) 95.9, సుజన్ (మెకానికల్) 95.17 స్కోర్ సాధించినట్లు వరంగల్ నిట్ డైరెక్టర్ ఎన్వీ రమణారావు తెలిపారు.

పలు ఉద్యోగాల పరీక్ష 'కీ'ల విడుదల

అభ్యంతరాలను ఈ నెల 15లోపు తెలపాలన్న టీఎస్‌పీఎస్సీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్వహించిన సానిటరీ ఇన్‌స్పెక్టర్, హెల్త్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, అసిస్టెంట్ డైరీ మేనేజర్, అసిస్టెంట్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్, ఫీల్డ్ సూపర్‌వైజర్, ప్రాసెసింగ్ సూపర్‌వైజర్, బాయిలర్ ఆఫీసర్, ల్యాబ్ అసిస్టెంట్, మార్కెటింగ్ అసిస్టెంట్, మార్కెటింగ్ సూపర్‌వైజర్ పోస్టుల రాతపరీక్ష 'కీ' లను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు కార్యదర్శి శనివారం ప్రకటనలో తెలిపారు. 'కీ' లపై ఎలాంటి అభ్యంతరాలున్నా అభ్యర్థులు ఈ నెల 9 నుంచి 15వ తేదీ లోపు ఆన్‌లైన్ విధానం ద్వారా తెలుపవచ్చని పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో గ్రాడ్యుయేషన్ కోర్సులు

సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ ద్వారా అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులు అందుబాటులోకి తెచ్చేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నోటిఫికేషన్ జారీచేసింది. ఈ మేరకు ఆన్‌లైన్ కోర్సులు నిర్వహించుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్రంలోని ఉన్నత విద్యాసంస్థలకు సూచించింది. ఎలాంటి కోర్సులను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకువస్తారో అనుమతి పొందేందుకు ఈ నెల 7 నుంచి 31వతేదీ లోపు యూజీసీ న్యూఢిల్లీకి దరఖాస్తు చేసుకోవాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టంచేసింది.

మన దగ్గర నో డిటెన్షన్ విధానమే!

సాక్షి, హైదరాబాద్: ప్రాథమిక విద్యలో ఇప్పటివరకు అమల్లో ఉన్న నో డిటెన్షన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఈమేరకు ప్రవేశపెట్టిన బిల్లుకు పార్లమెంటు ఆమోదం తెలిపింది. దీంతో ఎనిమిదో తరగతిలోపున్న విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి వారిని ఇకపై డిటెండ్ చేసే అవకాశం ఉంటుంది. అయితే ఈ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం పక్కనపెట్టింది. అప్పట్లో విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి ఈ విధానాన్ని వ్యతిరేకించారు. నో డిటెన్షన్ విధానాన్నే అమలు చేయాలని నిర్ణయించారు. కేంద్రం బిల్లును ప్రవేశపెట్టినప్పటికీ అమలు అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకే ఇచ్చింది. దీంతో రాష్ట్రంలో నో డిటెన్షన్ విధానమే కొనసాగనుంది.

నీట్ ద్వారానే డిగ్రీ వెటర్నరీ కోర్సుల్లో ప్రవేశం

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన పశువైద్య కళాశాలల్లో 2019–20 విద్యా సంవత్సరానికి డిగ్రీ వెటర్నరీ సైన్స్ (బీవీఎస్సీ అండ్ ఏహెచ్) కోర్సుల్లో చేరేందుకు నీట్ అర్హత సాధించాలని వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. జమ్మూకశ్మీర్ తప్ప మిగిలిన రాష్ట్రాల్లోని కాలేజీల్లో 15 శాతం సీట్లకు పోటీ పడవచ్చని, ఈ ఏడాది మే 5వ తేదీన పరీక్ష ఉంటుందని పేర్కొంది.

అనుమతి తీసుకోవాల్సిందే

సాంకేతిక, వృత్తి విద్యా కాలేజీలకు ఏఐసీటీఈ సూచన

సాక్షి, హైదరాబాద్: సాంకేతిక, వృత్తి విద్యా కాలేజీలకు 2019–20 విద్యా సంవత్సరంలో కోర్సుల నిర్వహణ కోసం ఏఐసీటీఈ(ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) అనుమతి తప్పనిసరి చేసింది. ఇప్పటికే కొనసాగుతున్న కాలేజీలతో పాటు కొత్తగా ఏర్పాటు చేసే కాలేజీలు కూడా అనుమతి తీసుకోవాలని ఏఐసీటీఈ ఈమేరకు బహిరంగ ప్రకటన విడుదల చేసింది. వొకేషనల్ విద్యా కాలేజీలు కూడా అనుమతి తీసుకోవాల్సిందేనని ఓ ప్రకటనలో స్పష్టం చేసింది.

పార్టీ ఏ బాధ్యతలు ఇచ్చినా ఓకే: భట్టి



సాక్షి, హైదరాబాద్: తనపై నమ్మకంతో పార్టీ ఏ బాధ్యత అప్పగించినా నిర్వహిస్తానని కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. తనను చైర్మన్‌గా నియమించిన కమిటీ అసెంబ్లీ ఎన్నికల వరకే ఉంటుందని, లోక్‌సభ ఎన్నికలకు మరో కమిటీని వేస్తారని ఆయన వెల్లడించారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలను కేసీఆర్ డబ్బు మయం చేశారని, అన్ని వ్యవస్థలను కలుషితం చేశారని ఆరోపించారు. 6 నెల ముందు నుంచే ప్రతిపక్షంలోని ముఖ్య నాయకులు, నియోజకవర్గాలపై కేసీఆర్ దృష్టి పెట్టారని.. మండల, గ్రామ స్థాయి నేతలు, కుల సంఘాల నేతలను పార్టీలో చేర్చుకున్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో ఓటమికి పార్టీ నేతలందరూ సమిష్టి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకో: పొన్నం



సాక్షి, హైదరాబాద్: కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ హితవు పలికారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఏకంగా పెద్దోడి గా చెప్పుకున్న రాజకీయాల్లో ఇలా మాట్లాడటం మంచిది కాదు. నీ అహంకారం సభ్య సమాజం గమనిస్తుంది' అని అన్నారు. ఇందిరా గాంధీ, నెహ్రూ, కాంగ్రెస్ గురించి ముందు తెలుసుకోవాలని, కావాలంటే బుక్స్ పంపిస్తానని చెప్పారు. రాజకీయం అంటేనే.. జుగుప్సాకరం చేసింది టీఆర్ఎస్ అని దుయ్యబట్టారు. ఏ గ్రామానికైనా పోయి సవాల్ అంటూ కేటీఆర్‌కు సవాల్ చేశారు. టీఆర్ ఎస్ ఏదో ఓ గ్రామంలో లేకపోవచ్చని కానీ, కాంగ్రెస్ పార్టీ మాత్రం ప్రతీ గ్రామంలో ఉందని చెప్పారు. ఏకగ్రీవంగా పంచాయతీ ఎన్నికలకు 10 లక్షలు అని ఎన్నికల అధికారులు ప్రకటిస్తుంటే కేటీఆర్ మాత్రం 15 లక్షలు అంటున్నారని, ఎన్నికల అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

రజత్‌కుమార్ అమ్ముడుపోయారు: గూడూరు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రజత్‌కుమార్ టీఆర్ఎస్ పార్టీకి అమ్ముడుపోయారని టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి ఆరోపించారు. ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడి టీఆర్ఎస్ గెలుపునకు ఆయన సాయమందించారని, అందుకు ప్రతిఫలంగా ఆయనకు రూ.కోట్లు ముట్టాయని శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రజత్‌కుమార్ ఆస్తులు, బంధువుల ఆస్తులపై నిఘా పెట్టి విచారణ జరపాలని, దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు.


కేన్సర్ ఆస్పత్రి వైద్యులకు కేటీఆర్ అభినందనలు

సాక్షి, హైదరాబాద్: ప్రజారోగ్య చరిత్రలోనే ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రికి గిన్నీస్ బుక్‌లో స్థానం కల్పించిన ఆస్పత్రి వైద్యులను టీఆర్ఎస్ కార్యవర్గ అధ్యక్షుడు కేటీఆర్ శనివారం అభినందించారు. ఈ మేరకు ఆయన్ను కలిసిన ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ జయలతతో పాటు, వైద్య సిబ్బందిని ప్రశంసించారు. ఎడ్యుకేషన్ ప్రోగ్రాంలో భాగంగా ఎంఎన్‌జే ఆస్పత్రికి చెందిన ప్రొస్టేట్ కేన్సర్ నిపుణుడు డాక్టర్ శ్రీనివాస్‌లు అక్టోబర్ 26న జేబీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రొస్టేట్ కేన్సర్‌పై గంట వ్యవధిలోనే 487 మందికి కేన్సర్ అంటే ఏంటీ, లక్షణాలు, కారణాలు, నివారణ పద్ధతులపై అవగాహన కల్పించినందుకు గుర్తింపుగా ఆస్పత్రికి ఈ అరుదైన గుర్తింపు లభించడం తెలిసిందే.

'ఎగుమతులకు వేపర్ హీట్ ట్రీట్‌మెంట్'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నుంచి ఇతర దేశాలకు పండ్లు, కూరగాయలు, పూల ఎగుమతి చేయటానికి వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ అవసరమని వ్యవసాయ ముఖ్య కార్యదర్శి పార్థసారథి అన్నారు. ఈ ఏడాది ఇతర దేశాలకు పండ్లు ప్లాంట్ కోరంటీన్ ధ్రువీకరణ ద్వారా ఏప్రిల్ నుంచి ఎగుమతి చేయనున్నట్లు చెప్పారు. శనివారం రాష్ట్ర ఉద్యాన వర్సిటీలో సమీకృత ప్యాక్ హౌస్‌లో ఆధునిక సదుపాయాల కల్పన, ఉన్నతీకరణపై రాష్ట్ర ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ డైరెక్టర్ ఎల్.వెంకట్రామ్ ఫుడ్ ప్రాసెసింగ్‌పై ప్రభుత్వం చూపిస్తున్న చొరవను వివరించారు. సమీకృత ప్యాక్‌హౌస్ ఆధునీకరించాలని పార్థసారథి ఆదేశించారు.

337వ రోజు



ఇప్పటివరకు నడిచిన దూరం - 3,607.2 కిలోమీటర్లు

337వ రోజు నడిచిన దూరం – 13.6 కిలోమీటర్లు.
5.1.2019, శనివారం, లక్కవరం క్రాస్, శ్రీకాకుళం జిల్లా

తిత్లీ పరిహారం చెక్కులు చెల్లకపోవడం మీకు సిగ్గుగా అనిపించడంలేదా బాబూ?

ఈరోజు సోంపేట మండలంలో తురకశాసనం నుంచి, పాలవలస, కొర్లాం, బారువా జంక్షన్, లక్కవరం క్రాస్ వరకు పాదయాత్ర సాగింది. అన్నీ బాగా వెనుకబడిన ప్రాంతాలే. పైగా వరుస తుపానులకు బాగా నష్టపోయాయి. ఎన్నో ఇళ్లు దెబ్బతిన్నాయి. ఎంతోమంది పంటలు కోల్పోయారు. అయినా పట్టించుకున్నవారే లేరు. వారికి తుపాను పరిహారం ఇవ్వలేదు సరికదా.. కనీసం సంక్షేమ పథకాలు అందించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాలవలస కాలనీకి చెందిన దున్నశేషమ్మ ఛాతిలో గడ్డతో బాధపడుతోంది. జరాబందకు చెందిన కొండ రాముకు గుండెలో రంధ్రం ఉంది. ఆస్పత్రికెళితే ఆరోగ్యశ్రీ లేదని వెనక్కి పంపించేశారట. సుంకిడి గ్రామానికి చెందిన బొండాడ రాజమ్మ, మడ్డు దాలమ్మ, పాలవలసకు చెందిన గోకర్ల ధర్మావతి నిరుపేద వితంతువులు. కూలిపనులు చేసి పొట్టపోసుకుంటున్నారు. మూడేళ్లుగా వితంతు పింఛన్‌ల కోసం అధికారుల చుట్టూ, నాయకుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఏడు పదులు నిండిన కర్రి ఎండమ్మ, బదకల కొసరాజులు వృద్ధాప్య పింఛన్లు ఇవ్వడం లేదని కంటతడిపెట్టారు. బారువా కొత్తూరులో మత్స్యకార కుటుంబానికి చెందిన స్వాతి పుట్టుకతోనే మూగ,చెవుడు బాధితురాలు. వందశాతం వైకల్యం ఉన్న ఆ పాప చనిపోయినట్లు రికార్డుల్లో పెట్టి మరీ పింఛను ఆపేశారట. అదే ఊరికి చెందిన వలిశెట్టి రుషికి నాన్నగారి హయాం నుంచి వస్తున్న పింఛన్‌ను.. ఈ ప్రభుత్వం వచ్చాక తీసేసింది.

సుంకిడి గ్రామానికి చెందిన మహాలక్ష్మి, ఇప్పిలి లక్ష్మి, గీతాంజలికి ఒక్కొక్కరికి ఇద్దరేసి ఆడబిడ్డలున్నారు. బంగారుతల్లి పథకం కింద పేర్లు నమోదు చేయించుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆ పథకం కింద దశల వారీగా రావాల్సిన సొమ్ము జమ అయిందని చెప్పారు. ఈ ప్రభుత్వంలో తర్వాత రావాల్సినది ఒక్క పైసా కూడా జమ కాలేదని చెప్పారు. బలహీనవర్గాలకు చెందిన స్వాతి, సాయికిరణ్‌లు అర్హత ఉన్నా.. తమకు స్కాలర్‌షిప్పులు రావడం లేదని వాపోయారు.

సోంపేటకు చెందిన వినోద్, మేనకాప్రధాన్ అనే దంపతులు కలిశారు. వాళ్ల పాప నదియా ఇంటర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో సెకండ్‌ర్యాంక్ సాధించింది. మూడేళ్ల కిందట తిరుపతిలో సాక్షాత్తూ ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి ఇద్దరూ ఆ పాపకు సన్మానం చేసి, మెడల్ ఇచ్చి, ప్రతిభ అవార్డునిచ్చారు. ఆ అవార్డు పారితోషికం కింద రూ. 20 వేలు అకౌంట్లో పడతాయని చెప్పారు. బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసి, మూడేళ్లుగా ఆ పారితోషికం కోసం ఎదురుచూస్తూ బీకాం కూడా పూర్తి చేసింది. కానీ, ఆ సొమ్ము ఇప్పటికీ ఒక్క పైసా కూడా పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న... ఈ ఒక్కరోజే ఎంతో మంది ప్రజలు నన్ను కలిసి, సంక్షేమ పథకాలు అందడం లేదని, కనీసం తిత్లీ పరిహారమైనా ఇవ్వలేదని చెప్పారు. వాస్తవ పరిస్థితులు ఇలా ఉంటే.. మీరేమో ''ప్రతి కుటుంబ వికాసం.. వంద శాతం సంక్షేమం.. వంద శాతం సంతృప్తి''అంటూ పత్రికలన్నింటిలో భారీ ప్రకటనలు ఇచ్చారు. ఇది మోసం కాదా? ఒకవైపు ప్రతిభా అవార్డులిస్తూ మీరే స్వయంగా ప్రకటించిన పారితోషికమే అందడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. మరోవైపు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మీరిచ్చిన చెక్కులే బౌన్స్ అయిన సందర్భాలు కోకొల్లలు. తిత్లీ తుపాను పరిహారం కింద మీరిచ్చిన చెక్కులు చెల్లడం లేదని జనం మొర పెట్టుకుంటున్నారు. మీకు కాస్తయినా సిగ్గుగా అనిపించడం లేదా? వాస్తవాలు ఈ విధంగా ఉండగా.. అన్నీ అద్భుతంగా ఉన్నాయంటూ శ్వేత పత్రాలు విడుదల చేయడం ప్రజలను వంచించడం కాదా?

వైఎస్. జగన్.

ప్రశంసలే తప్ప పైసల్లేవు

- **కేంద్రానిది వివక్షపూరిత వైఖరి**
- తెలంగాణకు అన్యాయం చేస్తోంది
- మొండినిద్ర, మొద్దు నిద్ర నుంచి మేల్కోవాలి
- బీజేపీ పాలిత రాష్ట్రాలకే ప్రధానిలా మోదీ వ్యవహరిస్తున్నారు
- బయ్యారంపై కేంద్రం వైఖరి తేల్చాక రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
- కేంద్రంపై టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపాటు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణపై బీజేపీ వివక్షపూరిత వైఖరి ప్రదర్శిస్తోందని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేసే పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేయాలని యోచిస్తున్న కేంద్రం.. మన రాష్ట్రానికి సాయం చేసేందుకు మాత్రం చేతులు రావట్లేదని వ్యాఖ్యానించారు. శనివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మాట్లాడారు. 'మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలకు నిధులు కేటాయింపుపై మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి లోక్‌సభలో ఇటీవల ప్రశ్నించారు. దేశంలోని అన్ని ప్రతిష్ఠాత్మక సంస్థలు, వ్యక్తులు ప్రశంసిస్తున్న ఈ పథకాలకు ఇప్పటికైనా నిధులు కేటాయిస్తారా అని అడిగారు. ఈ రెండు పథకాలకు నిధుల కేటాయింపు ప్రతిపాదనను తిరస్కరించిన కేంద్ర జలవనరుల సహాయ మంత్రి అర్జున్ మేఘవాల్ సమాధానమిచ్చారు. మిషన్ భగీరథ పథకానికి రూ.19,205 కోట్లు, మిషన్ కాకతీయకు రూ.5 వేల కోట్లు ఇవ్వాలని నీతి ఆయోగ్ ప్రతిపాదించింది. ప్రధాని నిర్వహించే మన్‌కీ బాత్‌లోనూ మిషన్ భగీరథ అనుసరణీయ పథకమని పేర్కొన్నారు. పశ్చిమబెంగాల్, బిహార్, ఒడిశా, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలు ఈ పథకం అమలుపై అధ్యయనం చేస్తున్నాయి. ప్రధాని మోదీ గజ్వేల్‌కు వచ్చి మిషన్‌భగీరథను ప్రారంభించారు. ఇలా అందరూ బాగుందని మెచ్చుకుంటున్నా.. కేంద్రం మాత్రం ప్రశంసలు తప్ప పైసలు ఇవ్వట్లేదు. కేంద్రం వందలాదిమైన వ్యవహారాల వల్ల వంద సీట్లలో డిపాజిట్ కోల్పోతుందని నేను చెప్పా. ప్రజలు ఏకంగా 103 సీట్లలో బీజేపీకి డిపాజిట్ రాకుండా చేశారు. ఇప్పటికైనా బీజేపీ తీరు మార్చుకోవాలని వినయపూర్వకంగా హెచ్చరిస్తున్నా. బీజేపీ తీరు ఇలాగే ఉంటే వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో 17 ఎంపీ సీట్లలోనూ డిపాజిట్ గల్లంతవుతుంది. మొద్దు నిద్ర, మొండి నిద్ర నుంచి బీజేపీ మేల్కొనకపోతే ప్రజలే గుణపాఠం చెబుతారు.

కాంగ్రెస్‌లో సంక్షోభం..

టీఆర్ఎస్ వ్యవహారాల్లో అన్ని నిర్ణయాలు పార్టీ అధినేత కేసీఆర్ తీసుకుంటారు.. ఆ నిర్ణయాలను అమలు చేసే బాధ్యత తనదని కేటీఆర్ అన్నారు. 'అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్‌పై ప్రత్యర్థులు అన్ని రకాలుగా దాడి చేశారు. రకరకాల విమర్శలతో కొన్ని వర్గాలు టీఆర్ఎస్‌కు దూరమయ్యాయి. అలాంటి వర్గాలు సైతం లోక్‌సభ ఎన్నికల్లో మాతోనే కలుస్తారు. లోక్‌సభ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు 16 సీట్లు వస్తాయి. కాంగ్రెస్ ఇప్పుడు సంక్షోభంలో ఉంది. ఆ పార్టీకి అభ్యర్థుల కొరత ఉంది. ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటనే పూర్తి స్థాయిలో పనిలో నిమగ్నమయ్యారు. ములుగు అసెంబ్లీ స్థానంలో టీఆర్ఎస్ ఓడిపోయినా ఆ జిల్లా ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించారు. నారాయణపేట జిల్లాను ఏర్పాటు చేస్తున్నారు. 80 ఎంపీ సీట్లు ఉండే ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ, కాంగ్రెస్‌లకు ఏమీ ఉండదు. ఎస్పీ, బీఎస్పీ కలిస్తే వారిదే ఆధిక్యత ఉంటుంది. మన రాష్ట్రంలో ఎక్కువ సీట్లు గెలిస్తే కేంద్రంలో టీఆర్ఎస్ కీలకపాత్ర పోషిస్తుంది. సీఎం కేసీఆర్ ఎంపీగా ఎందుకు పోటీ చేస్తారు? ఇవన్నీ ఎవరో చేసే ప్రచారాలే. కోదండరాంను మీడియానే నాయకుడిని చేసింది. ఆయనతో ఏమీ కాదని నేను ముందే చెప్పా. లోక్‌సభ ఎన్నికల్లోనూ కూటమి ఉంటే మొన్న ఎన్నికల్లో సిద్దిపేట అసెంబ్లీ సీటు ఇచ్చినట్లుగా టీజేఎస్‌కు హైదరాబాద్ లోక్‌సభ స్థానం ఇస్తారనుకుంటా. ఏపీ రాజకీయాలను ఆ రాష్ట్రానికి వెళ్లి చేయాలనే లేదు. ఏపీ సీఎం చంద్రబాబు విమర్శలు నవ్వు పుట్టిస్తున్నాయి. ఆఖరికి గడియారాలపైనా రాజకీయం చేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు ఇంకా ఈవీఎం గురించి మాట్లాడుతున్నారు. ప్రజల తీర్పుతో అందరికీ స్పష్టత వచ్చింది. టీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌ను ఆధునీకరిస్తాం. పార్టీలోని ప్రతి విభాగానికి ఓ గది కేటాయిస్తాం. మీడియా ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఏర్పాటవుతుంది'అన్నారు.

ప్రధాని గజ్వేల్‌కు వచ్చినప్పుడు పాలమూరు, కాళేశ్వరం, రాష్ట్రంలోని మరేదైనా ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని సీఎం కేసీఆర్ కోరారు. దీనిపై

కేంద్రంలో ఉలుకే లేదు..

కేంద్రంలో ఇప్పటికీ ఉలుకు లేదు.. పలుకులేదు. జీఎస్టీ బకాయిలు, కంపా నిధులు, ఐటీఐఆర్, బయ్యారం ఉక్కు పరిశ్రమ, గిరిజన వర్సిటీ, ఉమ్మడి రాష్ట్ర విభజన హామీల విషయంలోనూ ఇలాగే ఉంది. కేంద్రం బాధ్యతలు విస్మరించినా ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాలు పెంచాం. బీజేపీ పాలిత రాష్ట్రాలకే ప్రధాని అన్నట్లు మోదీ వ్యవహరిస్తున్నారు. ఏపీలో పోలవరానికి 95 శాతం నిధులిస్తున్న కేంద్రం కాళేశ్వరానికి జాతీయ హోదా ఇవ్వట్లేదు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమపై రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. కేంద్రం వైఖరి స్పష్టం చేసే దాకా వేచి చూస్తాం'అని పేర్కొన్నారు.



శనివారం తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న కేటీఆర్

సమైక్యంగా ఉద్యమిద్దాం

- బీసీ రిజర్వేషన్ల కోసం పార్టీలకతీతంగా ఏకం కావాలి
- టీజేఎస్ నిరాహార దీక్షలో కోదండరాం, ఆర్.కృష్ణయ్య, దాసోజు శ్రవణ్ పిలుపు



ధర్నాచౌక్ వద్ద దీక్షలో పాల్గొన్న కోదండరాం, ఆర్.కృష్ణయ్య, దాసోజు శ్రవణ్ తదితరులు

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలతోనే బీసీ రిజర్వేషన్ల తగ్గింపు ఆగిపోదని, భవిష్యత్తులో విద్య, ఉద్యోగాల్లోనూ రిజర్వేషన్ల కోత తప్పదని పలువురు నాయకులు హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లు, హక్కులకై పార్టీలకతీతంగా జెండాలు పక్కనపెట్టి బీసీలు సమైక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీలను గెలిపించుకుని టీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పాలని, ఇందుకోసం గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ప్రజలను చైతన్యం చేయాలని బీసీ సంఘాలు, కుల సంఘాలను కోరారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల తగ్గింపును నిరసిస్తూ తెలంగాణ జన సమితి బీసీ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఇందిరా పార్కు వద్ద నిరాహారదీక్షలు నిర్వహించారు. దీక్షలను ప్రారంభించిన జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలో 56 శాతం బీసీలు ఉన్నారని చెప్తున్న సీఎం, పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లను 22 శాతానికి తగ్గిస్తూ ఆర్డినెన్స్ తేవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వేషన్లు 50 శాతం దాటవద్దనేది రాజ్యాంగ విరుద్ధమన్నారు. బీసీలను సంఘటితం చేద్దామనే చిత్తశుద్ధి బీసీ సంఘాలు, కుల సంఘాల్లో కనబడటంలేదని వాపోయారు. టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం మాట్లాడుతూ, రిజర్వేషన్లు తగ్గించడం ద్వారా బీసీలను రాజకీయంగా ఎదగకుండా అడ్డుకుంటున్నారన్నారు. రిజర్వేషన్లు ఆత్మగౌరవ హక్కుగా గుర్తించి దాన్ని కాపాడుకునేందుకు బీసీలు ఉద్యమించాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, మంత్రివర్గం లేకుండానే బీసీ రిజర్వేషన్లు తగ్గిస్తూ ఆర్డినెన్స్ తేవడం శోచనీయమన్నారు. టీఆర్ఎస్‌లోని బీసీ నాయకులు బీసీ రిజర్వేషన్ల తగ్గింపుపై స్పందించకుండా పదవుల కోసం జాతి ప్రయోజనాలను కేసీఆర్ వద్ద తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. కోమటిరెడ్డి, సంపత్‌కుమార్‌ల శాసనసభ సభ్యత్వ రద్దుపై రూ.50 లక్షలు ఖర్చుచేసి, అడ్వొకేట్లతో కోర్టులో వాదించిన ప్రభుత్వం రిజర్వేషన్ల తగ్గింపుపై మాత్రం స్థానిక అడ్వొకేట్లతోనే సరిపెట్టిందని విమర్శించారు. కాంగ్రెస్ నేత దాసోజు శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ, దళితులు సామాజిక అంటరానితనానికి గురవుతుంటే, బీసీలు రాజకీయ అంటరానితనానికి గురవుతున్నారన్నా రు. అసెంబ్లీలో, అఖిలపక్షంతో, కుల, బీసీ సం ఘాలతో చర్చించకుండా బీసీ రిజర్వేషన్లు తగ్గిస్తూ ఆర్డినెన్స్ తేవడం దుర్మార్గమన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో తమిళనాడు తరహాలో రిజర్వేషన్లు ఎందుకుండకూడదన్న కేసీఆర్ బీసీ రిజర్వేషన్లు 22 శాతానికి తగ్గిస్తూ ఆర్డినెన్స్ తీసుకురావడం అన్యాయమన్నారు. సీపీఐ నాయకులు సుధాకర్, కాంగ్రెస్ నాయకులు వినయ్‌కుమార్, సీపీఐ (ఎంఎల్) నాయకురాలు ఝాన్సీ, టీజేఎస్ నాయకులు గాదె ఇన్నయ్య, కె.దిలీప్ కుమార్, పీఎల్ విశ్వేశ్వర్‌రావు, బీసీ నాయకులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, టీజేఎస్ బీసీ విభాగం అధ్యక్షులు పాల్గొన్నారు.

జానారెడ్డి, షబ్బీర్ అలీకి ఇంటెలిజెన్స్ నోటీసులు

- ఎన్నికల కోడ్ సమయంలో బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు వినియోగం
- ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు 9లక్షలు చెల్లించాలన్న ఐఎస్‌డబ్ల్యూ
- టీఆర్ఎస్ నేతలకూ చెల్లింపు నోటీసులిచ్చినట్టు చెప్పిన అధికారులు



జానారెడ్డి



షబ్బీర్ అలీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలైన జానారెడ్డి, షబ్బీర్ అలీకి ఇంటెలిజెన్స్ పోలీసులు నోటీసులిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బుల్లెట్ ప్రూఫ్ వాహనాల వినియోగంపై రోజువారీ అద్దె, డ్రైవర్ భత్యం కింద రూ.9 లక్షలు చెల్లించాలని జానారెడ్డితో పాటు షబ్బీర్ అలీకి రాష్ట్ర ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్(ఐఎస్‌డబ్ల్యూ)విభాగం శనివారం నోటీసులందించింది. 2007లో సీఈసీ ఆదేశాల ప్రకారం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో భద్రత నిమిత్తం బుల్లెట్ ప్రూఫ్‌వాహనాలు సమకూర్చుకున్న నేతలు తప్పనిసరిగా సంబంధిత వాహనాల అద్దెతో పాటు డ్రైవర్లకు భత్యం చెల్లించాల్సి ఉంటుందని ఆదేశాల్లో ఉందని, ఈమేరకు బుల్లెట్ వాహనాలు వినియోగించినవారందరికీ నోటీసులు పంపించినట్టు ఇంటెలిజెన్స్ అధికారులు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన సెప్టెంబర్ 6 నుంచి డిసెంబర్ 7వరకు జానారెడ్డి, షబ్బీర్ అలీ బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు టీఎస్ 09పీఏ1653, టీఎస్ 09పీఏ1654 వాహనాలు ఉపయోగించారని నోటీసుల్లో పేర్కొన్నారు. షబ్బీర్ అలీ ఈ కోడ్ కాలంలో 12,728 కి.మీ వాహనంలో ప్రయాణించారని, ఇందుకు గాను ప్రతీ కిలోమీటర్‌కు రూ.37లతో పాటు డ్రైవర్ భత్యం రోజు వారీరూ.100లతో కలిపి మొత్తంగా రూ.4,79,936 చెల్లించాలని స్పష్టం చేశారు. కాంగ్రెస్ సీనియర్ లీడర్, మాజీ మంత్రి జానారెడ్డి కోడ్ అమల్లో ఉండగా 11,152కి.మీలు ప్రయాణించారని, ఇందుకు గాను రూ.4,20,924 చెల్లించాలని పేర్కొన్నారు. ఇద్దరు నేతలు కలిపి మొత్తంగా రూ.9,00,860 చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు.

అధికార పార్టీకి సైతం

రాష్ట్ర అధికార పార్టీ టీఆర్ఎస్‌లో ఉన్న మంత్రులు, ఇతర వీఐపీలు వాడిన బుల్లెట్ ప్రూఫ్ వాహనాలకు సైతం ఇదే రీతిలో చెల్లించాలని ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ అధికారులు నోటీసులిచ్చినట్టు తెలిసింది. ఎవరెవరికి ఇచ్చారు? ఎంత చెల్లించాల్సి ఉంటుందన్న అంశాలపై సాక్షి ఆరాతీసేందుకు ప్రయత్నించగా సంబంధిత అధికారులెవరు అందుబాటులోకి రాలేదు.

పొత్తులొద్దు

- కాంగ్రెస్ సమీక్షలో నేతల సూచన
- టీడీపీతో పొత్తే నష్టం చేసింది
- రెండోరోజు ఆరు లోక్‌సభ స్థానాల సమీక్ష



శనివారం గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఉత్తమ్, కుంతియా, జానారెడ్డి, మల్లు రవి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో ఇతర పార్టీలతో పొత్తులొద్దని కాంగ్రెస్ నాయకులు పార్టీ అధిష్టానానికి తేల్చి చెప్పారు. కూటమి కట్టొద్దని, ఒంటరిగా పోటీ చేస్తేనే గెలుస్తామని, లేకుంటే మళ్లీ పుట్టి మునగడం ఖాయమని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేశారు. పొత్తుల్లో జరిగిన జాప్యంతో పాటుగా, తెలంగాణలో చంద్రబాబు ప్రచారం కొంప ముంచిందని ఈ రెండు తప్పులను లోక్‌సభ ఎన్నికల్లో పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సమీక్షతో పాటు పంచాయతీ, లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు టీపీసీసీ నేతలు వరుసగా రెండోరోజు శనివారం గాంధీభవన్‌లో సమావేశమయ్యారు. నాగర్‌కర్నూలు, మహబూబ్‌నగర్, మహబూబాబాద్, ఖమ్మం, నల్లగొండ, భువనగిరి లోక్‌సభ స్థానాల పరిధిలోని అసెంబ్లీ స్థానాల పరిస్థితిపై నేతలు చర్చించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ, టీడీపీతో పొత్తు అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి తీరని నష్టం కలిగించిందని అభిప్రాయపడ్డారు. బాబుతో పొత్తు అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో టీఆర్ఎస్ విజయవంతమైనందునే పరాభవం ఎదురైందని, లేదంటే కనీసం 40–45 స్థానాల్లో గెలిచేవారమని చెప్పారు. లోక్‌సభ స్థానాల అభ్యర్థులను త్వరగా ప్రకటించాలని సూచించారు.

నాన్చుడు ధోరణి వీడాలి

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై దూకుడుగానే వెళ్లాలని, ఇకనైనా నాన్చుడు ధోరణి వీడాలని సమావేశంలో నేతలు నిర్ణయించారు. ఈవీఎంల విషయంలో న్యాయ పోరాటం చేస్తూనే ప్రజాసమస్యలపై స్పందించాలని, ఎన్నికల్లో జరిగిన అక్రమాలపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. ఖమ్మం జిల్లాకు చెందిన నేతలు మాత్రం పొత్తుల విషయంలో భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పార్టీ పెద్దలు మాట్లాడుతూ, ఏఐసీసీ నిర్ణయం మేరకే తెలుగుదేశంతో పాటు ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకోవాల్సి వచ్చిందని, లోక్‌సభ ఎన్నికల్లో ఎలా ముందుకెళ్లాలన్న దానిపై మరోమారు అధిష్టానంతో మాట్లాడతామని చెప్పినట్టు సమాచారం. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్.సి.కుంతియా, ఏఐసీసీ కార్యదర్శి సలీం అహ్మద్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు మల్లు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, మాజీ మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జి.చిన్నారెడ్డి, నాగం జనార్దనరెడ్డి, ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సీతక్క, చిరుమర్తి లింగయ్య, హర్షవర్ధన్‌రెడ్డి, హరిప్రియానాయక్, కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్, టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి, వంగాల స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు. మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు చెందిన ముఖ్య నేతలు డి.కె.అరుణ, రేవంత్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, వీరయ్యలు గైర్హాజరయ్యారు.

పొత్తుతోనే ఓటమి: కోమటిరెడ్డి

తెలుగుదేశం పొత్తుతోనే ఉద్యోగులు, యువత పార్టీకి దూరమయ్యారని, పొత్తుల వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలైందని మాజీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. సమీక్ష అనంతరం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, మహాకూటమి వద్దని అసెంబ్లీ ఎన్నికల ముందే చెప్పానని, లోక్‌సభ ఎన్నికల్లో కూడా పొత్తులు వద్దని సూచించానన్నారు. కూటమి గెలిస్తే చంద్రబాబు పాలన సాగిస్తారనే ప్రచారంతో పాటు ఎవరికి సీటు వస్తుందో కూడా తెలియని పరిస్థితుల్లో కార్యకర్తలు అయోమయానికి గురయ్యారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పొత్తులు లేకుండా పోటీ చేస్తే 7–8 స్థానాలు గెలుస్తామన్నారు. తాను నల్లగొండ లోక్‌సభ నుంచి పోటీచేస్తానని, హైకమాండ్ అవకాశమిస్తే విజయం సాధించి తీరుతానని ధీమా వ్యక్తం చేశారు.

ప్రజా సంకల్పం @ 3,600 కి.మీ.

బారువ జంక్షన్ వద్ద 3,600 కి.మీ దూరాన్ని అధిగమించిన వైఎస్ జగన్

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: ప్రజల కష్టాలు తెలుసుకుని, వారికి భరోసా ఇచ్చేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర 337వ రోజు శనివారంఅత్యంత కీలక ఘట్టానికి చేరుకుంది. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని బారువ జంక్షన్ వద్ద 3,600 కిలోమీటర్ల దూరాన్ని అధిగమించింది. ఇడుపులపాయ టు ఇచ్ఛాపురం వరకూ పాదయాత్రలో భాగంగా ఇప్పటికే 1,000, 2,000, 3,000 కిలోమీటర్ల దూరాన్ని అలవోకగా అధిగమిస్తూ వచ్చిన వైఎస్ జగన్.. 3,600 కిలోమీటర్ల మైలురాయిని కూడా శనివారం సాయంత్రం అశేష జనవాహిని మధ్య అధిగమించారు. ఉదయం ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గంలోని సోంపేట మండలం తురకశాసనం వద్ద ప్రారంభమైన పాదయాత్ర.. పాలవలస గేటు, కొర్లాం, బారువ క్రాస్, లక్కవరం క్రాస్ వరకూ సాగింది.

జనకెరటం.. ఘనస్వాగతం

సముద్ర తీరానికి దగ్గరలో సోంపేట మండలంలో శనివారం సాగిన ఆయన పర్యటనలో జన కెరటం ఎగసిపడింది. అక్కచెల్లెమ్మలు హారతులు పట్టారు. యువత ఉత్సాహంగా కేరింతలుకొడుతూ ఘనస్వాగతం పలికారు. సరిగ్గా బారువ జంక్షన్ వద్దకు రాగానే 3,600 కిలోమీటర్ల దూరాన్ని అధిగమించడంతో జగన్ అక్కడ ఓ వేప మొక్కను నాటి పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. జనహోరు మధ్య కదిలిన జగన్‌కు దారి పొడవునా వివిధ వర్గాల ప్రజలు తమ కష్టాలు చెప్పుకొన్నారు.

రాజకీయ వివక్ష: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక రాజకీయ వివక్ష చూపుతోందని పలువురు బాధితులు వైఎస్ జగన్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇటీవల సంభవించిన తుపానుకు నష్టపోయినవారు ఈ విషయంపై ప్రతిపక్ష నేత కు ఫిర్యాదు చేశారు. పలువురు ఉద్యోగ సంఘాలవారు జగన్‌ను కలిసి.. సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తానని ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలపడంతో పాటు.. ముఖ్యమంత్రి చంద్రబాబు అనుసరిస్తున్న దుర్మార్గమైన విధానాల వల్ల లక్షలాది మందికి ఉద్యోగ అభద్రత ఏర్పడిం దని చెప్పారు. పాలవలస గ్రామం వద్ద కొంద రు కలిసి.. తమ ఊర్లో పెద్ద సంఖ్యలో కిడ్నీ వ్యాధిగ్రస్తులున్నా ప్రభుత్వం ఆదుకోవడం లేదని, అందువల్ల తామే ఓ స్వచ్ఛంద సంస్థగా ఏర్పాటై ఆదుకుంటున్నట్లు వివరించారు.



బారువ జంక్షన్‌లో వైఎస్ జగన్ అడుగులో అడుగులేస్తున్న జనవాహిని

అందరి సమస్యలు ఓపికగా విన్న జగన్.. మనందరి ప్రభుత్వం రాగానే.. అంతా మంచి జరుగుతుందని భరోసా ఇచ్చారు. సాధారణంగా రాజకీయ నాయకులు వచ్చి పార్టీలో చేరడం తరచూ జరిగేదే.. కానీ శనివారం అసలే పార్టీతోనూ సంబంధంలేని.. రాజకీయ నేపథ్యమే లేని ఓ కుటుంబం పాదయాత్ర సాగుతున్న చోటికొచ్చి వైఎస్ జగన్ చేతుల మీదుగా పార్టీ కండువా వేయించుకున్నారు. వైఎస్ జగన్ ప్రకటించిన నవరత్నాలు, ఆయన సంకల్పంతో తాము స్ఫూర్తి పొందినట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్ గెలుపుకోసం కృషిచేస్తామని వారు వివరించారు.

రానున్న ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తులుండవని ఏపీ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునరుద్ఘాటించారు. అసెంబ్లీలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినందునే పాదయాత్రగా ప్రజల్లోకి వెళ్లి జరిగిన అన్యాయాన్ని వివరిస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలో గోబెల్స్ ప్రచారం తప్ప జరిగిందేమీ లేదని, రాజధాని పేరుతో బాబు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని మండిపడ్డారు. అవినీతి, అబద్ధాలు, దోపిడీలతో పాలన సాగిస్తున్న చంద్రబాబుకు తెలంగాణ ప్రజలు చక్కగా బుద్ధి చెప్పారని, రాష్ట్రంలోని ప్రజలు అంతకంటే ఎక్కువగా రగిలిపోతూ ఆయన్ను ఓడించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. తానిచ్చిన హామీలు నెరవేర్చలేకపోతే తప్పుకోడానికి వెనుకాడనని స్పష్టీకరించారు. శనివారం 'సాక్షి'టీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలపై సూటిగా మాట్లాడుతూ బాబు తీరును తూర్పారబట్టారు.

– సాక్షి, అమరావతి



ఎవరితోనూ పొత్తు ఉండదు

'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

సాక్షి: పాదయాత్ర మీ కుటుంబానికి కొత్తకాదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మీ నాన్న వైఎస్ రాజశేఖరరెడ్డి గారు పాదయాత్ర చేశారు. ప్రతిపక్షంలో ఉండి పాదయాత్ర చేసిన వారందరూ అధికారంలోకి వచ్చారు. మీరూ వస్తారని ఆశిస్తున్నా. గత 14 నెలలుగా చేస్తున్న పాదయాత్రలో మీరు చాలా విషయాలపై మాట్లాడారు. స్పష్టత కూడా ఇచ్చారు. కానీ ఇంకా కొన్ని అంశాలపై స్పష్టత రాలేదని బయట అనుకుంటున్నారు. కొందరు విమర్శలు చేస్తున్నారు. వాటి గురించి మాట్లాడుకుందాం. ముందుగా.. రాజకీయాలు వదిలేసి పాదయాత్ర చేస్తూ ప్రజా సమస్యల మీద ప్రభుత్వంతో పోరాటం నుంచి దూరమయ్యారన్న విమర్శ ఉంది. మీరు ఏమంటారు?

జగన్: పోరాటానికి క్లైమాక్స్ పాదయాత్ర. పోరాటం అసెంబ్లీలో 2014 నుంచి చేస్తూనే ఉన్నాం. చివరకు 2017 దాకా కూడా చేశాం. అసెంబ్లీలో ప్రజల వాణి వినిపించగలిగాం. కానీ, ఆ అసెంబ్లీ పనితీరులో ప్రజాస్వామ్యం అసలు ఉందా? లేదా? అన్నట్టుగా తయారైంది. ప్రతిపక్షానికి చెందిన 23 మంది ఎమ్మెల్యేలను సంతల్లో పశువుల్లా అధికార పార్టీ కొనుగోలు చేసింది. కొనుగోలు చేసిన తర్వాత వారిని అనర్హులుగా ప్రకటించలేదు. వారి రాజీనామా కోసం అసెంబ్లీలో ఒత్తిడి చేశాం. దాదాపు రెండేళ్ల పాటు వేచి చూశాం. 2014లో శాసనసభ మొదలైతే ఆ ఏడాది చివరి నుంచి ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం మొదలు పెట్టారు. ఎమ్మెల్యేల కొనుగోలుపై పశ్చాత్తాపం గానీ చేసింది తప్పనే భావన గానీ ఎక్కడా లేకుండా పోయింది. అదే తప్పును నిస్సిగ్గుగా వరుసగా చేయడం మొదలు పెట్టారు. చివరకు ఆ సిగ్గు లేని తనం ఏ స్థాయికి చేరిందంటే వాళ్లల్లో నలుగుర్ని అప్రజాస్వామికంగా ఏకంగా మంత్రులను కూడా చేశారు. నిజంగా ఇంత దారుణమైన పరిస్థితుల్లో ప్రజాస్వామ్యం ఉంది. చట్టసభలకు మనం ఎవరమైనా వెళ్లేది ఎందుకంటే చట్టాలను చేస్తామని. ప్రజలు మనవైపు చూసేది అందుకే. కానీ ఇక్కడ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు.

సాక్షి: ప్రతిపక్షం లేని శాసనసభలో ప్రత్యేక హోదా మొదలు పలు అంశాలపై ముఖ్యమంత్రి మాట్లాడిన మాటలకు మీరు మీ పాదయాత్ర ద్వారా సమాధానం ఇచ్చామనుకుంటున్నారా?

జగన్ : తప్పకుండా.. అసెంబ్లీలో ఉన్నా అంతకన్నా జవాబు ఇచ్చే పరిస్థితి ఏమీ ఉండదు. అసెంబ్లీలో అయితే అది కూడా ఇవ్వనివ్వరేమో... ఎందుకంటే అసెంబ్లీలో ప్రజాస్వామ్యం ఎలాగూ ఖూనీ అయిపోయింది. 2014 నుంచి జరుగుతున్న అప్రజాస్వామిక వ్యవస్థను ఆ స్పీకర్ అనే వ్యక్తే దగ్గరుండి ప్రోత్సహిస్తున్నారు. ఫిరాయించిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించరు. ఏదైనా మాట్లాడబోతే మైకులు కట్ చేస్తారు. అడుగడుగునా అవాంతరాలు కల్పిస్తారు. అటువంటి పరిస్థితుల్లో జనం మధ్యనైనా మేము చెప్పదలచుకున్నది ఎటువంటి అంతరాయం లేకుండా చెప్పగలుగుతాం. బాధితులు ప్రజలు. ప్రజల దగ్గరకే మేము పోతున్నాం. ప్రజలకు తోడుగా ఉండే కార్యక్రమాన్ని చేస్తున్నాం. అక్కడ జరిగిన అన్యాయాలు.. రాజధాని దగ్గర్నుంచి మొదలుకుని రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు చేసిన మోసాల వరకు, చివరకు ఆయన ప్రత్యేక హోదాను ఖూనీ చేస్తూ.. దాన్నే ధర్మపోరాట దీక్షలుగా మళ్లీ అభివర్ణిస్తూ ఏ రకంగా ప్రజలను మభ్యపెడుతున్నారో, మోసం చేస్తున్నారో అవన్నీ ప్రజలకు అసెంబ్లీలో కన్నా మంచిగా వివరించగలిగాం.

సాక్షి: శాసనసభలో మీ సభ్యుల్ని కొనుగోలు చేసినట్టే లోక్‌సభలోనూ మీ సభ్యుల్ని టీడీపీ కొనుగోలు చేసింది. అసెంబ్లీ స్పీకర్‌పై ఒత్తిడి చేసినట్టుగా లోక్‌సభ స్పీకర్‌పై అంత ఒత్తిడి ఎందుకు తీసుకురాలేదన్న విమర్శ ఉంది?

జగన్: అక్కడా, ఇక్కడా తీవ్రంగానే ఆక్షేపించాం. తప్పుబట్టాం. అక్కడా ఇక్కడా అదే పరిస్థితి. టీడీపీ, బీజేపీలు ఇద్దరూ కలిసి నాలుగేళ్లు సంసారం చేశారు. అక్కడ వాళ్లు చంద్రబాబు నాయుడిని ఇబ్బంది పెట్టకూడదని తొక్కిపెట్టారు.

సాక్షి: ఇప్పుడు విడిపోయామంటున్నారు, ఇప్పుడైనా చర్య తీసుకుని ఉండాల్సింది కదా?

జగన్: ఆ మేరకు వ్యవస్థలు దిగజారిపోయాయి. బహుశా బీజేపీకి, చంద్రబాబుకు మధ్య లోపాయికారిగా సంబంధాలు కొనసాగుతున్నాయేమో..

సాక్షి: చంద్రబాబు నాయుడు తాజాగా మీ మీద చేసిన ఆరోపణ.. సీనియర్ మోదీ కేసీఆర్ అయితే జూనియర్ మోదీ మీర(జగన్)ని. అసలు మోదీ, సీనియర్, జూనియర్ మోదీలు ముగ్గురూ ముసుగులు తీసి కలిసి పోటీ చేయండంటున్నారు. మీరేమంటారు?

జగన్: మీ ద్వారా నేను ప్రజలకు తెలియజేయాల్సిన విషయం ఒకటుంది. అసలు ఎవరు ఎవరతో కలిసి ఉన్నారు? ఎవరు ఎవరితో కాపురం చేస్తున్నారు? చేశారు? 2014 ఎన్నికలప్పుడు ఇదే చంద్రబాబు నరేంద్ర మోదీతో కలిసి ప్రయాణం చేశారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మోదీ ముగ్గురూ కలిసి ఒక కూటమిగా ఏర్పడి మా మీద యుద్ధం చేశారు. అప్పుడు వారన్న మాటలు కూడా చూడండి. జగన్‌కు ఓటేస్తే రాష్ట్రాన్ని విడగొట్టిన కాంగ్రెస్‌కు వేసినట్టే అని చంద్రబాబు అన్నాడు. తల్లి కాంగ్రెస్, పిల్ల కాంగ్రెస్ అన్నాడు. తనకున్న ఎల్లో మీడియా ద్వారా గట్టిగా ప్రచారం కూడా చేయించారు. ఆ తర్వాత ఏమి జరిగింది? 2014 ఎన్నికలు అయిపోయాయి. 2019లో ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఐదేళ్లలో మేము ఎక్కడా కాంగ్రెస్ పార్టీతో కలవలేదు. కానీ అదే చంద్రబాబు నాయుడు 2014 నుంచి 2018 దాకా నాలుగేళ్లపాటు బీజేపీతో సంసారం చేశాడు. ఆ సమయంలో బీజేపీని టీడీపీ, టీడీపీని బీజేపీ పరస్పరం విపరీతంగా పొగుడుకున్నాయి. ప్రత్యేక హోదాకు బదులు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని బీజేపీ చెప్పడం, చంద్రబాబు కోరిక మేరకు ప్యాకేజీ ఇచ్చామని బీజేపీ చెప్పడం.. దానికి ఏకంగా అసెంబ్లీలో ఈ చంద్రబాబు నాయుడు తీర్మానాలే చేసి బీజేపీని పొగడడం, చివరకు 2017 జనవరి చివరి వారంలో ప్రెస్‌మీట్ పెట్టి బీజేపీ ప్రభుత్వం ఏ రాష్ట్రానికి చేయనంతగా ఆంధ్రప్రదేశ్‌కు చేసిందనడం, చేసి ఉంటే చెప్పండని ప్రతిపక్షాలను సవాల్ చేయడం జరిగింది. ఆ దశ వరకు ఆ ఇద్దరూ చిలకా గోరింకల్లా సంసారం చేశారు. కేవలం ఒక సంవత్సరంలో ఎన్నికలు జరగబోతున్నాయనగా చంద్రబాబు నాయుడు తాను చేసిన మోసాలకు, అన్యాయాలకు, అవినీతి, అబద్ధాలకు ఎవరో ఒకరి మీద నెపం నెట్టాలని బలిపశువు కింద కేంద్రంపై ఆరోపణలు నెట్టేసి కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకున్నాడు. ఇదే కాంగ్రెస్ పార్టీని ఆవేళ రాష్ట్రాన్ని అడ్డగోలుగా, అన్యాయంగా విభజించిందని చెప్పిన వ్యక్తి, తల్లి కాంగ్రెస్ పిల్ల కాంగ్రెస్ అని అన్న వ్యక్తి, రాష్ట్రాన్ని విడగొట్టిన కాంగ్రెస్ పార్టీ ఏ ముఖం పెట్టుకుని రాష్ట్రానికి మళ్లా వస్తుందన్న ఇదే పెద్దమనిషి తానే కంకణం కట్టుకుని అదే కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకునే ప్రయత్నం చేశాడు. ఇంతకు ముందు చంద్రబాబు నాయుడు ఏమి అబద్ధాలు చెప్పారో ఈవేళ కూడా.. అదే ప్రత్యేక హోదా, చంద్రబాబు నాయుడు గొప్పగా పాలిస్తాడు, గొప్పగా మేలు చేస్తాడనే పాత హామీలనే మళ్లీ తెరపై చూపిస్తున్నాడు. ఏదైనా ఆరోపణ చేయాలంటే దానికి ఏదైనా ప్రాతిపదిక ఉండాలి. కానీ చంద్రబాబు చేసే వాటికి అటువంటివేమీ ఉండవు.



సాక్షి: తెలంగాణ ఫలితం చూశారు కదా.. మీకు ఏమనిపించింది?

జగన్: ప్రజలు చంద్రబాబు అనుకున్నంత పిచ్చోళ్లు కాదు. అది చంద్రబాబుకు అర్థం అయ్యేలా ప్రజలు బుద్ధి చెప్పారు. బయటి నుంచి ఎవరైనా మూడో వ్యక్తి ఆంధ్రప్రదేశ్‌ను చూస్తే ఏమిటీ వ్యవస్థ అనిపిస్తుంది. రాజకీయ వ్యవస్థ ఇంత దారుణంగా ఉంటే ఈ రాజకీయ నాయకుల్ని ఎలా క్షమించగలం అనేలా వ్యవస్థను దిగజార్చారు. అటువంటి అన్యాయమైన పరిస్థితిలోకి ఈ వ్యవస్థను దిగజార్చి మళ్లీ అవే అబద్ధాలతో తెలంగాణకు వెళ్లి అవే మాటల్ని చెబితే ప్రజలు నమ్ముతారా? ప్రజలు నిజంగా చైతన్యవంతులు కాబట్టి.. జరుగుతున్నది చూస్తున్నారు కాబట్టి.. అనైతిక పొత్తులకు, అనైతిక వ్యవహారాలకు తెర దింపే విధంగా తీర్పు ఇచ్చారు. అత్యధికంగా ఆంధ్రా సెటిలర్లు ఉన్న ఏరియా హైదరాబాద్. అనైతిక పొత్తులు పెట్టుకుని తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసిన వ్యక్తులు 40, 50, 60 వేల తేడాతో గచ్చిబౌలి, కూకట్‌పల్లి వంటి ప్రాంతాల్లోనే ఓడిపోయిన పరిస్థితి. హైదరాబాద్‌లో ఉన్న సెటిలర్లే ఓటేయలేదంటే ఆంధ్రప్రదేశ్‌లోని ఓటర్లు చంద్రబాబుపై ఏ స్థాయిలో కోపం పెంచుకుని ఉన్నారో అనేదానికి అదే నిదర్శనం. సెటిలర్లే ఓటేయకపోతే ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎందుకు వేస్తారు?

సాక్షి: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల ప్రెస్‌కాన్ఫరెన్స్‌లో చంద్రబాబును ఉద్దేశించి ఒకమాట అన్నారు.. ఆంధ్రప్రదేశ్‌లో నేను ఇక మొదలు పెడతానన్నారు?

జగన్: కేసీఆర్ గారు ఏమన్నారో, ఏ ఉద్దేశంతో అన్నారో నాకు తెలియదు గానీ వాస్తవం ఏమిటంటే ఆంధ్ర రాష్ట్రానికి సంబంధించి కేసీఆర్ గారు ఏదయితే చంద్రబాబుకు వ్యతిరేకంగా, ప్రత్యేక హోదాకు అనుకూలంగా మాట్లాడిన మాటల్ని స్వాగతించాను. ఎందుకంటే కేసీఆర్ గారు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి కాదు. పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి. అటువంటి వ్యక్తి ప్రత్యేక హోదా కోసం అవసరమైతే తాను ప్రధాన మంత్రికి లెటర్ కూడా రాస్తానని చెప్పి ఒక అడుగు ముందుకు వేస్తానన్న మాటలు హర్షించదగినవి.

సాక్షి: మీరు ప్రత్యేక హోదా సాధించుకునే క్రమంలో ఇలా చెబుతున్నారు. కానీ ఏపీ సీఎం చంద్రబాబు అంటున్నదేమిటి? తాను తెలంగాణకు వెళ్లి పోటీ చేస్తే టీఆర్ఎస్ దాన్ని సెంటిమెంట్‌కు ఎలా వాడుకుందో, ఇక్కడా అదే రీతిలో తెలంగాణ సీఎం వచ్చి జగన్‌మోహన్ రెడ్డితో కలవబోతున్నాడని, జగన్, మోదీ, కేసీఆర్ కలవబోతున్నారని ఇప్పటికే ప్రచారం మొదలు పెట్టారు. దానివల్ల ఇక్కడ ఎలాంటి పరిణామాలుంటాయి?

జగన్: అక్కడా కేసీఆర్.. కాంగ్రెస్, మోదీతో విభేదించి పోటీ చేశాడు. మోదీ హైదరాబాద్‌కొచ్చి తిట్టిపోయాడు. కేసీఆర్ కూడా మోదీని తిట్టాడు. కాంగ్రెస్, బీజేపీతో పోటీపడి ఆయన గెలిచాడు. ఎక్కడా కూడా బీజేపీతో కలిసి పోటీ చేసిందీ లేదు. కలిసి సపోర్ట్ చేసిందీ లేదు. పోనీ ఐదేళ్లలో ఆయన చేశాడా అంటే అదీ లేదు. అంతో ఇంతో చంద్రబాబు నాయుడు బీజేపీతో సంసారం చేశాడు తప్ప, ఆయనేం చేయలేదు. అదే వ్యక్తితో పొత్తు పెట్టుకునేందుకు ఇదే చంద్రబాబు నాయుడు హరికృష్ణ శవాన్ని పక్కన పెట్టుకుని కేటీఆర్‌తో ప్రతిపాదన చేశానని నిస్సిగ్గుగా ఒప్పుకున్నాడు. 'తెలుగు ప్రజలంతా ఒకటిగా ఉండాలని, కలిసి పోటీ చేద్దామని నేను ప్రతిపాదించాను. కానీ కేసీఆర్ ఒప్పుకోలేదు. అందుకే నేను కాంగ్రెస్‌తో జత కట్టాన'ని తనంతట తానే చెప్పాడు. ఇది చెప్పి రెండు నెలలు కాలేదు. అక్టోబర్‌లో హరికృష్ణ చనిపోయాడు. ఇది జరిగి నాలుగు నెలలు కాలేదు. అంటే నాలుగు నెలల క్రితం కేసీఆర్‌తో పొత్తు పెట్టుకునేందుకు ఆయనే సంసిద్ధత వ్యక్తం చేశాడు. అంటే దానర్థమేంటి? కేసీఆర్ మోదీతో లేనట్టే కదా? అలాంటి చంద్రబాబు నాలుగు నెలల తర్వాత చెప్పిందేంటి? ఆయన తప్ప కేసీఆర్, నేను మోదీతో ఉన్నామట.

సాక్షి: 2014 ప్రస్తావన తెచ్చారు మీరు. పవన్ కళ్యాణ్, బీజేపీతో కలిసి టీడీపీ అధికారంలోకొచ్చింది. అదీ ఒకటి ఒకటిన్నర శాతం ఎక్కువ ఓట్లతో. అప్పట్లో మీరు అలాంటిదేదన్నా చేసుంటే అధికారంలోకి వచ్చుండే వారు. ఇప్పటికైనా పవన్‌తో పొత్తు పెట్టుకుంటే మీకు అధికారం చాలా సులభంగా వస్తుందని చెబుతున్నారు.

జగన్: రాష్ట్రం ఈ రోజు ఈ పరిస్థితుల్లో ఉండటానికి కారణం. అబద్ధాలు, మోసాలు, అన్యాయాలు. ఈ పరిస్థితికి ఎవరు కారణమని ఒక్కసారి వెనక్కు తిరిగి చూస్తే, చంద్రబాబు నాయుడు, ఇదే బీజేపీ, ఇదే పవన్ కళ్యాణ్. ఆ రోజు ముగ్గురూ ఒక కూటమిగా ఏర్పడి, ప్రతీ హామీని మేం నెరవేరుస్తామని ప్రజలకు మాటిచ్చారు. ఇదే పవన్‌కళ్యాణ్ ఊరూరా తిరిగి చంద్రబాబుకు ఓటేయమన్నాడు. ఆయనకు అనుభవం ఎక్కువగా ఉందని, ఆయనిచ్చిన హామీలకు తాను పూచీ అంటూ చెప్పాడు. చంద్రబాబు గురించి చెప్పాడు. మోదీ గురించి ఇంకా ఎక్కువ చెప్పాడు. ఎన్నికలయిపోయిన తర్వాత జరిగిందేమిటి? ప్రత్యేక హోదా విషయమే కాకుండా, రైతులను, పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలను, చదువుకున్న పిల్లలను.. అందరినీ చంద్రబాబు ఎలా మోసం చేశాడు? ఆయన మేనిఫెస్టో చూస్తే ఎస్సీలు, ఎస్టీలు, బీసీలుగా చేస్తానని ప్రతీ కులాన్ని నమ్మించాడు. తన చేతుల్లో లేనిది కూడా చెప్పి ప్రతి కులాన్నీ మోసం చేశాడు.

సాక్షి: సంతకం పెట్టాలంటే వాళ్లు అధికారంలోకి రావాలిగా?

జగన్: ఆ పరిస్థితి ఉంటేనే. ప్రధాని అయిన ఒకటో రోజో.. రెండో రోజో హోదా ఇస్తానని చెప్పు. అప్పుడు నేనొస్తా. చంద్రబాబునాయుడు మాదిరి నాలుగేళ్లు నిరీక్షించే అవకాశమే ఉండదు. వారమో... రెండు రోజులో ఎప్పుడో చెబితే నేను మద్దతిస్తా.

సాక్షి: పోలవరం, అమరావతితో పాటు తాను చేస్తున్న అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ మేం రావాల్సిందే. జగన్‌మోహన్ రెడ్డి వస్తే ఇవన్నీ ఆపేస్తాడని చెబుతున్నారు..

జగన్: అసలు అభివృద్ధి ఎక్కడ జరుగుతోంది? పోలవరం ప్రాజెక్టు పునాది దాటి ముందుకెళ్లలేదు. గట్టుదాటి ముందుకు కదల్లేదు. ఒక బొట్టు నీళ్లు నిల్వ చేసే పరిస్థితి లేదు. ప్రాజెక్టు డిజైన్లు ఇంకా ఖరారు కాలేదు. డీపీఆర్ ఇంకా అవ్వలేదు. 48 గేట్లకు ఒకే ఒకటి పెట్టారు. ఒకటి పెట్టడానికి రెండు నెలలు పడుతుందట. ఎక్కడ అభివృద్ధి జరిగింది? ఇక రాజధాని వ్యవహారం ఓ పెద్ద స్కాం. ఇంతకన్నా పెద్ద స్కాం ప్రపంచంలో ఎక్కడా కన్పించదేమో. రాజధాని ప్రాంతం ఎందుకు ముందుకు కదలడం లేదంటే అది స్కాం కాబట్టే. పర్మినెంట్ అనే పేరుతో రాజధానిలో ఒక్క ఇటుకా పడలేదు. అభివృద్ధి పేపర్ మీదే తప్ప ఎక్కడన్నా కన్పిస్తోందా? తనకున్న ఎల్లో మీడియా సామ్రాజ్యంతో, తనకున్న ఛానళ్లు, పేపర్లతో మభ్యపెట్టేందుకు చేస్తున్న గోబెల్స్ ప్రచారమే తప్ప అభివృద్ధి ఉందా?

సాక్షి: 2014 ఎన్నికల్లో ఓటమిపాలైనప్పటికీ మీ విశ్వసనీయత పెరగడానికి అలవికాని హామీలు నేను ఇవ్వనన్నారు. రైతు రుణమాఫీని సమర్థించనన్నారు. అందువల్ల విశ్వసనీయత పెరిగింది. ఇప్పుడు మీరు ప్లీనరీలో ప్రకటించిన నవరత్నాలు కాకుండా పాదయాత్ర సందర్భంగా అన్ని సామాజిక వర్గాలకు హామీలు ఇస్తున్నారు. అధికారంలోకి వస్తే వీటన్నింటినీ పూర్తి చేయడానికి మీ దగ్గర ఉన్న ప్రణాళిక ఏమిటి?

జగన్: రైతు రుణమాఫీని నేను సమర్థించను అని నేను ఏనాడూ అనలేదు. అది చెయ్యలేనిది, సాధ్యం కానిదనే ఆ రోజు చెప్పాను. నిజంగా కేంద్రం ముందుకొచ్చి రైతు రుణాలన్నీ మాఫీ చేస్తానంటే నా కన్నా సంతోష పడేవాళ్లు ఎవరూ ఉండరు. బంగారంగా చెయ్యమనే చెబుతాను. కానీ సాధ్యమవుతుందా? కాదా? అనేది తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా ఆయనకూ తెలుసు. అసలు రాష్ట్ర బడ్జెట్ ఏమిటి? నంబర్ ఏమిటి? ఏమేర చెయ్యగలుతాం? చెయ్యలేము అనేది ప్రతిపక్ష నాయకుడిగా నాకూ అవగాహన ఉంది. నాకూ సలహాదారులున్నారు. రాష్ట్ర బడ్జెట్‌పై సరైన అవగాహనతో ఉన్న వ్యక్తిని నేను. బాధ్యతగల వ్యక్తులుగా మనం మాట్లాడాలి. ముఖ్యమంత్రిగా కాగల వ్యక్తులమని చెప్పి ప్రజల దగ్గర ఓట్లడుగుతున్నాం. అలాంటి మనకు విశ్వసనీయత ఉండాలి. మనం ఏదైనా మాట చెప్పి, అది చెయ్యలేకపోతే ప్రజలు మనల్ని క్షమించరు. చరిత్రహీనులమవుతామనేది అర్థం కావాలి. దేవుడు ఆశీర్వదించి అధికారంలోకి వస్తే చంద్రబాబు నాయుడు మాదిరి ఈ రోజు ఎంత సంపాదించాను, రేపు ఎంత సంపాదిస్తాననే ఆలోచన కోసం రావడం లేదు. నాకు డబ్బు మీద వ్యామోహం అంతకన్నా లేదు. నాకు ఒక్కదాని మీదే వ్యామోహం ఉంది ఒక్కటే... చరిత్ర సృష్టించాలి. ఒక్కసారి ముఖ్యమంత్రి స్థానంలోకి వెళ్తే ప్రజలకు ఎంత మంచి చేయాలంటే... ఆ మంచిని చూసి నేను చనిపోయిన తర్వాత ప్రతి ఇంట్లో నాన్న ఫొటోతో పాటు నా ఫొటో ఉండాలనేది నా కల. దాని కోసం తాపత్రయపడుతున్నాను. దేవుడు ఆశీర్వదించి నాతో చెయించగలిగితే అది చేస్తాను. నాతో కుదరదు అంటే నేను తప్పుకుంటాను. ఇంకొకటి లేదు.

సాక్షి: రైతులకు తెలంగాణలో కేసీఆర్ అమలు చేస్తున్న రైతు బంధు గురించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో పాటు మమతా బెనర్జీ కూడా మాట్లాడుతున్నారు. మీరు అధికారంలోకి వస్తే ఇలాంటిది ఏమైనా చేస్తారా?

జగన్: వీరందరికంటే ముందు రైతు భరోసా అని చెప్పింది మనం. ఈ స్కీమ్ గురించి ఎవరూ చెప్పకముందే నా పాదయాత్రకు ముందు గుంటూరులో జరిగిన మా పార్టీ ప్లీనరీలో నవరత్నాల సందర్భంగా రైతు భరోసా పథకం అమలు చేస్తామని ప్రకటించాం. తర్వాత కొన్ని నెలల తర్వాత పాదయాత్ర ప్రారంభించా. ప్రతి రైతు కుటుంబానికి 12,500 రూపాయలు మే మాసంలోనే ఇస్తాం. నాలుగు దఫాలుగా రూ.50 వేలు ఇస్తామని నవరత్నాల్లో భాగంగా ప్లీనరీలో ప్రకటించాం. వీళ్లెవరూ ఆలోచించకముందే నేను చెప్పిన మాట ఇది. రాష్ట్రంలో దాదాపు 85 లక్షల రైతు కుటుంబాలు ఉన్నాయి. ఇందులో అర హెక్టారు (1.25 ఎకరాల లోపు భూమి) భూమి ఉన్న కుటుంబాలు అక్షరాలా 42 లక్షలు ఉన్నాయి. అనగా రైతు కుటుంబాల్లో సగమన్నమాట. హెక్టారు వరకూ ఉన్న వారిని తీసుకుంటే ఈ 42 లక్షలకు మరో 19 లక్షల కుటుంబాలు కలుస్తాయి. అనగా సుమారు 60 లక్షల కుటుంబాలు. అనగా మొత్తం రైతుల్లో 70 శాతం మంది హెక్టారు (2.5 ఎకరాల లోపు భూమి ఉన్న)లోపు ఉన్న వారే. అందువల్ల ఎకరాకు ఇంత అని ఇస్తే వీరు ఎప్పటికీ బాగుపడరు. ఆ రోజుల్లో వీళ్లెవరూ చెప్పకముందే రైతుల కోసం మేం రూ.4 వేలు ఇవ్వాలా? రూ.5 వేలు ఇవ్వాలా? రూ.8 వేలు ఇవ్వాలా? అని ఆలోచన చేశాం. అయితే రూ.8 వేలు లేదా రూ.9 వేలు ఇచ్చినా ఇలాంటి చిన్న రైతులకు నేను మేలు చేయలేను. అందువల్లే రైతు కుటుంబాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలని నిర్ణయించాం. ప్రతి రైతు కుటుంబానికి రూ.12,500 ఇస్తామని చెప్పాం.

సాక్షి: మీపై హత్యాయత్నానికి సంబంధించిన కేసును కేంద్రం ఎన్ఐఏకు అప్పగించింది. దీనిపై చంద్రబాబు కామెంట్ చేశారు. దీనిని మీరేమంటారు?

జగన్: అసలు దాడి ఎక్కడ జరిగింది.. ఈ విషయంలో మనం ఆలోచించాల్సిన అంశాలు కొన్ని ఉన్నాయి. వీఐపీ లాంజి అనేది అత్యంత భద్రత కలిగిన ప్రాంతం. అలాంటి ప్రదేశంలోకి ఒక కత్తి.. అన్ని సెక్యూరిటీ ప్రమాణాలను దాటి ఎలా రాగలిగింది? అక్కడ పనిచేసిన ఆ మనిషి ఆ కత్తిని ఎలా తేగలిగాడు? ఆ మనిషి తెలుగుదేశం పార్టీకి చెందిన సానుభూతిపరుడు హర్షవర్ధన్ చౌదరికి చెందిన రెస్టారెంట్‌లో పని చేయగలిగాడు కాబట్టే ఆ కత్తిని తీసుకుని రాగలిగాడు. ఆ హర్షవర్ధన్ చౌదరి 2014లో తెలుగుదేశం పార్టీ టిక్కెట్టు ఆశించారు. ఆయనకు చంద్రబాబునాయుడి దగ్గర నుంచి లోకేశ్ వరకూ చివరకు విశాఖపట్నం తూర్పు ఎమ్మెల్యే రామకృష్ణ చౌదరి దాకా అందరితో సంబంధాలు ఉన్నాయి. హత్యాయత్నం చేసిన ఆ వ్యక్తి గతంలోనే హత్యాయత్నం కేసు ఎదుర్కొంటున్నారట. అలాంటి వ్యక్తికి పోలీసులు ఎన్ఓసీ ఎలా ఇచ్చారు? ఇంకో అడుగు ముందుకెళ్లి చూస్తే మొన్న కోర్టు అడుగుతున్న ప్రశ్నల్లో మరొకటి ముందుకొచ్చింది. నా పాదయాత్ర విశాఖపట్నం జిల్లాలోకి ప్రవేశించే నాటికే ఎయిర్‌పోర్టులో సీసీ కెమెరాలు ఆగిపోయాయి. నాపై హత్యాయత్నం జరిగేంత వరకూ ఎయిర్ పోర్టులో సీసీ కెమెరాలు పని చేయలేదట. అంటే దాదాపుగా మూడు నెలల పాటు విమానాశ్రయంలో సీసీ కెమెరాలు పనిచేయడం మానేశాయి. అదీ కరెక్టుగా ఎప్పుడు పనిచేయడం మానేశాయంటే విశాఖపట్నం జిల్లాలోకి జగన్ అనే వ్యక్తి అడుగు పెట్టిన తర్వాతే. ఇంత దారుణమైన కుట్ర జరుగుతున్నప్పుడు సంఘటన జరిగిన తర్వాత కూడా ప్రభుత్వ పెద్దలు స్పందించిన తీరు దారుణం. హత్యాయత్నం జరిగిన గంటలోపే డీజీపీ మీడియా ముందుకు వచ్చి నాపై హత్యాయత్నాన్ని వెటకారం చేస్తూ దాడి చేసిన వ్యక్తి జగన్ అనుచరుడని తేల్చేశారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడైతే అదీ బ్లూకలర్‌లో ఫ్లెక్సీ వేస్తాడు. కానీ ఆ ఫ్లెక్సీ ఎల్లో కలర్‌లో ఉంది. దానిపైన గరుడ పక్షి బొమ్మ పెట్టి మార్ఫ్‌డ్ ఫ్లెక్సీ ఎవడైనా పెట్టగలుగుతాడా? ఆ ఫ్లెక్సీని అప్పటికప్పుడు పాత ఫ్లెక్సీ మీద తయారు చేయించారు. ఎయిర్ పోర్టులో నాపై హత్యాయత్నం జరిగాక నేను చాలా హుందాగా చంద్రబాబు మీదగానీ, మరొకరి మీదగానీ అనవసరమైన ఆరోపణలు చేయలేదు. తెలిసీ తెలియకుండా ఆరోపణలు చేయడం ధర్మం కాదని అన్ని విషయాలు తెలిసిన తర్వాతే మాట్లాడాలని సంయమనం పాటించి మౌనంగా ఉన్నాను. ప్రథమ చికిత్స చేసిన తర్వాత అందరి ముందే చొక్కా మార్చుకుని ఒక్క మాట మాట్లాడకుండా హైదరాబాద్‌కు వచ్చి నేరుగా ఆస్పత్రిలో చేరి వైద్యం చేయించుకున్నా. దాన్ని కూడా ఏ రకంగా చిత్రీకరించారంటే అన్యాయంగా మాట్లాడారు.

సాక్షి: మీ నాన్నలాగానే మీరు కూడా చిన్న వయసులో రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన కూడా చాలా యంగ్ ఏజ్‌లో వచ్చారు. ప్రజా వైద్యుడుగా ఉన్నారు. ఈ మధ్య కాలంలో ఫిరాయింపులతో పార్టీ చాలా నష్టపోయింది. బోలెడన్ని అనుభవాలు. చివరకు మీమీద భౌతిక దాడి కూడా జరిగింది. ఎప్పుడైనా ఏ మూలనైనా ఎందుకీ రాజకీయాలు అని విరక్తి కలిగిందా?

జగన్: ఒక్కోసారి అనిపిస్తుంది.. కానీ ఇన్ని కోట్ల మంది.. లాస్ట్ ఎలక్షన్స్‌లో 1.30 కోట్ల మంది నన్ను నమ్మి నాకు ఓట్లేశారు. చంద్రబాబు అన్ని పార్టీలతో కలిసి పోటీ చేసినా ఆయనకు 1.35 కోట్ల మంది మాత్రమే ఓట్లేశారు. నాకంటే కేవలం 5 లక్షల మందే ఎక్కువ. కోటి ముప్పయి లక్షల మంది నామీద నమ్మకం పెట్టుకుని ఓట్లేసినప్పుడు కష్టాలు వచ్చినాయి కదా అని వదిలేసి పోతే.. కిందిస్థాయిలో లీడర్ల నుంచి గ్రామ స్థాయి నుంచి సర్పంచులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, వాళ్లు అభిమానించే ప్రజల వరకూ అందరికీ అన్యాయం చేసినవాడినవుతానేమోనన్నది ఆల్వేస్ బిహైండ్ మై హెడ్. కష్టాలు అనేవి ఎల్లకాలం ఉండవు. ఒక రాత్రి వచ్చిన తర్వాత ఒక పగలు రావాలి. ఒక చీకటి వచ్చిన తర్వాత వెలుతురు కూడా వస్తుంది కదా..

సాక్షి: జగన్‌పై ఉన్న కేసుల విచారణను జాప్యం చేయడం కోసమే హైకోర్టును విభజించారు. హడావుడిగా విజయవాడకు తీసుకొచ్చారనే ఆరోపణపై మీరేమంటారు?

జగన్: అసలు నాకు అర్థం కానిదేమంటే, హైకోర్టుకు, నాకు సంబంధం ఏముంది? హైకోర్టును విభజించాలని, వెంటనే ఆంధ్ర రాష్ట్రంలో పెట్టాలని నేను ఎన్నడూ కోరలేదు. నేను ఏనాడూ డిమాండు చేయలేదు. నేను ఏనాడూ లేఖ రాయలేదు. పది సంవత్సరాలు మనకు హైదరాబాద్‌లోనే ఉండటానికి హక్కుంది. నువ్వు అక్కడింత వరకూ పర్మినెంట్ అనే పేరుతో ఒక్క భవనం కట్టలేదు. పర్మినెంట్ అనే పేరుతో హైకోర్టే కట్టకుండా హైకోర్టును షిఫ్ట్ చేయాలని ఏ బుద్ధి ఉన్న వాడూ అడగరు. ప్రతిపక్ష నాయకుని బాధ్యతలో నేనున్నప్పుడు అసలు అడగనే అడగను. అలాంటప్పుడు చంద్రబాబు నాయుడు ఏమి జరుగుతుందో పూర్తిగా తెలిసి ఉండి కూడా హైకోర్టును ఎట్టిపరిస్థితుల్లోనూ విభజించండని విజ్ఞప్తి చేస్తూ.. దానికి సంబంధించిన భవనాలన్నీ తయారైపోయాయి.. మీరు షిఫ్ట్ చేయండి.. అని తానంతట తానే సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేశారు. దానికి తెలంగాణ ప్రభుత్వం ఇక్కడే ఉన్నా తమకేమీ అభ్యంతరం లేదు, అవసరమైతే ఒక భవనం కూడా ఇస్తామని రివర్స్ అఫిడవిట్ ఫైల్ చేసింది. ఈ రెండింటినీ పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు చంద్రబాబు సర్కారు భవనాలు ఇస్తామని అంటున్నప్పుడు ఆ రాష్ట్రానికి హైకోర్టు షిఫ్ట్ కావడం ధర్మం కదా? ఎందుకు మీరు షిఫ్ట్ చేయడం లేదు? అంటూ పలానా తేదీ నుంచి షిఫ్ట్ చేయండని కేంద్ర ప్రభుత్వానికి హుకుం జారీ చేసింది. ఆ నేపథ్యంలో హైకోర్టు షిఫ్ట్ అయింది. చంద్రబాబు నాయుడి కోరిక మేరకు హైకోర్టు బదిలీ అయితే దాన్ని తిరిగి రాజకీయం చేసి వేరే వాళ్లపై బురద చల్లేందుకు ఉపయోగించుకోవాలనే దుర్మార్గమైన ఆలోచన చంద్రబాబుది. బహుశా ప్రపంచ చరిత్రలో ఇంతటి దారుణమైన, అన్యాయమైన వ్యక్తి మరొకరు ఉండరు.

సాక్షి: మీరు అవకాశం ఇవ్వనందునే రాహుల్ గాంధీ చంద్రబాబుతో వెళుతున్నారని అంటున్నారు?

జగన్: అవకాశం ఇవ్వాలి అనేది ఎందుకు ఎక్స్‌పెక్ట్ చెయ్యాలి. నీ బలం మీద నువ్వు పోటీ చెయ్యి. ప్రజలను నమ్ముకో. నువ్వు కష్టపడు. ఎవడో సపోర్ట్ చెయ్యాలి, ఎవడి భుజాలమీదో పరుగెత్తాలని అనుకుంటున్నావ్. నువ్వే విలువలను అమ్మేసుకుని, నువ్వే దిగజారిపోయి, రాంగ్ మెసేజ్ ఇచ్చావ్. నీకే విలువలు లేనప్పుడు వాళ్లు అమ్ముడు పోతే తప్పేముంది?

సాక్షి: మొదటి నుంచీ ప్రత్యేక హోదా కోసం పోరాడుతున్నారు. హోదా ఇస్తానన్న పార్టీకే మద్దతిస్తామంటున్నారు. రాహుల్ గాంధీ హోదా ఇస్తానంటున్నాడు. కాంగ్రెస్‌తో కలిసిపోతారా?

జగన్: నేను ఆంధ్ర రాష్ట్ర ప్రజల ప్రతినిధిగా మాట్లాడుతున్నా. ఇప్పటి వరకూ మేం చాలా మోసపోయాం. హోదా ఇస్తామని అంతా మోసం చేశారు. రాష్ట్రాన్ని విడగొట్టిన కాంగ్రెస్ పార్టీ హోదాను చట్టంలో చేర్చకుండా మోసం చేసింది. బీజేపీ చేస్తానని ముందుకొచ్చింది. పవన్ కళ్యాణ్ మద్దతు పలికారు. వాళ్లూ మోసం చేశారు. ఎవడో ఏదో చేస్తామని చెబితే నమ్మే పరిస్థితుల్లో మేం లేం. ఏపీ ప్రజలను కోరేది ఒకటే. 25కు 25 ఎంపీ స్థానాలను మనం సొంతం చేసుకుందాం. ఎవరికీ మద్దతునివ్వాల్సిన పనిలేదు. గెలిచిన తర్వాత సంతకం పెట్టు మద్దతిస్తామందాం. అప్పుడు కేంద్ర ప్రభుత్వం, ప్రధాన మంత్రి హోదాకు సంతకం పెట్టక తప్పని పరిస్థితి వస్తుంది. ఇవాళ మద్దతిస్తే.. ఇప్పుడు జరిగినట్టే మళ్లీ వాళ్లు చేతులెత్తేస్తే హోదా ఇవ్వకపోతే ఎవరిని అనగలుగుతాం?

సాక్షి: తాను, పవన్ కళ్యాణ్ కలిస్తే జగన్‌కు ఎందుకు బాధ అని చంద్రబాబు అంటున్నారు..

జగన్: నాకెక్కడ బాధండీ. నాకసలు బాధ లేదు. నేను వాళ్లను కలవమనే చెబుతున్నాను. ఎందుకు ఈ ముసుగులో గుద్దులాట. ఎందుకు ప్రజలను మోసం చేస్తున్నారు? ఇంతకు ముందు కలిసి మీరు పోటీ చేశారు. ఇప్పుడు విడిపోయినట్లు నటించి ప్రజలను మోసం చేస్తున్నారు. ఎందుకు ప్రజలను మోసం చేస్తారు? ముసుగు తీసేసి కలిసికట్టుగా రండయ్యా.. నాకు భయం లేదు. నాకు ప్రజల మీద నమ్మకం ఉంది. ఇవ్వాళ కూడా నేను ఒక్కడినే పోటీ చేస్తానని చెబుతున్నా. మీరందరూ మళ్లీ కలిసి రండయ్యా అని చెబుతున్నా. పొత్తులు ఏమీ ఉండవని చెబుతున్నా.



గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం
దక్షిణాయనం హేమంత ఋతువు
పుష్య మాసం, తిథి శు.పాడ్యమి పూర్తి
నక్షత్రం పూర్వాషాఢ సా.5.09 వరకు
తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం రా.1.53
నుంచి 3.38 వరకు, దుర్ముహూర్తం
సా.4.08 నుంచి 4.53 వరకు
అమృతఘడియలు... ప.11.54 నుంచి
12.56 వరకు

సూర్యోదయం : 6.36
సూర్యాస్తమయం : 5.36
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

పినరయి విజయన్ (కేరళ సీఎం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

స్టేట్‌లో ఉన్నది ఒకటే సీటైనా, స్టేటంతా తమదే అన్నట్లు కర్రలు పట్టుకుని తిరుగుతున్నారు బీజేపీ భక్తులు. 'బీజేపీని ఆపగలుగుతున్నాం కానీ, బీజేపీలోని భక్తిని ఆపలేకపోతున్నాం సర్..' అన్నాడు లోక్‌నాథ్ బెహెరా ఫోన్ చేసి!

ఒక డీజీపీ అనవలసిన మాట కాదు.

"బీజేపీ, భక్తి రెండూ ఒకటే అయినప్పుడు బీజేపీని ఆపితే ఆటోమేటిగ్గా బీజేపీలోని భక్తి కూడా ఆర్డర్‌లోకి రావాలి కదా లోక్‌నాథ్" అని అడిగాను.

"కానీ సర్, బీజేపీ కన్నా, బీజేపీలోని భక్తే ఎక్కువ స్ట్రాంగ్‌గా ఉంది. పట్టలేకపోతున్నాం. దాన్నే పట్టగలిగితే బీజేపీని పట్టుకోవడం పెద్ద కష్టమేం కాదు. అందుకోసమే ట్రయ్ చేస్తున్నాం సర్" అన్నాడు.

"ఎందుకోసం?" అన్నాను.

"అదే సర్, బీజేపీలోని భక్తిని పట్టుకోవడం కోసం" అన్నాడు. భక్తినెలా పట్టుకుంటాడో అర్థం కాలేదు!

"లోక్‌నాథ్, మీరు భక్తిని పట్టుకునే ప్రయత్నంలో మిమ్మల్ని భక్తి పట్టుకోకుండా జాగ్రత్త పడండి" అని చెప్పాను.

"సర్, శబరిమల నుంచి ఫోన్" అంటూ గాభరాగా వచ్చాడు టామ్ జోస్.

"ఎవరికొచ్చింది? ఎవరు చేశారు?" అని అడిగాను.

"కనుక్కుంటాను సర్' అని, నాకివ్వబోయిన ఫోన్‌ని మళ్లీ తన చెవి దగ్గర పెట్టుకున్నాడు!

టామ్ జోస్ కొత్తగా వచ్చిన చీఫ్ సెక్రటరీ. పాల్ ఆంటోని ప్లేస్‌లో వచ్చాడు. పాల్ ఆంటోని రిటైర్ అయ్యాడని టామ్ జోస్‌ని తెచ్చుకుంటే, టామ్ జోస్ రిటైర్ కాకుండానే 'ఆషా థామస్‌ని తెప్పించుకోండి నేను పోతున్నా..' అనేసేలా ఉన్నాడు. ఆషా థామస్.. అతడి తర్వాత లైన్‌లో ఉన్న చీఫ్ సెక్రటరీ.



శబరిమల నుంచి ఫోన్ వచ్చిన ప్రతిసారీ, శబరిమల ఇంకే స్టేట్‌లోనైనా ఎందుకు లేకపోయిందా అన్నట్లు ఫీలింగ్ పెట్టేస్తున్నాడు టామ్ జోస్. రెండు వేల ఇరవై వరకు ఉంది అతడి టెన్యూర్. ఈ మకరజ్యోతి కాకుండా, ఇంకో మకరజ్యోతిని కూడా చూడాలి అతడు.

ఇద్దరు మహిళలు గుడిలోకి ఎంటర్ అవడంతో గుడిని శుద్ధి చేశారనే వార్త వచ్చిన వెంటనే అతడికో ఆలోచన వచ్చింది.

"ఈసారి మకరజ్యోతి కనిపించదేమో సర్" అన్నాడు సడన్‌గా!

"ఎందుకని?" అన్నాను.

"గుడిని అపవిత్రం చేస్తుంటే సీపీఎం చూస్తూ కూర్చున్నందుకు అయ్యప్పకు కోపం వచ్చిందని ప్రచారం చేయడానికి బీజేపీ వాళ్లు మకరజ్యోతిని కనిపించనీయకుండా చెయ్యొచ్చు కదా సర్" అన్నాడు!!

షాక్ తిన్నాను.

సీఎంకి ఐడియాలు ఇచ్చేందుకు చీఫ్ సెక్రటరీగా పెట్టుకుంటే బీజేపీవాళ్లకు ఐడియాలు ఇచ్చేలా ఉన్నాడు టామ్ జోస్.

మకరజ్యోతికి ఇంకో వారమే ఉంది. ఈలోపు ఏవైతే జరగకూడదో వాటన్నిటినీ గొప్ప భక్తి పారవశ్యంతో దగ్గరుండి మరీ జరిపించేలా ఉంది బీజేపీ.

మోదీకి ఫోన్ చేశాను.

"బోలియే.. విజయన్‌జీ.. ఎప్పుడో వరదల్లో కలిశారు, మళ్లీ ఇన్నాళ్లకు!" అన్నాడు.

"ఇప్పుడూ వరదలే మోదీజీ. భక్తి వరద" అన్నాను.

"నేనేం చేయగలను విజయన్‌జీ.. పేద భక్తుడిని" అన్నాడు!

"భక్తిని, పేదరికాన్ని దాచిపెట్టుకోవాలి మోదీజీ. ప్రదర్శనకు పెట్టకూడదు. భక్తిని ప్రదర్శిస్తే భక్తిలోని లేమి మాత్రమే బయటికి కనిపిస్తుంది. పేదరికాన్ని ప్రదర్శిస్తే 'లేని సంపన్నత'పై భక్తిగా మాత్రమే లోకం దాన్ని చూస్తుంది. లోపల ఉంచుకోవడమే నిజమైన భక్తి. లేమిని దాచుకోవడమే నిజమైన సంపన్నత" అన్నాను.

అన్నానే కానీ, లైన్ ఎప్పుడు కట్ అయిందో చూసుకోలేదు.

జన మనోరథయాత్ర

ఫ్రీకాలమ్



కె. రామచంద్రమూర్తి

ఒకానొక చారిత్రక ఘట్టం ఈ నెల తొమ్మిదో తేదీన ముగుస్తుంది. ఆంధ్రప్రదేశ్ విపక్ష నాయకుడు, వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2017 నవంబర్ 6న ఆరంభించిన 'ప్రజాసంకల్పయాత్ర' ఇచ్ఛాపురంలో పెద్ద బహిరంగసభతో ముగియనున్నది. కన్యాకుమారి నుంచి కశ్మీరం వరకూ జరిగిన ఆదిశంకరుడి పాదయాత్ర వివరాలు మనకు అందుబాటులో లేవు. పాదయాత్రను ఒక సాధనంగా వినియోగించి విజయాలు సాధించిన తొలి ప్రజానాయకుడు మహాత్మాగాంధీ. దక్షిణాఫ్రికాలో బొగ్గుగని కార్మికులను సమీకరించి పోరుబాటలో నడిపించడానికి గాంధీజీ చేసిన ప్రయోగం భారత స్వాతంత్ర్య సమరంలో ఒక విధానంగా స్థిరపడింది. 1930లో ఆయన ఆధ్వర్యంలో సాగిన దండి సత్యాగ్రహం దేశప్రజల్లో ఐకమత్యానికీ, స్వాతంత్ర్య పోరాటం తీవ్రతరం కావడానికీ దోహదం చేసింది. అదే మంత్రాన్ని వినోబా భావే 1950 దశకంలో భూదానోద్యమం ప్రచారానికి జయప్రదంగా ఉపయోగించారు. జనతా పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ కన్యాకుమారి నుంచి ఢిల్లీ వరకూ జరిపిన పాదయాత్ర నడివయస్సులో ఉన్నవారికి గుర్తు ఉంటుంది. ఉత్తరాఖండ్‌లో హరిత విప్లవ సారథి సుందర్‌లాల్ బహుగుణ ప్రజలలో అవగాహన పెంపొందించే కార్యక్రమానికి పాదయాత్రను వినియోగించుకున్నారు. ఏక్తాపరిషత్, స్వరాజ్ అభియాన్ వంటి సంస్థలు హక్కుల సాధనకోసం ప్రభుత్వాలపైన ఒత్తిడి తీసుకొని రావడానికి పాదయాత్రలు చేసిన సందర్భాలు ఉన్నాయి.

చంద్రశేఖర్ భారత్‌యాత్ర

రాజకీయ లక్ష్యంతో, ఎన్నికలకు ముందు ప్రజలను ప్రభావితం చేయడానికి ఉద్దేశించిన పాదయాత్ర చేసిన తొలి నాయకుడు జనతాపార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్. జయప్రకాశ్‌నారాయణ్ ఆశీస్సులతో ఆవిర్భవించిన జనతా పార్టీ 1977లో ప్రభుత్వం ఏర్పాటు చేసి, 1980 ఎన్నికలలో పరాజయం చెందిన తర్వాత కొన్ని మాసాలకే విచ్ఛిన్నమైపోయింది. అటల్‌బిహారీ వాజపేయి, లాల్‌కృష్ణ అద్వాణీలు భారతీయ జనతా పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. చరణ్‌సింగ్, దేవీలాల్, లాలూ ప్రసాద్‌యాదవ్, ములాయంసింగ్‌యాదవ్, దేవెగౌడ వంటి నాయకులు వేరు వేరు కుంపట్లు పెట్టుకున్నారు. చంద్రశేఖర్ ఒంటరి. ఆ నేపథ్యంలో ప్రత్యామ్నాయ రాజకీయాలకు అంకురార్పణ చేయాలన్న సంకల్పంతో ఆయన 'భారత్ యాత్ర'ను ప్రారంభించారు. కన్యాకుమారి నుంచి 4,260 కిలోమీటర్లు ఆరు మాసాలలో (జనవరి6–జూన్ 25, 1983) నడిచి రాజ్‌ఘాట్‌లో గాంధీజీకి శ్రద్ధాంజలి ఘటించడంతో యాత్ర ముగిసింది. కానీ చంద్రశేఖర్‌కు రాజకీయ ప్రయోజనం ఏదీ ఆ సందర్భంలో కలగలేదు. 1967 నుంచి ఎంపీగా ఉండిన చంద్రశేఖర్ భారత్‌యాత్ర అనంతరం 1984లో జరిగిన ఎన్నికలలో ఇందిరాగాంధీ హత్య కారణంగా వీచిన సానుభూతి పవనాల ఫలితంగా ఓటమి చవిచూశారు. అనంతరం 1990 నవంబర్‌లో ప్రధాని పదవి చేపట్టి 1991 జూన్ వరకూ కొనసాగారు కానీ దానికీ, పాదయాత్రకూ సంబంధం లేదు. ప్రధాని పదవిలో రాణించడానికి అవసరమైన వ్యవధి కూడా లభించలేదు. పాదయాత్రలో తెలుసుకున్న సమస్యలకు పరిష్కారాలు ఆలోచించడానికి కానీ అమలు చేయడానికి కానీ అవకాశం లేకపోయింది. 1990లో బీజేపీ నాయకుడు అద్వాణీ చేసిన 36 రోజుల రథయాత్ర దేశాన్ని కుదిపివేసింది. ఇది రాజకీయాల కోసం మతాన్ని ఉపయోగించే ప్రయత్నం. హిందువులను మతప్రాతిపదికపైన, బాబరీమసీదును తొలగించి రామాలయ నిర్మాణం జరిపించాలనే నినాదంపైన సంఘటితం చేసే ఉద్దేశంతో సాగిన యాత్ర. మహాభారత యుద్ధంలో అర్జునుడు ఉపయోగించిన రథాన్ని పోలిన వాహనంలో చేసిన యాత్రను బిహార్ ముఖ్యమంత్రి లాలూ అడ్డుకున్నారు. అద్వాణీని అరెస్టు చేయించారు. అయినా ఆ యాత్ర బీజేపీకి లబ్ధి చేకూర్చింది. 1984లో రెండు లోక్‌సభ స్థానాలను మాత్రమే గెలుచుకున్న బీజేపీ 1998 నాటికి అధికారంలోకి వచ్చింది. రాజీవ్ హత్య జరిగి ఉండకపోతే 1991 ఎన్నికలలో బీజేపీ ఎక్కువ స్థానాలు సాధించి ఉండేది. హత్య కారణంగా ఎన్నికల రెండో ఘట్టంలో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు కలిగిన పార్టీగా అవతరించింది. 1996 ఎన్నికల అనంతరం 13 రోజుల స్వల్పకాలం వాజపేయి నేతృత్వంలో బీజేపీ అధికారంలో ఉంది. ఆ తర్వాత యునైటెడ్ ఫ్రంట్ అల్పాయుష్షు ప్రభుత్వాలకు దేవెగౌడ, గుజ్రాల్ సారథ్యం వహించారు. 1998 ఎన్నికలలో బీజేపీ అతి పెద్ద పార్టీగా అవతరించి వాజపేయి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మొత్తంమీద రథయాత్ర ఫలితంగా బీజేపీ బలం పుంజుకొని అధికారంలోకి వచ్చిందని భావించవచ్చు.

పూర్తిగా రాజకీయ, సామాజిక అంశాలను మాత్రమే ప్రస్తావిస్తూ, ప్రజలను



కలుసుకొని వారి కంట నీరు తుడిచే ఉద్దేశంతో సాగిన పాదయాత్ర వైఎస్ రాజశేఖరరెడ్డి 2003లో చేసిన 'ప్రజాప్రస్థానం.'రంగారెడ్డి జిల్లా చేవెళ్ళ నుంచి ఆరంభించి ఇచ్ఛాపురం వరకూ 64 రోజులపాటు 1,470 కిలోమీటర్లు సాగిన యాత్రలో అన్ని వర్గాల, కులాల, మతాల ప్రజలనూ కలుసుకొని వారి వెతలు వినే అవకాశం నాటి ప్రతిపక్ష నాయకుడు వైఎస్ఆర్‌కి దక్కింది. పేదప్రజలూ, నిరుద్యోగులూ, మైనారిటీలూ, దళితులూ, ఆదివాసులూ చెప్పిన అనేక సమస్యలను అవగాహన చేసుకొని వాటికి పరిష్కారాలు ఆలోచించి నిర్దిష్టమైన రూపం ఇచ్చే సావకాశం ఆయనకు లభించింది. 2004 ఎన్నికలలో విజయం సాధించాక ఆయన ప్రభుత్వం ఏర్పడి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసింది. జలయజ్ఞం వంటి బృహత్తరమైన కార్యక్రమాన్ని తలకెత్తుకున్నది. విద్య, ఆరోగ్య రంగాలలో వినూత్నమైన పథకాలు తెచ్చింది. పార్టీలకూ, ప్రాంతాలకూ అతీతంగా ప్రజలందరికీ పథకాల ఫలాలు అందే విధంగా అమలు చేయడానికి శక్తివంచన లేకుండా ప్రయత్నించింది. ఆ పథకాల ఫలితంగానే 2009లో మహాకూటమిని ఒంటరిగా ఎదుర్కొని వైఎస్ఆర్ నాయకత్వంలోని కాంగ్రెస్ విజయం సాధించింది. 2009 సెప్టెంబర్ 2న ఆయన హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందిన తర్వాత రాష్ట్ర రాజకీయాలు పూర్తిగా మారిపోయినాయి. వైఎస్ఆర్ స్థానంలో రోశయ్య, ఆ తర్వాత కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రులుగా పని చేశారు. 2012 అక్టోబర్ 2న టీడీపీ అధినేత చంద్రబాబు హిందూపురం నుంచి విశాఖపట్టణం వరకూ పాదయాత్ర ప్రారంభించారు. 208 రోజులపాటు సుమారు 2,800 కిలోమీటర్లు నడిచి 2013 ఏప్రిల్ 27న యాత్ర ముగించారు. ఆ తర్వాత రాష్ట్ర విభజన జరిగింది. సార్వత్రిక ఎన్నికలతోపాటు అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. టీడీపీ గెలిచింది. ఇంతవరకూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష నాయకులు జరిపిన పాదయాత్రలు ఫలించాయి. చంద్రబాబు పాదయాత్ర ప్రారంభించిన తర్వాత పక్షం రోజులకు, 2012 అక్టోబర్ 18న వైఎస్ఆర్ కుమార్తె షర్మిల ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకూ పాదయాత్ర మొదలు పెట్టారు. 2013 జులై 29 వరకూ 230 రోజుల పాటు 3112 కిలోమీటర్ల దూరం నడిచి కొత్త రికార్డు నెలకొల్పారు. జగన్ జైలులో ఉన్న కారణంగా ఆయన చెల్లెలు అన్నకు సంఘీభావ సూచనగా 'మరోప్రజాప్రస్థానం' పేరుతో ఈ పాదయాత్ర చేశారు. వైఎస్ఆర్‌సీపీ విజయావకాశాలు పెంపొందించడమే తప్ప తనకు వ్యక్తిగతంగా రాజకీయ ప్రయోజనం ఆశించలేదు కనుక షర్మిల పాదయాత్రకు నిర్దిష్టమైన ఫలితం అంటూ ఉండదు.

ఈ పాదయాత్ర ప్రత్యేకతలు ఏమిటి?

బుధవారం ముగియనున్న జగన్ పాదయాత్ర ఇంతకు మునుపు జరిగిన పాదయాత్రల కంటే పలు విధాల భిన్నమైనది. తెలుగునాట ఇంతకు పూర్వం పాదయాత్రలో నెలకొల్పిన రికార్డులన్నింటినీ ఇది అధిగమించింది. ఆయన ఇంత వరకూ 338 రోజులపాటు 3,600 కిలోమీటర్ల పైచిలుకు నడిచారు. కాలమూ, దూరంలోనే కాదు ప్రత్యేకత. వైఎస్ పాదయాత్ర చేసిన రోజులలో రాష్ట్రంలో కరువు తాండవించింది. వ్యవసాయదారుల సమస్యలను అధికంగా ప్రస్తావించేవారు. రైతుల రుణమాఫీ, ఉచిత కరెంటు ఇవ్వడం వంటి కార్యక్రమాలు ఆ యాత్ర ఫలితమే. చంద్రబాబు చేసిన 'వస్తున్నా మీ కోసం' యాత్రలో రైతుల సమస్యలనూ, ఇతర వర్గాల సమస్యలనూ ప్రస్తావించారు. కానీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకోగానే రైతులనూ, పేదలనూ విస్మరించి సింగపూర్ స్వప్నంలో మునిగారు. ఇప్పటికీ తేలలేదు. ఏడు మాసాల పాదయాత్రలో ఆలకించిన విన్నపాల ఆధారంగా ప్రజల ఎజెండా రూపొందించుకొని అమలు పరచవలసిన ముఖ్యమంత్రి సొంత ఎజెండాను తలకెత్తుకున్నారు. బహుశా ప్రజల ఆశలనూ, ఆకాంక్షలనూ చంద్రబాబు పట్టించుకోని ఫలితంగానే జగన్ పాదయాత్రకు జనం తండోపతండాలుగా వస్తున్నారు. ఇదివరకు జరగనట్టు ఈ పాదయాత్రలో భాగంగా ప్రతి రెండు రోజులకూ ఒక బహిరంగసభ జరుగుతోంది. ఇదివరకు ఎరగనట్టు ప్రతి సభకూ ప్రజలు వేల సంఖ్యలో హాజరవుతున్నారు. ఒక పాదయాత్రకు ఇంతమంది ప్రజలు హాజరుకావడం చరిత్ర. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు రాష్ట్రం పొడవునా పాదయాత్ర చేయడం ప్రపంచ రికార్డు. బహిరంగ సభలతో పాటు వివిధ కులాలవారూ, వృత్తులవారూ ఆత్మీయసభలలో జగన్‌ను కలుసుకొని తమ కష్టాలూ, సమస్యలూ చెప్పుకుంటున్నారు. ప్రతిపక్ష నాయకుడు అందరు చెప్పినవీ శ్రద్ధగా ఆలకించి పరిష్కారం సూచిస్తున్నారు. అందరి ఆశీస్సులతో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పడితే ఈ సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలని అనుకుంటున్నారో చెబుతున్నారు.

ఇసుకవేస్తే రాలని జనం ఎందుకు వస్తున్నారు?

టీడీపీ ఎన్నికల వాగ్దానాలు సక్రమంగా అమలు జరగడం లేదని ప్రజలు ఆవేశంగా, ఆవేదనతో చెబుతున్న మాటలు స్పష్టం చేస్తున్నాయి. అవే అంశాలు జగన్ ఉపన్యాసాలలో విమర్శనాస్త్రాలుగా వెలువడుతున్నాయి. విమర్శ సూటిగానే, ఘాటుగానే ఉంటున్నది. ప్రత్యర్థిని చులకన చేసి మాట్లాడటం లేదు. 'ఈ పెద్దమనిషి, చంద్రబాబునాయుడుగారు...' అంటూనే వాక్యం ప్రారంభం అవుతున్నది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలనూ, ప్రభుత్వ వైఫల్యాలనూ పేర్కొంటూనే వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి వస్తే ఏమి చేయాలని అనుకుంటున్నదో కూడా స్పష్టంగా చెబుతున్నారు. వైఎస్ఆర్ రైతు భరోసా పథకం, వైఎస్ఆర్ ఆసరా పథకం కింద డ్వాక్రా మహిళలకు ఉన్న రుణాల మొత్తాన్ని నాలుగు దఫాలుగా వారికే చెల్లించడం, వృద్ధాప్య పింఛన్‌నూ, వికలాంగులకు ఇచ్చే పింఛన్‌నూ వెయ్యి నుంచి రెండు వేల రూపాయలకు పెంచడం, పిల్లలను చదివించే తల్లులకు ప్రోత్సాహకాలు అందించే అమ్మఒడి పథకం, పేదలందరికీ ఇళ్ళు, ఆరోగ్యశ్రీకి పూర్వవైభవం, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం, దశలవారీగా మద్యనిషేధం అంటూ నవరత్నాల పేరుమీద తొమ్మిది పథకాలను ప్రధాన ఎజెండాగా ప్రకటించారు. ప్రతిపథకం గురించి వివరంగా చెబుతున్నారు. ఇలా ప్రజల మధ్య నిత్యం ఉండటం,వారి మాటలు వినడం, మాట్లాడటం కంటే ముఖ్యమైన కార్యక్రమం రాజకీయ నాయకులకు ఉండదు. ప్రజల సంక్షేమమే పరమావధి అని భావించే నాయకులకు ఇది మహోపకారం చేస్తుంది. 2009లో తండ్రి ఆకస్మిక మరణం నుంచి నేటి వరకూ ఆయన పట్టుమని వారం రోజులు ఇంటి దగ్గర భార్యాపిల్లలతో కలసి ఉండలేదు. మొదట్లో ఓదార్పు యాత్ర, అనంతరం జైలు జీవితం, ఆ తర్వాత ప్రత్యేకహోదా సాధనకోసం రాష్ట్ర వ్యాప్తంగా సభలు, అటుపిమ్మట పాదయాత్ర. 2018 పూర్తిగా పాదయాత్రలోనే గడిచిపోయింది. వాస్తవానికి ఇది 2017లో ఆరంభమై 2019లో పూర్తవుతున్న చరిత్రాత్మకమైన పాదయాత్ర. 'ప్రజల సంక్షేమం కోసం నాన్నగారు ఒక అడుగు ముందుకేస్తే మీ జగన్ రెండడుగులు ముందుకేస్తాడు' అంటూ అడుగడుగునా చెబుతున్న జగన్ 2019లో అద్భుతమైన విజయం సాధిస్తారనడంలో సందేహం ఏ మాత్రం లేదు. ప్రజలు ఎప్పుడో నిర్ణయించుకున్నారు. ప్రజలు ఒకసారి సంకల్పం చెప్పుకున్న తర్వాత ప్రత్యర్థుల ఎత్తుగడలూ, కూడికలూ, తీసివేతలూ, వ్యూహాలూ, ప్రలోభాలూ, కుట్రలూ, ధనప్రవాహాలూ, విషప్రచారాలూ పని చేయవు. 2004లో, 2009లో పని చేయలేదు. ఈసారీ పని చేయవు. గెలిచిన తర్వాత జగన్ ఎట్లా వ్యవహరిస్తారో ప్రజలు పరిశీలిస్తారు. శాసనసభ్యుల చేత రాజీనామా చేయించిన తర్వాతనే పార్టీలో చేర్చుకున్నట్టు, ఆచరణసాధ్యమైన వాగ్దానాలనే ప్రజలకు చేసినట్టు, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నట్టు... ఇదే రకమైన విలువలను అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కొనసాగిస్తే, పాదయాత్రలో చేసిన బాసలన్నీ నిలబెట్టుకునే ప్రయత్నం నిజాయితీగా చేయగలిగితే 'ప్రజాసంకల్పయాత్ర' పూర్తిగా సార్థకం అవుతుంది. జగన్‌మోహన్‌రెడ్డి జన్మ ధన్యమౌతుంది.

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా సిండ్రోమ్



"మాడిసన్ స్క్వేర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్న కార్యక్రమంలో రాజ్‌దీప్ సర్దేశాయ్ పట్ల దేశభక్తి గల ఎన్ఆర్ఐ బీజేపీ మద్దతుదారులు దురుసుగా ప్రవర్తించారు. ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విమర్శలు చేస్తుంటే వాళ్లంతా దాక్కున్నారు. వాళ్లు అమెరికా వెళ్లింది ఏదోలా ఉద్యోగాలు చేసుకుని బతకడానికేగా. దీన్నే సావర్కర్ సిండ్రోమ్ అంటారు"

– సంజయ్ హెగ్డే
న్యాయవాది

జాబ్స్



"భారత్‌లోని కోటీ పదిలక్షల మంది 2018లో ఉద్యోగాలు కోల్పోయారు. గ్రామీణ భారతదేశంలో మరో కోటిమంది వరకు ఉద్యోగాలు కోల్పోయారు. వీరందరిలో సుమారు 80లక్షలమంది మహిళలే. అచ్చేదిన్ అంటూ ఇచ్చిన హామీలకు, వాస్తవాలకీ ఏమైనా సంబంధం ఉందా?"

– అశోక్ గహ్లోత్, రాజస్తాన్ సీఎం

కర్నాటకం



"కర్ణాటకలోని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ పాలనలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు, దళితులు బానిసలుగా బతుకుతున్నారు, పన్నులు కట్టలేక సామాన్యుడు సతమతమవుతున్నాడు. అవినీతి, అసమర్థతలో కూరుకుపోయిన కర్ణాటక ప్రభుత్వ తీరుకు ప్రజలు ఎందుకు ఇంతటి భారీ మూల్యం చెల్లించాలి?"

– అమిత్ షా, బీజేపీ అధినేత

ఆయన



"మహిళలారా, అతడు మీ పుట్టిన రోజును గుర్తుపెట్టుకుంటున్నాడా? మీకు సంబంధించిన రహస్యాలన్నీ తెలుసుకుంటున్నాడా? ప్రతిరోజూ మీతో చాలా సమయం గడుపుతున్నాడా? మీ స్నేహితులందరి గురించి తెలుసా? అయితే, ఆయన మీ ఆయన కాదు; జుకర్ బర్గ్ "

– శోభా డే, రచయిత్రి

అబద్ధం



"ఒలింపిక్ గోల్డ్ మెడల్ సాధించిన మనుబెకర్‌కు రెండు కోట్ల రూపాయలు అవార్డుగా అందజేయనున్నట్టు ప్రకటించిన హరియాణాలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ మొత్తం ఇవ్వలేదు. భారతీయులందరి బ్యాంకు ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని ప్రధాని మోదీ చెప్పినట్టుగానే, ఇది బీజేపీ చెప్పిన మరో అబద్ధం"

– షమా మహ్మద్, దంతవైద్యురాలు

పరిశోధనల్లో 'సగం'

శాస్త్ర విజ్ఞాన పరిశోధనల్లో పాలుపంచుకోవడానికి వీలైన వాతావరణాన్ని మహిళలకు కల్పిస్తే వారు అద్భుతమైన విజయాలు సొంతం చేసుకోవడానికి ఆస్కారం ఏర్పడుతుందని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి హితవు చెప్పారు. ఈమధ్య అమెరికాకు చెందిన క్లారివేట్ ఎనలిటిక్స్ సంస్థ విడుదల చేసిన నివేదికను ఆయన ప్రస్తావించి ప్రపంచంలోని అత్యున్నత ప్రమాణాలు సాధించిన 4,000 మంది పరిశోధకుల్లో మన దేశం నుంచి కేవలం 10 మంది మాత్రమే ఉన్నారని, వారిలో ఒకే ఒక్క మహిళ ఉన్నదని వివరించారు. ఇది విచారకరమని ఆయన అన్నారు. మహిళలకు సరైన ప్రోత్సాహమిస్తే ఆ జాబితాలో మన పరిశోధకుల సంఖ్య అమాంతం పెరుగుతుందన్నది ఆయన అంచనా. అందుకాయన ఒక కారణం కూడా చెప్పారు. తాను ఏదైనా యూనివర్సిటీకి లేదా ఐఐటీలకూ వెళ్లినప్పుడు అక్కడ బంగారు పతకాలు గెల్చుకున్నవారిలో మహిళలెందరని చూస్తుంటానని, ప్రతిసారీ వారి సంఖ్యే అధికంగా ఉంటున్నదని తెలిపారు. ఈ ధోరణి గమనించాకే పరిశోధనా రంగంలో మహిళల శాతం మరింత పెరగడం అవసరమని గుర్తించానంటున్నారు. పెళ్లయినా, పిల్లలున్నా ప్రతిబంధకాలు ఏర్పడని రీతిలో మహిళలను ప్రోత్సహించడం ముఖ్యమన్నది ఆయన సలహా. పాలకులు సైతం దీన్ని గుర్తించడం, అందుకు అవసరమైన సమస్త చర్యలూ తీసుకోవడం అత్యవసరం.

సాహిత్యం, సమాజం, రాజకీయాలలో నేడు మనం ఎదుర్కొంటున్న సవాళ్లకు ప్రజాతంత్ర సంస్కృతే ప్రత్యామ్నాయం. పాలకులు పథకాల ద్వారా ఉచితంగా ప్రజల డబ్బును పంచిపెడుతూ ఆ ప్రజలనే బిచ్చగాళ్లుగా మార్చేస్తున్నారు. కవులు, రచయితలు, మేధావులు నిజాలు చెప్పినా, రాసినా జైళ్ల నోళ్లు తెరుచుకుంటున్నాయి. మరికొందరు పదవులకు సన్మానాలు, పురస్కారాలకు ఎగబడుతున్న వాస్తవాన్ని మనం విస్మరించలేం. రాజ్యాధికారంలో తమ వంతు వాటాను సాధించుకోడానికి ఆయా కుల సంఘాలు షార్ట్ కట్ మార్గాలను వెదుకుతున్నాయి. సమష్టి ప్రజా పోరాటాల నుండి విడిపోయి తమ కుల పంచాయితీలలో, రిజర్వేషన్ల ఉద్యమంలోనే తమ విముక్తి ఉందని భావిస్తున్నాయి. ఈ ప్రజాతంత్ర సంస్కృతి విప్లవోద్యమాల బాసటగా రావలసిన సాంస్కృతిక విప్లవం ద్వారానే వికసించే అవకాశం ఉంది. ప్రజా పోరాటాల వారసత్వం ఇచ్చిన ఆత్మవిశ్వాసంతో కాలక్షేప రచయితలకు సమాంతరంగా శక్తివంతంగా రచనలు చేయడమే ప్రత్యామ్నాయం.

సవాళ్లకు ప్రజాతంత్ర సంస్కృతే సమాధానం

సందర్భం



నిఖిలేశ్వర్

దేశంలో ప్రతి ఒక్కరం వ్యక్తిగతంగా, సమాజంలో భాగంగా ఆయా రంగాలలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఇక్కడ మనం అంటే– రచయితలుగా, మేధావులుగా, బుద్ధి జీవులుగా మాట్లాడుకుంటున్నాం. సమకాలీన సమాజంలో అందరికంటే ముందుగా మేల్కొని హెచ్చరిస్తున్న వాళ్లుగా ఆలోచిస్తున్నాం.

శుష్క వాగ్దానాలతో, నినాదాలతో అధికారానికి వస్తున్న పాలకులు నేలపైనున్న వాస్తవాలను మరచి, ఆకాశంలో అంచనాలు వేస్తున్నారు. సమస్యల మూలాల నుంచి దారి మళ్లించి తాత్కాలిక ఉపశమనంతో బతుకు భారాన్ని మోయమంటున్నారు. ఆయా పథకాల ద్వారా ఉచితంగా ప్రజల డబ్బును పంచిపెడుతూ వారినే బిచ్చగాళ్లుగా మార్చేస్తున్నారు.

అంతరిక్షంలోకి దూసుకుపోయే ప్రయోగాలతో వైజ్ఞానికంగా, సాంకేతికంగా ఎదిగిన ఇండియాను ఒకవైపు, ఇక్కడి నేలపై రుణ భారంతో, వ్యవసాయం గిట్టుబాటుగాక ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల దీనమైన భారత్‌ను మరోవైపు చూస్తున్నాం.

రాజకీయ, ఆర్థిక రంగాలలో ఉన్న వైరుధ్యాలు, అంతరాల మధ్యనే సామాజికంగా మతతత్వం, కుల జాడ్యం విస్తరించిన ఈ వ్యవస్థలో జీవిస్తున్న కవులు, రచయితలు, మేధావులు నిజాలు చెప్పినా, రాసినా జైళ్ల నోళ్లు తెరుచుకుంటున్నాయి. భావప్రకటన, అభివ్యక్తి స్వేచ్ఛ అనే మౌలికమైన ప్రాథమిక, మానవ హక్కులను బంధించాలని పాలకవర్గాలు కుట్రలు పన్నుతున్నాయి. మరోవైపు ప్రజల పక్షాన నిలబడి ప్రతిపక్షంలో ఉండవలసిన కవులు, కళాకారులు, మేధావులు పదవులకు సన్మానాలు, పురస్కారాలకు ఎగబడుతున్న వాస్తవాన్ని మనం విస్మరించలేం.

డిజిటల్ ఎలక్ట్రానిక్ విప్లవం వచ్చిన తర్వాత, నయా ఫాసిజం కోరలు చాస్తున్నది. అన్ని మానవ రంగాలపై నిఘా వ్యవస్థను కట్టుదిట్టం చేస్తున్నది. దళారీ పెట్టుబడిదారీ వర్గం సంపన్నుల సౌలభ్యం కోసం ఉన్నత మధ్యతరగతిని పెంచి పోషిస్తున్నది. క్యాపిటలైజేషన్‌లోని న్యాయమైన పోటీని కూడా అమలు చేయకుండా, మన రాజకీయ నాయకులు, పాలకులు భూస్వామ్య, ఫ్యూడల్ మానసికతతో పాలిస్తున్నారు. ఇక ఇంతవరకు అణగారిన కులాలు, తమ అస్తిత్వ పోరాటాల ద్వారా ఉనికిని చాటుకోవడం న్యాయమే. అయితే తాత్కాలికంగానైనా రాజ్యాధికారంలో తమ వంతు వాటాను సాధించుకోడానికి ఆయా కుల సంఘాలు షార్ట్‌కట్ మార్గాలను వెదుకుతున్నాయి. సమష్టి ప్రజా పోరాటాల నుండి విడిపోయి తమ కుల పంచాయితీలలో, రిజర్వేషన్ల ఉద్యమంలోనే తమ విముక్తి ఉందని భావిస్తున్నాయి. ఇదే సందర్భాలలో వామపక్ష ఉద్యమాల వర్గపోరాటాల స్ఫూర్తిని తిరస్కరిస్తున్నాయి. ఈ పరిణామంవల్ల దళిత, వెనుకబడిన కులాల నుంచి వచ్చే ప్రజలు కేవలం కుల పోరాటాలకే పరిమితం కాగా వామపక్ష పోరాటాలు బలహీనపడిపోయిన వాస్తవాన్ని గుర్తించక తప్పదు. సమాంతరంగా విప్లవ రాజకీయ పక్షాల ప్రజా పోరాట చరిత్ర ఉంది. ప్రజానుకూల పంథాలో అతి, మితవాదాలను ఎదిరిస్తూ విప్లవకారులు ఏకం కావలసి ఉంది.

ప్రస్తుతం మనకు రాజ్యాంగపరమైన హక్కులున్నా, వాటిని కాపాడవలసిన న్యాయ వ్యవస్థ బలహీన పడుతున్నది. ప్రజల మాన, ప్రాణాలను రక్షించవలసిన చట్టాలన్నీ అవినీతి పాలకుల కీలుబొమ్మలుగా మారిపోతున్నాయి. పవిత్రమైన గ్రంథమనుకొనే మన రాజ్యాంగాన్ని వందసార్లు సవరించుకొన్నాం. సోషలిజం, సెక్యులరిజం నామమాత్రంగా అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. మరోవైపు గ్రామీణ ప్రజల కులవృత్తులు ధ్వంసమైన తర్వాత, ఉపాధి కోల్పోయి, పేదల సంఖ్య పెరిగి నగరాలకు వలసబాట పడుతున్నారు.

ఇక సహజ వనరుల విధ్వంసం జరిగి పర్యావరణ సమతౌల్యం పెద్ద సవాలుగా మనముందున్నది. విద్య, వైద్యం సామాన్యుడికి అతి ఖరీదైపోగా, ఈ సోకాల్డ్ సంక్షేమ పథకాలు కాగితాలకే పరిమితమైనాయి. విగ్రహాలు, మందిరాల నిర్మాణమే ప్రాధాన్యతను సంతరించుకోగా, ఆయా మతాచార్యులు, కాలం చెల్లిన సంప్రదాయాలతో సామాజిక జీవితాల్ని నిర్దేశిస్తున్నారు. పాలకులు తమ పదవుల భద్రత కోసం స్వాములవార్లకు సాష్టాంగ నమస్కారాలు చేస్తున్నారు. ఎన్నికలు జూదంగా పరిణమించి, ఓటర్లను కొనివేయగలమనే ధీమా ఏర్పడింది.

ఇలాంటి స్థితిలో ఈ రాజకీయ, సామాజికమైన సవాళ్లను ఎదుర్కొనే శక్తిని ప్రజా పోరాటాల ద్వారానే సాధించుకోగలమనే నమ్మకం మిగిలి ఉంది. కార్మిక, రైతాంగ విప్లవపోరాటాల మార్గాన అర్ధ భూస్వామ్య, అర్ధ వలస సామ్రాజ్యవాద శక్తులను ఓడించగలం. కీలకమైన వ్యవసాయిక విప్లవంతో భూమి సమస్య పరిష్కారం కాగలదని చరిత్ర చెబుతున్నది.

మరో ముఖ్యమైన సవాలు–వర్తమాన సాంఘిక వ్యవస్థలోకి మార్కెట్ ఆర్థిక విధానాలవల్ల వాడకం దినుసుల వ్యామోహంతో విలాసాలకు ఎగబడే మనస్తత్వం వ్యాపించింది. మానవ సంబంధాలు విచ్ఛిన్నమైపోతున్నాయి. వికృతమైన వినోదం, లైంగిక విశృంఖలత మూలంగా స్త్రీ పురుష సంబంధాలలో, సహజమైన ప్రేమానుబంధాలు నశించిపోతున్నాయి. వ్యక్తితోపాటు, కుటుంబాలు మానసిక సంక్షోభంలో కూరుకుపోతున్న పరిస్థితి ఇది.

ఈ సంక్షోభాన్ని, మానవ సంబంధాలలో వచ్చిన మార్పును మన సమకాలీన సాహిత్యం చిత్రించడం లేదు. ఇప్పటికీ మధ్యతరగతి మనస్తత్వంతో, సంకుచిత వ్యక్తి స్వార్థంతో కొట్టుమిట్టాడుతున్నది. పాలకుల ఫాసిస్టు చర్యలను ఎండగట్టే ప్రజలకు మనో ధైర్యాన్ని, ప్రతిఘటనా శక్తిని ఇవ్వవలసిన రచయితలు మౌనం వహిస్తున్నారు. పాలకులు భజనపరులైన కవులు, కళాకారుల అవకాశవాదాన్ని సహిస్తున్నారు. మెజారిటీ ప్రజాస్వామ్యం పేరిట, హిందుత్వ భావజాలంతో గోవుల రక్షణ, ఆహార వ్యవహారాలపై ఆంక్షలతో హత్యలను ప్రోత్సహిస్తున్న సంస్కృతిని సామూహిక స్వరం ద్వారా, సామూహిక ప్రజాతంత్ర సంస్కృతి ద్వారా ప్రతిఘటించక తప్పదు. ఈ ప్రజాతంత్ర సంస్కృతి విప్లవోద్యమాల బాసటగా రావలసిన సాంస్కృతిక విప్లవం ద్వారానే వికసించే అవకాశం ఉంది.

అంతిమంగా మానవీయ విలువల కోసం, సామ్యవాద స్వప్నాన్ని నిజం చేయగల శక్తి ఈ దేశ ప్రజలకే ఉన్నదని నమ్ముతున్నాం. శ్రామికశక్తితో, మన ప్రజా పోరాటాల వారసత్వం ఇచ్చిన ఆత్మవిశ్వాసంతో, రచయితలు తమ సృజనాత్మక శక్తితో వివిధ ప్రక్రియలలో పాపులిస్టు, కాలక్షేప రచయితలకు సమాంతరంగా శక్తివంతంగా రచనలు చేయడమే ప్రత్యామ్నాయ మార్గం.

(23.12–2018 జ్వాలాముఖి 10వ వర్ధంతి సదస్సులో చదివిన పత్రం)

వ్యాసకర్త ప్రముఖ కవి | 91778 81201

సాక్షి ఫ్యామిలీ

నల్లగొండ ॥ ఆదివారం
6-1-2019



మీలో చాలామంది నటి జయంతిని చూసి ఉండకపోవచ్చు.
ఈ ఇంటర్వ్యూ చదివితే జయంతి మాత్రమే కాదు, చిన్ననాటి జయంతి గురించి కూడా మీకు తెలుస్తుంది!
లైఫ్‌ని ఊరికే లాగించేస్తుంటారు మనుషులు.
కానీ జయంతి, జీవితంలోని ప్రతి దశలోనూ జీవించారు!
నటనలో జీవించడం నటులు చేసే పనే.
జీవితంలో నటించకుండా ఉండటమే లైఫ్ అంటే.
ఆ లైఫ్‌నే 'జీవించా..' అంటున్నారు జయంతి.
నేడు ఆమె బర్త్ డే. ఆ సందర్భంగా..
సాక్షి ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ.

అలనాటి నటి జయంతి

జీవించా..

■ **ముందుగా పుట్టినరోజు శుభాకాంక్షలు.. బర్త్‌డే (జనవరి 6) గురించి నాలుగు మాటలు?**

జయంతి: ధన్యవాదాలు. 'సాక్షి'ని కలవడం నాకూ ఆనందంగా ఉంది. ఆ మధ్య నేను అనారోగ్యానికి గురయ్యానని వార్త వచ్చినప్పుడు ఎప్పటికప్పుడు క్షేమసమాచారాలు తెలుసుకున్నారు. బెంగళూరులో ఉన్న నాకు ఇలాంటి అభిమానం దక్కడం మరచిపోలేను. నాకు బర్త్‌డేలంటే భలే ఇష్టం. నేను నటిగా ఉన్నప్పుడు గ్రాండ్‌గా చేసేవాళ్లు. మెల్లిగా ఎందుకి దంతా అనిపించింది. ఆ తర్వాత చాముండేశ్వరీ మాత దేవాలయానికి వెళ్లి ఇంటికి వచ్చేదాన్ని. ఇంట్లో అందరం కలసి భోజనం చేసేవాళ్లం. బర్త్‌డే నాడు ఫ్యామిలీ మెంబర్స్ అంతా కలుస్తాం. ఈసారి బయటకు ఎక్కడికీ వెళ్లడంలేదు. ఇంట్లోనే.

■ **ఈ సందర్భంగా ఒక్కసారి మీ బాల్యంలోకి వెళదాం. ఎక్కడ పుట్టారు. ఎక్కడ పెరిగారు?**

బళ్లారిలో పుట్టాను. ఎక్కువ సంవత్సరాలు అక్కడే పెరిగాను. నాన్న బాలసుబ్రహ్మణ్యంగారు సెంట్ జోసెఫ్ కాలేజీలో ఇంగ్లీష్ లెక్చరర్‌గా ఉండేవారు. అమ్మగారు సంతాన లక్ష్మి. నేను పెద్ద అమ్మాయి. నాకు ఇద్దరు తమ్ముళ్లు యోగేశ్‌బాబు, హరికృష్ణ. ఇది మా ఫ్యామిలీ. మేం బెంగళూరులో ఉండేవాళ్లం. అమ్మానాన్న ప్రేమగా ఉంటూనే స్ట్రిక్ట్‌గా ఉండేవాళ్లు.

■ **స్కూల్ డేస్‌లో చురుకుగా ఉండేవారా?**

చాలా. స్కూల్ ఫంక్షన్స్‌లో స్టేజ్ మీద డ్యాన్స్ చేయాల్సిందే. ఓ ప్రోగ్రామ్ చూసి, మా అమ్మగారైతే 'నా కూతురు పెద్ద డ్యాన్సర్ అయిపోతుంది' అని మురిసిపోయి, నాన్నని ఒప్పించి మద్రాస్ తీసుకెళ్లి చంద్రకళ అనే డ్యాన్స్ మాస్టర్ దగ్గర చేర్పించారు. ఈవిడ డ్యాన్స్ స్కూల్ నడుపుతూ సినిమాల్లో డ్యాన్స్ చేసేవారు. ఆవిడ దగ్గర చేరినప్పుడు నటి మనోరమ నాకు సీనియర్. తనేం డ్యాన్స్ చేస్తుంది. చేయి ఊపుతుందా? నడుము ఊపుతుందా? అని సీనియర్స్ అంతా నన్ను ఏడిపించేవాళ్లు. నాకు బాగా ఏడుపొస్తే గోడకు కొట్టుకునేదాన్ని. ఓసారి అలా చేసినప్పుడు మనోరమ చూశారు. 'కమలా.. ఎందుకలా చేస్తున్నావు?' అని అడిగితే, 'వీళ్లంతా నన్ను ఏడిపిస్తున్నారు. వచ్చింది కూడా నేర్చుకోలేకపోతున్నాను' అన్నాను. 'కొత్తవాళ్లను ఎంకరేజ్ చేయాలి. సారీ చెప్పండి' అని వాళ్లను దులిపేశారామె.

■ **మరి సినిమాల్లోకి ఎలా వచ్చారు?**

ఆ రోజు మా టీచర్‌కి షూటింగ్ ఉంది. మేం కూడా వస్తామని వెళ్లాం. ఆ సమయంలో కన్నడ దర్శకుడు వైఆర్ స్వామి ఒక కన్నడ సినిమా తీస్తున్నారు. అందులో ముగ్గురు హీరోయిన్స్ పండరీ బాయి, చంద్రకళ. ఈ చంద్రకళ మా డ్యాన్స్ టీచర్ కాదు. ఆవిడ నటి. మూడో హీరోయిన్‌గా ఒక చిన్నమ్మాయి కోసం వెతుకుతున్నారు. నేను ఆయన కళ్లలో పడ్డాను. 'నీ పేరేంటి' అని అడిగితే, కమలా అని వినపడీ వినపడనట్టు చెప్పాను. మా సినిమాలో యాక్ట్ చేస్తావా? అని అడిగారు. టీచర్ వైపు చూస్తే, 'ఆ అమ్మాయికి తెలియదండీ.. వాళ్లింటికి తీసుకెళ్తాను' అన్నారు. మరుసటిరోజు వచ్చారు. 'మాకు సినిమా లంటే ఇష్టం లేదు' అని మా అమ్మగారు అన్నారు. సినిమా అన్నా సినిమావాళ్లన్నా తక్కువ భావన ఉండేదట. మా అమ్మ వద్దని చెప్పి, పంపించేశారు. పాపం మూడుసార్లు వచ్చారు. 'మీ అమ్మాయి అయితే బాగుంటుంది. నా బిడ్డలాగా చూసుకుంటాను. నా భార్యా పిల్లలు షూటింగ్‌కి వస్తారు. వాళ్ల పక్కనే కూర్చుంటుంది' అని అమ్మని కన్విన్స్ చేశారు.

జయంతి నటించిన కొన్ని తెలుగు సినిమాలు

1. జగదేకవీరుని కథ
2. డాక్టర్ చక్రవర్తి
3. భక్త ప్రహ్లాద
4. బందిపోటు దొంగలు
5. శారద
6. తల్లి బాధ్యత
7. కొండవీటి సింహం
8. జస్టిస్ చౌదరి
9. కలియుగ పాండవులు
10. దొంగ మొగుడు
11. రాజా విక్రమార్క
12. స్వాతికిరణం
13.పెదరాయుడు
14. వంశానికొక్కడు
15. రాముడొచ్చాడు



■ **ఓకే.. షూటింగ్ ఎక్స్‌పీరియన్స్ చెబుతారా?**

అంతా చిత్రాతిచిత్రంగా అనిపించింది. మేకప్ పూస్తున్నారు.. పూస్తున్నారు.. పూస్తూనే ఉన్నారు. ఏంటి ఇదంతా పూస్తేనే బావుంటారా? అనుకున్నాను. ఆ తర్వాత ఒకతను తల దువ్వాడు. ఇంకొకతను బట్టలు తీసుకొచ్చారు. కొంపతీసి ఈ అబ్బాయి బట్టలు కడతాడా? అనుకున్నాను. బట్టలు కట్టరమ్మా ఇచ్చి వెళ్తారమ్మా అని చెప్పాడు. రెడీ అయ్యాక నన్ను కెమెరా ముందు నిలబెట్టారు. చుట్టూ జనం. నాకేం చేయాలో తెలియలేదు. దర్శకుడు వచ్చి, 'చుట్టూ జనం ఉన్నారని మర్చిపో. నేను చెప్పింది చేస్తే చాలు' అన్నారు. అలానే చేశా. అందరూ చప్పట్లు కొట్టేశారు. ఆ సినిమా పేరు 'జేను గూడు' ('తేనె తుట్టె' అని అర్థం).

■ **ఆ తర్వాత మీ లైఫ్ తేనెలాగానే సాగిందా?**

హహ్హహ్హా... ఇంత తియ్యగా ఎవరూ ఈ మాట ఇప్పటివరకూ అనలేదు. (నవ్వుతూ). నిజంగానే దాదాపు తియ్యగానే సాగింది. 'జేను గూడు' డైరెక్టర్ వై.ఆర్. స్వామిగారు నాకు 'గిని మరీ' అని పేరు పెట్టారు. అంటే.. చిలక పిల్ల అని అర్థం. ఆ పిక్చర్ పెద్ద హిట్ అయింది. పేరు చిన్నదిగా ఉంటే బాగుంటుందని స్వామిగారు అంటే లక్ష్మి, సరస్వతి, పార్వతి ముగ్గురి పేర్లు కలిసొచ్చేట్లు 'జయంతి' అని పేరు పెట్టారు.

■ **మిమ్మల్ని ఎస్వీ రంగారావుగారు 'చిన్న రంగారావు' అని పిలిచేవారట?**

రామారావుగారు, యస్వీ రంగారావుగారు, భానుమతిగారు.. వీళ్లతో ఒక్క సీన్‌లో అయినా యాక్ట్ చేయాలని ఉండేది. ఆ అదృష్టం నాకు దక్కింది. రామారావుగారితో చేశాను. రంగారావుగారి గురించి చెప్పాలంటే.. ఆయన ఎందుకో నాకు చిన్నపిల్లాడిలా అనిపించేవారు. అందుకే రంగా రంగా అని పిలిస్తే నవ్వుకునేవారు. 'ఏంటీ ఈ అమ్మాయి అలా యాక్ట్ చేస్తోంది' అని డైరెక్టర్ అంటే 'ఆ అమ్మాయి చేసింది కరెక్టే. బాగా యాక్ట్ చేస్తోంది' అని రంగారావుగారు అనేవారు. ఆయన నన్ను 'చిన్న రంగారావు' అని పిలిచేవారు. భానుమతిగారితో నాకో మరచిపోలేని ఇన్సిడెంట్ ఉంది. ఆవిడ ఏం ఆర్టిస్ట్ అండీ. ఆవిడ పాద ధూళికి కూడా సరిపోను. ఒక సినిమాలో మా ఇద్దరి కాంబినేషన్‌లో ఒక సాంగ్ పెట్టారు. నేను స్పెషల్ డ్రెస్ తెప్పించుకొని రెడీ అయ్యాను. భానుమతిగారు ఆవిడ స్టైల్‌లో రెడీ అయి వచ్చారు. నా పక్కన కూర్చుని నన్ను కిందకీ పైకీ చూస్తుండిపోయారు. నా పోర్షన్ రేపు షూట్ చేద్దాం అని వెళ్లిపోయారు. నేనెలా అయితే రెడీ అయ్యానో మరుసటి రోజు అదేలా రెడీ అయ్యి వచ్చారు. మా టైలర్ దగ్గర కనుక్కుని, ఆ హెయిర్ స్టైల్ నుంచి అన్నీ సేమ్ టు సేమ్ నాలానే రెడీ అయ్యారు. అంతే.. నేను ఖుష్ అయిపోయాను.

■ **ఒకసారి సావిత్రిగారు షూటింగ్ లొకేషన్‌లో మీపై ఆగ్రహం వ్యక్తపరిచారట. నిజమా?**

కొత్త భాషలు నేర్చుకోవాలనే పట్టుదల కలగడానికి సావిత్రిగారే కారణం. ఆ సినిమా పేరు గుర్తు లేదు. సావిత్రిగారి కాంబినేషన్‌లో ఓ సీన్ తీస్తున్నప్పుడు నేను డైలాగ్ చెప్పడానికి తడబడ్డాను. ఆవిడకు కోపం వచ్చి, భాష రానివాళ్లను తీసుకొచ్చి విసిగిస్తారా? ముందు సరిగ్గా నేర్పించండి అన్నారు. నిజానికి నాకు తమిళ్ రాదని, ఆ సినిమా చేయనంటే మేనేజ్ చేసుకుంటామని ప్రొడ్యూసర్ ఒప్పించారు. అందరి ముందు సావిత్రిగారు అనేసరికి దుఃఖం వచ్చేసింది. కో–డైరెక్టర్ సముదాయించడానికి ట్రై చేసినా ఇలా ఇన్‌సల్ట్ చేస్తే నా వల్ల కాదు, నా కోసం ఖర్చు పెట్టినదంతా తిరిగి ఇచ్చేస్తానని ఇంటికి వచ్చేశాను. సావిత్రిగారంటే నాకు ఇష్టం. ఆవిడతో నటించే చాన్స్ మిస్ అయిందని ఓ వైపు బాధ. మా అమ్మ విషయం తెలుసుకుని మంచి తమిళ ట్యూషన్ మాస్టారుని పెట్టించారు. నేనే వేరేవాళ్లకు డబ్బింగ్ చెప్పేంతగా నాకు తమిళ్ నేర్పించారు. ఆ తర్వాత ఓ కన్నడ పిక్చర్‌లో సావిత్రిగారు నాకు అత్తగారిగా చేశారు. షూటింగ్‌లో నేను ఆవిడ కాళ్లు పట్టుకున్నాను. 'జయంతీ.. ఏంటమ్మా ఇది. కన్నడంలో నంబర్ వన్ హీరోయిన్‌వి. నా కాళ్ల మీద పడుతున్నావు?' అనగానే 'నేను ఇవాళ ఇలా ఉన్నానంటే కారణం మీరు. భాష నేర్చుకునేలా చేశారు' అన్నాను.

■ **కెరీర్ స్టార్ట్ చేసిన తొలి రోజుల్లో మీ నడక మగరాయుడిలా ఉండేదట.. ఎలా మార్చుకున్నారు?**

దానికి కారణం రామారావుగారు. డ్యాన్స్ నేర్చుకోవడానికి మద్రాస్ వెళ్లినప్పుడు రామారావుగారిని చూడ్డానికి ఆయన ఇంటికి వెళ్లాం. అప్పుడాయన 'నాతో యాక్ట్ చేస్తావా?' అని నన్ను ఒళ్లో కూర్చోబెట్టుకుని అడిగితే, మా అమ్మను చూశాను. 'ఏం తాగుతారు? మజ్జిగా? మంచినీళ్లా? వీరు మా హీరోయిన్' అన్నారు రామారావుగారు. నిజంగానే ఆయన సరసన ఆ తర్వాత 'జగదేకవీరుని కథ'లో నటించాను. ఆ షూటింగ్ అప్పుడు 'షాట్ రెడీ' అని నన్ను పిలిస్తే, విసా విసా నడుచుకుంటూ వెళ్లాను. అప్పుడు రామారావుగారు 'మీరు అబ్బాయా? అమ్మాయా?' అనడిగారు. నాకేం అర్థం కాలేదు. అమ్మాయి అయితే ఇలా అబ్బాయిలా నడుచుకుంటూ వస్తారా? అంటూ ఆయనే ఒక కాలు వంకరగా పెట్టి నిల్చోమన్నారు. ఎలా నడవాలో చూపించారు. అప్పటివరకూ నా నడక మగపిల్లల్లానే ఉండేది.

■ **అప్పటివరకూ ట్రెడిషనల్ క్యారెక్టర్స్‌లో కనిపించిన మీరు 'మిస్ లీలావతి'లో స్విమ్ సూట్ ధరించడం, కన్నడ స్క్రీన్‌కి మోడ్రన్ డ్రెస్సులు పరిచయం చేసిన తారగా పేరు తెచ్చుకోవడం, 'గ్లామర్ దివా' బిరుదు దక్కించుకోవడం గురించి?**

నాకు ఈ సినిమా రావడమే విచిత్రంగా జరిగింది. ఆ పాత్రకు షావుకారు జానకిగారిని, ఆమె స్నేహితురాలి పాత్రకు నన్ను సెలక్ట్ చేశారు. ఆ చిత్రదర్శకుడు యంఆర్. విఠల్ 'అమ్మా.. ఇందులో మీరు స్విమ్మింగ్ షాట్స్ చేయాలి. స్విమ్మింగ్ డ్రెస్ వేసుకోవాలి, సినిమాకు కీలక సన్నివేశాల్లో వస్తుంది' అని జానకిగారితో అన్నారు. 'ఆ సీన్స్ లేవంటే చేస్తాను' అన్నారు. దాంతో నాకు ఆ పాత్ర గురించి చెప్పారు. స్విమ్మింగ్ చేయాలంటే స్విమ్మింగ్ డ్రెస్ వేసుకోవాలి కదా. అందుకే నేను యస్ అన్నాను. అప్పటికి కన్నడ సినిమా లంగా, వోణీల వరకే ఆగింది. ఈ సినిమాతోనే స్కర్ట్స్, టీ షర్ట్స్, స్విమ్ సూట్ స్క్రీన్‌కి వచ్చాయి. తర్వాత ఇలాంటి కాస్ట్యూమ్స్ మామూలు అయిపోయింది.

■ **రాజ్‌కుమార్‌గారితో ఎక్కువ చిత్రాలు చేసిన రికార్డ్ మీదేనట?**

అవును. మేమిద్దరం చాలా సినిమాలు చేశాం. మాకు 'రాజా జోడీ' అనే పేరు కూడా ఉంది. మా కాంబినేషన్‌లో వచ్చిన సినిమాల్లో 'బహదూర్ గండు' ది బెస్ట్. మేం ఇద్దరం నువ్వా నేనా అన్నట్టు యాక్ట్ చేశాం. అందులో నేను రాజ్‌కుమార్‌ని, ఆయన కామన్ మ్యాన్. పిక్చర్ సూపర్ హిట్. ఇంగ్లీష్ మ్యాగజీన్స్ 'జయంతి స్టీల్స్ ది షో' అని రాశారు.

■ **ఫిల్మ్ ఇండస్ట్రీ మేల్ డామినేటెడ్ కాబట్టి ఆ కామెంట్‌కి రాజ్‌కుమార్‌గారికి కోపం వచ్చిందా?**

కోపమా? ఆయనతో నాకదే లాస్ట్ పిక్చర్ (నవ్వేస్తూ). ఆ తర్వాత మేమిద్దరం చేయలేదు.

■ **మరి వ్యక్తిగతంగా కూడా మీ రిలేషన్ చెడిపోయిందా?**

(జయంతి తనయుడు కృష్ణ అందుకుంటూ) సినిమాలు చేయకపోయినా ఆయన ఉన్నంత వరకూ ఇద్దరూ బెస్ట్ ఫ్రెండ్స్‌లా ఉన్నారు. 'రాజ్' అని పేరు పెట్టి కర్ణాటకలో రాజ్‌కుమార్‌గారిని పిలిచేంత చనువు అమ్మకే ఉంది. (జయంతి అందుకుంటూ) ఆ సంగతలా ఉంచితే.. రాజ్‌తో యాక్ట్ చేసిన ఓ సినిమాలో నా పాత్ర చనిపోతుంది. మంచం మీద అలా నిద్రపోయినట్టు ఉండమన్నారు. ఆయనకేమో భారీ డైలాగ్ ఇచ్చారు. ఆయనేమో ఒక పట్టాన సీన్‌ని వదలరు. ఆ ఎమోషన్‌లో నా కాళ్ల మీద దబ్బ్‌మని పడ్డారు. అంతే.. పోయాం అనుకున్నాను (నవ్వుతూ).

■ **ఫైనల్లీ.. మీరు మరెన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని 'సాక్షి' కోరుకుంటోంది.**

థ్యాంక్యూ. మీ ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించే అవకాశం దక్కినందుకు ఆనందంగా ఉంది.

– డి.జి. భవాని



జయంతికి ఒకే ఒక్క కుమారుడు. పేరు కృష్ణ. గతేడాది మార్చిలో జయంతి అస్వస్థతకు గురైనప్పుడు ఆమె తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయారంటూ వార్త ప్రచారమైంది. అప్పుడు 'సాక్షి' కృష్ణను సంప్రదించగా, 'అమ్మ బాగానే ఉన్నారు. ఆ వార్త నిజం కాదు' అన్నారు. ఇప్పుడు బర్త్‌డే సందర్భంగా జయంతిని ఇంటర్వ్యూ చేస్తున్న సమయంలో కృష్ణతో గతేడాది మార్చి గురించి మాట్లాడితే ఆవిడ ఆరోగ్యం గురించి చెప్పారు.

■ **'జయంతి ఇక లేరు' అనే వార్త ప్రచారమైనది తెలుసుకుని మీ అమ్మ ఎలా ఫీలయ్యారు?**

కృష్ణ: తన వరకూ ఆ వార్తను వెళ్లనివ్వలేదు. ఎందుకంటే హెల్త్ బాగా లేనప్పుడు అలాంటివి వింటే తనేదో క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నానని అమ్మ భయపడుతుందని చెప్పలేదు.

■ **అసలు అప్పుడు ఏం జరిగింది?**

అమ్మకు ఆస్థమా అటాక్ అయింది. దానివల్ల ఊపిరితిత్తుల్లో ప్రాబ్లమ్ వచ్చింది. హాస్పిటల్‌లో ఉంచి మంచి ట్రీట్‌మెంట్ ఇప్పించాం. ఆమె కోలుకునే నెలవరకూ కూడా జరిగిన రాంగ్ పబ్లిసిటీ గురించి అమ్మకు తెలియదు. ఆరోగ్యంగా ఇంటికి వచ్చాక అమ్మతో 'అమ్మా.. మన దేశం మొత్తం నువ్వు అభిమానులను సంపాదించుకున్నావు. నీ గురించి ఎంతమంది ఫోన్లు చేశారో' అన్నాను. అమ్మ ఆనందపడింది. నిజంగా అమ్మ అచీవ్‌మెంట్ అదే అనుకుంటాను. మార్చి నెల మొత్తం రాత్రీ పగలూ తేడా లేకుండా నా దగ్గరున్న మూడు ఫోన్లు రింగ్ అవుతానే ఉన్నాయి.

■ **మీ అమ్మగారు ఇంతమంది అభిమానాన్ని సొంతం చేసుకున్నారని అప్పుడే తెలిసిందా?**

అభిమానులు ఉన్న విషయం తెలియక కాదు. అయితే ఇంతమంది అభిమానం చూపిస్తారని ఊహించలేదు. ఒక సినిమా స్టార్‌కి ఉన్న గొప్ప అదృష్టం అది.

■ **మీరెందుకు సినిమాల్లోకి రాలేదు?**

నాకు ఇంట్రెస్ట్ లేదు.

■ **ఇప్పుడు సినిమాల్లో నటించడానికి అమ్మ ఆరోగ్యం సహకరిస్తుందా?**

ఓ..

(జయంతి) నూటికి నూట పది శాతం సపోర్ట్ చేస్తుంది. *(నవ్వుతూ)*

తప్పు కదా!

తారలపై విసుర్లు

సోషల్ మీడియాలో బాలీవుడ్ తారలపై బాడీ షేమింగ్ ఏమాత్రం తగ్గుముఖం పట్టడం లేదు. ఇన్‌స్టాగ్రామ్‌లో వాళ్లేదో ఫొటో పోస్ట్ చేస్తారు. వీళ్లు దానిపై కామెంట్ చేస్తారు. దీపికా పదుకోన్ నలుపు రంగు సింగిల్ పీస్ డ్రెస్ ధరించి పోస్ట్ చేసిన ఫొటోలో చాలా బక్కగా ఉన్నారు. 'ఎముకలున్నాయి, మరి స్కిన్ ఎక్కడ? అని ఓ నెటిజెన్ కామెంట్ చేశారు. ప్రియాంక చోప్రా తన పెదవుల్ని ముందుకు తెచ్చి తీసుకున్న సెల్ఫీపై కూడా ట్రోలింగ్ జరిగింది. ఇంత బండ పెదవులేమిటని! దిషా పటానీ అయితే 'బక్క'తనానికి పీక్ గ్రేడ్ అయిన 'పీల' స్థాయికి బాడీషేమింగ్‌కి గురయ్యారు. పరిణీతి చోప్రా బొద్దుగా ఉంటారు. తిండి తగ్గించమని ఆమెకు కొన్ని వేల ఉచిత సలహాలు లభించాయి. తనిష్ఠ చటర్జీ ఒంటి రంగు మీద ఓ కామెడీ షోలో షేమింగ్ జరిగింది. నవ్వుతూ నవ్వుతూనే తనది 'రోస్టెడ్ స్కిన్' అన్నందుకు తనిష్ఠ చాలా బాధపడ్డారు. అనేరి వజానీ టీవీ నటి. ఆమె తన బక్కపలుచని ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టీపెట్టగానే బాడీ షేమింగ్ మొదలైంది. 'చీపురు పుల్ల' అంటూ. ఇలియానాను కూడా ఒకప్పుడు బాడీ షేమింగ్ చేశారట. నడుము కింది భాగం ఎక్కువగా ఉంటుందని. ఇవన్నీ ఇలా ఉంచితే సాటి నటే తన సహనటిని షేమ్ చేసిన ఉదంతం కూడా ఉంది. 'ఆ మనిషికి హెడ్‌లైట్ ఎక్కడుంటుందో, బంపర్ ఎక్కడ ఉంటుందో చెప్పడం కష్టం. కాలేజీ పిల్లలు నయం. తీరుగా కనిపిస్తారు' అని భైరవి గోస్వామి.. కీర్తి సనన్‌పై ట్విట్టర్‌లో పోస్ట్ పెట్టారు. తప్పు కదా. ఎప్పటికి ఎదుగుతాం?!



● దీపికా పదుకోన్



● ప్రియాంక చోప్రా



● తనిష్ఠ చటర్జీ

పాశుర ప్రభాతం 22వ రోజు

భగవంతుని చల్లని చూపు ఒక్కసారి క్రీగంటనైనా మనవైపు ప్రసరించితే చాలు జన్మ చరితార్థమవుతుంది. అదే ఆ దేవుని కరుణ ప్రపంచానికి నిమిషంపాటు ఆలస్యమైనా లోకం నిస్సారమైపోతుంది. చీకటి వెలుగుల జీవితంలో ఆనందం తాలూకు ఆశీస్సులనిచ్చేవాడే విష్ణుమూర్తి.

"అఙ్గణ్ మాయాలత్తరశర్, అభిమాన
బఙ్గమాయ్‌వన్దనిన్ పళ్ళిక్కట్టిల్ కొళే
శఙ్గమిరుపాప్ పోల్ వన్దు తలైప్పెయ్‌దోమ్
కిఙ్గిణివాయ్ చ్చెయ్‌దతామరై పూప్పోలే
శెఙ్గణ్ శిరిచ్చిరిదే యెమ్మేల్ విళియావో;
తిఙ్గళు మాదిత్తియను మెళున్దార్పోల్
అఙ్గణిరణ్డుఙ్గొణ్డు ఎఙ్గళ్‌మేల్ నోక్కుదియల్
ఎఙ్గళ్‌మేల్ శాబ మిళన్దేలో రెమ్బావాయ్"

భావం: నదీనదాలన్నీ తమ అస్థిత్వాన్ని మరచి సముద్రాన్ని చేరినట్లు, మహామహులు అయిన రాజులు అహంకారాన్ని వదిలి చక్రవర్తిని చేరినట్లు మేమంతా మిమ్మల్ని మేమే మరచి నీ తాదాత్మ్యంలో మునిగిపోయాము. నిన్నే చేరి ఆనందిస్తున్నాము కృష్ణా! అందమైన నీ ముఖారవిందంలో అరవిరిసిన తామర రేకుల వంటి నీ కనురెప్పలను తెరచి నీ కృపాదృష్టిని మాపై ప్రసరించు. కృష్ణా! నీ కనుదోయి సూర్య చంద్రులు ఒకేసారి ఉదయించినట్లు అనంత వెలుగులను పంచుతుంది. కృష్ణుని దృష్టి ఒకసారి మనపై కరుణిస్తే అనుభవించినా తీరని, తీరలేని దుఃఖాలూ, కష్టాలూ మనల్ని వీడిపోయి మరుగునపడతాయి.



సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ ఆదివారం
6-1-2019

ఈ పాటకు ట్యూన్ తెలుసా?



హే నా నాటుకోడివే నా క్యూటు జోడివే
నీ బుజ్జి పప్పినే టేక్ మీ టేక్ మీ
హే నీ చిలక ముక్కే నా గుండెకు హుక్కే
నువ్వు కేకో కేకే టాక్ మీ టాక్ మీ
హే మన్మథరాజా నా మడత కాజా
ముద్దులిస్తాను ఆజా మస్తు మసాల మజా
హే మాసు మారాణీ నా ఆకాశవాణి
నా హార్టుకి బోణి నీ ఆటోతే పోని

రా మనం లాంగూ డ్రైవే పోదాం
ఊర మాసు స్టెప్పు వేద్దాం
నువ్వేలే నా రౌడీ బేబీ
రా యుఆర్ మై ఓన్లీ గాళ్ ఫ్రెండు
నా గుండే నీకు దిండు
వీల్ మేక్ అస్ న్యూ ట్రెండూ బేబీ
పోదాం.. వేదాం.. రౌడీ బేబీ
గాళ్ ఫ్రెండు.. నీ దిండూ.. ట్రెండూ బేబీ

రౌడీ బేబీ.... రౌడీ బేబీ

నిన్నేలే నే కోరింది
నా రూటంతా నీ వల్లే మారింది
హే ఈడొచ్చి మంచి మూడొచ్చి
ఈ మారికే ఎక్కిందే నీ పిచ్చి
ఒకటై కలసీ ఉందామా
ఒడిలోకొస్తే హంగామా
రావే నాటీ రాణీ నా నింబూ పానీ
చీకట్లో పనీ అరె చేద్దామే చిన్ని
నా సోకుల ఖైదీ నువు చెప్పాక తేదీ
సొగసంతా నీది అంటు లేదంట ఏదీ

రౌడీ బేబీ రౌడీ బేబీ ॥3॥

॥నా నాటు॥

చిత్రం : మారీ 2
సంగీతం : యువన్ శంకర్ రాజా
గానం : ధనుష్, మానసి
రచన : సామ్రాట్

కట్‌చేయ్...దాచేయ్...

కాసుకో సుడోకు

2		4		1				
		1		7	6			4
7	6	8		3	4			
4	2			8		9		
5			3		9			8
		9		4			1	3
			1	2		6	7	9
3			6	5		8		
				9		2		5

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

5	7	1	4	9	2	3	6	8
2	8	3	1	6	5	9	7	4
9	4	6	8	7	3	1	5	2
4	2	7	9	5	1	6	8	3
3	6	9	7	4	8	5	2	1
8	1	5	2	3	6	7	4	9
7	9	2	5	1	4	8	3	6
6	5	4	3	8	9	2	1	7
1	3	8	6	2	7	4	9	5

రెండు నెలలు మాత్రమే!



చిరంజీవి

జార్జియాలో క్లైమాక్స్ కంప్లీట్ చేశారు. కీలక సన్నివేశాల కోసం మైసూర్, చెన్నై కూడా వెళ్లొచ్చారు. ఎలాగూ హైదరాబాద్‌లో మేజర్ షూటింగ్ జరుగుతోంది. ఇదంతా... 'సైరా: నరసింహారెడ్డి' చిత్రం గురించే. ఇంకెంతకాలం 'సైరా' జర్నీ కొనసాగుతుంది అంటే ఇంకా రెండు నెలలు. అంటే మార్చి ఎండింగ్‌లో ఈ చిత్రం షూటింగ్ కంప్లీట్ అయ్యే అవకాశం ఉందని ఊహించవచ్చు. ఈ విషయాన్ని ఈ చిత్రనిర్మాత, హీరో రామ్‌చరణ్ ఓ సందర్భంలో వెల్లడించారు. స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'సైరా: నరసింహారెడ్డి'. చిరంజీవి టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. సురేందర్‌రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా కొత్త షెడ్యూల్ సంక్రాంతి పండగ తర్వాత హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో ప్రారంభం అవుతుందని సమాచారం. సినిమాలోని ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాల చిత్రీకరణను ప్లాన్ చేశారు 'సైరా' టీమ్. నయనతార కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాకు అమిత్ త్రివేది సంగీతం అందిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, విజయ్‌సేతుపతి, సుదీప్, తమన్నా కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమా ఈ ఏడాది సెకండాఫ్‌లో ప్రేక్షకుల ముందుకు వస్తుందని టాక్.

జెట్ స్పీడ్!



రజనీకాంత్

సినిమా సినిమాకు మధ్యలో గ్యాప్ ఇవ్వడం లేదు. నాలుగైదు నెలల గ్యాప్‌లోనే స్క్రీన్‌పై కనిపిస్తున్నారు రజనీకాంత్. 'కాలా, 2.0, పేట్టా' మూడు చిత్రాలు ఏడు నెలల గ్యాప్‌లో రిలీజ్ అయ్యాయి. ఈ స్పీడ్ చూసి ఆశ్చర్యపడకమానలేం. సంక్రాంతికి కొత్త సినిమా 'పేట్టా' (తెలుగులో 'పేట')తో బరిలోకి దిగుతున్నారు. ఫిబ్రవరి నెలలో మురుగదాస్‌తో చేయనున్న ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించనున్నట్లు కోలీవుడ్ సమాచారం. ఇది పూర్తిస్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా, రజనీను ఆయన ఫ్యాన్స్ ఎలా చూడాలనుకుంటున్నారో అలా ఉండబోతోందని ఆ మధ్య ఓ ఫంక్షన్‌లో పేర్కొన్నారు మురగదాస్. ఆల్రెడీ మురుగదాస్‌తో 'సర్కార్', రజనీతో 'పేట్టా' సినిమాలను నిర్మించిన సన్ నెట్‌వర్క్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. రజనీకాంత్ రాజకీయాల్లో పూర్తి స్థాయిలో ప్రవేశించాక సినిమాలకు ఫుల్‌స్టాప్ పెట్టొచ్చనే టాక్ కూడా తమిళనాడులో ఉంది. అందుకోసమే ఇలా గ్యాప్ లేకుండా జెట్ స్పీడ్‌తో వీలైనన్ని ఎక్కువ సినిమాలు చేయాలని భావిస్తున్నారా?

ఫిబ్రవరిలో మొదలు



అల్లు అర్జున్

న్యూ ఇయర్‌కు ఒక్కరోజు ముందు తన కొత్త సినిమాను అనౌన్స్ చేశారు అల్లు అర్జున్. ఈ సినిమాకు త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తారు. అల్లు అరవింద్, ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా పలువురు అగ్ర కథానాయికల పేర్లను పరిశీలిస్తున్నారట టీమ్. ఆ లిస్ట్‌లో ప్రముఖంగా హీరోయిన్ కియారా అద్వానీ పేరు వినిపిస్తోంది. ఇక షూటింగ్‌ను వచ్చే నెల రెండో వారంలో స్టార్ట్ చేయడానికి టీమ్ సన్నాహాలు చేస్తున్నారని ఫిల్మ్‌నగర్ తాజా సమాచారం. 'జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత అల్లు అర్జున్–త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందనున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉంటాయని చెప్పొచ్చు.

న్యూ ఇయర్.... న్యూ లెర్నింగ్స్



అర్జున్ కపూర్

... అంటున్నారు బాలీవుడ్ హీరో అర్జున్ కపూర్. అశుతోష్ గోవారీకర్ దర్శకత్వంలో ఆయన హీరోగా రూపొందుతున్న పీరియాడికల్ చిత్రం 'పానిపట్'. సంజయ్ దత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. కృతీసనన్ కథానాయిక. ఈ సినిమా షూటింగ్ కోసం ముంబైలోని ఓ ప్రముఖ స్టూడియోలో భారీ సెట్ వేశారు టీమ్. ఒకవైపు షూటింగ్‌లో పాల్గొంటూ ఈ సినిమా కోసం గుర్రపు స్వారీ కూడా నేర్చుకుంటున్నారు అర్జున్. ''గతేడాది డిసెంబర్ చాలా సంతోషంగా గడిచింది. 'పానిపట్' సినిమా షూటింగ్‌లో మళ్లీ పాల్గొంటున్నాను. ఇప్పుడీ సినిమా కోసం గుర్రపుస్వారీని మరింత బాగా నేర్చుకుంటున్నాను'' అని పేర్కొన్నారు అర్జున్ కపూర్. ఈ సినిమాను ఈ ఏడాదే విడుదల చేయాలనుకుంటున్నారు. ఇక అర్జున్ కపూర్ వ్యక్తిగత విషయానికొస్తే.. బాలీవుడ్ నటి మలైకా అరోరా ఖాన్‌తో ఆయన ప్రేమలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.

మీటూ భయాన్ని సృష్టించింది



లాల్ జోస్

సినిమా ఇండస్ట్రీలో 'మీటూ' ఉద్యమం ప్రకంపనలు సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఉద్యమంపై కొందరు నటీనటులు తమ అభిప్రాయాలను వివిధ సందర్భాల్లో పంచుకున్నారు. తాజాగా మీటూ ఉద్యమం గురించి మలయాళగ దర్శకుడు లాల్ జోస్ మాట్లాడుతూ– ''సినిమా షూటింగ్ సమయంలో నా తోటి వారితో కొన్నిసార్లు కోపంగా, మరికొన్నిసార్లు స్నేహపూర్వకంగా ఉంటాను. పురుషులు, మహిళలనే బేధం లేకుండా అందరితో ఒకేలా మాట్లాడతాను. అయితే నేను ఆగ్రహం వ్యక్తపరిచినప్పుడు ఎవరు ఎలా తీసుకుంటారో నేను ఊహించలేను. అందుకే 'మీటూ' వచ్చాక నా టీమ్‌లోకి మహిళలను తీసుకోవడానికి భయంగా ఉంది. దాదాపు 20 ఏళ్ల క్రితం సెట్‌లో నా ప్రవర్తన బాగోలేదని ఓ పాపులర్ లేడీ ఫొటోగ్రాఫర్ నాపై ఆరోపించారు. అయితే అది నిజం కాదు. ఇప్పుడు మీటూ ఉద్యమం ఒక భయాన్ని క్రియేట్ చేసిందని నా అభిప్రాయం. కానీ ఈ భయం మంచికా? లేక చెడుకా? అనేది చెప్పలేం'' అని ఆయన ఓ ఇంటర్వ్యూలో భాగంగా పేర్కొన్నారు.

అలా జరిగింది



ఐశ్వర్యా రాయ్

న్యూ యార్క్... ఓ స్టార్ హోటల్ బాల్కనీలో నిలబడి ఆలోచిస్తున్నాడు అభిషేక్ బచ్చన్. 'ఏదో రోజు తనతో (ఐశ్వర్య) కలిసి జీవిస్తే ఎంత బావుండు?' అన్నది ఆ ఆలోచనల సారాంశం. కొన్నేళ్ల తర్వాత.. ఐశ్వర్యారాయ్, అభిషేక్ నటించిన 'గురు' ప్రీమియర్ సమయం. అదే న్యూ యార్క్. అదే హోటల్. సినిమా ప్రీమియర్ పూర్తయింది. హోటల్ బాల్కనీలో తన అభిప్రాయాన్ని ఐష్‌తో చెప్పాడు అభిషేక్.



అభిషేక్, ఐశ్వర్య

అప్పటికి ఐష్‌కి ఇవ్వడానికి అతని వద్ద డైమండ్ రింగ్ లేదు. సినిమా షూటింగ్స్ కోసం వాడే డమ్మీ డైమండ్ రింగ్‌తో మోకాళ్ల మీద నిలబడి ప్రపోజ్ చేశాడు. ఆయన సంకల్పం బలమైంది. అందుకే ప్రపోజల్‌లోని ప్రాపర్టీస్‌ని పట్టించుకోలేదు.. కేవలం ప్రేమను మాత్రమే చూశారు ఐష్. ఈ లవ్‌స్టోరీను కొన్ని సందర్భాల్లో పంచుకున్నారు అభిషేక్. ఆ తర్వాత పెళ్లి ఎలా జరిగిందో పూర్తిగా మాట్లాడలేదు.

తాజాగా ఐశ్వర్యా రాయ్ తమ నిశ్చితార్థం ఎలా జరిగిందో వివరిస్తూ – ''అభిషేక్ నాకు ప్రపోజ్ చేసిన కొన్ని రోజుల తర్వాత ఓ రోజు సడన్‌గా ఫోన్ చేశాడు. 'మేం మరికొంతసేపట్లో మీ ఇంటికి బయలుదేరుతున్నాం, నిశ్చితార్థం చేసుకోవడానికి' అన్నది సారాంశం. నాకేం అర్థం కాలేదు. మా నాన్నగారు కూడా ఇంట్లో లేరు. ఏం చేయాలో తోచలేదు. మా ఇంటికి అభిషేక్ ఫ్యామిలీ సడన్‌గా వచ్చేశారు. 'పదండి ఇంటికి వెళ్దాం' అని అమితాబ్‌జీ అన్నారు. ఇప్పుడు ఆలోచిస్తే అనిపిస్తుంది... అద్భుతమైన క్షణాలు అనుకోకుండానే కదా జరిగేది అని.

నా నిశ్చితార్థం కూడా అలానే జరిగింది. మేం సౌతిండియన్స్ కాబట్టి నిశ్చితార్థ వేడుకను నార్త్‌లో 'రోకా' అంటారని కూడా తెలియదు. జనవరి 14న మా నిశ్చితార్థం జరిగింది. అది బయటకు చెప్పలేదు కూడా. అప్పుడు హృతిక్‌తో 'జోధా అక్బర్' సినిమా చేస్తున్నా. నిశ్చితార్థం జరిగిన తర్వాత సినిమాలో పెళ్లి కూతురిగా ముస్తాబయ్యే సన్నివేశం తీయాలి. ఆఫ్ స్క్రీన్, ఆన్ స్క్రీన్ ఒకేలాంటి ఫేజ్‌లో ఉండటం భలే విచిత్రంగా అనిపించింది. ఆ తర్వాత కొన్ని రోజులకు మా ఎంగేజ్‌మెంట్ గురించి అఫీషియల్‌గా అనౌన్స్ చేశాం. ఆ ఏడాది (2007) ఏప్రిల్‌లోనే పెళ్లి చేసుకున్నాం. తర్వాత మీకు తెలిసిందే. ఇప్పటికి మా పెళ్లి అయ్యి పదకొండేళ్లు అవుతోంది. హ్యాపీగా ఉన్నాం'' అంటూ స్వీట్ మెమొరీస్‌ని స్వీట్‌గా రివైండ్ చేసుకున్నారు ఐశ్వర్యా రాయ్.

లవ్.. యాక్షన్

''ధీవర' సినిమా కాన్సెప్ట్ బాగుంది. యూత్ రిలేట్ అయ్యే విధంగా ఈ కథ ఉంది. పోస్టర్ నాకు బాగా నచ్చింది. సినిమా మంచి హిట్ అవ్వాలి. మొత్తం యూనిట్‌కి ఆల్ ద బెస్ట్'' అని దర్శకుడు బాబీ అన్నారు. నాగసాయి, విదా చైతన్య హీరోహీరోయిన్లుగా, విజయ్ జిక్కి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ధీవర'. భగీరథ ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై హరనాథ్ బాబు నిర్మించిన ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దర్శకుడు బాబీ విడుదల చేశారు. విజయ్ జిక్కి మాట్లాడుతూ– ''టైటిల్‌కు తగ్గట్టుగానే డైనమిక్ స్క్రిప్ట్‌తో తెరకెక్కిన చిత్రమిది. ఇందులో స్క్రీన్‌ప్లే హైలైట్‌గా ఉంటుంది. లవ్ అండ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా సాగే ఈ సినిమా ఒకేసారి రెండు జానర్స్‌లో సాగుతుంది'' అన్నారు. ''అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా యూత్‌ఫుల్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా రూపొందిన చిత్రమిది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుపుకుంటోంది. త్వరలోనే ఆడియోతో పాటు ట్రైలర్‌ను విడుదల చేస్తాం. ఫిబ్రవరి నెలాఖరులో సినిమాను విడుదల చేస్తాం'' అని నిర్మాత హరనాథ్ బాబు అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: అద్దంకి వెంకటేష్, కెమెరా: సాగర్ గొళ్లా.



విజయ్ జిక్కి, బాబీ, హరనాథ్ బాబు

కేతిరెడ్డి నా బాగు కోరే ఆత్మీయుడు

– తేజ

''కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి నాకు చిన్నప్పటి నుంచి స్నేహితుడు. నేను చిత్రం మూవీస్ సంస్థను స్థాపించడానికి కారణమైనవాళ్లలో ఆయన ఒకరు. 'జయం, నిజం' లాంటి హిట్స్ తీసేందుకు తన వంతు కృషి చేశారు. ఒక రకంగా చెప్పాలంటే నా బాగు కోరే ఆత్మీయుడు. తమిళనాడులో తెలుగు వారి సమస్యలపై ఆయన చేసిన ఉద్యమాలు అభినందనీయం. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు ఆయన ఎంతో కృషి చేస్తున్నారు'' అని డైరెక్టర్ తేజ అన్నారు. తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షుడు, 'లక్ష్మీస్ వీరగ్రంథం' సినీ నిర్మాత, దర్శకుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి జన్మదిన వేడుకలు శనివారం తేజ ఆధ్వర్యంలో జరిగాయి. కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి మాట్లాడుతూ– ''తేజ ఆధ్వర్యంలో జరిగిన ఈ పుట్టినరోజు వేడుకలను ఒక ఆత్మీయ వేడుకగా భావిస్తాను. తేజ తెరకెక్కిస్తోన్న 'సీత' చిత్రకథ నాకు తెలుసు. ఈ సినిమా కచ్చితంగా తేజ జీవితంలో ఒక మైలురాయిగా నిలుస్తుంది. త్వరలో 'చిత్రం మూవీస్ సంస్థ' ద్వారా తేజ కుమారుణ్ణి హీరోగా పరిచయం చేస్తూ, ఓ మల్టీ లాంగ్వేజ్ సినిమా నిర్మించనున్నాం. నేను తెరకెక్కిస్తోన్న 'లక్ష్మీస్ వీరగ్రంథం' టీజర్‌ని ఈ నెల 9న విడుదల చేయనున్నాం'' అన్నారు. ఈ కార్యక్రమంలో నటులు దువ్వాసి మోహన్, మహేశ్, మీసం సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కేతిరెడ్డి, తేజ


కృష్ణమాచారిగా...




జీవా

భారతదేశానికి క్రికెట్‌లో తొలి ప్రపంచ కప్ సాధించి పెట్టిన ఘనత కపిల్‌దేవ్, అండ్ టీమ్‌కి దక్కుతుంది. 1983లో జరిగిన క్రికెట్ ప్రపంచ కప్ పోటీల్లో ఇండియాని విశ్వవిజేతగా నిలిపి భారతీయులంతా గర్వపడేలా చేశారు. ఆ మధుర క్షణాల్ని, అప్పటి ఇండియా టీమ్ కెప్టెన్ కపిల్‌దేవ్ బయోపిక్‌ని బాలీవుడ్‌లో తెరపైకి తీసుకొస్తున్న సంగతి తెలిసిందే. 'ఏక్ థా టైగర్' ఫేమ్ కబీర్ ఖాన్ దర్శకత్వంలో '1983' పేరుతో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో కపిల్ పాత్రలో రణ్‌వీర్ సింగ్ నటిస్తున్నారు. 1983 ప్రపంచ కప్‌లో పాల్గొన్న ఇతర ఆటగాళ్లలో కృష్ణమాచారి శ్రీకాంత్ కూడా ఒకరు. తమిళనాడుకు చెందిన శ్రీకాంత్ ఓపెనర్‌గా బరిలోకి దిగి చక్కని ఆటతీరును ప్రదర్శించేవారు. '1983' చిత్రంలో ఆయన పాత్రలో టాలీవుడ్ హీరోలు అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ నటించనున్నారంటూ గతంలో వార్తలు చక్కర్లు కొట్టాయి. తాజాగా శ్రీకాంత్ పాత్రలో హీరో జీవా నటించనున్నారట. తమిళనాడుకు చెందిన శ్రీకాంత్ పాత్రలో తమిళ హీరో అయితేనే బాగుంటుందని భావించిన చిత్రవర్గాలు జీవాని సంప్రదించడంతో ఆయన గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారట. అంతేకాదు.. ఈ పాత్ర కోసం కృష్ణమాచారి శ్రీకాంత్ వద్ద ఆయన క్రికెట్‌లో శిక్షణ తీసుకుంటుండటం విశేషం.


ముగ్గు-ముచ్చట



సి. రజని
కడప,
వైయస్ఆర్ జిల్లా
డిజైన్ ముగ్గు



ఎ. సత్య
పెద్దపురం,
తూ.గో జిల్లా
27 చుక్కలు 11 వరసలు
ఇటు అటు వదిలి
4 వరకు సరి చుక్కలు
11 చుక్కలు, 4 వరసలు



సుగుణ
అనంతపురం జిల్లా
20 చుక్కలు
2 వరుసలు
2 వచ్చేవరకు

ముగ్గులకు ఆహ్వానం ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. muggulu.sakshi@gmail.com

సాక్షి ఫ్యామిలీ సన్నిధి
నల్లగొండ ॥ ఆదివారం
6-1-2019

సంప్రదాయ శాస్త్రం

శ్రీమంతంలో మట్టి గాజులు ఎందుకు తొడుగుతారు?



పెళ్లయిన ఆడపిల్ల...కడుపు పండి, పుట్టింటికి వచ్చిన వేళ.. ఐదో నెలలో గాని, ఏడో నెలలో గాని, సీమంతం చేస్తారు. కొన్ని ప్రాంతాలలో, కొన్ని కుటుంబాలలో తొమ్మిదో నెలలో కూడా చేస్తున్నారుకొంటి. అది వేరే సంగతి. ఈ సీమంతోత్సవంలో..పేరంటానికి వచ్చిన ప్రతి ముత్తయిదువు... ఆ సీమంతవధువు చేతులకు తలో జత మట్టిగాజులు తొడగడం ఆనాదినుండి వస్తున్న ఆచారం. ఇలా గాజులు తొడగడం ఎందుకు అంటే... ఐదో నెలలోనే గర్భస్థ పిండానికి ప్రాణం వస్తుంది. అప్పటినుండి ఆ స్త్రీ మరింత జాగ్రత్తగా ఉండాలి. గాజులేస్తే జాగ్రత్త వస్తుందా? వస్తుంది. శిశువు ఎంత సున్నితంగా వుంటుందో, తనను ఎంత జాగ్రత్తగా చూసుకోవాలో, గాజుల రూపంలో (గాజులు సున్నితమైనవే కదా) తెలియజేస్తారు. అంతేకాదు, సైన్స్ ప్రకారం మోచేతికి, మణికట్టుకు మధ్య ప్రాంతంలో వుండే నాడులు గర్భాశయ నాడులతో అనుసంధానమై ఉంటాయట. స్వల్ప వత్తిడి గాజుల ద్వారా కలుగజేయడం వలన గర్భాశయంలోని నాడులు కూడా అందుకు అనుగుణంగా ఉత్తేజితమై, గర్భంలోని కండరాలు సరిగా పనిచేయడానికి దోహదపడతాయట. అంతేకాదు, గాజులు ధరించిన చేతులు గర్భానికి దగ్గరగా ఉంటాయి కనుక గర్భంలో వుండే శిశువుకు గాజుల సవ్వడి స్పష్టంగా వినబడి, శిశువు వినికిడి శక్తి పెరిగేందుకు సహాయపడతాయి.

నా సోదర సోదరీమణులారా...

12న స్వామి వివేకానంద జయంతి

కేవలం ముప్పై తొమ్మిది సంవత్సరాలు మాత్రమే ఈ భూమిపై నడయాడినప్పటికీ, నేటికీ సజీవ చైతన్యమూర్తిగా, నిత్యస్మరణీయుడిగా, స్ఫూర్తిప్రదాతగా నిలిచి ఉన్న భారతీయ ఆధ్యాత్మిక యువకెరటం స్వామి వివేకానంద. ఈ పుణ్యపురుడు ఘనతను తాను గుర్తించడమేగాక భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను దశ దిశలా చాటిన స్వామి వివేకానంద చెప్పిన మాటలు గుండెలోతుల్లోకి చొచ్చుకొనిపోతాయి. లోకంలో కనిపించే చెడు, దురవస్థ అంతా అజ్ఞానప్రభావమే అని బలంగా విశ్వసించిన స్వామి వివేకానంద జయంతి సందర్భంగా...




హైందవ ధర్మ, ఆర్ష సంప్రదాయ బావుటాలను దేశ దేశాలలోనూ ఎగురవేసిన, భారతదేశంలోనూ, పాశ్చాత్య దేశాలలోనూ రామకృష్ణ మిషన్, రామకృష్ణ మఠాలను నెలకొల్పి ఎందరో విద్యావంతులైన శిష్యులను మానవసేవకు అంకితమయ్యేలా చేసిన ఆ ధన్యమూర్తి జన్మించిన జనవరి 12ను యువజన దినోత్సవంగా జరుపుకుంటున్న సందర్భంగా వివేకానందుడు చెప్పిన మంచి మాటలు కొన్ని...

- ప్రతి ఇంటిని మనం ధర్మసత్రంగా మార్చినా, దేశాన్నంతా చికిత్సాలయాలతో నింపినా, మానవుడి శీలం మార్పు చెందే వరకు అతడి దుఃఖం ఉంటూనే ఉంటుంది.
- భగవత్సాక్షాత్కారం పొందనంతవరకు నీ మతం నిష్ప్రయోజనమే. ఎవరు మతం పేర కేవలం గ్రంథ పఠనం మాత్రమే చేస్తూ ఉంటారో, వారు చక్కెర బస్తాలను మోసే గాడిద వంటివారు. ఆ గాడిదకు చక్కెర రుచి ఏమాత్రమూ తెలియదు.
- దానాన్ని మించిన గొప్పగుణం మరేదీ లేదు. ఇతరులకు ఇవ్వడానికి చెయ్యి ముందుకు చాచేవాడు మనుష్యుల్లో మహోత్కృష్ట స్థానాన్ని అలంకరిస్తాడు. ఎందుకంటే నీ చెయ్యి ఎల్లప్పుడూ ఇవ్వడం కోసమే రూపొందించబడింది.
- సమస్త నీతికి, ఆధ్యాత్మికతకు, ఉత్కృష్టతకు జనని భారతదేశం. రుషులు నడచిన దేశమిది. నేటికీ ఇక్కడ దివ్యపురుషులున్నారు. ఆ పుణ్యపురుషుల నుండి దీపాన్ని బదులు తెమ్మకుని, నీ వెంట రావడానికి సిద్ధంగా ఉన్నారు సోదరా! ఈ విశాల ప్రపంచంలోని పట్టణాలలో, పల్లెల్లో, మైదానాలలో అడవులలో అన్వేషిస్తారు. ఏ దేవుడి మహానుభావులను మరెక్కడైనా చూపగలరా?
- భగవదనుగ్రహాన్ని పొందాలంటే, మానవుడు వినిర్మల హృదయుడై ఉండాలి. ఆ నిర్మలత్వం శీలం వల్లనే సిద్ధిస్తుంది.
- ఆధ్యాత్మిక ధర్మం పుస్తకాలలో లేదు. సిద్ధాంతాల్లో లేదు. విధివిధానాల్లో లేదు. ఉపన్యాసాలలో అంతకన్నా లేదు. తర్కంలో అసలే లేదు. అది ఒక స్థితి. ఆ స్థితి ఒక్క సిద్ధులలోనే ఉంది. ఆ సిద్ధులు ఎవరో కాదు, మీరే! ఆ సిద్ధి పొందాలంటే, మీలో ప్రతివారూ రుష్యే. ఆధ్యాత్మిక సత్యాలను ప్రత్యక్షం చేసుకునే వరకు, మీకు ఆధ్యాత్మిక జీవనం ఆరంభం కానట్టే. అతీంద్రియ దశ మీకు కలిగేవరకు ఆధ్యాత్మిక జీవనమనేది వట్టి అర్థం లేని మాట.
- మీరు భగవంతుణ్ని తెలుసుకొన్నప్పుడు మీ ముఖ వర్చస్సు మారుతుంది. మీ కంఠస్వరం మారుతుంది. మీ ఆకారమంతా మారుతుంది. మీరు మానవజాతికి ఉద్ధరించేవారవుతారు. రుషిని ఎవరూ ఎదురు లేరు. ఎవరూ ఎదురు నిలవలేరు. రుషిత్వమంటే అదే మరి. అది మన జాతికి వరమవదు.
- మన ఉపనిషత్తులలోనూ, శాస్త్రాలలోనూ, పురాణాలలోనూ దాగిన మహాద్భుత సత్యాలను వెలికి లాగాలి. మఠాల నుండి వాటిని బయటకు తీయాలి. అరణ్యాల నుండి తరలించుకు రావాలి. ప్రత్యేక వర్గాల అధీనం నుండి వాటిని గుంజుకు రావాలి. అవి దేశమంతటా- ఆసేతు హిమాచల పర్యంతం దావానలంగా వ్యాపింపచేయడానికి మనం పూనుకుంటే కార్యం సాధించగలమన్నమాటే. ఈ సత్యాలను మనలో ప్రతి ఒక్కరూ తెలుసుకుని ఉండాలి. వాటిని ప్రజలకు మెట్టమొదట వివరించాలి. నేడు దీనికి సత్వర్య మరొకటి లేదు. కర్మలలో దాన కర్మ ఒక్కటే గొప్పది. అన్ని దానాలలోనూ ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైనది.
- భారతీయుడు నా సోదరుడు! భారతీయుడే నా ప్రాణం! భారతదేశపు దేవీదేవతలే నా ఆరాధ్యదైవాలు; భరత భూమి నా చిన్నప్పటి ఊయల, పడుచుదనపు పూదోట, వార్ధక్యపు వారణాసి అని గర్వంగా పలకండి.
- కష్టాలనే అభేద్యమైన అడ్డుగోడల్ని చీల్చుకొని ముందుకు సాగేది, సర్వంలోని శక్తిని సంతరించుకున్న సంకల్ప బలమే కానీ ధనం, పేరు ప్రతిష్ఠలు, పాండిత్య ప్రకర్షలు కావు.
- ఓటమిలేని జీవితం ఉండదు. పరాజయం పలకరించని ప్రభువుండడు. జీవితానికి మెరుగులు దిద్దేది ఓటమే!
- తనపై తనకు నమ్మకం లేనివాడే అసలైన నాస్తికుడు
- సేవకుడిగా ఉండడం అలవరచుకుంటే, నాయకుడయ్యే యోగ్యత లభిస్తుంది.
- ఇతరై వేల ఉన్నత వ్యర్థమైన మాటలకన్న ఇసుమంత ఆచరణ మిన్న
- లక్ష్యంపై ఉన్నంత శ్రద్ధాసక్తుల్ని లక్ష్యసాధనలో సైతం చూపినప్పుడే విజయం వరిస్తుంది.
- నిన్ను నీవు జయిస్తే విశ్వమంతా నీకు స్వాధీనమవుతుంది.
- స్వామి వివేకానంద పలుకులన్నీ కలకండ పలుకుల లాగా తియ్యగా ఉండకపోవచ్చు కానీ, మనలోని అనారోగ్యాన్ని నయం చేసి, ఆరోగ్యాన్ని చేకూర్చేది చేదు గుళికలేనని మరచిపోకూడదు.
- ఆయన మాటలు వెన్నలా మెత్తగా ఉండకపోవచ్చు కానీ, కొండరాళ్లను పిండి చేసేది ఇనుప పలుగేనని గుర్తుపెట్టుకుని, ఆ మాటల స్ఫూర్తిని మనసులో నింపుకుని సాగిపోవాలి.

– డి. కృష్ణకార్తీక

భారతం క్విజ్




61. బ్రహ్మ సలహా ప్రకారం వ్యాసుడు ఏం చేశాడు?
62. వ్యాస మహర్షి తపస్సుకి ఫలితమేమిటి?
63. వినాయకుడికి వ్యాసుడు ఏమని విన్నవించాడు?
64. వినాయకుడు తన నియమం గురించి ఏం చెప్పాడు?
65. సమాధానంగా వ్యాసుడు ఏమన్నాడు?
66. వ్యాసుడు ఏ సమయంలో క్లిష్టమైన శ్లోకాలు చెప్పాడు?
67. వ్యాసుడు మహాభారతాన్ని ఎన్ని శ్లోకాలతో రచించాడు?
68. ఎన్ని శ్లోకాలు స్వర్గలోకంలో ప్రతిష్ఠించబడ్డాయి?
69. ఎన్ని శ్లోకాలు పితృ లోకంలో ప్రతిష్ఠించబడ్డాయి?
70. ఎన్ని శ్లోకాలు గంధర్వ లోకంలో ప్రతిష్ఠించబడ్డాయి?
71. ఎన్ని శ్లోకాలు మానవ లోకంలో ప్రతిష్ఠించబడ్డాయి?

జవాబులు 61. గణపతి గురించి తపస్సు ఆచరించాడు. 62. వినాయకుడు ప్రత్యక్షమయ్యాడు. 63. వ్యాసుడు తన కార్యం గురించి వినాయకుడికి విన్నవించాడు. వినాయకుడు భారత సంహితను అక్షరబద్ధం చేయడానికి అంగీకరించాడు. 64. చెప్పేటప్పుడు క్షణం కూడా వ్యాసుడు జాప్యం చేయకూడదు. ఆ విధంగా చేస్తే, రాయడం ఆపేస్తాను అని వినాయకుడు చెప్పాడు. 65. తాను చెబుతున్నప్పుడు అర్థం చేసుకుంటూ వ్రాయాలన్నాడు. అలాగే అర్థం కాకపోతే ఆగాలి అని చెప్పాడు. వినాయకుడు అంగీకరించాడు. అలా భారత రచనా యజ్ఞం ఆరంభమైంది. వ్యాసుడు చెబుతున్నాడు. వినాయకుడు వ్రాస్తున్నాడు. 66. తనకు సమయం కావలసినప్పుడు ఒక క్లిష్టమైన శ్లోకం చెప్పాడు. గణపతి అర్థం చేసుకోవడానికి కొంత సమయం పట్టింది. ఆ విధంగా సర్వజనోపయోగమైన మహాభారత సంహిత మానవాళికి అందింది. 67. జ. అరవై ఆరు లక్షల శ్లోకాలతో రచించాడు. 68. 30 లక్షలు 69. 15 లక్షలు. 70. 14 లక్షలు. 71. లక్ష

నిర్వహణ: డి.వి.ఆర్. భాస్కర్

కలాం కలలు

అన్ని వికారాలకు అదే మూలం



వ్యక్తిగత పరిశుభ్రతతో పాటూ సామాజిక పరిశుభ్రతకోసం పరితపించిన వారిలో విశేషంగా చెప్పుకోదగిన వ్యక్తి మహాత్మాగాంధీ. అబ్దుల్ కలాం గారు కూడా అందుకే ''స్వచ్ఛమైన భూగోళం కోసం, స్వచ్ఛమైన శక్తికోసం నిరంతరం శ్రమిస్తాను'' అని విద్యార్థులచేత ప్రమాణం చేయించేవారు. ఇంకొన్ని రోజుల్లో ప్రాణం వదిలిపెట్టేస్తారన్నప్పుడు కూడా ఆయన విపరీతంగా బాధపడిన అంశం–మన దేశంలో చాలా మంది ఆరోగ్యం నశించిపోవడానికి కారణం– ప్లాట్‌ఫారమ్ మీద ఆగి ఉండగా ప్రయాణికులు రైళ్లలోని శౌచాలయాల్లో మలమూత్ర విసర్జన చేయడం–అన్న విషయం. అలా చేసినప్పుడు అవి స్టేషన్లలోని పట్టాల మధ్యలోనిలిచి పోతాయి. వాటిమీద వాలిన ఈగలు, దోమలు, సూక్ష్మక్రిములు అక్కడే తిరుగుతూ ప్లాట్‌ఫారాలమీద అమ్మే, ప్రయాణికులు తినే ఆహార పదార్థాలమీద వాలి నేరుగా మన ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి.

రైలు ప్రయాణికులలో చంటిపిల్లలు, వృద్ధులు, రోగులు మాత్రమే కాదు, అప్పటివరకు ఆరోగ్యంగా ఉన్నవారు కూడా వ్యాధిగ్రస్తులవుతారు. చదువుకున్నవారయినా, చదువులేనివారయినా అక్కడ ప్రయాణ హడావుడిలో విచక్షణ కోల్పోయి అనారోగ్యానికి బలవుతున్నారు. విద్యార్థులుగా మీరు దీని పట్ల అవగాహన పెంచుకుని మీరు పాటించడమే గాదు, మీ ఎదురుగా మరెవరయినా స్టేషన్లలో ఆగి ఉన్న రైళ్ళలో శౌచాలయాలు వినియోగించకుండా చూడండి.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అలాగే పల్లెలు, పట్టణాలు,నగరాలు అనే తేడా లేకుండా అనుసరిస్తున్న మరొక చెడ్డ అలవాటు – బహిరంగ మలమూత్ర విసర్జన. ఇది మన పరిసరాలను, మన ఆరోగ్యాన్నే కాకుండా మన దేశ గౌరవాన్ని కూడా పాడు చేసి అప్రతిష్ఠ తీసుకు వస్తున్నది. మరుగుదొడ్లు కట్టుకుంటామంటే ఇప్పుడు ప్రభుత్వాలుకూడా డబ్బిస్తున్నాయి. అలాగే శక్తి ఎప్పుడూ కూడా స్వచ్ఛమైనదై ఉండాలి. నేను ఏది తింటే అది నాకు శక్తిగా మారుతుంది. మంచి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకుంటే మంచి రోగనిరోధక శక్తి తోపాటూ మంచి శక్తిని కూడా పొందుతున్నా. కుళ్ళిన ఆహారాన్ని తీసుకుంటే వెంటనే శరీరం రోగగ్రస్థమైపోయి నీరసపడిపోతాం. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడం, వ్యాయామాల ద్వారా బలంగా ఉంచుకోవడం ఒక ఎత్తు అయితే సమస్త శక్తులకూ కారణమయిన మనసుని కూడా శుభ్రంగా ఉంచుకోవడం మరొక ఎత్తు. కళ్ళతో, చెవులతో, ముక్కుతో, స్పర్శతో మనం గ్రహించే వాటితో మన మనసు కూడా ప్రభావితమవుతుంది. అందువల్ల మనం లోపలికి గ్రహించే వాటిపట్ల మనం సర్వదా అప్రమత్తంగా ఉండాలి. నిల్వ ఉన్న పదార్థాలు, మసాలా పదార్థాలు తీసుకుంటే అవి మీ ఆరోగ్యాన్నేకాక, మీ మనసును కూడా ప్రభావితం చేస్తాయి. అలా కాకుండా మీ మనసును ఎంతగా నియంత్రించి శక్తిమంతం చేసుకుంటే మీమనస్సులోంచి అంత మంచి ఆలోచనలు వస్తాయి. మీరు ఎంత మంచి ఆహారాన్ని పుచ్చుకుంటే అంత మంచి శక్తి మీ శరీరం నుండి విడుదలవుతుంది.

నిలకడగా ఒక చోట ఉండగలిగేటట్లు, మీ ఆలోచనలను స్థిరంగా ఉంచగలిగేటట్లు, మీ చదువుసంధ్యలపట్ల మీ శ్రద్ధాసక్తులు నిశ్చలంగా ఉండేటట్లు మీ శరీరాన్ని, మీ మనసును నియంత్రించుకోగలగాలి. ప్రయత్నపూర్వకంగా అది అది అలవాటుగా చేసుకోవాలి. అలా వ్యక్తిగతంగా మీ వద్ధి, తద్వారా మీ వంటి ఉత్తమ పౌరులతో దేశాభివృద్ధి సాధ్యమవుతుంది.

అపురూపం

హతజోడి

హతజోడి లేదా హస్తజోడి అనేది ఒక అరుదైన మూలిక. రెండు మూడంగుళాల పరిమాణంలో ఉండే ఈ మూలిక చూడటానికి ముకుళించిన హస్తాల రూపంలో ఉంటుంది. అందుకే దీనికి ఆ పేరు వచ్చింది. ఇది ఎక్కువగా నేపాల్‌లోని లుంబినీ లోయలోను, అమర్‌కంటక ప్రాంతంలోను దొరుకుతుంది. ఉమ్మెత్తజాతికి చెందిన ఒక మొక్కకు చెందిన మూలిక ఇది. మొక్క బాగా ఎదిగిన తర్వాత దాని వేళ్లు జోడించిన చేతుల ఆకారంలోకి రూపుదిద్దుకుంటాయి. హతజోడి మూలికను చాముండేశ్వరీదేవికి ప్రతిరూపంగా భావిస్తారు. దృష్టిదోష నివారణకు, దుష్టశక్తుల కారణంగా తలెత్తే అనర్థాల నివారణకు హతజోడి మూలిక అద్భుతంగా ఉపయోగపడుతుందని తంత్రశాస్త్ర గ్రంథాలు చెబుతున్నాయి. పూజ మందిరంలో చాముండేశ్వరీ దేవి ఎదుట హతజోడి మూలికను ఉంచి, దానిని ఎర్రని పుష్పాలు, ఎర్రని అక్షతలతోను, ధూప దీప నైవేద్యాలతోను అర్చించాలి. దీనిని ఉంచి చాముండేశ్వరి హోమం జరిపించడం మరీ శ్రేష్ఠం. అలా పూజించిన తర్వాత ఎర్రని వస్త్రంలో కట్టి డబ్బు భద్రపరచే చోట ఉంచినట్లయితే, ఆర్థిక సమస్యలు తొలగిపోతాయి. దీనిని తాయెత్తులో ఉంచి భుజానికి లేదా మెడలో ధరించినట్లయితే, కార్యసిద్ధి, మానసిక స్థైర్యం కలుగుతాయి. ఆరోగ్య సమస్యలు కుదుటబడతాయి.

– పన్యాల జగన్నాథ దాసు



సువార్త

దేవుని సార్వభౌమత్వానికి తలవంచితేనే ఆశీర్వాదం

ప్రార్థన ఎలా చెయ్యాలి? దేవునితో విశ్వాసి చేసే 'ప్రార్థన' అనే సంభాషణ ఎలా సాగాలి? తన గురించైనా, మరి దేని గురైంచైనా సర్వజ్ఞుడైన దేవునికి, విశ్వాసి కొత్తగా ఏదైనా చెప్పవలసిన అవసరం ఉంటుందా? మరి మనం చెప్పవలసిందేమీ అవసరం లేకుండా ముందే అంతా ఎరిగిన దేవునితో ప్రార్థనలో మనమాయనకు ఏమి చెప్పాలి? విశ్వాసిలో బాహ్యం, ఆంతర్యం అనే రెండు ప్రధానాంశాలుంటాయని అపొస్తలుడైన పౌలు వివరించాడు (2 కొరింథీ 4:16). ఈ రెండింటి మధ్యా అంతర్గతంగా నిరంతర సంఘర్షణ సాగుతూ ఉంటుంది. లోకం ప్రాతినిధ్యం వహించే మన బాహ్యానికి, దైవసంబంధమైన మన ఆంతర్యంలోని ఆత్మీయతకు ఎప్పుడూ ఘర్షణే!! అయితే ఎంత నలిగినా, బలహీనపడ్డా, చింతచచ్చినా పులుపుచావదన్నట్టు, మనిషిలోని 'అహం' మాత్రం ఓటమిని అంత తొందరగా అంగీకరించదు. కాని ఈ అంతర్గత సంఘర్షణలో మనిషిదెప్పుడూ ఓటమే!! గెలవాలన్న ప్రయత్నమే తప్ప, గెలిచే అవకాశాలు మనిషికి ఏ మాత్రం లేని ఈ రంగంలోనే, దేవుని ప్రేమ మాత్రం అంతకంతకూ మరెక్కువగా విశ్వాసిలో పరిపూర్ణమౌతుందంటాడు అపొస్తలుడైన పౌలు. తన జీవితంలో ఒక ముల్లు ఉండేదంటాడాయన. ముండ్లు లేని జీవితాలసలుంటాయా? అయితే ఆ ముల్లును తొలగించమని తాను ముమ్మారు వేడినా దేవుడు దానిని తొలగించలేదు సరికదా, 'నా కృప నీకు చాలు, నీ బలహీనతల్లోనే నా శక్తి సంపూర్ణమవుతుందని దేవుడు తనకు బదులిచ్చాడు' అని పౌలు తన నిస్సహాయతను, ఓటమిని కొరింథీ చర్చికి వివరించుకున్నాడు (2కొరింథీ 12:1–9). అతిశయపడేందుకు పౌలు జీవితంలో ఎన్నో ఉన్నాయి. ఎవరికీ లేని ఒక పరలోకానుభవం కూడా ఉంది. ఆయన పరలోకం దాకా వెళ్లి మానవుల వశంలో లేని ఎన్నో పారలౌకికానుభవాలకు గురయ్యాడు.. కానీ తిరిగొచ్చిన తర్వాత ఆ 'అనుభవం' గురించి ఏ ఒక్కరికి కూడా ఆయన చెప్పుకోలేదు. సరి కదా అలా పరలోకానికి వెళ్ళింది తానే అని కూడా చెప్పుకోకుండా, అలా వెళ్లిన ఒక వ్యక్తి తనకు తెలుసునని మాత్రం పౌలు తన పత్రికలో వివరించడం పౌలు సాత్వికత్వానికీ, వినయానికి, తగ్గింపు స్వభావానికి స్పష్టమైన ఉదాహరణ.. కానీ క్రీస్తు ప్రేమకు నన్ను అంతకంతకు దగ్గర చేసే నా బలహీనతలయందే నేను అతిశయిస్తాను తప్ప, అతిశయించేందుకు తన వద్ద మరేదీ లేదని అపొస్తలుడైన పౌలు అంత సవినయంగా ప్రకటించుకోవడం, పైపై మెరుగుల ప్రచారం తప్ప మరేదీ లేని క్రైస్తవానికి ప్రతినిధులైన నేటి తరం విశ్వాసులకు, పరిచారకులకు ఎన్నటికీ అర్థం కాదు.


కొందరి ప్రార్థనల నిండా వాళ్ళ జీవితంలోని ముండ్ల ప్రస్తావనే ఉంటుంది. ముల్లు తీసెయ్యమని అడగడం తమ హక్కు, దాన్ని తీసివేయడం దేవుని బాధ్యత అన్నట్టుగా వాళ్ళ ప్రార్థనలు సాగుతుంటాయి. అయితే తన ముల్లు తీసెయ్యమంటూ తాను మూడుసార్లు అడిగినా దేవుడు అందుకు తిరస్కరించి, ఆ ముల్లు నిన్ను బలహీనుణ్ణి చెయ్యడంలోనే నా బలం నీలో పరిపూర్ణమవుతుందంటూ దేవుడు జవాబిచ్చాడని పౌలు రాసుకున్నాడు. మనం ఏది అడిగితే అది ఇస్తూ మనల్ని సంతోషపర్చడానికే దేవుడున్నాడన్న పద్ధతిలో లోతులు లేక కేవలం పబ్బం గడుపుకునే బాపతు పద్ధతిలో సాగుతున్న ఈనాటి పరిచారకుల పసలేని ప్రసంగాల కారణంగా 'దేవుని సార్వభౌమత్వం' అనే అత్యంత ప్రాముఖ్యమైన ఆత్మీయాంశం విశ్వాసులకు అర్థం కావడం లేదు. దేవుడు సార్వభౌమత్వం కలిగిన సర్వాధికారి తప్ప, మనమేది అడిగితే అది తెచ్చిచ్చే 'అల్లాఉద్దీన్ అద్భుత దీపం' కాదు. కూడా. మనమడిగింది ఆయన చేస్తాడు కాని దాన్ని చెయ్యకుండా ఉండే సార్వభౌమత్వం కూడా దేవుని సొంతం. దేవుని సంపూర్ణంగా విశ్వసించడమంటే, దేవుని సార్వభౌమత్వాన్ని విశ్వసించడమే, దేవుని విధానాలను, దేవుని సమయాన్ని సంపూర్ణంగా ఎరగటమే!! దేవునిలో ఎదగడమంటే, ప్రాపంచికంగా మనం బలహీనపడటమేనన్న పౌలు మాటలు, దేవుని హృదయ స్పందనకు సాదృశ్యాలు. 'మన బాహ్య పురుషుడు కృషిస్తున్నా, ఆంతర్య పురుషుడు దినదినం వినూత్నపర్చబడుతున్నాడు' అంటాడు పౌలు. అలాంటి ఆత్మీయవృద్ధిని, దేవుని సార్వభౌమత్వాన్ని కాంక్షిద్దాం.

దేవుని సంపూర్ణంగా విశ్వసించడమంటే, దేవుని సార్వభౌమత్వాన్ని విశ్వసించడమే, దేవుని విధానాలను, దేవుని సమయాన్ని సంపూర్ణంగా ఎరగటమే!! దేవునిలో ఎదగడమంటే, ప్రాపంచికంగా మనం బలహీన పడటమేనన్న పౌలు మాటలు, దేవుని హృదయ స్పందనకు సాదృశ్యాలు.

– రెవ.డా.టి.ఎ.ప్రభుకిరణ్

ఇస్లాం వెలుగు

నా ప్రభువే కాపాడాడు



హజ్రత్ అబ్దుల్ ఖాదర్ జీలానీ రహ్మతుల్లాహ్ అలైహ్ గొప్పదైవభక్తుడు. అనునిత్యం దైవధ్యానంలో నిమగ్నమై ఉంటూ, ప్రజలకు ధార్మికబోధ చేస్తూ ఉండేవారు. ఒకనాటి రాత్రి ఆయన యధాతథంగా దైవారాధనలో నిమగ్నమై ఉన్నారు. అంతలో ఒక మహోజ్వలమైన వెలుగు కనిపించింది . హజ్రత్ అబ్దుల్ ఖాదర్ జీలానీ రహ్మ బయటికి వెళ్ళి చూశారు. ఆకాశం వైపునుండి ఒక సింహాసనం జాజ్వల్యమానంగా వెలుగులు విరజిమ్ముతూ భూమ్మీదకు దూసుకువస్తోంది. అసలు అది ఏమిటో కూడా చూడలేనంత వెలుగు భూమండలంపై పరచుకుంటోంది. అంతలో 'అబ్దుల్ ఖాదర్ జీలానీ..! మేము నీ దైవభక్తిని, నీ ఆరాధనను మెచ్చుకున్నాము. ఇకనుండి ఇతరులకు ధర్మబద్ధం కానివి నీకు ధర్మబద్ధం చేశాము. అంటే హరాం విషయాలను నీకు హలాల్ గా చేశాము.' అన్న అదృశ్యవాణి వినిపించింది.

అప్పుడు హజ్రత్ జీలానీ రహ్మ, 'హరామ్ వస్తువులు హలాల్ చేయడం ఎవరికి సాధ్యం? ఇదేమైనా షైతాన్ పన్నాగం కాదుకదా..?' అని ఆలోచిస్తూ...,' ఇంతకూ నువ్వు ఎవరివి? దైవానివా. సృష్టి కర్తవా..?'అని ప్రశ్నించారు.

ఈ ప్రశ్నకు అటువైపునుండి ఎటువంటి సమాధానమూ రాలేదు. నేను దేవుణ్ణి అని చెప్పేధైర్యం షైతాన్ కులేదు. వాడు నేనే దైవాన్ని అని చెప్పలేడు. మౌనమే సమాధానమైంది. వెంటనే ఆయన, ఇదంతా షైతాన్ కల్పించిన భ్రమ మాత్రమే.. అని పసిగట్టి,'శాపగ్రస్తుడా..దుర్మార్గుడా..దూరంగా పారిపో..' అంటూ.. అల్లాహ్ శరణు వేడుకున్నారు.

అప్పుడు షైతాన్ మరోపాచిక విసురుతూ..'జీలానీ .. నిన్ను నీ జ్ఞానం కాపాడింది.' అని పలికాడు. 'కాదు.. కాదు.. నా జ్ఞానం కాదు.. నాప్రభువు కాపాడాడు.' అన్నారు హజ్రత్ జీలానీ రహ్మ వెంటనే.. ఈ విధంగా షైతాన్ చివరి అస్త్రం కూడా పనిచేయకుండా పోయింది.

దీనివల్ల మనకు అర్థమయ్యేదేమిటంటే, మన మేదో దైవభక్తులమని, దానధర్మాలు చేస్తుంటామని, ఇతరసత్కార్యాలెన్నో చేస్తూ ఉంటామని, విద్యావిజ్ఞానాలు ఉన్నాయని, అందరికంటే నాలుగాకులు ఎక్కువే చదివామని ఎవ్వరూ భ్రమపడకూడదు. అంతా దైవానుగ్రహమని మాత్రమే భావించాలి తప్ప దైవభక్తిపరులమని ప్రత్యేకతలు ఆపాదించుకొని గర్వించకూడదు.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

కథాశిల్పం

శాస్తారం ప్రణమామ్యహం



అయ్యప్ప అనగానే అందరికీ యోగాసనంలో, మోకాలికి యోగపట్టం ధరించి కుడి చేత్తో అభయాన్నిస్తూ, ఎడమచేతిని మోకాలిపై ఉంచే రూపం గుర్తుకు వస్తుంది. శబరిమలైపై కొలువు తీరిన రూపం ఇదే. ఇక్కడ ఆయన బ్రహ్మచారిగా కనిపిస్తాడు. కానీ ఆయనకు ఇద్దరు భార్యలు ఉన్నారు. పూర్ణ, పుష్కలా వారి పేర్లు. శక్తి సమేతుడైన స్వామిని ధర్మశాస్త అని పిలుస్తారు. అచ్చన్ కోసం ఆలయంలో స్వామివారు ఇరువైపుల దేవేరులతో పాటు ఆసీనుడై కుడి కాలిని కిందకు చాచి ఎడమకాలిని మడిచి పీఠంపై ఉంచి నడుముకూ ఎడమమోకాలికీ కలిపి వేసిన పట్టంతో కుడిచేతిలో పుష్పాన్ని, ఎడమచేతిని ఎడమమోకాలిపై జారవిడిచి చిద్విలాసంగా చిరునవ్వులు చిందిస్తూ ఉంటాడు. పూర్ణాపుష్కలా దేవేరులు చేతిలో సౌగంధికా పుష్పాలను పట్టుకుని వరదముద్రనూ చూపుతూ వరాలిస్తుంటారు. ఇదే స్వరూపంలో తమిళనాడులోని కాంచీపురం,కడలూర్ మొదలైన కొన్ని దేవాలయాలలో మాత్రం అరుదుగా దర్శనమిస్తాడు. పూర్ణాపుష్కలాసమేత ధర్మశాస్త విగ్రహ స్వరూపాన్ని మయమత శిల్పశాస్త్రం విశేషంగా వివరించింది. ఇతడి చేతిలో చంద్రాకోలును ఉంచాలని చెప్పింది. ఈ స్వామి వాహనం, ధ్వజచిహ్నం రెండూ గజమే. చతుర్భుజుడైన స్వామికి కుక్కుటధ్వజం ఉంటుంది.

శాస్త అంటే శాసించువాడని అర్థం. ఆగమ, శిల్ప శాస్త్రాలలో అనేక శాస్తా స్వరూపాలున్నా వాటిలో ఎనిమిది శాస్తారూపాలు ప్రసిద్ధమైనవి. ఆదిశాస్త, ధర్మశాస్త, జ్ఞానశాస్త, కల్యాణవరదశాస్త, గజారూఢ శాస్త, సమ్మోహన శాస్త, సంతానప్రాప్తి శాస్త, వేదశాస్త, వీరశాస్తలలో ఒక్కో దేవుడూ ఒక్కో ఫలితాన్ని ఇస్తాడు.

ధర్మశాస్తా దర్శనంతో సకలాభీష్టాలూ నెరవేరుతాయి. మహాపాతకాలు తొలగిపోతాయి. ఆరోగ్యం, పుత్ర సిద్ధి, కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయని శాస్త్రాగమం చెప్పింది.

– డాక్టర్ ఛాయా కామాక్షీదేవి

మాసం మహాత్మ్యం


పుణ్యఫలాలనిచ్చే పుష్యం

పుష్యమీ నక్షత్రం పౌర్ణమినాడు చంద్రునితో కూడి ఉన్న మాసం పుష్యమాసం. చాంద్రమాన ప్రకారం సంవత్సరంలో ఇది పదోమాసం. దేవతలతో పాటు, పితృదేవతలనీ ఆరాధించడం ఈ మాసం ప్రత్యేకం. పుష్యమి అనేది శనిగ్రహ నక్షత్రం. ఈ నక్షత్రానికి అధిదేవత బృహస్పతి బుద్ధి కారకుడు కావడం వల్ల ఈ మాసం బృహస్పతికీ, శనికీ అత్యంత ప్రీతికరమైనది. శనికి ఇష్టమైన పదార్థం నువ్వులు, వాటి నుంచి వచ్చే నూనె. కాబట్టి ఈ మాసంలో నువ్వులు, నువ్వులనూనెతో ఆయనను అభిషేకించి, పూజించాలని, నువ్వులు దానం చేయాలని, బెల్లంతో కలిపిన నువ్వులు తినాలని శాస్త్రవచనం. అలాగే ఇది మంచు కప్పబడి ఉండే మాసం కాబట్టి పగటి సమయం తక్కువ, రాత్రి సమయం ఎక్కువ. ఆ కొద్దిసేపైనా ఎండతీక్షణత ఉండదు. సూర్యరశ్మి శరీరానికి తగినంత అందదు. అందువల్ల తైలగ్రంథులు వాటి విధిని సక్రమంగా నిర్వహించలేక మందగిస్తాయి. ఫలితంగా చర్మం పొడిబారి, పగుళ్లు ఏర్పడతాయి. దీనికి నివారణ నువ్వులనూనె ఒంటికి పట్టించి నలుగు పెట్టుకుని స్నానం చేయడం. అలాగే సంక్రాంతి పిండి వంటలన్నిటిలో నువ్వులు, బెల్లం తప్పకుండా ఉంటాయి, ఉండాలి కూడా.

ఇక ఈ మాసం శూన్యమాసం అని ఆందరూ ఆడిపోసుకుంటారు కానీ, అత్యుత్తమమైన ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చేదీ, రైతులు పండుగగా, పితృదేవతల పండగగా చెప్పుకునే సంక్రాంతి పండగ వచ్చేది కూడా ఈ మాసంలోనే కాబట్టి చిన్న చూపు తగదు.

(నేటినుంచి పుష్యమాసం ఆరంభం)

తత్త్వ రేఖలు



ఆత్మ నుండి... ఆత్మలోకి

మనిషి అనేక ప్రాకృతిక చర్యలను గుర్తించలేడు. ఉదాహరణకు తాను భూమిలో భాగమై ఉండటం వలన భూభ్రమణాన్ని గమనించలేడు. అలాగే, తన శరీరంలో జరిగే చర్యలను గుర్తించలేడు. తనకున్న పరిమితులు, తన దృక్పథంతో మాత్రమే ఆలోచించడం వలన అనేక అపోహలు, నమ్మకాలు కలుగుతాయి. కొన్నింటిని ఇతరుల నుండి స్వీకరించి, కొన్ని స్వతహాగా ఊహించి అనుకూల వాదనలు చేస్తూ ఉంటాడు. ఈ మార్గం సరైంది కాదని తెలుసుకున్న భారతీయ ఆధ్యాత్మిక పరిశోధకులు హేతువు నుండి పరిశోధన మొదలు పెట్టారు. ఏది హేతువో అది ఆత్మ అని నిశ్చయించారు. ఆ ఆత్మ నుండే పదార్థం ఉద్భవిస్తోందని, తిరిగి దానిలోనే లయమైపోతోందని నిర్ధారించారు.

ఈ సూత్రాన్ని ఒడిసిపడితే చాలు, అన్నింటికీ సమాధానం దొరికిపోతుంది. మనం మన తల్లిదండ్రుల ద్వారా ఉద్భవించినట్టు అనిపించినా, మన ఈ పరిణామరూపం ఆత్మచేత, ఆత్మ ద్వారా, ఆత్మ నుండి, ఆత్మలోనే జరుగుతుందని గుర్తించ గలుగుతాము. ఈ విధంగా మన ఆలోచనలను హేతుమార్గంలో విస్తృత పరచుకుంటే ఆత్మ అర్థమౌతుంది. అర్థమైన ఆత్మను అంతటా, అన్నింటా దర్శించే ప్రయత్నమే తపస్సు.

ఈ తపస్సు నిరంతర ఆలోచనల్లో నిండిపోతే కలిగేదే ఆత్మసందర్శన లేక భగవత్సాక్షాత్కారం.

ఆ ఆలోచనలను ఆచరిస్తే కలిగే స్థితే బ్రహ్మస్థితి. అంటే సాధకుడు 'అహం బ్రహ్మస్మి' స్థాయికి చేరుకుంటాడు.

'ఈశావాస్యోపనిషత్తు' చెప్పినట్లుగా బ్రహ్మస్థితిలో ఉన్న సాధకుడికి తన చుట్టూ ఉన్న ఏ జీవీ అల్పమైనదిగానో, అసహ్యకరమైనదిగానో కనిపించదు. అన్నింటా ఈశ్వరుడు కనిపిస్తే ఏహ్యాభావమెలా కలుగుతుంది? అలాగే, వస్తువాసనలు నశించిపోతాయి. అందువల్ల అరిషడ్వర్గాలు ఆవిరైపోతాయి.

అరిషడ్వర్గాలు నశిస్తే దుఃఖానికి స్థానమెక్కడుంటుంది? దుఃఖమే లేనప్పుడు మనసంతా ఆనందమయమే కదా! ఈ ఆనందం మనకు కలిగే సంతోషాలకు భిన్నమయిందీ, ఉన్నతమయింది. సంతోషం స్వల్పకాలిక మానసిక ప్రతిస్పందన కాగా, ఈ ఆనందం ఎలాంటి మానసిక స్పందనలూలేని స్థిర స్థితి.

దీనిలో అలజడులకూ, హెచ్చుతగ్గులకూ స్థానం లేదు. అలా నిశ్చలమై, నిరంతరమై ఉంటుంది. సాధకునికి తనలో, తన చుట్టూ కలిగే పరిణామాలకు సంబంధమే ఉండదు. సాధకుడి పని సాధకునిది.

అదే కర్మతో, ప్రతిఫలంతో సంబంధం లేని మోక్షస్థితి. అందరూ ఆశించే పరమాత్మ సన్నిధి.

– గిరిధర్ రావుల


● మహేశ్‌బాబు

వేసవి ముగిశాక కొత్త సినిమా

'వన్ : నేనొక్కడినే' కాంబినేషన్ (సుకుమార్– మహేశ్‌బాబు) వన్స్‌మోర్ రిపీట్ కానుందన్నప్పటి నుంచి ఇండస్ట్రీలో మంచి ఆసక్తి ఏర్పడింది. ఈ ప్రాజెక్ట్ ఎప్పుడు పట్టాలెక్కుతుందా? అని ఎదురు చూస్తున్నారు. సుకుమార్ కథ తయారు చేసే పని మీద ఉన్నారనే వార్త ప్రచారంలో ఉంది. తాజా సమాచారమేంటంటే సుకుమార్ కథ అవుట్‌లైన్‌ను తయారు చేసేశారట. అలాగే మహేశ్‌కు వినిపించడం కూడా జరిగిపోయిందట. ఈ కథ మహేశ్‌కు చాలా బాగా నచ్చిందని, ప్రాజెక్ట్ పట్ల చాలా ఎగ్జైటింగ్‌గా ఉన్నారని టాక్. ప్రస్తుతం సుక్కూ కథ పూర్తి స్థాయి ప్రిపరేషన్‌తో పాటు ప్రీ ప్రొడక్షన్ వర్క్ పనులు మొదలెట్టారని సమాచారం. మహేశ్ కెరీర్‌లో మునుపెన్నడూ చూడనటువంటి కమర్షియల్ చిత్రంగా ఈ సినిమా ఉండబోతోందట. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై రవిశంకర్, మోహన్ చెరుకూరి, నవీన్ యర్నేని నిర్మించనున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జూన్ నెల నుంచి ప్రారంభం కానుందట. ఇందులో మహేశ్ సరసన బాలీవుడ్ భామ కత్రినా కైఫ్ నటించొచ్చనే ప్రచారం కూడా జరుగుతోంది. మహేశ్ ప్రస్తుతం 'మహర్షి' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా ఏప్రిల్ 5న రిలీజ్ కానుంది. మే నెల హాలిడే తీసుకొని జూన్‌లో సుక్కూ సినిమా సెట్లో అడుగుపెడతారని ఊహించవచ్చు. సో.. వేసవి ముగిశాక కొత్త సినిమా షూటింగ్‌లో పాల్గొంటారన్నమాట.


● కియారా, రామ్‌చరణ్

ఇదో మంచి లెర్నింగ్ ఎక్స్‌పీరియన్స్

రామ్‌చరణ్ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'వినయ విధేయ రామ'. ఇందులో కియారా అద్వానీ కథానాయికగా నటించారు. డీవీవీ దానయ్య నిర్మించిన ఈ సినిమా సెన్సార్ కంప్లీట్ చేసుకుంది. ఈ నెల 11న విడుదల కానున్న ఈ చిత్రం 2గంటల 26 నిమిషాల నిడివి ఉందని సమాచారం. అలాగే ఈ సినిమాలోని 'రామా లవ్స్ సీత..' పాటను ఈరోజు సాయంత్రం నాలుగు గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమా గురించి రామ్‌చరణ్ మాట్లాడుతూ– ''ఇందులో బ్యూటిఫుల్ అండ్ బ్యాలెన్స్డ్ క్యారెక్టర్ చేశాను. పూర్తి స్థాయి మాస్ ఫిల్మ్‌లా ఉంటుంది. మంచి కుటుంబ కథా చిత్రం కూడా. సినిమాలో అజర్ బైజాన్ లొకేషన్స్‌ను నేపాల్–బీహార్ సరిహద్దు ప్రాంతంలా చూపించాం. కియారా ఫైన్ ఆర్టిస్టు. ఆ అమ్మాయి కళ్లతో మంచి హావభావాలు పలికించగలదు. మంచి డ్యాన్స్ పార్టనర్. 'రామా లవ్స్ సీత' సాంగ్ విజువల్‌గా హైలైట్‌గా ఉంటుంది. ప్రశాంత్, స్నేహ, వివేక్ ఒబెరాయ్‌గార్లతో పనిచేయడం నాకు లెర్నింగ్ ఎక్స్‌పీరియన్స్‌లా అనిపించింది. లొకేషన్‌లో బాగా ఎంజాయ్ చేశాం కూడా. పెద్ద సినిమాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారారు దానయ్యగారు. ఆయనతో చేస్తే మా హోమ్ బ్యానర్ కొణిదెల ప్రొడక్షన్స్‌లో చేసినట్లే ఉంటుంది. బోయపాటిగారు మంచి కన్విక్షన్‌తో సినిమా చేస్తారు'' అన్నారు. ఇంకా 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా గురించి చెబుతూ– ''ఎన్టీఆర్ కాంబినేషన్‌లో సినిమా అనగానే సర్‌ప్రైజ్ కాలేదు. సెట్‌లో ఎలా ఉంటామని కూడా ఆలోచించలేదు. బయట మేం మంచి స్నేహితులం. అదే షూటింగ్‌లో కూడా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యింది. చాలా ఆనందంగా ఉంది. 'ఆర్‌ఆర్‌ఆర్' గురించి ఎక్కువ రివీల్ చేయకూడదు. ఫస్ట్ షెడ్యూల్ పూర్తయింది'' అని పేర్కొన్నారు.

ఐ లవ్ నిక్కీ!


● నిధీ అగర్వాల్

నాగచైతన్య నటించిన 'సవ్యసాచి' సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయ్యారు హీరోయిన్ నిధీ అగర్వాల్. తెలుగు ఆడియన్స్ గురించి తన అభిప్రాయాన్ని, కొత్త ఏడాది తీసుకున్న నిర్ణయాలు.. ఇంకా కొన్ని విషయాలను నెటిజన్లతో షేర్ చేసుకున్నారామె. ప్రస్తుతం అఖిల్ హీరోగా నటిస్తున్న 'మిస్టర్ మజ్ను' సినిమాలో కథానాయికగా నటిస్తున్నారు నిధీ అగర్వాల్. ఈ నెల 25న ఈ సినిమా విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఇక.. ఈ బ్యూటీ చెప్పిన విషయాలు తెలుసుకుందాం.

● **తెలుగు ప్రేక్షకుల గురించి మీ అభిప్రాయం?**

అద్భుతమైన, నమ్మకమైనవారు.

● **కొత్త ఏడాది తీసుకున్న నిర్ణయం?**

భయం లేకుండా ఉండటం.

● **'మిస్టర్ మజ్ను' సినిమాలో మీ క్యారెక్టర్ గురించి?**

మై మోస్ట్ ఫేవరెట్ క్యారెక్టర్. ఐ లవ్ యు నిక్కీ (సినిమాలో నిధి పాత్ర పేరు నిక్కీ). ఈ సినిమా రిలీజ్ కోసం చాలా ఎగ్జైటెడ్‌గా ఎదురు చూస్తున్నా. ప్రేక్షకులు సపోర్ట్ చేయాలి.

● **మీకు బిర్యానీ అంటే ఇష్టమేనా?**

చాలా ఇష్టం.

● **మీ ఫేవరెట్ నెట్‌ఫ్లిక్స్ సిరీస్?**

ప్రస్తుతం 'వైల్డ్ వైల్డ్ కంట్రీ' చూస్తున్నాను.

● **మీ రోల్ మోడల్ ఎవరు?**

ఈ రోజు ఆమె పుట్టినరోజు (శనివారం బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకోన్ పుట్టినరోజని ప్రత్యేకించి చెప్పక్కర్లేదు)

● **'అర్జున్‌రెడ్డి' సినిమా చూశారా?**

ఇప్పటివరకు నాలుగుసార్లు చూశాను.

● **అఖిల్ లేదా నాగచైతన్య.. ఎవరిష్టం?**

ఈ ప్రశ్న చాలామంది అడుగుతున్నారు (నవ్వుతూ)

● **'మిస్టర్ మజ్ను' డైరెక్టర్ వెంకీ అట్లూరి గురించి?**

మై ఫేవరెట్ అండ్ టాలెంటెడ్ డైరెక్టర్.

● **సౌత్ ఇండియన్ స్టార్స్‌లో ఎవరిపై అయినా మీకు క్రష్ ఉందా?**

అవును. ఉంది కానీ ఎవరో చెప్పను.

● **ఫైనల్లీ మీ గోల్ ఏంటి?**

నా పూర్తి బలాన్ని ఉపయోగించి నేను ఆశించిన శిఖరాలకు చేరుకోవాలి. భవిష్యత్ బాగా ఉండటానికి కావాల్సిన కృషి చేసేంత ఎనర్జీ నాలో దాగి ఉందని నా నమ్మకం.

వాళ్లు కర్త.. కర్మ.. నేను క్రియ

యన్టీఆర్ జీవితం ఆధారంగా ఆయన తనయుడు బాలకృష్ణ టైటిల్ రోల్ పోషించి, నిర్మించిన చిత్రం 'యన్.టి.ఆర్'. క్రిష్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం మొదటి భాగం 'యన్.టి.ఆర్ : కథానాయకుడు' ఈ నెల 9న రిలీజ్ కాబోతుంది. ఈ సందర్భంగా బాలకృష్ణ పంచుకున్న విశేషాలు.

● **ఇప్పటి వరకూ చేసిన సినిమాలు ఒక ఎత్తు. ఈ సినిమా ఒక ఎత్తు అనుకుంటారా?**

చాలెంజ్ అనుకోలేదు. గొప్ప అవకాశం అనుకున్నాను. విధి మనకు ఎలాంటి చాలెంజ్‌లు ఇచ్చినా వాటిని అధిగమించి ముందుకు వెళ్లాలని భావిస్తాను. ఏ సినిమా వచ్చినా అది ఎందుకు నాదాకా వచ్చిందో


● బాలకృష్ణ

నాకు నేనే ఆలోచించుకుంటా. ఎక్కువ మందితో చర్చలు ఉండవు. టూ మెనీ కుక్స్ స్పాయిల్ ది బ్రాత్ (ఎక్కువ మంది వంటగాళ్లు కూర చెడగొట్టినట్టు) అంటారు కదా అలాగ. అనిపించింది చేసుకుంటూ వెళ్లడమే. ప్రాచీన ఆంధ్ర చరిత్ర సృష్టికర్త గౌతమీ పుత్ర శాతకర్ణి, నవీన తెలుగు జాతి సృష్టికర్త ఎన్టీఆర్‌ల కథలను ఒకే దర్శకుడు క్రిష్‌తో చేయడం విశేషం.

● **మీ నాన్నగారిలా చేయడం కష్టం అనిపించిందా?**

కష్టమేం అనిపించలేదు. ఆయన కేవలం నా తండ్రి మాత్రమే కాదు. దైవం, గురువు, మెంటర్ అన్నీ. ఆయన చేసిన పాత్రలన్నీ చేయగలగడం ఈ సినిమాతో కుదిరింది. కర్త, కర్మ అన్నీ అమ్మానాన్నే. నేను కేవలం క్రియ మాత్రమే.

● **ఆర్టిస్టుల ఎంపిక ఎలా జరిగింది?**

బయోపిక్ ఫీల్ రావాలంటే తెలిసిన ముఖాలు ఎక్కువ కనిపించకూడదు. ఎందుకంటే కథ నుంచి డైవర్ట్ అయిపోతారు. కేవలం సినిమా యాక్టర్ అయినప్పటి పోర్షన్‌లో మాత్రమే యాక్టర్స్ కనిపిస్తారు. మిగతా సీన్స్ కోసం సురభి నాటక కళాకారులను తీసుకున్నాం. యాక్టర్స్ కనిపిస్తే కమర్షియల్ అయిపోతుంది. ఈ సినిమాను అలా చేయదలుచుకోలేదు.

● **రెండు భాగాల కథ ఎలా ఉంటుంది?**

ఫస్ట్ పార్ట్ సినిమాలు, పార్టీని అనౌన్స్ చేయడం. రెండో భాగం పార్టీ స్థాపించడం, పార్టీ క్రైసిస్, అమ్మగారు శివైక్యం అవ్వడం ఉంటాయి. ఇది అమ్మానాన్నల కథ. కేవలం వాళ్లమీదే ఈ సినిమా ఉంటుంది.

● **ఈ జర్నీ ఎమోషనల్‌గా సాగిందనుకోవచ్చా?**

అవును. చాలా వరకు. నాన్నగారి వైఖరి నాకు తెలుసు, అమ్మగారి సెంటిమెంట్సూ నాకు తెలుసు. అమ్మ మాటకు నాన్నగారు ఎంత విలువ ఇచ్చేవారో చెప్పాం. హరి (హరికృష్ణ) అన్నయ్యతో, నాతో మా మేనమామ 'రామ్ రహీమ్' పిక్చర్ తీద్దాం అనుకున్నారు. ముందు చదువు పూర్తి కావాలని నాన్నగారు అనేవారు. నాన్నగారిని అమ్మగారు అడిగిన వెంటనే 'సరే చేసుకోమనండి' అన్నారు. ఇలాంటి బోలెడన్ని విషయాలు ఉంటాయి సినిమాలో.

● **మీ క్యారెక్టర్ (బాలకృష్ణ) ఉంటుందా?**

నాకో ఐడెంటిఫికేషన్ ఉంది. దాంతో కథ నుంచి డైవర్ట్ అయిపోతారు. అలా అవ్వకూడదు. అయితే నా పాత్ర ఒక్క సీన్‌లో కనిపిస్తుంది.

● **అంటే.. ఏ వయసు పాత్రలో కనిపిస్తారు?**

లేదు. లేదు. చంటి బిడ్డగా ఉన్నప్పుడు. ఆ పాత్రను నా మనవడు దేవాన్ష్ చేశాడు. బాగా చేశాడు. నాకు నామకరణం చేసే సన్నివేశంలో కనిపిస్తాడు. షూటింగ్ టైమ్‌లో ఏడుస్తాడేమో అని చాలా ఏర్పాటు చేసుకున్నాడు క్రిష్. బొమ్మలు అవీ ఇవీ తెప్పించాడు. కానీ సీన్‌లో ఎవరు డైలాగ్ చెప్పినా వాళ్లను చూసేవాడు. క్లోజప్ షాట్ కావాలంటే నవ్వాడు. నటన మా బ్లడ్‌లోఉంది కదా (నవ్వుతూ).

● **చిన్న ఎన్టీఆర్, మీ అబ్బాయి మోక్షజ్ఞ పాత్రలు కూడా లేవు కదా?**

లెంగ్త్ కుదర్లేదు. అంత సమయాభావాన్ని సరి పెట్టలేకపోయాం. నా పాత్రే లేనప్పుడు వాళ్ల పాత్రలు పెట్టించడం కుదరదు కదా.

● **క్రిష్ ప్రాజెక్ట్‌లోకి ఎలా వచ్చారు?**

విద్యాబాలన్‌గారితో మాట్లాడటానికి ముంబై వెళ్లా. అక్కడ 'మణికర్ణిక' షూటింగ్ జరుగుతోంది. క్రిష్‌ని కలిశాను. నేను డైరెక్షన్ చేసేయనా? అన్నారు. 'యస్.. యు ఆర్ మై డైరెక్టర్' అన్నాను.

● **డైలాగ్స్ గురించి?**

ఏమంటివి ఏమంటివి, 'బొబ్బిలి పులి'లో డైలాగ్స్ ఉంటాయి. ఊరికే నేను చెప్పగలుగుతాను అని పెట్టినవి కాదు. ప్రతి సీన్‌కు ఓ రీజన్ ఉంది. నాగేశ్వర రావుతో ఉన్న అనుబంధం కూడా చూపిస్తాం. మా నాన్నగారికి నేనిచ్చే ఘనమైన నివాళి ఈ సినిమా.

● **పొలిటికల్ కాంట్రవర్సీలు ఉంటాయా?**

అవేం ఉండవు. 1983 ఆగస్ట్‌లో పాలిటిక్స్ క్రైసిస్, ఆ తర్వాత అమ్మగారు శివైక్యం అవ్వడంతో సినిమా ముగుస్తుంది. ఇది కేవలం మా అమ్మానాన్నల కథ.

● **ఈ సినిమా తర్వాత బోయపాటితో మూవీ అనౌన్స్ చేశారు. రెస్ట్ ఎప్పుడు తీసుకుంటారు?**

రెస్ట్ ఎందుకు? ప్రతి రోజూ నాన్నగారి సినిమాలో ఏదో సీన్ చూసి పడుకుంటా. పాజిటివ్ ఎనర్జీ ఇస్తుంది. అభిమానులు మా నుంచి సినిమాలు కోరుకుంటారు. ఆర్టిస్ట్ నిత్యావసర వస్తువు. వాళ్లకు కావాల్సింది అందిస్తుండాలి. ఇచ్చే ధైర్యం మనకుండాలి.


● ప్రియాంకా చోప్రా

యోగా గురువు

యోగా టీచర్‌గా క్లాసులను కంప్లీట్ చేశారు ప్రియాంకా చోప్రా. ఆ క్లాసులు ఎలా జరిగాయి? అనేది ప్రేమికుల రోజున తెలుస్తుంది. ప్రియాంకా చోప్రా, లియమ్ హెమ్స్‌వర్త్, రెబెల్ విల్సన్, ఆడమ్ డివైన్ ముఖ్య తారలుగా రూపొందిన హాలీవుడ్ మూవీ 'ఈజింట్ ఇట్ రొమాంటిక్?'. టాడ్ స్ట్రాస్–గల్సన్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో యోగా అంబాసిడర్ ఇసాబెల్లా పాత్రలో నటించారు ప్రియాంకా చోప్రా. పాత్ర పరంగా కొన్ని సీన్స్‌లో యోగా క్లాసులను కండక్ట్ చేస్తారట. ఈ సినిమాను వచ్చే నెల 13న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం పేర్కొంది. అలాగే ఈ సినిమాలో ప్రియాంకా లుక్‌ను కూడా రిలీజ్ చేశారు. గతేడాది డిసెంబర్‌లో ప్రియుడు నిక్ జోనస్‌తో ఏడడుగులు వేసిన ప్రియాంకా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ కోసం స్విట్జర్లాండ్ వెళ్లిన సంగతి తెలిసిందే. ఇక బాలీవుడ్‌లో ప్రియాంకా చోప్రా 'ది స్కై ఈజ్ పింక్' అనే సినిమాలో నటిస్తున్నారు. ఫర్హాన్ అక్తర్, జైరా వసీమ్ ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు సోనాలి బోస్ దర్శకురాలు.


● 'ఈజింట్..' లో

ఈ క్షణం.. ఓ హైలైట్


● విశ్వనాథ్ తన్నీరు, వినాయక్, ధ్రువ

ధ్రువ, అశ్విని జంటగా జైరామ్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'యమ్ 6'. విశ్వనాథ్ ఫిలిం ఫ్యాక్టరీ, శ్రీలక్ష్మీ వెంకటాద్రి క్రియేషన్స్ బ్యానర్స్‌పై విశ్వనాథ్ తన్నీరు నిర్మించిన ఈ సినిమా ట్రైలర్‌ను దర్శకుడు వీవీ వినాయక్ ఆవిష్కరించి, చిత్రబృందాన్ని అభినందించారు. విశ్వనాథ్ తన్నీరు మాట్లాడుతూ– ''సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది. సినిమాలోని ప్రతి సన్నివేశాన్ని ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు. ఎక్కడా బోర్ ఫీల్ అవకుండా ఉత్కంఠ కలిగించేలా ఈ చిత్రం రూపొందించాం. 'యమ్ 6' అనే డిఫరెంట్ టైటిల్‌ని ఎందుకు పెట్టామో సినిమా చూస్తే అర్థమవుతుంది. మా చిత్రానికే హైలైట్‌గా నిలిచే 'ఈ క్షణం...' అనే మెలోడి సాంగ్‌ను మంగళూరు, అరకులోని అందమైన లొకేషన్స్‌లో చిత్రీకరించాం. ధ్రువ సరసన మిస్ బెంగళూరు అశ్విని హీరోయిన్‌గా నటించింది. త్వరలోనే సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు. ''హీరోగా ఇది నా తొలి చిత్రం. అందర్నీ అలరించే విభిన్నమైన పాత్రలు పోషించి, ఇండస్ట్రీలో నటుడిగా నాకంటూ ఓ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకోవాలన్నది నా చిరకాల కోరిక'' అని ధ్రువ అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బాలాజీ, కెమెరా: మహ్మద్, రియాజ్, సహ నిర్మాత: సురేశ్.



విజయ్ మాల్యా.. పరారైన నేరగాడే

ఆర్థిక నేరస్తుడిగా ప్రకటించిన ముంబై కోర్టు • ఫిబ్రవరి 5 నుంచి ఆస్తుల జప్తునకు ఆదేశం

ముంబై: భారత బ్యాంకులకు రూ.9,000 కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టి విదేశాలకు చెక్కేసిన వ్యాపారవేత్త విజయ్‌మాల్యాకు మరోషాక్ తగిలింది. మాల్యాను పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తుడి(ఎఫ్‌ఈవో)గా గుర్తిస్తూ ముంబైలోని పీఎంఎల్‌ఏ కోర్టు శనివారం ఉత్తర్వులు జారీచేసింది. తాజా ఆదేశాల నేపథ్యంలో పరారీలో ఉన్న రుణఎగవేతదారుల చట్టం–2018 కింద దేశ, విదేశాల్లోని మాల్యా ఆస్తులన్నింటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం వీలవుతుంది. ముంబై న్యాయస్థానం ఆదేశాలతో ఎఫ్‌ఈవోగా గుర్తింపు పొందిన తొలి వ్యాపారవేత్తగా మాల్యా నిలిచారు. ఈ కేసు విచారణ సందర్భంగా ఈడీ న్యాయవాది డి.ఎన్.సింగ్ వాదిస్తూ.. ప్రస్తుతం బ్రిటన్‌లో ఉంటున్న మాల్యాను భారత్‌కు రప్పించేందుకు అన్నిరకాలుగా ప్రయత్నించామని తెలిపారు. అక్కడి న్యాయస్థానం సైతం మాల్యాను భారత్‌కు అప్పగించాలని తీర్పు ఇచ్చిందన్నారు. కానీ విజయ్‌మాల్యా మాత్రం భారత్‌కు రావడం ఇష్టపడటం లేదనీ, ఈ తీర్పును పైకోర్టులో సవాలు చేసేందుకు సిద్ధమవుతున్నారని వెల్లడించారు. అయితే ఈ వాదనల్ని మాల్యా లాయర్లు ఖండించారు. చట్టప్రకారం మాల్యా లండన్ కోర్టు ముందు లొంగిపోయారనీ, ఆతర్వాత బెయిల్ పొందారని కోర్టుకు చెప్పారు. ఫోర్స్ ఇండియా జట్టు డైరెక్టర్ హోదాలో వరల్డ్ మోటార్ స్పోర్ట్స్ సమావేశంలో పాల్గొనేందుకు బ్రిటన్ వెళ్లారని, ఈడీ చెబుతున్నట్లు మాల్యా రహస్యంగా వెళ్లలేదని తెలిపారు.

స్టే ఇచ్చేందుకు కోర్టు నిరాకరణ

ఇరుపక్షాల వాదనలు విన్న అక్రమ నగదు చెలామణి నిరోధక(పీఎంఎల్‌ఏ) కోర్టు జడ్జి ఎం.ఎస్.అజ్మీ స్పందిస్తూ.. 'ఎఫ్‌ఈవో చట్టంలోని సెక్షన్ 12(ఐ) కింద ఈడీ చేసిన దరఖాస్తును పాక్షికంగా మన్నిస్తున్నాం. విజయ్‌మాల్యాను పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తుడిగా ప్రకటిస్తున్నాం. ఆయన ఆస్తుల జప్తు ఫిబ్రవరి 5 నుంచి మొదలవుతుంది' అని ఉత్తర్వులు జారీచేశారు. వెంటనే మాల్యా తరపు న్యాయవాదులు స్పందిస్తూ.. కోర్టు తీర్పు పూర్తి కాపీని అందుకునేందుకు, ఎగువ కోర్టులో అప్పీలుకు వీలుగా ఈ ఆదేశాలపై 4 వారాల స్టే ఇవ్వాలన్నారు. దీంతో ఎఫ్‌ఈవో చట్టం కింద పనిచేస్తున్న కోర్టు తన ఉత్తర్వులపై తానే స్టే ఇచ్చుకోలేదని స్పష్టం చేశారు. రూ.100 కోట్లు, అంతకు మించి మోసానికి పాల్పడి విదేశాలకు పారిపోయిన వ్యక్తులు అరెస్ట్ వారెంట్ జారీ అయినప్పటికీ స్వదేశానికి వచ్చేందుకు మొగ్గుచూపకపోతే ఎఫ్‌ఈవోఏ చట్టం కింద వారిని పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తుడిగా ప్రకటిస్తారు.

మా చొరవ వల్లే..: బీజేపీ

ఎన్డీయే ప్రభుత్వం చొరవ కారణంగానే ముంబైలోని కోర్టు మాల్యాను పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తుడిగా ప్రకటించిందని ఆ పార్టీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా తెలిపారు. మాల్యా లాంటి రుణఎగవేతదారులను అరికట్టేందుకు, చట్టం ముందు నిలబెట్టేందుకే ఎన్డీయే ప్రభుత్వం పరారీలో ఉన్న రుణఎగవేతదారుల చట్టం(ఎఫ్‌ఈవోఏ)–2018 తీసుకొచ్చిందని వెల్లడించారు.

అన్నింటికీ బీజేపీ గొప్పలు: కాంగ్రెస్

అధికారంలోకి వచ్చినప్పట్నుంచీ ప్రతీ విషయంలో క్రెడిట్ తీసుకునేందుకు బీజేపీ యత్నిస్తోందని కాంగ్రెస్ విమర్శించింది. పారిపోయే ముందు మాల్యా కేంద్ర మంత్రి జైట్లీని కలిసి అనుమతి తీసుకున్నారంది. 'తమ వల్లే మాల్యాను పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తుడిగా కోర్టు ప్రకటించిందని బీజేపీ నేతలు భావిస్తే అలాగే కానివ్వండి. మంగళ్‌యాన్, పోఖ్రాన్–1 అణుపరీక్షలు.. ఇలా అన్ని విషయాల్లో క్రెడిట్ అంతా తమదేనని బీజేపీ నేతలు చెప్పుకుంటున్నారు. తామొచ్చాకే అన్నీ జరిగాయని వాళ్లు భావిస్తున్నారు. ఈ లెక్కన 2019, మే 26న భారత్ తన ఐదో బర్త్‌డే చేసుకోవాలి' అని వ్యంగ్యాస్త్రాలు సంధించింది.



మాల్యాకు చెందిన ఇండియన్ ఎంప్రెస్ నౌక

వినోదాల కోసం రెండు నౌకలు

మాల్యా అంటేనే విందు వినోదాలకు పెట్టింది పేరు. తరచూ భారీ పార్టీలు ఇస్తూ ఉంటారు. దీని కోసం ఆయన ఏకంగా రెండు నౌకలనే కొనుగోలు చేశారు. హెలికాప్టర్లు కూడా దిగడానికి వీలుండే ఈ నౌకల్లో రెండు మెర్సిడెస్ కార్లను కూడా పార్క్ చేసుకునే సదుపాయం ఉంది. ఇక వాటిల్లో ఉండే సౌకర్యాలు ఒక్క మాటలో చెప్పలేం. బార్లు, జిమ్, వైద్యశాల, బ్యూటీ పార్లర్, సమావేశ మందిరాలు అన్నీ అందులోనే. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన పార్టీలను మాల్యా ఈ నౌకల్లోనే ఇచ్చారు. డచ్ షిప్‌యార్డ్‌కు చెందిన ఒక నౌకను మాల్యా 9.3 కోట్ల డాలర్లు వెచ్చించి కొనుగోలు చేశారు. ప్రపంచ ప్రసిద్ధ సినీనటులు సర్ రిచర్డ్ బర్టన్, ఎలిజబెత్ టేలర్ వంటివారు వినియోగించిన క్లజిమా అనే మరో నౌక కూడా మాల్యాకు ఉంది. 1995లో సుమారు కోటి డాలర్లు పెట్టి దీన్ని ఆయన కొనుగోలు చేశారు. ఈ రెండు నౌకల్లో మాల్యా ఇచ్చే పార్టీలకు వీవీఐపీలు సైతం క్యూ కట్టేవారు.



విలాసాలకు మారుపేరు

మాల్యా స్థిరాస్తులు : రూ. 2 వేల కోట్లు • చరాస్తులు : రూ. 10,500 కోట్లు



బ్యాంకులకు రూ.9,000 కోట్లకుపైగా ఎగ్గొట్టి లండన్‌కు పారిపోయిన విజయ్ మాల్యాను పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తుడిగా ముంబై కోర్టు ప్రకటించింది. దీంతో దేశ విదేశాల్లో ఉన్న మాల్యా ఆస్తుల్ని జప్తు చేసే అధికారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కు లభించింది. రాజ ప్రాసాదాలను తలపించే భవంతులు, ప్రకృతి సౌందర్యానికి మారుపేరుగా నిలిచే ఎస్టేట్‌లు, సకల సౌకర్యాలున్న విమానాలు, విలాసవంతమైన నౌకలు, రేసు కార్లు, కోట్లాది రూపాయల బ్యాంక్ బ్యాలెన్స్‌లు.. ఇలా చెప్పుకుంటూ పోతే మాల్యాకున్న ఆస్తులు కోకొల్లలు. మాల్యా స్థిర చరాస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయో, ఎన్ని ఉన్నాయో ఈడీ ఒక జాబితా రూపొందించింది. బ్యాంకు డిపాజిట్లు, షేర్లు, భూములు, భవంతులను గుర్తించింది.

ఈడీ జప్తు చేయడానికి రూపొందించిన జాబితా ఇదే.. కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో మాల్యాకు కోట్లాది రూపాయల విలువ చేసే భూములు, ఫామ్ హౌస్‌లు ఉన్నాయి. మొత్తం 3.09 లక్షల చదరపు అడుగుల భూమి ఉంది.

కర్ణాటక : బెంగళూరులో మాల్స్, మరో నాలుగు గ్రామాల్లో భూములు ఉన్నాయి. వీటి విలువ రూ.1,937.5 కోట్లుగా ఉంది. బెంగళూరులో యూబీ సిటీ మాల్ విలువ రూ.713 కోట్ల వరకు ఉంటుంది. అలాగే రూ.962 కోట్లతో కింగ్‌ఫిషర్ టవర్ నిర్మాణంలో ఉంది.

మహారాష్ట్ర : ముంబై, ఆలిబాగ్‌లో ఫామ్ హౌస్‌లున్నాయి. వాటి ఖరీదు రూ.28.02 కోట్లకుపైమాటే.

తమిళనాడు : వెల్లూరు జిల్లాలో భూముల విలువ రూ. 1.14 కోట్ల వరకూ ఉంటుంది.



ఇవే కాక వివిధ కంపెనీల్లో మాల్యాకు షేర్లు ఉన్నాయి. యూబీఎల్ కంపెనీలో ఆయనకున్న షేర్ల విలువరూ. 8,758 కోట్లు కాగా, యూఎస్‌ఎల్‌లో రూ.1,692 కోట్లు, యూబీహెచ్‌ఎల్ రూ.27 కోట్లు, మెక్‌డొవెల్ రూ.10 కోట్ల విలువైన షేర్లు ఉన్నట్లు ఈడీ జాబితాలో తెలిపింది.

ఈడీ జాబితాలో లేనివి మరికొన్ని..

ప్రపంచవ్యాప్తంగా మాల్యాకు ఎస్టేట్‌లు, భవనాలు మొత్తం రెండు డజన్లకుపైగా ఉన్నాయి. కాలిఫోర్నియాలో 11వేల చ.అ.విస్తీర్ణంలో ఎస్టేట్ ఉంది. దీని విలువ 12 లక్షల డాలర్లు. న్యూయార్క్‌లోని ప్రఖ్యాతిగాంచిన ట్రంప్ ప్లాజాలో పెంట్ హౌస్, దక్షిణాఫ్రికాలో జోహన్నెస్‌బర్గ్ సమీపంలో 12,000 హెక్టార్లలో విస్తరించిన మబూలా గేమ్‌లాడ్జ్, అత్యంత ఖరీదైన ప్రాంతంలో ఎస్టేట్, ఫ్రాన్స్‌లోని రివిరా పట్టణానికి సమీపంలోని లగ్జరీ ఎస్టేట్, భారత్‌లోని కర్ణాటకలో కునిగల్ పట్టణం దగ్గర 400 ఎకరాల్లో విస్తరించిన గుర్రపు శాల(స్టడ్ ఫామ్), గోవాలో రాజభవంతిని తలపించే కింగ్‌ఫిషర్ విల్లా వంటి స్థిరాస్తులు మాల్యా సొంతం.

బ్యాంక్ బ్యాలెన్స్ : రూ. 34.21 కోట్లు
ఫిక్స్‌డ్ డిపాజిట్లు : రూ. 10.82 కోట్లు

బెంగళూరులోని యూబీ సిటీ మాల్

సొంత పనులకు 4 విమానాలు

కింగ్‌ఫిషర్ వంటి విమానయాన సంస్థను నడిపించిన ప్రముఖ వ్యక్తికి తనకంటూ సొంతంగా విమానం ఉండటం ఏమంత పెద్ద విషయం కాదు. మాల్యా ఎక్కడికి వెళ్లాలన్నా సరే విమానంలోనే వెళ్లేవారు. మొత్తం నాలుగు విమానాలను ఆయన వినియోగించేవారు. ప్రపంచంలోని తనకున్న ఎస్టేట్‌లలో ఎక్కడికి వెళ్లాలన్నా బోయింగ్ 727 రకం విమానాన్ని వాడేవారు. మాల్యా దగ్గరున్న ఎయిర్‌బస్ ఏ319 విమానం లండన్ నుంచి అమెరికాకు ఒకే ఒక్క హాల్ట్‌తో ప్రయాణించగలదు. ఇక హాకర్ హెచ్‌ఎస్125, గల్ఫ్ స్ట్రీమ్ త్రీ అనే మరో రెండు విమానాలు కూడా ఎప్పుడూ మాల్యా కోసం సిద్ధంగా ఉండేవి. తన అభిరుచికి తగ్గట్టుగా ఆ విమానంలో ఆయన సకల అధునాతన సౌకర్యాలను ఏర్పాటు చేసుకున్నారు. ఇవి కాకుండా ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన స్పోర్ట్స్ కార్లు విజయ్ మాల్యా వద్ద చాలా ఉన్నాయి.

2020లో 5జీ టెక్నాలజీ తెస్తాం: కేంద్రం



జలంధర్ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: 2020 నాటికి దేశంలో 5జీ మొబైల్ టెక్నాలజీని తీసుకొస్తామని ఐటీ మంత్రి రవిశంకర్ తెలిపారు. దేశంలోని గ్రామ పంచాయతీలను ఫైబర్ ఆప్టిక్ కేబుల్‌తో అనుసంధానించే ప్రాజెక్టు ఈ ఏడాదిలో పూర్తవుతుందన్నారు. ప్రస్తుతం గ్రామస్థాయిలో ప్రభుత్వ సేవలు అందించే సిటిజన్ సర్వీస్ సెంటర్ల ద్వారా దేశవ్యాప్తంగా 12 లక్షల మందికి ఉపాధిని అందిస్తున్నామని పేర్కొన్నారు.

55 అడుగుల రోబో: సైన్స్ కాంగ్రెస్‌లో శనివారం కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ ఆవిష్కరించిన భారీ రోబో ప్రతిమ ఇది. 55 అడుగుల ఎత్తున్న ఈ రోబో పేరు మెటల్ మాగ్నా. 25 టన్నుల బరువున్న దీన్ని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ విద్యార్థులు రెండు నెలలు శ్రమించి తయారు చేశారు.

క్రిమినల్ లావాదేవీలుగా చూపారు

ముంబై: పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ)ను రూ.14,000 కోట్ల మేర మోసం చేసిన కేసులో తాను భారత్‌కు తిరిగిరాలేనని నిందితుడు, వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ తెలిపారు. భారత్‌లో తన ప్రాణాలకు భద్రత లేకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.నీరవ్ మోదీని పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తుడిగా ప్రకటించాలని ఈడీ ముంబైలోని ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో ఆయన న్యాయవాది న్యాయస్థానంలో ఈ మేరకు స్పందించారు. ఈ వ్యవహారంలో తానే దోషి అన్నట్లు పలు రాజకీయ పార్టీలకు చెందిన నేతలు మాట్లాడారని నీరవ్ పిటిషన్‌లో తెలిపారు. తాను చేసిన సాధారణ బ్యాంకింగ్ వ్యవహారాలను కూడా పీఎన్‌బీ అధికారులు క్రిమినల్ లావాదేవీలుగా కలరింగ్ ఇచ్చారని ఆరోపించారు.

ఎవరి మాటా వినని అసమర్థుడు మోదీ



న్యూఢిల్లీ: నోట్లరద్దు, జీఎస్టీ అమలు ద్వారా దేశాన్ని నాశనం చేసిన ప్రధాని మోదీని 'ఎవరి మాటా వినని ఒక అసమర్థుడు'గా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ అభివర్ణించారు. 'ఈ దేశాన్ని కాంగ్రెస్ అభివృద్ధి చేసింది. మోదీ వచ్చి నోట్ల రద్దు, గబ్బర్ సింగ్ ట్యాక్స్(జీఎస్టీ)ను అమలు చేయడం ద్వారా దేశాన్ని నాశనం చేశారు. ఆయన ఎవరి మాటా వినని ఒక అసమర్థుడైన వ్యక్తి' అని ట్వీట్ చేశారు. కేంద్రం కుదుర్చుకున్న రఫేల్ విమానాల కొనుగోలు ఒప్పందంపై పార్లమెంట్‌లో ప్రధాని మోదీని, మంత్రులను తాను అడిగిన ప్రశ్నలనే ప్రతి భారతీయుడు అడగాలని కోరారు. ' అనిల్ అంబానీ కంపెనీకి రఫేల్ కాంట్రాక్టు ఎవరిచ్చారు? ఈ విషయంలో ప్రధాని మోదీ జోక్యంపై రక్షణ శాఖ అధికారులు అభ్యంతరం తెలిపారా? అనే ప్రశ్నలను పోస్ట్ చేశారు.

సెల్ఫీ తీసుకుంటూ భారత విద్యార్థి మృతి

లండన్: ఐర్లాండ్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం మొహెర్ కొండ అంచుల్లో సెల్‌ఫోన్‌తో సెల్ఫీ తీసుకుంటూ జారిపడి భారతీయ విద్యార్థి ఒకరు ప్రాణాలు కోల్పోయారు. బాధితుడు డబ్లిన్‌లో చదువుకుంటున్న ఓ భారత సంతతి విద్యార్థి అని మాత్రమే తెలిసిందని పోలీసులు వెల్లడించారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆ విద్యార్థి ఎత్తైన మొహెర్ కొండ అంచులకు చేరుకుని, తన మొబైల్‌తో సెల్ఫీ తీసుకుంటున్నాడు. ఆ సమయంలో అనుకోకుండా కాలు జారి పట్టుతప్పి కిందపడిపోయాడు. తోటి పర్యాటకుల హెచ్చరికలతో రంగంలోకి దిగిన పోలీసులు హెలికాప్టర్ సాయంతో అతడిని గుర్తించి, ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భారత్‌లో ఉన్న అతడి కుటుంబసభ్యులతో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



శనివారం శ్రీనగర్‌లో భారీగా కురిసిన మంచు. శ్రీనగర్‌లో 10, కుప్వారాలో ఏకంగా 17 అంగుళాల మేర మంచు పేరుకుపోయింది.

యూపీలో ఎస్పీ–బీఎస్పీ జట్టు!

- లోక్‌సభ ఎన్నికల కోసం కూటమి ఏర్పాటుకు సమ్మతి
- త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం
- కాంగ్రెస్‌కు చోటుపై సందిగ్ధత





లక్నో: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల కోసం ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)లు జట్టు కట్టడం దాదాపు ఖాయమైనట్లు తెలుస్తోంది. ఈ రెండింటితోపాటు రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్‌ఎల్‌డీ) వంటి చిన్న పార్టీలు కూడా ఈ కూటమిలో ఉండనున్నాయి. అయితే కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేస్తుందా లేక ఎస్పీ–బీఎస్పీల కూటమితో కలిసే సాగుతుందా అన్న అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. ఒకవేళ కూటమితో కాంగ్రెస్ కలిస్తే, ఆ పార్టీకి అతి తక్కువ స్థానాల్లోనే టికెట్లు దక్కనున్నాయి. ఎస్పీ–బీఎస్పీల కూటమిపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని ఎస్పీ జాతీయ అధికార ప్రతినిధి రాజేంద్ర చౌదరి చెప్పారు.

అమేథీ, రాయ్‌బరేలీల్లో పోటీ చేయం..

ఎస్పీ నేత అఖిలేశ్ యాదవ్, బీఎస్పీ అధినేత్రి మాయావతిలు ఇప్పటికే పలుమార్లు సమావేశమై కూటమి ఏర్పాటుపై చర్చించారనీ, తాజాగా శుక్రవారం వారు ఢిల్లీలో భేటీ అయ్యి మాట్లాడారని రాజేంద్ర చెప్పారు. కూటమి ఏర్పాటుకు వీరిరువురూ సూత్రప్రాయ అంగీకారం తెలిపారన్నారు. కూటమిలో కాంగ్రెస్ ఉండాలా లేదా అన్న అంశాన్ని అఖిలేశ్, మాయావతిలు తర్వాత నిర్ణయిస్తారనీ, అయితే కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్, యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీల నియోజకవర్గాలైన అమేథీ, రాయ్‌బరేలీల్లో మాత్రం తమ కూటమి అభ్యర్థులను పోటీలో నిలపకుండా ఆ సీట్లను కాంగ్రెస్‌కే విడిచిపెట్టాలని నిర్ణయించామన్నారు. యూపీసీసీ అధ్యక్షుడు రాజ్ బబ్బర్ మాట్లాడుతూ అఖిలేశ్–మాయావతిల భేటీపై అధికారిక ప్రకటనేదీ లేదనీ, దీనిపై తాను మాట్లాడేదీ లేదంటూ ఆయన స్పందించేందుకు నిరాకరించారు. యూపీలో 80 లోక్‌సభ స్థానాలుండగా గత ఎన్నికల్లో 71 సీట్లు బీజేపీ, మరో రెండు సీట్లు బీజేపీ మిత్రపక్షం అప్నాదళ్ గెలిచాయి. ఎస్పీ ఐదు, కాంగ్రెస్ రెండు సీట్లు గెలవగా బీఎస్పీ ఒక్క స్థానంలోనూ గెలవలేదు.

అఖిలేశ్ మెడకు మైనింగ్ కేసు!

- 14 చోట్ల సీబీఐ సోదాలు
- నిందితుల్లో తెలంగాణ ఐఏఎస్ అధికారిణి చంద్రకళ



న్యూఢిల్లీ: అక్రమ మైనింగ్ కేసులో యూపీ మాజీ సీఎం అఖిలేశ్ సీబీఐ విచారణ ఎదుర్కొనే చాన్సుంది. ఈ మేరకు నమోదైన కేసు వివరాల్ని సీబీఐ వెల్లడించింది. ఐఏఎస్ అధికారిణి బి.చంద్రకళ, ఎస్పీ ఎమ్మెల్సీ రమేశ్ కుమార్ మిశ్రా, బీఎస్పీ నాయకుడు సంజయ్ దీక్షిత్ సహా మొత్తం 11 మందిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ కేసుకు సంబంధించి శనివారం సీబీఐ అధికారులు.. యూపీ, ఢిల్లీలో నిందితులకు చెందిన 14 చోట్ల సోదాలు నిర్వహించారు. 2012–16 మధ్య కాలంలో హమీర్‌పూర్ జిల్లాలో ఇసుక, కంకర లాంటి ఖనిజాల తవ్వకాల్లో అక్రమాలు జరిగాయన్నది తాజా కేసులో ప్రధాన ఆరోపణ. 2012–17 మధ్య కాలంలో నాటి సీఎం అఖిలేశ్ 2012–13లో గనుల శాఖను తన వద్దే అట్టిపెట్టుకున్నారు. అందుకే ఆయన పాత్రపై సీబీఐ దృష్టిసారించే వీలుంది.

అక్రమంగా కాంట్రాక్టులిచ్చారు..

2012–14 మధ్య కాలంలో హమీర్‌పూర్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన చంద్రకళ ఈ–టెండర్ నిబంధనల్ని ఉల్లంఘించి కాంట్రాక్టులు కట్టబెట్టారని సీబీఐ ఆరోపించింది. ఆమె అక్రమంగా కొత్త అనుమతులిచ్చారని, పాత వాటిని పునరుద్ధరించారని పేర్కొంది. అక్రమ మైనింగ్‌కు అనుమతిచ్చిన చంద్రకళ, ఇతర అధికారులు.. గుత్తేదారుల నుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించింది. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా రామగుండంకు చెందిన చంద్రకళ 2008లో ఐఏఎస్‌కు ఎంపికై, యూపీ కేడర్ అధికారిగా నియమితులయ్యారు.

నిధులివ్వకుంటే.. ఎమర్జెన్సీ

- ఎలాగైనా గోడ కడతా
- డెమొక్రాట్లకు ట్రంప్ హెచ్చరిక
- షట్‌డౌన్‌పై వీడని ప్రతిష్టంభన



వాషింగ్టన్: మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణానికి కాంగ్రెస్ నిధులు మంజూరు చేయకుంటే జాతీయ అత్యవసర పరిస్థితి విధిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ప్రతిష్టంభన తొలగకుంటే ప్రభుత్వ షట్‌డౌన్ నెలలు లేదా సంవత్సరాల పాటు కొనసాగొచ్చని ప్రతిపక్ష డెమొక్రటిక్ సభ్యులతో చెప్పారు. రెండు వారాలుగా కొనసాగుతున్న పీటముడిని పరిష్కరించేందుకు శుక్రవారం అధ్యక్షుడు, డెమొక్రటిక్ సభ్యుల మధ్య జరిగిన సమావేశం విఫలమైంది.

గోడతోనే అక్రమ వలసల కట్టడి..

సమావేశం ముగిశాక ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ అనుమతి లేకుండానే గోడ నిర్మాణానికి నిధులు పొందేందుకు అవసరమైతే జాతీయ అత్యవసర పరిస్థితి విధిస్తానని వెల్లడించారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం తనకు ఈ విషయంలో విశేష అధికారాలున్న సంగతిని ప్రస్తావించారు. అయితే పరిస్థితి అంతదాకా రాకపోవచ్చని, కాంగ్రెస్ సమ్మతితోనే ఈ ప్రక్రియను పూర్తిచేయడానికి ప్రాధాన్యమిస్తానని చెప్పారు. గోడతోనే అక్రమ వలసల కట్టడి సాధ్యమన్నారు.

విద్యార్థి మేధావుల్లారా వెళ్లకండి

అమెరికా ఉత్తమ విద్యా సంస్థల్లో చదువు ముగించుకున్న విద్యార్థులు దేశం విడిచి వెళ్లొద్దని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కోరారు. అమెరికాలోనే ఉండి అక్కడి కంపెనీల అభివృద్ధికి దోహదపడాలని పిలుపునిచ్చారు. వీసా విధానంలోని లొసుగుల్ని సరిదిద్ది మేధావుల్ని, ప్రతిభావంతుల్ని ఆకర్షించేందుకు కట్టుబడి ఉన్నానన్నారు.

అట్టుడుకుతున్న కన్నూర్

- శబరిమల వ్యవహారంలో బీజేపీ, సీపీఎం కార్యకర్తల పరస్పర దాడులు
- చట్టాన్ని గౌరవించాలని ఐరాస విజ్ఞప్తి



కన్నూర్/తిరువనంతపురం/న్యూఢిల్లీ: కేరళలో రాజకీయంగా అత్యంత సున్నితమైన కన్నూర్‌తోపాటు పతనంథిట్ట, కోజికోడ్ జిల్లాల్లో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. బీజేపీ, సీపీఎం నేతల ఇళ్లు, ఆస్తులపై బాంబు దాడులు జరిగాయి. శబరిమల ఆలయంలోకి 2వ తేదీన 50 ఏళ్లలోపు ఇద్దరు మహిళల ప్రవేశం అనంతరం రాష్ట్రంలో అల్లర్లు చెలరేగాయి. ఆలయ సంప్రదాయాలకు భంగం కలిగించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని సీఎం విజయన్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని బీజేపీ ఆరోపించింది.

పలుచోట్ల బాంబు దాడులు

సీపీఎం ఎమ్మెల్యే ఏఎన్ షంషీర్‌కు చెందిన మడపీడికయిల్‌లోని ఇంటిపై, వడియిల్ పీడికియలోని బీజేపీ నేత రాజ్యసభ సభ్యుడు వి.మురళీధరన్ పూర్వీకుల నివాసం, తలస్సేరిలోని సీపీఎం నేత పి.శశి ఇంటిపై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నాటు బాంబులు విసిరారు. ఈ ఘటనలతో జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పొరుగునే ఉన్న కోజికోడ్ జిల్లా పెరంబ్రాతోపాటు శబరిమల ఆలయం ఉన్న పతనంథిట్ట జిల్లా మలప్పురం, ఆదూర్‌లలో శుక్రవారం అర్ధరాత్రి, శనివారం వేకువజామున బీజేపీ, సీపీఎం కార్యకర్తలు పరస్పరం దాడులు, ఆస్తుల విధ్వంసానికి పాల్పడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న అల్లర్లకు సంబంధించి 1,700 మందిని, కన్నూర్ జిల్లాలో హింసాత్మక ఘటనలకు సంబంధించి 260 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. శబరిమల అంశాన్ని సున్నితంగా పరిష్కరించడానికి బదులు సీపీఎం ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం రాష్ట్రంలో హింసను ప్రేరేపిస్తోందని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు ఆరోపించారు. అన్ని వర్గాల వారు చట్టాన్ని గౌరవించాలన్నదే తమ అభిమతమని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ ప్రతినిధి ఫర్హాన్ హక్ అన్నారు. శబరిమల వివాదం కారణంగా కేరళలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నందున అప్రమత్తంగా ఉండాలని బ్రిటన్ ప్రభుత్వం తమ పౌరులను హెచ్చరించింది.

'బెంగళూరు సెంట్రల్ నుంచి పోటీ చేస్తా'




బెంగళూరు: బహుభాషా నటుడు ప్రకాశ్ రాజ్ రాజకీయ ప్రవేశ వేదికపై ఒక స్పష్టత వచ్చింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నట్లు ప్రకాశ్ రాజ్ చెప్పారు. ఈ నియోజకవర్గం నుంచి 2014 ఎన్నికల్లో బీజేపీకి చెందిన పీసీ మోహన్ గెలుపొందారు. తన స్నేహితురాలు, జర్నలిస్ట్ గౌరీ లంకేశ్ హత్య అనంతరం ప్రకాశ్‌రాజ్ కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శిస్తున్నారు. బాలీవుడ్, కన్నడ, తమిళ, తెలుగు సినీ రంగాలకు ప్రకాశ్‌రాజ్ సుపరిచితుడు.

మధ్యవర్తుల ప్రభుత్వమది

- కర్షకులంటే కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకు మాత్రమే
- జార్ఖండ్, ఒడిశా సభల్లో మోదీ

డాల్టన్‌గంజ్/బరీపదా: గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజల కోసం ప్రభుత్వాన్ని నడపడంపోయి, రక్షణ రంగంలో మధ్యవర్తుల ఆదేశాలతో పాలన సాగించిందని ప్రధాని మోదీ దుయ్యబట్టారు. 'కాంగ్రెస్ నాడు ప్రభుత్వాన్ని నడిపిందో లేక తమ మిషెల్ (అగస్టా కుంభకోణంలో మధ్యవర్తి) మామ దర్బార్ నడిపిందో అర్థంకాట్లేదు' అంటూ వ్యంగ్యోక్తులు విసిరారు. అలాగే రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ పార్టీ రైతులను తప్పుదోవ పట్టిస్తోందనీ, ఆ పార్టీకి రైతులంటే కేవలం ఓటు బ్యాంకేనని ఆయన ఆరోపించారు. జార్ఖండ్, ఒడిశాల్లో మోదీ శనివారం పర్యటించి వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారు. బిహార్, జార్ఖండ్‌ల సరిహద్దుల్లోని 19.6 వేల హెక్టార్ల భూమికి సాగు నీరు అందించే కోయెల్ కరో మండల్ ప్రాజెక్టు సహా పలు నీటి పారుదల ప్రాజెక్టులకు మోదీ జార్ఖండ్‌లో పునాది రాయి వేశారు. అక్కడ మోదీ మాట్లాడుతూ 'గతంలో రైతులు అప్పులు తీసుకునేలా కాంగ్రెస్సే చేసింది. ఇప్పుడు రుణాలను మాఫీ చేస్తామంటూ తప్పుదోవ పట్టిస్తోంది. నేను కూడా వ్యవసాయదారులను ఓటు బ్యాంకుగానే పరిగణించి ఉంటే, లక్ష రూపాయల రుణమాఫీని నేనే అమలు చేసేవాణ్ని. కానీ పంట దిగుబడులను పెంచి, రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసి రాబోయే తరాల కర్షకులకు కూడా లాభదాయకంగా ఉండే విధానాలు తీసుకొచ్చేందుకు మేం ప్రాధాన్యమిస్తున్నాం' అని మోదీ చెప్పారు. ప్రాజెక్టు పేరులోని 'కోయెల్' అంటే అసలు ఇది ప్రాజెక్టు పేరా, నది పేరా, పక్షి పేరా అన్న విషయం కూడా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి తెలిసుండకపోవచ్చని మోదీ ఎద్దేవా చేశారు. నీళ్లు, ఇతర అంశాలపై ఇరుగుపొరుగు రాష్ట్రాలు గొడవలు పడుతున్న వేళ.. జార్ఖండ్ సీఎం రఘువర్ దాస్, బిహార్ సీఎం నితీశ్ కుమార్‌లు కలిసి సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపట్టడం సమాఖ్య వ్యవస్థకు మంచి ఉదాహరణ అని మోదీ ప్రశంసించారు.



ప్రధానమంత్రి ఆవాస్ యోజన లబ్ధిదారుకు ఇంటి తాళం చెవి ఇస్తున్న మోదీ

సైన్యంపై కుట్ర: మోదీ

ఒడిశాలోని బరీపదాలో నిర్వహించిన బీజేపీ ర్యాలీలో మోదీ మాట్లాడుతూ 'దేశ సైన్యాన్ని బలహీన పరిచేందుకు 2004–14 మధ్య కుట్ర జరిగింది. ఇప్పుడు ఆ నిజాలు బయటకొస్తుంటే కాంగ్రెస్ నేతలకు నొప్పిగా ఉంది' అని అన్నారు. అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ల కుంభకోణంలో మధ్యవర్తి క్రిస్టియన్ మిషెల్‌ను ఇప్పుడు తమ ప్రభుత్వం భారత్‌కు తీసుకొచ్చి విచారిస్తుండటంతో తమ రహస్యాలు బయటకొస్తాయని కాంగ్రెస్ పెద్దలు భయపడుతున్నారని మోదీ పేర్కొన్నారు. లోక్‌సభలో శుక్రవారం రఫేల్ ఒప్పందం వివాదంపై సమాధానమిచ్చిన రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌పై మోదీ ప్రశంసలు కురిపించారు. ఒడిశాలో పలు రహదారుల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. మోదీ ప్రారంభించిన, శంకుస్థాపనలు చేసిన మొత్తం ప్రాజెక్టుల విలువ రూ.4,000 కోట్లు.

1992, జనవరి 8న జపాన్ ప్రధాని ఇచ్చిన విందుకు హాజరైన అమెరికా అధ్యక్షుడు జార్జ్ హెచ్‌డబ్ల్యూ బుష్ అనారోగ్యంతో జపాన్ ప్రధాని కిచి మియజావపై వాంతి చేసుకున్నారు.



హాకీ హమారీ జాన్ హై



- హాకీ క్రీడాకారులకు నిలయం సుందర్‌గఢ్
- ఇంటికో ప్లేయర్.. ఏడాదంతా పోటీలు

ఒడిశాలోని సుందర్‌గఢ్ ప్రజలకు హాకీ అంటే ప్రేమ. 'అది మా జీవితం. అదే మా వినోదం' అంటుంటారు అక్కడి ఆదివాసీలు. జాతీయ-అంతర్జాతీయ హాకీ క్రీడాకారులకు నిలయమైన సుందర్‌గఢ్‌లో ఏ ఇంటికెళ్లినా.. ఓ హాకీ ప్లేయర్ కనిపిస్తారని చెబుతారు హాకీ ఆటగాడు దీప్సన్ టిర్కే తండ్రి పంథ్రాసియస్ టిర్కే. సాయంకాలాల్లో ఇక్కడి పేదపిల్లలు హాకీ కర్రలతో ఆటలకు దిగుతారు. తమ జిల్లా నుంచి ప్రపంచ స్థాయికి ఎదిగిన పద్మశ్రీ దిలీప్ టిర్కే వారికి దేవుడు. పిల్లలు ఆయన నుంచి ప్రేరణ పొందుతుంటారు. బాగా ఆడాలని, ఏదో ఒక స్పోర్ట్స్ అకాడమీలో చేరి మెరుగైన జీవితానికి పునాదులు వేసుకోవాలని కలలు కంటుంటారు.

19వ శతాబ్ది మధ్య కాలంలో యూరోపియన్ క్రిస్టియన్ మిషనరీలు తమ పూర్వీకులకు ఈ ఆటను పరిచయం చేశారని, సోదర భావాన్ని పెంపొందించేందుకు గ్రామాల మధ్య పోటీలు జరిపేవారని చెబుతుంటారు సుందర్‌గఢ్ వాసులు. ఇలా తరతరాలుగా హాకీ తమ జీవితంలో భాగమైపోయిందంటారు. 'మా రోజుల్లో ఆడుకునేందుకు తగిన కర్రలు కూడా ఉండేవి కాదు. వెదురు కర్రలను హాకీ కర్రలుగా మలచుకునేవాళ్లం. పండునే బంతిగా చేసుకునేవాళ్లం'అంటూ తాను ఎదిగిన విధానాన్ని వివరిస్తుంటారు పాతికేళ్ల నుంచి రాష్ట్ర కోచ్‌గా పనిచేస్తున్న బిజయ్ లక్రా.

గెలిచిన జట్టుకు మేక..

సుందర్‌గఢ్‌లో ఏడాది మొత్తం హాకీ పోటీలు జరుగుతూనే ఉంటాయి. అక్టోబర్– నవంబర్ మాసాల్లో మరింత జోరందుకుంటాయి. ఆ రెండు మాసాల్లో 20–25 టోర్నమెంట్లు నిరంతరాయంగా జరుగుతాయి. ప్రతి పోటీలో 15కు పైగా జట్లు పాల్గొంటాయి. గెలిచిన జట్టుకు మేకను కానుకగా ఇస్తారు. ఇంకా, కోడిపుంజు, పంది కోసం కూడా ఆడుతుంటారు. గ్రామస్తులు పనులూ మానుకుని ఆటలు చూడటానికి వస్తారు. ఫైనల్స్ చూసేందుకు సుమారు 4 వేల మంది హాజరవుతారు. భారత్ తరపున ఆడకముందు దీప్సన్ ఇలాంటి ఎన్నో పోటీల్లో పాల్గొన్నాడని, సౌనమరాలోని రాళ్లూ రప్పలతో కూడిన మైదానంలో ఆట నేర్చుకున్నాడని ఆయన తండ్రి పంథ్రాసియస్ చెప్పారు. ఒకప్పుడు కొడుకుతో పాటు ఈయన కూడా హాకీ ఆడేవారట.

నేషనల్స్ ఆడితే జాబ్..

సుందర్‌గఢ్‌లో వానలు పడితేనే పంటలు చేతికొచ్చే పరిస్థితి. రైతుల ఆదాయం అంతంత మాత్రమే. ఈ నేపథ్యంలో హాకీ జీవితానికి ఓ దారి చూపగలదని ఇక్కడ చాలామంది భావిస్తుంటారు. జాతీయ స్థాయిలో ఆడితే ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు రావడం ఖాయమని చెబుతుంటారు. సౌనమరా గ్రామ ఉద్యోగుల్లో 90 శాతం మంది హాకీ వల్లనే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సంపాదించగలిగారని కోచ్ బిజయ్ లక్రా చెప్పారు.

పొలాల మధ్యే సాధన..

రాజ్‌గంగ్‌పూర్‌లో హాకీ కలలు కంటున్న 180 మంది పిల్లలకు మూడేళ్లుగా మాజీ సైనికుడు సునీల్ టిగ్గా శిక్షణ ఇస్తున్నారు. బూట్లు సైతం కొనుక్కోలేని ఆ పేద పిల్లల చేత 365 రోజులూ పొలాల మధ్య ఉచితంగా సాధన చేయిస్తుంటారాయన. వీరిలో ఏడుగురు స్పోర్ట్స్ అకాడమీలకు ఎంపికయ్యారు. ప్రభుత్వం ఇలాంటి పిల్లలకోసం పచ్చిక మైదానాలు ఏర్పాటు చేయాలంటారు సునీల్. ఇలాంటి విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని సుందర్‌గఢ్‌లోని 17 బ్లాకుల్లోనూ మైదానాలు ఏర్పాట్లు చేస్తామని ఆ రాష్ట్ర సీఎం నవీన్ పట్నాయక్ ప్రకటించారు.

బాలికలూ ఎక్కువే..

ఒడిశాలోని పలు స్పోర్ట్స్ హాస్టళ్లలో శిక్షణ పొందుతున్న వారిలో బాలికలూ ఎక్కువే. రూర్కెలా హాస్టల్‌లో సగానికి సగం మంది బాలికలున్నారు. అయితే మేక 'బహుమతి'కోసం జరిగే పోటీల్లో మాత్రం బాలికలకు ప్రవేశం లేదు. బాలికల కోసం ప్రత్యేకంగా ఓ టోర్నమెంట్ జరిపే సంప్రదాయం ఇక్కడ లేకపోవడం గమనార్హం.

ఐఏఎస్ చంద్రకళ నివాసాల్లో సీబీఐ సోదాలు!



సిరిసిల్ల/జ్యోతినగర్(రామగుండం): రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఐఏఎస్ అధికారి భూక్య చంద్రకళ నివాసాలపై సీబీఐ శనివారం దాడులు చేయడం సంచలనం కలిగిస్తోంది. ఆమె సొంత ఊరు రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం గర్జనపల్లి. ఆమె తల్లిదండ్రులు వృత్తిరీత్యా పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీ సమీపంలోని గౌతమినగర్‌లో స్థిరపడ్డారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని స్వచ్ఛ భారత్ మిషన్‌లో చంద్రకళ విధులు నిర్వర్తిస్తున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో సీబీఐ అధికారులు ఆమె నివాసాలపై ఏకకాలంలో దాడులు చేసినట్లు సమాచారం. గర్జనపల్లితోపాటు గౌతమినగర్‌లోని తన సోదరుడి నివాసం, సా మిల్లులో సీబీఐ అధికారులు సోదాలు చేసినట్లు తెలిసింది. సుమారు 12 చోట్ల సీబీఐ సోదాలు చేసినట్లు ప్రచారం జరిగింది. మీడియా ప్రతినిధులు గర్జనపల్లి, గౌతమినగర్ వరకు వెళ్లి ఆరా తీశారు. ఉత్తరప్రదేశ్ క్యాడర్‌కు చెందిన చంద్రకళ నిజాయితీ గల అధికారిగా పేరు తెచ్చుకున్నారు. బులంద్‌షహర్ జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడు కాంట్రాక్టర్లు, అధికారుల పనితీరుపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేయడం అప్పట్లో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇప్పుడు ఆమె ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని సీబీఐ దాడులు చేయడం చర్చనీయాంశమైంది. ఆమె భర్త రాములునాయక్ నీటి పారుదల శాఖలో ఈఈగా పనిచేస్తున్నారు.

కాంగ్రెస్‌ను వీడం: శ్రీధర్‌బాబు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీ చేసి ఎమ్మెల్యేలుగా గెలుపొందిన 19 మంది పార్టీ మారే ప్రసక్తే లేదని మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. టీఆర్ఎస్ మైండ్ గేమ్‌లో భాగంగానే అసత్యపు ప్రచారం జరుగుతోందని చెప్పారు. కరీంనగర్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీలో ఉంటూ అభ్యర్థుల ఓటమికి కారణమైన వారిపై త్వరలోనే చర్యలు ఉంటాయని తెలిపారు. ఈవీఎంలపై అనేక అనుమానాలు ఉన్నాయని, 500 ఓట్లు పోలైన చోట ఈవీఎంలో 550 ఓట్లు పోలైనట్లు వెల్లడి కావడమే ఇందుకు ఉదహరణ అని పేర్కొన్నారు. అనుమానాల నివృత్తికి వీవీప్యాట్స్ లెక్కించాలని కోరినప్పటికి పట్టించుకోవడం లేదని, దానిపై విస్తృతంగా చర్చ జరిగి ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, దానికి తోడుగా నిలిచే టీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ వెలువడ్డాక ఏకగ్రీవం అయ్యే గ్రామాలకు రూ.15 లక్షలు ప్రోత్సాహకంగా ఇస్తామని కేటీఆర్ ప్రకటించడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. కోడ్ ఉల్లంఘన కింద సుమోటోగా ఎన్నికల అధికారులు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్డీ రాష్ట్ర కమిటీ సభ్యుడు రామన్న అరెస్టు

మహబూబాబాద్ రూరల్ : న్యూడెమోక్రసీ పెద్దచంద్రన్న వర్గానికి చెందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యుడు సింగనబోయిన వీరభద్రం అలియాస్ రామన్నను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి ఒక ఎస్ఎల్ఆర్‌తో పాటు 20 తూటాల మ్యాగ్జిన్, ఒక ల్యాప్‌ట్యాప్, పార్టీ సాహిత్యం స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి కథనం ప్రకారం.. రామన్న జిల్లాలోని బయ్యారం మండలం బాలాజీపేట గ్రామానికి చెందినవాడు. 22 ఏళ్లుగా వివిధ హోదాలలో, పని చేశాడు. ఆయన మొత్తం పది కేసుల్లో నిందితుడు. ఈ క్రమంలో ఉదయం డోర్నకల్ మండలం వెన్నారం గ్రామంలో గల చెరువు కట్టవద్దకు అశోక్, బెజ్జం ప్రతాప్, ఇతర దళ సభ్యులతో కలసి తుపాకులు దాచిపెట్టి సాధారణ దుస్తులతో వచ్చారు. రామన్న గ్రామ పంచాయతీ ఎన్నికల గురించి సమావేశమయ్యాడు. సమాచారం అందుకున్న డోర్నకల్ సీఐ జె. శ్యాంసుందర్, ఎస్ఐ అంబాటి రవీందర్, వారి సిబ్బందితో వెళ్లి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రావుల గిరిధర్, డీఎస్పీ ఆంగోత్ నరేష్‌కుమార్, సీఐలు శ్యాంసుందర్, లింగయ్య, రవి కుమార్ పాల్గొన్నారు.

పులి చర్మం పట్టివేత

అధికారుల అదుపులో నలుగురు నిందితులు

ఇచ్చోడ (బోథ్): ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలోని శివాజీచౌక్‌లో శనివారం అటవీశాఖ ఆధికారులు పులి చర్మాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరిని ఆదిలాబాద్‌లోని అటవీశాఖ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నారు. నిందితుల్లో ఇంద్రవెల్లి మండలం గౌరారం గ్రామానికి చెందిన ఒకరు ఉన్నట్లు తెలిసింది. పులి చర్మం ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారు. దాని వెనుక ఎవరి హస్తం ఉంది. అని ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై అటవీశాఖ అధికారులు మీడియాకు వివరాలు వెల్లడించేందుకు అందుబాటులోకి రావడం లేదు. అయితే స్వాధీన పర్చుకున్న పులి చర్మం చాలా రోజుల క్రితం నాటిదని తెలుస్తోంది.

నిట్‌లో సైన్స్ సంబురాలు ప్రారంభం

కాజీపేట అర్బన్ : కాజీపేటలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లో జనవిజ్ఞాన వేదిక వరంగల్ కమిటీ ఆధ్వర్యంలో జేవీవీ 30వ ఆవిర్భావం సందర్భంగా చెకుముకి రాష్ట్రస్థాయి పిల్లల సైన్స్ సంబురాలు శనివారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా డీఆర్‌డీఏ రిటైర్డ్ డైరెక్టర్ మార్త ఎన్.రెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ పాల్గొన్నారు. మార్త ఎన్.రెడ్డి మాట్లాడారు. నూతన పరిశోధనలు, ఆవిష్కరణలతోనే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని తెలిపారు. ఈ సంబురాల్లో 31 జిల్లాల నుంచి 500 మంది విద్యార్థులు, 200 మంది ఉపాధ్యాయులు, జేవీవీ సభ్యులు పాల్గొన్నారు. సైన్స్ సంబురాల్లో భాగంగా స్నేక్‌షో, స్కైవాచ్, మీట్ ద సైంటిస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇస్రో, ఎన్ఎస్‌సీ, కేఎంసీ,జేవీవీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్లు అలరించాయి.

చలికి ముగ్గురు వృద్ధులు మృతి

భీమారం (చెన్నూర్): మంచిర్యాల జిల్లా భీమారం మండలం మద్దికల్ గ్రామంలో శుక్రవారం ముగ్గురు వృద్ధులు చలికి తట్టుకోలేక మృతి చెందారు. బత్సుల చిన్నమ్మ(85), నైతం రామక్క (80), బొటికె రాజమల్లు (86) అనారోగ్యంతో ఉన్నారు. చలి తీవ్రత పెరగడంతో ఒకే రోజు రాత్రి అకస్మాత్తుగా మరణించారు.

శిశువు అనుమానాస్పద మృతి

చింతపల్లి: నల్లగొండ జిల్లా చింతపల్లి మండల పరిధిలోని చౌళ్లతండాలో శనివారం అనుమానాస్పద స్థితిలో 40 రోజుల ఆడ శిశువు మృతి చెందింది. ఎస్ఐ శంకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి మండలం దొరోని తండాకు చెందిన ఇస్లావత్ యాదగిరికి చింతపల్లి మండలం చౌళ్లతండాకు చెందిన శోభకు ఆరు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. శోభకు మొదటి కాన్పులో ఇద్దరు ఆడ శిశువులు కవలలుగా జన్మించగా, రెండోసారైనా కొడుకు పుడుతాడని ఆశగా ఎదురుచూశారు. కానీ రెండో కాన్పులో కూడా ఆడ శిశువే జన్మించింది. పేద కుటుంబం కావడంతో శిశువును సాకడం భారంగా భావించి శిశుసంరక్షణ గృహానికి అప్పగించేందుకు మూడు రోజుల క్రితం ఐసీడీఎస్ అధికారులతో చర్చలు జరిపారు. అధికారులు వారికి కౌన్సెలింగ్ నిర్వహించి శిశుగృహానికి చిన్నారిని తరలించగా, ఆ తర్వాత తల్లిదండ్రులు వెళ్లి చిన్నారిని తామే పెంచుకుంటామని చెప్పి తిరిగి తెచ్చుకున్నారు.

అహో.. యాదాద్రి



వాస్తు, ఆగమశాస్త్ర ప్రకారం ఆలయ పునర్నిర్మాణం

- మరో రెండు, మూడు నెలల్లో ప్రధాన ఆలయం పనులు పూర్తి
- నిరంతరం పనిచేస్తున్న 2వేల మంది శిల్పులు
- తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా ఆకృతులు
- తుది దశకు పనులు

సాక్షి, యాదాద్రి: ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆగమ, వైదిక నియమాలు.. ఆకట్టుకునే శిల్ప కళాకృతులతో ప్రపంచంలోనే అద్భుతమైన ఆలయంగా రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం రూపుదిద్దుకుంటోంది. రాజుల కాలంనాటి నిర్మాణశైలిని అనుసరిస్తూ.. జీవకళ తొణికిసలాడేలా కృష్ణ శిలలతో కూడిన అద్భుత సౌందర్య నిర్మాణం త్వరలో ఆవిష్కృతం కానుంది. దేశంలోని నారసింహ క్షేత్రాల్లో అతిపురాతనమైన యాదగిరికొండపై కొలువైన పంచనారసింహుడి ఆలయ మహిమలు విశ్వవ్యాప్తం కానున్నాయి. దక్షిణ భారతంలోని తంజావూరు.. అనంత మంగళం.. మధుర.. రామేశ్వరం వంటి పురాతన ఆలయాల నిర్మాణ శైలిని మించిన రాతి శిల్పాలు ఇక్కడ సిద్ధమవుతున్నాయి. పునాది నుంచి శిఖరం వరకు పూర్తిగా రాతి శిల్పాలతో సాగడం యాదాద్రి ఆలయ నిర్మాణ విశిష్టతగా చెబుతున్నారు.

రూ.2,000 కోట్ల అంచనా..

శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణం చినజీయర్ స్వామి సూచనలు, సలహాలు, వాస్తు, పంచరాత్ర ఆగమ శాస్త్ర పద్ధతిలో స్థపతులు పనులను ఎక్కడ కూడా ఇబ్బంది లేకుండా చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో.. సీఎం కేసీఆర్ పట్టుదలతో రూ.2,000 కోట్ల అంచనాతో చేపట్టిన ఈ నిర్మాణం త్వరలోనే పూర్తి కానుంది. ఇప్పటికే పనులకోసం రూ.1,800 కోట్ల నిధులు కేటాయించారు. ఇందులో రూ.610 కోట్లు ఖర్చు అయ్యాయి.

ప్రాకార మండపంపై రాతి పనులు

యాదాద్రి ప్రధానాలయం, అష్టభుజి ప్రాకార మండపం వద్ద కొడింగల్, సాలహారాలు, వేలంరాల శిల్పాల పనులను చేస్తున్నారు. అలాగే ప్రాకార మండపం వద్ద రాతి కప్పు పనులను ముమ్మరం చేశారు. గర్భాలయ ప్రధాన గోపురం వద్ద కర్ణకూటం లేయర్ అమర్చుతున్నారు. తూర్పు రాజగోపురంలోనుంచి వెళ్లాగానే కర్ణకూటం కనిపించే విధంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రధాన ఆలయానికి ఎదురుగా ఇటీవల ధ్వజస్తంభం కోసం బలిపీఠం నిలబెట్టారు. వాటికి బంగారు తొడుగులు చేయించడానికి ప్రథమంగా రాగి తొడుగు పనులను చేపట్టారు.

సర్వం నారసింహ చరితం

సప్తగోపుర సముదాయాలు, కాకతీయ శిల్పాలు, యాలి పిల్లర్లు ఇలా .. పలు హంగులతో ఆలయానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. రాజగోపురాల పనులు పూర్తయ్యాయి. గర్భాలయంలోగల ఉప ఆలయాలైన ఆండాల్ అమ్మవారి ఆలయం, క్షేత్ర పాలకుడు ఆంజనేయస్వామి, నమ్మాళ్వార్, రామానుజాళ్వార్‌ల ఆలయాలు కూడా ఇప్పటికే పూర్తయ్యాయి. గర్భాలయ ముఖ ద్వారానికి ఇరువైపులా జయ విజయుల స్వాగత మూర్తులను ఏర్పాటు చేస్తున్నారు. ద్వారంపై కొండగుహ ఆకృతి నరసింహావిర్భావ భక్త ప్రహ్లాదచరితం, ఆంజనేయస్వామి, గరుడాళ్వార్లు శంకుచక్రనామాలతో శిలా విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆండాల్ అమ్మవారి ఆలయానికి మధ్య స్వామివారి శయన మందిరాన్ని నిర్మించి శయన నారసింహుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ శయన మందిరాన్ని అద్దాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నారు. మరో పక్క ధ్వజస్తంభం పనులు కూడా ప్రారంభమయ్యాయి.



కొనసాగుతున్న శివాలయం పనులు

శరవేగంగా శివాలయం పనులు

శ్రీపర్వత వర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయ విస్తరణ, పునఃనిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. తోగుట స్వామి పర్యవేక్షణలో శివాలయ ప్రాకారం, ఆలయం లోపలి భాగం పనులు చేపట్టారు. మహా శివుడు కొలువైన ఈ ఆలయాన్ని కూడా లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంతోనే అందుబాటులోకి తేనున్నారు.

పూర్తి కావస్తున్న ప్రధానాలయం

ప్రస్తుతం ప్రధాన ఆలయంలో ఇప్పటికే గర్భాలయం, ముఖ మండపం, అంతర్గత ప్రాకారం, ఏడు గోపురాలు పూర్తయ్యాయి. అష్టభుజి ప్రాకారం, బాహ్య ప్రాకారం పనులు కొనసాగుతున్నాయి. మరో రెండు నెలల్లో ప్రధాన ఆలయాన్ని ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

పుష్కరణి పనులు వేగం

ప్రస్తుతం 300 గజాల్లో ఉన్న పుష్కరిణిని 1,200 గజాలకు విస్తరిస్తున్నారు. రెండు నెలల్లో సివిల్ పనులను పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. పుష్కరిణిలో ఒక రాతి మండపం ప్రారంభించారు. బ్రహ్మోత్సవాల నాటికి పుష్కరిణి పనులు కూడా పూర్తి చేసి శ్రీస్వామి వారి చక్రతీర్థ స్థానం చేపట్టాలన్న పట్టుదలతో ఉన్నారు. అంతే కాకుండా భక్తులకు ఇబ్బందులు కలగకుండా కొండకింద గల గండిచెరువును కూడా అభివృద్ధి చేస్తున్నారు.

సమకాలిన పరిస్థితుల చిత్రీకరణ

యాదాద్రి క్షేత్ర చరిత్రతోపాటు, ప్రస్తుత సమాజంలోని వాస్తవ పరిస్థితుల గురించి భావితరాలకు తెలిపేందుకు ఇప్పుడు ఉన్న కరెన్సీ, తెలంగాణ జీవన విధానం, బతుకమ్మ, ఉగాది, సంక్రాంతి పండుగలు, క్రీడలు, తెలంగాణ తల్లి ఆకృతులు వంటి వాటిని ప్రాకార మండపాల్లోని పిల్లర్లలో చెక్కుతున్నారు.

పూర్తయిన రాజగోపురాలు

మహారాజగోపురం పనులు పూర్తయ్యాయి. వీటిపై ప్రస్తుతం లక్ష్మీనరసింహుని వివిధ రూపాల విగ్రహాలు, కళశాలను ఏర్పాటు చేసే పనుల్లో కూలీలు నిమగ్నమయ్యారు. ఇప్పటికే మొదటి ప్రాకారంలో 3 అంతస్తుల తూర్పు రాజగోపురం, 5 అంతస్తులతో దివ్య విమాన రాజగోపురం, రెండవ ప్రాకారంలో 5 అంతస్తులతో తూర్పు, ఉత్తర, దక్షిణ రాజగోపురాల నిర్మాణాలు పూర్తి చేశారు.

సుందరీకరణ కోసం ప్రణాళికలు

పెద్దగుట్టపై చేపట్టిన లేఅవుట్‌లో ఓపెన్‌ప్లాట్లు, రోడ్లు, సుందరీకరణ పనులు పూర్తికావచ్చాయి. 250 ఎకరాల లేఅవుట్ ప్లాన్ రూపొందించి చేపట్టిన అభివృద్ధి పనులు దాదాపు పూర్తి కావొస్తున్నాయి. రూ.207కోట్ల నిధులను కేటాయించారు. 100 కోట్లతో రోడ్లు, మంచి నీటి సౌకర్యం, మురుగునీటి పారుదల, పచ్చదనం కోసం పనులు చేపట్టారు. హెచ్ఎండీఏ పర్యవేక్షణలో రోడ్ల మధ్య, పక్కన మొక్కలతో పాటు పచ్చని గడ్డిని పరిచారు.



దక్షిణ రాజగోపురం వద్ద జరుగుతున్న ప్రాకార మండపం పనులు


మూడు నెలల్లో పూర్తి



గీతారెడ్డి, ఈఓ

మరో మూడు నెలల్లో ప్రధాన ఆలయ పనులు పూర్తవుతాయని ఈవో గీతా రెడ్డి తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు జరుగుతున్నాయని చెప్పారు.


జీయర్ మంగళశాసనాలతో..



ప్రధాన అర్చకుడు

చినజీయర్ స్వామి సూచనలు, సలహాలు, మంగళశాసనాలతో జరుగుతున్నాయని ప్రధాన అర్చకుడు లక్ష్మినరసింహా చార్యులు తెలిపారు. స్థపతులు ఆగమశాస్త్ర పద్ధతిలో పనులను పూర్తి చేస్తున్నారు.

పూర్వజన్మ సుకృతం



స్థపతి ఆనందచారి

యాదాద్రి క్షేత్రం అద్భుతంగా మారుతోందని స్థపతి డాక్టర్ ఆనందచారి వేలు తెలిపారు. ఇలాంటి ఆలయంలో స్థపతిగా పని చేయడం పూర్వజన్మ సుకృతమన్నారు.

రెండువేల మంది శిల్పుల శ్రమ

తమిళనాడు, బిహార్, ఏపీలోని గుంటూరు, ఆళ్లగడ్డ ప్రాంతాల నుంచి వచ్చిన 2వేల మంది శిల్పులు ప్రస్తుతం పనిచేస్తున్నారు. నిపుణుల సూచన మేరకు గుంటూరు– ప్రకాశం మధ్యలో ఉన్న గురిజేపల్లి ప్రాంతం నుంచి లక్ష టన్నుల కృష్ణ శిలలను వాడుతున్నారు.



ఆలయ సన్నిధిలో భోజనాలు చేస్తున్న శిల్పులు

పచ్చదనం అందాలు

యాదాద్రిలక్ష్మి పచ్చదనానికి అత్యంత ప్రాముఖ్యతను ఇస్తున్నారు. ఇందుకోసం కొండచుట్టూ ల్యాండ్ స్కేప్‌లు ఏర్పాటు చేసి పచ్చదనం పంచే మొక్కలు నాటుతున్నారు. అలాగే కొండపైకి వెళ్ళే దారిలో ఇరువైపులా పచ్చని పూలమొక్కలు, సుగంధ ద్రవ్యాలు, ఔషధగుణాలు కలిగిన మొక్కలను నాటుతున్నారు.



రసాభాసగా కాంగ్రెస్ సమావేశం

కటుకం మృత్యుంజయం వర్సెస్ 'చింతకుంట'

- సమావేశంలోనే వాగ్వాదానికి దిగిన నేతలు
- చింతకుంట కారును అడ్డుకున్న కటుకం వర్గీయులు
- శ్రీధర్‌బాబు చొరవతో సద్దుమణిగిన వివాదం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో శనివారం జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం రసాభాసగా ముగిసింది. సమావేశం ముగింపు దశలో డీసీసీ అధ్యక్షుడు కటుకం మృత్యుంజయం మాట్లాడుతూ.. పీసీసీ ఆదేశాల మేరకు ఈనెల 14లోపు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి బూత్ లెవల్, మండల అధ్యక్షుల పేర్లను పంపించాలని కోరారు. ఇదే సందర్భంలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు జోక్యం చేసుకొని నియోజకవర్గాల్లో ఇటీవల ఎన్నికల్లో ఓడిపోయినవారు సూచించిన పేర్లను పరిగణలోకి తీసుకోవాలని, పీసీసీ రాష్ట్ర కమిటీలో జరిగిన నిర్ణయాన్ని కాదని మళ్లీ కొత్తగా బూత్ లెవల్ మండల కమిటీ అధ్యక్షుల పేర్లు ఇవ్వాలని ద్వితీయ శ్రేణి నాయకులను కోరడం దేనికంటూనే నువ్వేంటి కొత్తగా అంటూ కటుకం మృత్యుంజయంను ఉద్దేశించి ప్రశ్నించారు. దీంతో కటుకం జోక్యం చేసుకొని ఏకవచనంతో మాట్లాడటం తగదంటూ షటప్ అని అదే స్థాయిలో జవాబిచ్చారు. దీంతో ఒక్కసారిగా కటుకం వైపు విజయరమణారావు దూసుకెళుతూ ఎన్నికల సందర్భంగా ఎక్కడికీ వెళ్లకుండా జిల్లాలో కూర్చుండి పుల్లలు పెడుతూ పార్టీని నాశనం చేశావని, ఇలాగైతే బాగుండదని విరుచుకుపడ్డారు. దీంతో మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు జోక్యం చేసుకొని ఇరువురిని సముదాయించి విజయరమణారావును కారులో ఎక్కించి పంపించే ప్రయత్నం చేస్తుండగానే ఒక్కసారిగా కటుకం వర్గీయులు దిండిగాల మధు, జొన్నల రమేశ్, నసీమొద్దీన్ తదితరులు విజయరమణారావు కారుకు అడ్డంగా నిలిచారు. 'మొన్నటికి మొన్న పార్టీలోకి వచ్చి టికెట్ తెచ్చుకున్నావ్, మృత్యుంజయంను ఏనాడైనా పిలిచావా, ఇప్పుడు ఈ గలాటా ఏందీ' అంటూ మృత్యుంజయంకు క్షమాపణ చెప్పాలని వాగ్వాదానికి దిగారు. దీంతో కారులో కూర్చున్న విజయరమణారావు కారు దిగకుండానే క్షమాపణ చెప్పేది లేదని భీష్మించుకున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు అందరినీ సముదాయించి విజయరమణారావు కారుకు అడ్డంగా నిలిచిన వారిని తప్పించారు. దీంతో కటుకం వర్గీయు లు విజయరమణారావు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తుండగ ఆయన వెళ్లిపోయారు. కాగా అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారిగా జరిగిన కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, సుద్దాల దేవయ్య, అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, నాయకులు చల్మెడ లక్ష్మీనరసింహారావు తదతరులు హాజరయ్యారు.



విజయరమణారావు కారును అడ్డుకుంటున్న మృత్యుంజయం వర్గీయులు

సీనియర్లు డుమ్మా

ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన పార్టీ సీనియర్ నేతలు పొన్నం ప్రభాకర్, టి.జీవన్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మేడిపల్లి సత్యం, జువ్వాడి నర్సింగరావు, మక్కాన్‌సింగ్, కేకే.మహేందర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి ఈ సమావేశానికి హాజరుకాలేదు.

సాక్షి పెళ్ళిచూపులు

ఆదివారం 6-1-2019

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



క్రిస్టియన్ మాల /M.Tech /Govt. AE (Transco) / 50,000/- PM/ 5'9" ఎత్తు/ 30 సం॥ల అబ్బాయికి తగిన అమ్మాయి కావలెను. 9642728299 [HA-10024]

క్రిస్టియన్ మాదిగ /B.Tech /C.Govt. బ్యాంక్ Asst. మేనేజర్ (SBI)/ 45,000/- PM/ 5'8" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. 9515755529 [HA-10024]

SC Madiga /28y/5'10"/ M.Tech / SWE/ 1 Lak PM / Well Settled Family కలిగిన వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్:9676968974, 9705345003 [HA-3360]

SC Madiga (Ch) /28y/5'9"/B.Tech / MBA / Govt. Emp / Well Settled Family కలిగిన వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్: 9705345003, 9676968974 [HA-3360]

Kapu డైవర్సీ/34y/5'10"/B.Tech / MBA / SWE / 1 Lak PM / Well Settled Family కలిగిన వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్: 9705345003, 9951022798 [HA-3360]

రెడ్డి/విడో/కుల, ధన ప్రసక్తిలేదు 2 కోట్ల ఆస్తి కలిగి 33 సం॥లు H: 5'10"/ Qly: PG / నెలకి 1 లక్ష సంపాదన గల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 7036801690 [HA-658943]

58 / Widower / Telugu/ rtrd Lecturer / Seeks / Educated Homely Lady for remarriage pref widow no encumbrances 7731991312 [HA-48366]

★

రెడ్డి/27Y /5'3"/ MS/ SWE/ USA/ 50 Crores Property వరునకు తగిన వధువు కావలెను. Ph: 9248064777 [HA-661254]

రెడ్డి/26Y /5'11"/ B.Tech / MS/ SWE/ USA / 6L PM / 15 Cr Property వరునకు తగిన వధువు కావలెను. Ph: 9030315599 [HA-661254]

రెడ్డి/31Y /5'8"/ B.Tech / MBA / IT Manager / 4 L PM / 45 Cr Property వరునకు తగిన వధువు కావలెను. Ph: 9248064777 [HA-661254]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015 Email: kcreddy43@gmail.com

వధువు కావలెను

Reddy/ MS/MBA/29/ 5'10"/100 Cr + Father (IAS) * MS / Industrialist / Hyd/ 30/5'8"/100 Cr / Hyd * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech /H1/USA/230K/ Microsoft / 29/5'8"/ * MS/28/5'11"/20 Cr * 30/ 5'11"/ 200K * 28/5'10"/ I 140/140K * Cont: K.C. Reddy, Ph: 9849321309

Reddy/Late Marriage/ B.Tech /Business / 36/5'11"/30 Cr (Prop) No Dowry * Cont: K.C. Reddy, B. Hills, Hyd. Ph: 9849321309/9347807015

Reddy/MBBS / Int. Med (Residency) / Fellowship/ Haematology/ 31/6' * Cont: K.C. Reddy, B. Hills, Hyd. Ph: 9849321309/9347807015

Reddy/MBBS / Int-Med/Residency /USA/ Fellowship / Onchology / 31/5'8" * Cont: K.C. Reddy, B. Hills, Hyd. Ph: 9849321309/9347807015

Reddy/Divercee / B.Tech/ MS / Business / Hyd / Royal Family / 33/6'/ V. Smart / 100 Cr + (Prop) / Hyd * Cont: K.C. Reddy, Hyd, Ph: 9849321309

Reddy/MBA/ Very Good Business / 26/5'11"/ 350 Cr / Hyd * MS /27/6'/200 cR * 28/6'/300 Cr * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech IIT/ M.Tech/ IIT/ 29/5'11" * 30/5'7"/35L/ Yr * NIT / 30/5'9"/26 l / yR/ hYD * 28/5'10"/40L /Yr/ 15 Cr * Cont: K.C. Reddy Ph: 9849321309/9347807015

Reddy/B.Tech / MS /H1/USA/28/ 5'9"/ GC/ 140/90K /10 Cr *25/6'/120K/ 30 Cr * 30/5'11"/200K * Cont: K.C. Reddy, Hyd- Ph: 9849321309/9347807015

Reddy/MBBS/PG * 29/5'7"/50 Cr * 29/ 6'/75 Cr * 28/6'/20 Cr*28/5'10"/10 Cr* 28/ 5'9"/25 Cr * Cont: K.C. Reddy B. Hills, Hyd- Ph: 9849321309/9347807015

వరుడు కావలెను

Reddy/B.Tech/M.Tech/27/5'4"/ Beautiful / 65 Cr (Prop) / Share * Cont: K.C. Reddy Mar-Bureau, B. Hills, Hyd, Ph: 9849321309/ 9347807015

Reddy/MBA/28/5'3"/Beautiful/ 40 Cr (Share) Prop/ Hyd. * Cont: K.C. Reddy Mar-Bureau, B. Hills, Hyd, Ph: 9849321309/ 9347807015

Reddy/ B.Tech / MS/ USA/ H1/ Beautiful / 130K/30 Cr (Share) Prop/ Hyd * Cont: K.C. Reddy, B. Hills, Hyd, Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech/ MBA/ 29/5'3"/ Father Very Big (Famous) Builder / Hyd/ Richest * Cont: K.C. Reddy, Hyd Ph: 9849321309/ 9347807015

Reddy/MBA / 26/5'4"/300 Cr * 27/5'6"/100 Cr * 24/5'6"/150 Cr * 23/5'6"/ 60 Cr * 28 / 5'3" / 50 Cr *28/5'5"/50 Cr * 30/5'21/2"/ 100 Cr*Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309

Reddy/MBBS / 22/5'3"/40 Cr * 22/ 5'5"/ 30 Cr* MS/ 31/5'4"/50 Cr * MD / 30/ 5'8"/500 Cr* Cont: K.C. Reddy - Mar-Bureau, Hyd Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech / SWE / INDIA * 24/5'5"/30 Cr* 28/5'5"/50 Cr * 26/5' 3 1/2"/40 Cr *27/5'5"/20 Cr * 28/5'3"/20 Cr * 28/5'3"/40 Cr * Cont: K.C. Reddy - Hyd Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech/28/5'3"/20 Cr * 28/5'3"/10 Cr * 25/5'6"/50 Cr * 27/5'8"/50 Cr * 26/5'5"/50 Cr * 23/5'3"/CA/ 20 Cr * 26/5'4"/10 Cr * Cont: K.C. Reddy - Hyd Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech / MS/ H1/USA * 24/5'3"/10 Cr * 26/5'7"/30 Cr* 28/5'4"/30 Cr *25/5'4"/ 25 cr * 26/5'5"/10 cr * 26/5'3 1/2"/40 Cr * Cont: K.C. Reddy, Hyd Ph: 9849321309

Reddy/BTech / M.Tech/ 25/5'6"/60 Cr * 25/5'4"/20 Cr * 31/5'4"/70 Cr * 28/5'3"/10 Cr * 29/5'3"/50 Cr * 26/5'5"/10 Cr *Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309, 9347807015

[D-011]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి BE(IIT), MBA, 26, 5'10", 150 K, 12 Crores, Handsome, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS 27, 5'11", 85 K, 8 Crores, H1, USA, Handsome, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BE, MBA, 26, 6', Rich, Hyderabad, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 29, 6', 34 L P/A, Hyd, Handsome, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE, MS, 26, 5'6" Business Analyst, 120 K, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818

రెడ్డి MBA, 27, 5'3", Hyd, 2.5 Crores, Fair, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818

రెడ్డి Degree, 24, 5'3", Hyderabad, 50 Crores, Avinash, Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 24, 5'5", 20 Crores, Hyd, Fair, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, MS, 26, 5'11" , 90 K, 2 Crores, SWE, USA, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5'11", H1, 100 K, USA, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA 27, 5'9", Manager, Handsome, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, Govt Officer, 42, 5'8" , Handsome, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, M. Tech, (IIIT), 26, 5'1", SWE, Fair & Slim, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 24, 5'4" , SWE, 65 K, USA, Fair & Slim, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, Infosys, Systems Engineer, 25, 5'6", Fair, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE,MBA, 30, 5'6" Manager, 12 L P/A, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

కుల ప్రసక్తిలేదు (గౌడ)/ 42/5'7"/ Pvt. Job / 60,000/- PM గల వెల్ సెటిల్డ్ వరునికి తగిన 34-38 సం॥ FC / BC వధువు కావలెను. Ph: 6309608785/9848466974 [HA-658737]

SC/Mala, Hindu/ Diverce/33/5'9"/MS (USA) /SWE at Hyd/ 90K PM/ Seeks Un married Bride Age : 25-31. No Dowry/Ph: 9441188188 Direct. [HA-661887]

వరుడు కావలెను



SC మాల/23/5'5"/Fair/B.Tech(NIT) / Income Tax Officer / 35,000/- PM/ అందమైన సాంప్రదాయక కుటుంబపు వధువుకు వరుడు కావలెను. 9182870836 [HA-10024]

కుల పట్టింపులేదు/ (2nd మ్యారేజ్) 45/5'4"/ ఇంటర్/ఫ్యామిలీ పెన్షన్/22,000/- PM/ స్వంత ఇల్లు గల అందమైన వధువుకు వరుడు కావలెను. 9573736895/7075816068 [HA-10024]

ప్రభుత్వ ఉద్యోగినికి ఏదైనా Private / Govt. ఉద్యోగి వరుడు కావలెను. 25-30 సం॥ ఉండాలి. కుల పట్టింపులేదు. 7680975761 [HA-10024]

కాపు/విడో/28/5'5"/BSc, BEd /Govt. టీచర్/60,000/- PM/ ఈ మధ్యనే భర్తను కోల్పోయిన వధువుకు కుల/ఆస్తి ప్రసక్తిలేని ఇల్లరికం వరుడు కావలెను. 6309069291 [HA-10024]

SC Christian /25y/5'5"/B.Tech / SWE / 40K PM / Well Settled Family కలిగిన వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్: 7673939882, 8790246602 [HA-3360]

SC/25y/5'4"/B.Tech / SWE / 40K PM / Well Settled Family కలిగిన వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్: 8790246602, 7673939882 [HA-3360]

Kapu /డైవర్సీ/30y/5'4"/MBA / Govt. Emp/ Well Settled Family కలిగిన వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్: 9951022798, 7673939882 [HA-3360]

No Caste Bar చౌదరి/విడో/ Age 32/ పిల్లలులేరు & Parents ఆస్తి కలిగిన వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. Whatsapp: 8501849854 [HA-661468]

కుల, ఆస్తి పట్టింపులేదు చౌదరి/విడో/ Age 40/ స్థిరాస్తులు కలిగి పిల్లలు లేని వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. Whatsapp: 9951698425 [HA-661468]

నాయుడు/Age 44/ గ్రానైట్ బిజినెస్/ Full ఫెయిర్/ హైట్ 5.4. అందమైన వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. Ph: 8187085313 [HA-661468]

రెడ్డి విడో/Age 28/Software Job / 40 K PM/ Full ఫెయిర్ ఉన్న వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. Ph: 8498903564 [HA-661468]

చౌదరి/Age 28/Govt. Job / Height 5.4./ ఆస్తి గల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 9603951435 [HA-661468]

రాజులు/Age 26/షాపింగ్ Complexs / Full Fair / 5.4 హైట్/ అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 8185824228 [HA-661468]

మున్నూరుకాపు/32/5'5"/గైనకాలజిస్ట్ డాక్టర్/Own క్లినిక్/ 1 లక్ష PM / ఇన్‌కమ్‌గల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. (కుల పట్టింపులేదు) Ph: 8106499144 [HA-658943]

కమ్మ/విడో, కుల, ధన ప్రసక్తిలేదు 3 కోట్ల ఆస్తి గల 32 సం॥లు h: 5'5"/Qly: PG నెలకి 1 లక్ష సంపాదన గల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 9676327710 [HA-658943]

కుల పట్టింపు లేదు /బ్రాహ్మణ/ 30 Yrs / 5'4"/ 2nd మ్యాచ్/ డిగ్రీ/నో సిస్టర్స్/నో బ్రదర్స్ తండ్రి లేట్ సొంత ఇల్లు కల్గి పిల్లలు లేని అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 7673923785 [HA-658943]

కుల,ఆస్తిపట్టింపులేదు/చౌదరివిడో/32Age /5'4/MBA/ Full Fair / C.Food Business/ ఆస్తి22కోట్లు గల అందమైన ఏకైక వధువుకు 1,2వరుడుకావలెను.వాట్సప్9666583973 [G-734]

రెడ్డి/విడో/కుల, ఆస్తి పట్టింపులేదు/ 7 కోట్ల ఆస్తి/32/5'3"/Degree/Fair / నెలకు మంచి సంపాదన కల్గిన వధువుకు వరుడు కావలెను. (ఇల్లరికం Ok) 9581690158 [HA-66307]

★

రెడ్డి వధువు/ 25Y /5'1"/B.Tech/ SWE / 4 L PA / 5 Crores / Property వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9030315599 [HA-661254]

రెడ్డి వధువు/ 26Y /5'8"/MBBS/MD/ Doctor / 2 Cr / Property గల వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9246960888 [HA-661254]

కుల పట్టింపులేదు/ 29Y /5'4"/ B.Tech/ SWE/ 8 L PA / Well Settled అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9246960888 [HA-661254]

వేదికలు



ఫ్రీ రిజిస్ట్రేషన్. అన్ని కులముల వారికి AP, తెలంగాణలో Govt SWE, 1వ, 2వ, లేట్, దేశ, విదేశ, సంబంధాలకై సంప్ర॥ నో కమిషన్/ వాట్సాప్ 7095940444 [HA-2195]

మనిషి జీవితం శాశ్వతం కానిది. కావున శ్వాస ఉన్నంత వరకు సంతోషంగా ఉండాలంటే జీవిత భాగస్వామి తోడుండాలి కదా! కుల పట్టింపులేని 1వ/ 2వ/లేట్/విడో/డైవర్సీ వ॥ 25-60 సం॥ సంప్ర॥ 7286031653 [HA-658943]

రజక వివాహ వేదిక (1994) Abroad, ఇంజినీర్స్, డాక్టర్స్, Govt. Job, Business BED సంబంధాలకై సంప్ర॥ 8106303155/ 9391265304 [HA-658943]

మీరు మెచ్చే సంబంధాలను సకాలంలో కుదర్చబడును. అన్ని కులాలకు 1,2, లేటు, NRI మ్యాచెస్, మీ ఇంట్లో పెళ్ళి మా బాధ్యత. నమ్మకంతో అడుగు వేయండి. శుభ వివాహానికి కాల్: 6304826162/ sservices.in [HA-21638]

కావ్యశ్రీ మ్యారేజ్ బ్యూరో/ 1వ, 2వ, లేట్ మ్యారేజెస్, డైవర్సీస్, విడో, విడోయర్స్, పెనర్షనర్లకు 20-70 సం॥ అన్ని కులముల వారికి సంబంధాలు కుదర్చబడును.స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్. 7286931144 [HA-658710]

SC మాల హిందువులకు మాత్రమే. B.Tech/ M.Tech /IAS/IPS/ MBBS/MD/MCA/Abroad & Govt Job Holders సంప్ర॥ శ్రీలక్ష్మి మ్యారేజ్ బ్యూరో సాయిరాం. Ph: 8008988513, 9000919182. [H-658399]

వాసవి-విజయవాడ(రి)వారి ఆర్యవైశ్య వధూవరుల వివాహ పరిచయ వేదిక మరియు పునర్వివాహ పరిచయ వేదిక 26-1-2019 తేదీన I.V. ప్యాలెస్, విజయవాడ నందు జరుగును. వివరాలకు : ✆ 99895 00130, 81064 54284 [B-536]

15రో॥ అన్ని కులాల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి. info@rohinimarriages.com, ✆ 94920 33897, 9441829644, 9440785888 వాట్సప్ [B-544]

రూ.500లకు 25 సంబంధాలు Online / WhatsApp / ఫోన్ కాల్‌తో బయోడేటా ఫ్రీ రిజిస్ట్రేషన్. ఫోన్ః 97016 59125. www.jeelakarrabellam.com [G-669]

నాయీబ్రాహ్మణ మాట్రిమోనీలో రిజిస్టర్ అవ్వండి మీకుకావలసిన జీవిత భాగ స్వామి నిఎంచుకొండి రిజిస్ట్రేషన్ ఫ్రీ. www.nayeebrahminamatrimony.com 9381616796 [G-735]

బాబురావు మ్యారేజిబ్యూరో: మాల, మాదిగ స్పెషల్: IAS, IPS, IRS, IRTS, MBBS, M.S, MD, GOVT JOBS, SWE, USA, Group-I, II. Cell: 7893013265. [W-925855]

★

కాపు వధూవరుల పరిచయ వేదిక/ 27/01/19న భవానీ మ్యారేజ్ బ్యూరో ఆఫీస్ ECIL, Hyd లో జరుగును. Time : 10 am to 4 pm Ph: 9704656103/9533608887 [HA-20269]

మాదిగ పరిచయ వేదిక తేది 03-02-2019, 10 AM - 6 PM, ఫీజు 1 వేయి, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్. సంప్ర. స్వప్న వివాహ వేదిక, సికింద్రాబాద్ స్టేషన్. 9347046175 [HA-698884]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి పెళ్ళిచూపులు

Combined : 1430/- for 4 Lines 385/- Extra Line | Andhra Pradesh: 990/- for 4 Lines (Incl. Hyd) 275/- Extra Line

Telangana : 880/- for 4 Lines (Incl. Hyd) 240/- Extra Line | * Color 25% Extra

గమనిక : ఇకపై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం.

3+3 3 ప్రకటనలకు చెల్లించండి 3 ప్రకటనలు ఉచితంగా పొందండి

నిజామాబాద్	:99122 20764	తిరుపతి	:99122 20584	తాడేపల్లి గూడెం	:99122 20558
కరీంనగర్	:9705933396	కడప	:99516 02932	రాజమండ్రి	:99122 20358
వరంగల్	:99516 02868	అనంతపూర్	:99122 20718	విజయవాడ	:9912225442
నల్గొండ	:95055 08382	కర్నూల్	:99122 20575	గుంటూరు	:99122 20349
మహబూబ్‌నగర్	:99516 02829	శ్రీకాకుళం	:99122 20343	ఒంగోలు	:99122 25431
ఖమ్మం	:99122 20596	విశాఖపట్నం	:99122 20550	నెల్లూరు	: 99516 02861

మరియు మీ దగ్గరలోని సాక్షి ప్రాంతీయ కార్యాలయములలో సంప్రదించండి.

6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-23256000 Ext: 6230 / 6235 Cell: 9912225456.

ఫిబ్రవరి నుంచి ఎస్సారెస్పీ నీటి విడుదల

నాలుగు తడులుగా విడుదల చేయాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు లభ్యత నీటిలో తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇస్తూనే, మిగతా నీటిని యాసంగి అవసరాలకు ఇవ్వాలని నిర్ణయించిన నీటి పారుదల శాఖ, ఫిబ్రవరి నుంచి ఆయకట్టు పంటల స్థిరీకరణకు నీటిని విడుదల చేయాలని నిర్ణయించింది. ఫిబ్రవరి తొలి వారం నుంచి నీటిని నాలుగు తడులకు విడుదల చేసేలా ప్రణాళిక రచించింది. ఫిబ్రవరిలో రెండు తడులు, మార్చిలో రెండు తడులు కలిపి మొత్తంగా ఎస్సారెస్పీ కింద పంటల స్థిరీకరణకు 14 టీఎంసీల నీటిని విడుదల చేయాలని నిర్ణయించింది. శనివారం ప్రాజెక్టు పరిధిలోని ఎమ్మెల్యేలు ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, సంజయ్‌కుమార్, సుంకె రవిశంకర్, గంగుల కమలాకర్, మనోహర్‌రెడ్డిలు జలసౌధలో నీటి పారుదల శాఖ అధికారులతో భేటీ అయ్యారు. యాసంగి పంటల నీటి విడుదలపై చర్చించి ఈ మేరకు నిర్ణయించారు. ఎల్‌ఎండీ దిగువన 2 టీఎంసీల నీటిని రెండు తడులకు విడుదల చేయాలని నిర్ణయించారు.



మాట్లాడుతున్న జాజుల. చిత్రంలో జస్టిస్ ఈశ్వరయ్య తదితరులు

7న ఆర్డినెన్స్ కాపీల దహనం: జాజుల

సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్ ఎన్నికల్లో రిజర్వేషన్లు తగ్గిస్తూ ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్‌తో బీసీల నోటికాడి ముద్దను గుంజుకున్నట్లు అయిందని బీసీ సంక్షేమం సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ప్రభుత్వం తెచ్చిన ఈ ఆర్డినెన్స్‌పై న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. దీనిపై ఈ నెల 7న 31 జిల్లాల్లో ప్రభుత్వం ఇచ్చిన ఆర్డినెన్స్ కాపీలను దహనం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం బషీర్‌బాగ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జాజుల మాట్లాడుతూ.. జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు 34 శాతం ఉన్న రిజర్వేషన్లను 22 శాతానికి తగ్గిస్తూ ఆర్డినెన్స్ తేవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. రిజర్వేషన్లపై ధర్నాలు, ఆందోళనలు, నిరసనలు చేసినా ప్రభుత్వంలో చలనం లేదని వాపోయారు. గ్రామ పంచాయతీలో భారీ ఎత్తున బీసీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. ఓబీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. కుట్ర, కుతంత్రంతో బీసీలను అణచివేస్తున్నారని ఆరోపించారు. బీసీలపై ఒక ప్లాన్‌తోనే ఇలా చేస్తున్నారని మండిపడ్డారు. సామాజిక విశ్లేషకుడు సాంబశివరావు మాట్లాడుతూ.. రిజర్వేషన్ల విషయం కేసీఆర్‌కు ముందే తెలుసని, అయినా పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. ఈ సమావేశంలో విజయభాస్కర్, బీసీ నేతలు జాజుల లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దొంగచాటుగా తెస్తున్న బంగారం పట్టివేత

హైదరాబాద్: దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తెస్తున్న ఇద్దరు వ్యక్తులను శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. ఒకరి వద్ద నుంచి కేజీ బంగారం, మరోవ్యక్తి నుంచి 876 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకొని వారిని విచారిస్తున్నారు. శుక్రవారం రాత్రి దుబాయ్ నుంచి నగరానికి వస్తున్న ఓ వ్యక్తి నాలుగైదు సీల్డ్ కవర్‌లలో బంగారు ఆభరణాలను చెక్‌ఇన్ బ్యాగేజ్‌లో పెట్టుకుని వెళ్తున్నాడు. కస్టమ్స్ అధికారుల తనిఖీల్లో ఈ కేజీ బంగారు ఆభరణాలు పట్టుబడ్డాయి. అదేవిధంగా శనివారం ఉదయం దుబాయ్ నుంచి నగరానికి వస్తున్న మరోవ్యక్తి స్వీటు బాక్స్‌లో కింద, పైన గోల్డ్ ఫాయిల్స్ అమర్చి తీసుకొస్తుండగా అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాస్తవానికి 6 నెలల పాటు ఇతర దేశాల్లో ఉండి స్వదేశానికి వస్తున్న ఆడవాళ్లయితే రూ.1 లక్ష విలువ గల బంగారం, మగవారైతే రూ.50 వేలు విలువ గల బంగారాన్ని తెచ్చుకునే అవకాశం ఉంది. అంతకంటే ఎక్కువ తీసుకొస్తే కస్టమ్స్ అధికారులకు ముందుగా తెలపాల్సి ఉంటుంది. ఇండియన్ బంగారం ధరల ఆధారంగా 32 శాతం ట్యాక్స్‌ని చెల్లించాల్సి ఉంటుంది. ఇలా చేయకుండా చెక్‌ఇన్ బ్యాగేజ్‌లో పెట్టుకుని అక్రమ రవాణాకు ప్రయత్నించడంతో వీరిద్దరినీ కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. వీరి వెనక ముఠాలు ఏవైనా ఉన్నాయా అనే కోణంలో అధికారులు విచారిస్తున్నట్లు సమాచారం.

సొరంగాల్లోనే సమస్యంతా!

- ఎస్‌ఎల్‌బీసీ, దేవాదుల టన్నెల్ పనుల్లో తీవ్ర జాప్యం
- 2020 నాటికి ఎస్‌ఎల్‌బీసీ పూర్తి కావడం కష్టమే
- రామప్ప–ధర్మసాగర్ సొరంగ పనులు ఎక్కడివక్కడే
- నేడో, రేపో సీఎంకు నివేదించనున్న రిటైర్డ్ ఇంజనీర్లు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులన్నీ సాఫీగా సాగుతుండగా, రెండు ప్రాజెక్టులు మాత్రం కొరకరాని కొయ్యలుగా తయారయ్యాయి. ఆ ప్రాజెక్టుల పనులు చేపట్టి ఏళ్లు గడుస్తున్నా, వివిధ సమస్యల వల్ల అడుగు ముందుకు పడడం లేదు. ఆ రెండు ప్రాజెక్టుల్లో ఒకటి ఎలిమినేటి మాధవరెడ్డి శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్(ఎస్‌ఎల్‌బీసీ) ప్రాజెక్టు కాగా, రెండోది దేవాదుల ఎత్తిపోతలలోని మూడో దశ పనులు. ఈ రెండు ప్రాజెక్టుల పరిధిలోని సొరంగాల పనులు ఏళ్లవుతున్నా కొలిక్కి రావడం లేదు. వందల కోట్లు కుమ్మరిస్తున్నా, సొరంగాలు పూర్తవడం లేదు. ఇటీవల ప్రాజెక్టు పరిధిలో పర్యటించిన శ్యాంప్రసాద్‌రెడ్డి నేతృత్వంలోని రిటైర్డ్ ఇంజనీర్ల బృందం అత్యంత క్లిష్టమైన ప్రాజెక్టుల్లో ఈ రెండింటిని గుర్తించింది. వీటిని ఎలా ముందుకు తీసుకెళ్లాలన్న దానిపై ప్రభుత్వానికి నివేదించనుంది.

మూడేళ్లలో సాధ్యమయ్యేనా?

ఎస్‌ఎల్‌బీసీ సొరంగ పనులు తొలి నుంచి నత్తకు పాఠాలు చెప్పేలా సాగుతున్నాయి. కృష్ణా నదీజలాలను వినియోగించుకొని తెలంగాణలోని అవిభాజ్య మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలోని సుమారు 4.50 లక్షల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో, 2004లో చేపట్టిన ఈ ప్రాజెక్టు పూర్తి కావడానికి మరో మూడేళ్లకు పైగా సమయం పట్టే అవకాశం ఉంది. 2020 అక్టోబర్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేసి తీరుతామంటూ పనులు చేస్తున్న ఏజెన్సీ ప్రభుత్వానికి హామీ ఇచ్చినా ప్రస్తుత పరిస్థితులను బట్టి అది సాధ్యమయ్యేలా లేదు. ప్రాజెక్టు ఆరంభం నుంచి సొరంగం పనుల్లో ఎప్పుడూ ఓ ఆటంకం ఎదురవుతుండగా, మొన్నటి వరకు టన్నెల్ బోరింగ్ మిషన్ పాడవడంతో దాని మరమ్మతులు జరిగాయి. ప్రస్తుతం సీపేజీ కారణంగా గంటకు 9,600 లీటర్ల మేర నీరు ఉబికి వస్తోంది. ఈ నీటిని తోడటం పెద్ద సమస్యగా మారింది. ప్రస్తుతం అక్కడ 6వేల లీటర్ల నీటిని తోడే సామర్థ్యం గల మోటార్లు ఉన్నాయి. దీంతో బోరింగ్ మెషీన్ మునగకుండా జాగ్రత్తలు తీసుకోవడంలోనే పుణ్యకాలం గడిచిపోతోంది. ఇప్పుడు ఊబికివస్తున్న నీటిని తోడాలంటే ఏకంగా 3 స్టేజుల్లో పంపింగ్ చేయాల్సి ఉంటుంది. దీనికే రూ.20కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం ఉందని రిటైర్డ్ ఇంజనీర్ల బృందం గుర్తించింది. ఇంకా 10 కిలోమీటర్ల మేర టన్నెల్ తవ్వాల్సి ఉండటం, ప్రస్తుత సమస్యల దృష్ట్యా దీని పూర్తికి మూడేళ్ల సమయం పట్టే అవకాశం కనిపిస్తోందని రిటైర్డ్ ఇంజనీర్ల బృందం అంచనా వేస్తోంది.

గోదావరి నుంచి 60 టీఎంసీల నదీ జలాలను వినియోగించుకుంటూ చేపట్టిన దేవాదుల ఎత్తిపోతల పథకానికి అనేక ఆటుపోట్లు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా ప్రాజెక్టులోని మూడో దశ సొరంగ పనుల్లో జరుగుతున్న జాప్యం ఎటూ పాలుపోనివ్వడం లేదు. దేవాదుల మూడో దశ పనులను

ముందుకుసాగని.. రామప్ప–ధర్మసాగర్

8 ప్యాకేజీలుగా విభజించి, 2.41 లక్షల ఎకరాలకు నీళ్లివ్వాలని నిర్ణయించారు. మూడో దశ ప్యాకేజీ–3లో భాగంగా రామప్ప నుంచి ధర్మసాగర్‌కు నీటిని తరలించేందుకు 54 కి.మీ.ల మేర సొరంగం తవ్వాల్సి ఉంది. ఈ టన్నెల్‌ను సలివాగు చెరువు కింది నుంచి ప్రతిపాదించగా, 2011లో చెరువు కింది సొరంగ ప్రాంతం కుంగి ప్రమాదం జరిగింది. రెండేళ్లుగా పనులు కూడా నిలిచిపోయాయి. దీనికి తోడు సొరంగం 7 కి.మీ. అటవీ మార్గంలో వెళ్తోంది. ఇక్కడి భూమి సొరంగం తవ్వకానికి అనుకూలంగా లేదు. దీంతో పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని ఇంజనీర్ల బృందం గుర్తించింది. సొరంగం 49వ కిలోమీటర్ వద్ద అండర్ గ్రౌండ్ పంప్‌హౌజ్ నిర్మాణం చేయాల్సి ఉండగా ఇక్కడి భూమి పొరలు అనుకూలంగా లేవని, దీంతో పంప్‌హౌజ్ పనులు ఆలస్యమవుతున్నాయని రిటైర్డ్ ఇంజనీర్లు పేర్కొన్నారు. కాగా ప్రాజెక్టు పరిధిలో పర్యటించిన శ్యాంప్రసాద్‌రెడ్డి, చంద్రమౌళి నేతృత్వంలోని రిటైర్డ్ ఇంజనీర్ల బృందం ఒకటిరెండు రోజుల్లో వీటిపై ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నివేదించనున్నారు. అడ్డంకులను ఎలా అధిగమించాలన్న దానిపై ఇంజనీర్లతో చర్చించిన అనంతరం ముఖ్యమంత్రి దీనిపై దిశానిర్దేశం చేసే అవకాశాలున్నాయి.

ఒకే ఇంట్లో వారి పేర్లు వేర్వేరు వార్డుల్లోనా?

- ఓటర్ల జాబితాలో తప్పులపై హైకోర్టు విస్మయం
- గుర్రంపోడు గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాను సవరించండి
- గడువులోగా కుదరకుంటే ఎన్నికను రీ షెడ్యూల్ చేయండి
- ఎన్నికల కమిషన్‌కు ఉన్నత న్యాయస్థానం ఆదేశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినంత మాత్రాన ఓటర్ల జాబితాకు పవిత్రత వచ్చినట్లు కాదని హైకోర్టు స్పష్టం చేసింది. ఓటర్ల జాబితాలో తప్పులకు ఆస్కారం లేనప్పుడే ఆ జాబితాకు పవిత్రత చేకూరుతుందని తేల్చి చెప్పింది. నల్లగొండ జిల్లా గుర్రంపోడు గ్రామంలో ఒకే ఇంట్లో నివాసం ఉంటున్న కుటుంబీకులను వేర్వేరు వార్డుల్లో ఓటర్లుగా చూపడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ప్రస్తుత కేసులో ఎన్నికల కమిషన్ తన విధులను నిర్వర్తించడంలో విఫలమైనట్లు కనిపిస్తోందని విమర్శించింది. గుర్రంపోడు గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాను సవరించాలని ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ఓటర్ల జాబితా సవరణ గడువులోగా సాధ్యం కాకపోతే గుర్రంపోడు గ్రామ పంచాయతీ ఎన్నికను రీ షెడ్యూల్ చేసి రెండో దశ లేదా మూడో దశలోనైనా సవరించిన జాబితా ఆధారంగా నిర్వహించాలని కమిషన్‌కు స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియ నిరాటంకంగా కొనసాగేందుకే ఈ విషయంలో తాము జోక్యం చేసుకుంటున్నామని వ్యాఖ్యానించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ పి. వి. సంజయ్ కుమార్ శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అంతకుముందు వాదనల సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాది పి. శ్రీహర్షారెడ్డి వాదిస్తూ ఓటర్ల జాబితా తయారీలో పంచాయతీ అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చునన్నారు. ఎన్నికల కమిషన్ అధీకృత అధికారిగా వ్యవహరించే వ్యక్తి తయారు చేసిన ఓటర్ల జాబితాను ఆమోదించాల్సిన అవసరం ఎన్నికల కమిషన్‌కు లేదని, ఆ జాబితా సక్రమంగా ఉందో లేదో పరిశీలించి తప్పులకు ఆస్కారం లేకుండా తిరిగి జాబితాను రూపొందించే అధికారం కమిషన్‌కు ఉందని తెలిపారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి గుర్రంపాడు గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాను సవరించాలని ఎన్నికల కమిషన్‌ను ఆదేశించారు.

ఏబీవీపీ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా ప్రవీణ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: డిసెంబర్ 27 నుంచి 30 వరకు అహ్మదాబాద్‌లో జరిగిన ఏబీవీపీ 64వ జాతీయ మహాసభల్లో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు ప్రవీణ్ రెడ్డిని సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా ఏబీవీపీ జాతీయ అధ్యక్షుడు సుబ్బయ్య నియమించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యారంగ, పరిశోధక విద్యార్థుల సమస్యల పరిష్కారానికై తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

సీపీఎస్ రద్దు కోసం దేశవ్యాప్త సమ్మెకు మద్దతు

టీఎన్జీవో నేతలు

సాక్షి, హైదరాబాద్: సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్న దేశ వ్యాప్త సమ్మెకు మద్దతు తెలుపుతున్నట్లు టీఎన్జీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కారం రవీందర్‌రెడ్డి, రాజేందర్ వెల్లడించారు. ఈ మేరకు నిరసన ప్రదర్శనల పోస్టర్‌ను టీఎన్జీవో భవన్‌లో విడుదల చేశారు. భోజన విరామ సమయంలో అన్ని జిల్లాల కలెక్టరేట్ కార్యాలయాల ముందు నిరసన ప్రదర్శనలు చేస్తామన్నారు. దీనిపై ఇప్పటికే సీఎస్‌కు సమాచారం ఇచ్చామని తెలిపారు.

సమస్యల సాధన సంవత్సరంగా సాగాలి

ఈ ఏడాది ఉద్యోగుల సమస్యల సాధన సంవత్సరంగా సాగాలని టీఎన్జీవో నేతలు అన్నారు. శనివారం సీఎస్ ఎస్‌కే జోషిని టీఎన్జీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కారం రవీందర్ రెడ్డి, రాజేందర్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

31 వరకు 'ఎమ్మెల్సీ' ఓటర్ల నమోదు

- ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన
- రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల స్థానానికి త్వరలో ఎన్నికలు

సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగనున్న రెండు ఉపాధ్యాయ, ఓ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదయ్యేందుకు ఈ నెల 31 వరకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశాన్ని కల్పించింది. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రులు/ఉపాధ్యాయుల నియోజకవర్గాలతో పాటు వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయుల మండలి నియోజకవర్గానికి త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ మూడు నియోజకవర్గాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాలను ఈ నెల 1న ప్రకటించారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలతో పాటు కొత్తగా ఓటర్ల నమోదుకు దరఖాస్తుల సమర్పణకు జనవరి 31 వరకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. 2018 నవంబర్ 1 అర్హత తేదీగా ఓటర్ల నమోదుకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. వచ్చే ఫిబ్రవరి 15 నాటికి మసాయిదా జాబితాపై అభ్యంతరాలు, దరఖాస్తులను పరిశీలించి అనుబంధ ఓటర్ల జాబితాలను ప్రచురించనున్నారు. ఫిబ్రవరి 20న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు.

పోలింగ్ కేంద్రాల సంఖ్య పెంపు

రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గానికి ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేసింది. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గంలో 41 కొత్త పోలింగ్ స్టేషన్లు కలిపి మొత్తం 313 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయుల నియోజకవర్గం/ వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయుల నియోజకవర్గంలో 59 కొత్త పోలింగ్ కేంద్రాలతో సహా మొత్తం 434 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

ధనా 'ధన్'



ఆయుధ వ్యాపారం @ 7 లక్షల కోట్లు

గత ఐదేళ్లలో 10% పెరిగిన అమ్మకాలు ☛ ఎక్కువ అమ్మకాలు అనిశ్చిత పశ్చిమాసియాలోనే..

మార్కెట్‌లో 34% వాటాతో అమెరికాదే అగ్రస్థానం ☛ ఈ వ్యాపారంలో సైలెంట్‌గా దూసుకొస్తున్న డ్రాగన్

వచ్చే దశాబ్దంలో యుద్ధ విమానాలకే ఎక్కువ గిరాకీ ☛ పెరుగుతున్న మార్కెట్‌పై ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆవేదన

ఓ నిరాయుధీకరణ, శాంతియుత ప్రపంచం కోసం ఉద్యమాలు, ఒప్పందాలు జరుగుతోంటే.. మరోవైపు విధ్వంసాలకు కారణమవుతున్న ఆయుధ వ్యాపారం వేల కోట్ల రూపాయలతో పెరుగుతూనే ఉంది. ప్రపంచంలో శాంతి నెలకొనాలంటూ ప్రకటనలు, భారీ స్పీచులు ఇస్తున్న అగ్రరాజ్యాలే.. ఈ ఆయుధ వ్యాపారంలో మొదటివరసలో ఉండటం గమనార్హం. అమెరికా, రష్యాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన తర్వాత ఆయుధ వ్యాపారం కాస్త మందగించింది. అయితే, అమెరికా, రష్యాలు మళ్లీ ఆధిపత్యం కోసం ప్రయత్నాలు చేస్తుండటం.. చైనా వీరికి పోటీ రావడంతో 2002 నుంచి ఈ వ్యాపారం మళ్లీ ఊపందుకుంది. దీనికితోడు సిరియా, యెమెన్ తదితర దేశాల్లో అంతర్యుద్ధాలు, దాయాది దేశాల మధ్య ఘర్షణలు ఈ ఆయుధ వ్యాపారానికి ఆజ్యం పోస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం ఏటా 10 వేల కోట్ల డాలర్ల (దాదాపు రూ.7లక్షల కోట్లు) ఆయుధ వ్యాపారం సాగుతోందని స్టాక్‌హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సిప్రీ)కి చెందిన సీనియర్ పరిశోధకుడు పీటర్ వెజెమన్ చెబుతున్నారు. 2008–12తో పోలిస్తే 2013–17లో భారీ ఆయుధాల అమ్మకాలు 10% పెరిగాయని రక్షణరంగ నిపుణులు అంటున్నారు.

– సాక్షి నాలెడ్జ్ సెంటర్

పశ్చిమాసియానే మొదటి కస్టమర్

అమెరికా నుంచి చాలా దేశాలు ఆయుధాలు కొనుగోలు చేస్తున్నా.. మెజారిటీ వాటామాత్రం పశ్చిమాసియా దేశాలదే. 2013–17మధ్య అమెరికా ఆయుధ ఎగుమతుల్లో దాదాపు సగం ఈ దేశాలకే జరిగాయి. ఇందుకు కారణం పశ్చిమాసియా దేశాల్లో రాజకీయ అస్థిరత, అంతర్యుద్ధాలు ఎక్కువగా జరుగుతుండటమే. ముఖ్యంగా సిరియా, యెమెన్‌లలో అంతర్యుద్ధాలు ఆయుధ వ్యాపారానికి ఆజ్యం పోశాయి. సౌదీ అరేబియా, ఈజిప్టు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లు కూడా అమెరికా నుంచి ఆయుధాలు దిగుమతి జాబితాలో ముందున్నాయి. 2012–16 మధ్యలో పశ్చిమాసియా దేశాల ఆయుధ దిగుమతులు 86% పెరిగాయని, ప్రపంచవ్యాప్తంగా జరిగిన ఆయుధ దిగుమతుల్లో ఇది 29% అని నిపుణులు చెబుతున్నారు.

అమెరికాయే నంబర్ వన్

ఆయుధాల ఎగుమతిలో అమెరికాదే అగ్రస్థానం. ప్రపంచవ్యాప్తంగా జరిగే ఆయుధ విక్రయాల్లో 34% వాటా అమెరికాదేనని సిప్రీ స్పష్టం చేసింది. ఐదేళ్ల క్రితం ఇది 30%. అమెరికా నుంచి భారీ మొత్తంలో ఆయుధాలను దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో సౌదీ అరేబియా ముందుంది. ఆయుధాల ఎగుమతి జాబితాలో అమెరికా తర్వాత స్థానం రష్యాదే. అయితే, రష్యాతో పోలిస్తే అమెరికా 58% ఎక్కువ ఎగుమతి చేస్తోంది. 2008–12తో పోలిస్తే 2013–17 మధ్య కాలంలో అమెరికా ఆయుధ విక్రయాలు 25% పెరగగా.. రష్యా విక్రయాలు 7.1% తగ్గాయి. మొత్తం ఆయుధ ఎగుమతుల్లో 74% వాటా.. అమెరికా, రష్యా, జర్మనీ, ఫ్రాన్స్, చైనాలదేనని సిప్రీ వివరించింది.

ఆఫ్రికాలో చిల్లర ఆయుధాలే

అన్ని దేశాల్లో ఆయుధాల దిగుమతులు పెరుగుతోంటే ఆఫ్రికా దేశాల్లో మాత్రం తగ్గుదల కనిపిస్తోంది. ఐదేళ్లలో ఈ దేశాల ఆయుధ దిగుమతులు 22% తగ్గాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంతమాత్రాన.. ఆఫ్రికా దేశాల్లో యుద్ధాలు జరగడం లేదని, ఆ దేశాలు ఆయుధాలను కొనడం మానేస్తున్నాయని దీనర్థం కాదు. సాధారణంగా కాంట్రాక్టు విలువల ఆధారంగా అంతర్జాతీయ స్థాయిలో ఆయుధ విక్రయాలను లెక్కిస్తారు. భారీ ఆయుధాల కొనుగోలుకే కాంట్రాక్టులు ఉంటాయి. చిన్న, తేలికపాటి ఆయుధాలు ఈ లెక్కలోకి రావు. ఉదాహరణకు ఏ దేశమైనా మూడు పెద్ద ఓడల నిండా మెషిన్‌గన్‌లను దిగుమతి చేసుకుంటే అవి అంతర్జాతీయ స్థాయి లెక్కల్లోకి రావు. ఆఫ్రికా దేశాల్లో దిగుమతులు తగ్గడానికి కారణం కూడా ఇదే. ఈ దేశాలన్నీ చిన్న చిన్న ఆయుధాలనే బాగా కొంటున్నాయని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తెలిపింది.



దూసుకొస్తున్న చైనా

అమెరికాతో వాణిజ్య, సాంకేతిక రంగాల్లోనే కాక ఆయుధ విక్రయాల్లో కూడా చైనా పోటీ పడుతోంది. చైనా తన రక్షణ బడ్జెట్‌ను పెంచుకోవడంతో పాటు ఆయుధ సరఫరాదారుగా కూడా మార్కెట్‌లోకి ప్రవేశించింది. తాజా వివరాల ప్రకారం.. ప్రస్తుతం చైనా ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆయుధ విక్రేత. అమెరికా, రష్యా, ఫ్రాన్స్, జర్మనీల తర్వాతి స్థానం చైనాదే. ఇటీవలే బ్రిటన్‌ను వెనక్కు నెట్టి డ్రాగన్ కంట్రీ ఐదో స్థానాన్ని సంపాదించుకుంది. 2008–12తో పోలిస్తే 2013–17 మధ్య చైనా ఆయుధ ఎగుమతులు 38% పెరిగాయి. అమెరికా తర్వాత అత్యధిక రక్షణ బడ్జెట్ కలిగిన దేశం కూడా చైనాయే. అత్యాధునిక ఆయుధాల తయారీలో కూడా చైనా ముందుందని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్‌కు చెందిన పరిశోధకురాలు మియా నౌవెన్స్ అన్నారు. సొంతంగా యుద్ధనౌకలను నిర్మించుకోవడమే కాకుండా పెద్ద ఎత్తున ఆయుధాలను విక్రయించడం ద్వారా బలమైన సైనిక శక్తిగా ఎదగాలని చైనా ఆకాంక్షిస్తోంది. 2013–17 మధ్య చైనా 48 దేశాలకు ఆయుధాలు విక్రయించింది. అయితే చైనా ఆయుధాల్లో ఎక్కువశాతం పాకిస్తాన్ ఖాతాలో చేరాయి. అమెరికా, రష్యా, జర్మనీ, ఫ్రాన్స్ దేశాలు ఆయుధాలు విక్రయించని.. ఇరాన్, వెనెజులా, సుడాన్, జింబాబ్వే వంటి దేశాలకు కూడా చైనా ఆయుధాలు విక్రయిస్తోంది. చైనా దూకుడుతో పోటీ పడేందుకు భారత్‌కూడా తన రక్షణ బడ్జెట్‌ను నెమ్మదిగా పెంచుతోంది. 2008–12తో పోలిస్తే 2013–17లో భారత్ రక్షణ దిగుమతులు 24% పెరిగాయి.

ప్రపంచంలోని ప్రముఖ ఆయుధ డీలర్లు, అమ్మకాలు (బిలియన్ డాలర్లలో)

ర్యాంకు	కంపెనీ	దేశం	అమ్మకాలు (2016)
1	లాక్‌హీడ్ మార్టిన్	అమెరికా	40.8
2	బోయింగ్	అమెరికా	29.5
3	రేథియాన్	అమెరికా	22.9
4	బీఏఈ సిస్టమ్స్	బ్రిటన్	22.8
5	నార్త్‌రాప్ గ్రుమన్	అమెరికా	21.4
6	జనరల్ డైనమిక్స్	అమెరికా	19.2
7	ఎయిర్‌బస్	ఈయూ	12.5
8	బీఏఈ సిస్టమ్స్	అమెరికా	9.3
9	ఎల్–3 టెక్నాలజీస్	అమెరికా	8.9
10	లియోనార్డో	ఇటలీ	8.5

యుద్ధ విమానాలకు గిరాకీ

ఆయుధాల తయారీ, ఎగుమతుల్లో తాజా ట్రెండ్ యుద్ధ విమానాలదే. 2027 కల్లా యుద్ధ విమానాల మార్కెట్ 24,900 కోట్ల డాలర్లకు (రూ.16.6 లక్షల కోట్లు) చేరుతుందని, 3,243 యుద్ధ విమానాలు తయారవుతాయని ఫోర్‌కాస్ట్ ఇంటర్నేషనల్ అనే సంస్థ 'ద మార్కెట్ ఫర్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్'పేరుతో విడుదల చేసిన అధ్యయన నివేదికలో పేర్కొంది. ఈ పదేళ్లలో తయారైన యుద్ధ విమానాలకంటే 13.1% ఎక్కువ విమానాలు వచ్చే పదేళ్లలో తయారవుతాయని పేర్కొంది. వచ్చే పదేళ్లలో ఏటా సగటున 280 విమానాలు తయారవుతాయని వెల్లడించింది. ఇందులో 1,466 విమానాలు లాక్‌హీడ్ మార్టిన్ తయారు చేసే ఎఫ్–35 విమానాలేనని తెలిపింది. ఈ నివేదిక ప్రకారం వచ్చే పదేళ్లలో అమెరికా ఎక్కువగా ఎఫ్–35 యుద్ధవిమానాలను కొంటుంది. భవిష్యత్తులో లాక్‌హీడ్ మార్టిన్ తయారు చేసే ఎఫ్–35 విమానాలను చాలా దేశాలు కొనే అవకాశం ఉంది. ఈ మార్కెట్‌లో 45% లాక్‌హీడ్ సొంతం చేసుకోనుంది. బోయింగ్ ఎఫ్–16, ఎఫ్/ఏ–18ఈ సూపర్ హార్నెట్, లాక్‌హీడ్ ఎఫ్–16 యుద్ధ విమానాలకు కూడా మళ్లీ డిమాండు పెరుగుతోంది. పశ్చిమాసియా దేశాల నుంచి యుద్ధ విమానాలకు ఎక్కువ డిమాండు ఉండబోతోంది. ఆ మేరకు బోయింగ్, లాక్‌హీడ్, డస్సాల్ట్, యూరోఫైటర్ కన్సార్టియంలు ఉత్పత్తిని పెంచుకోవలసి ఉంటుందని ఫోర్‌కాస్ట్ సంస్థ నిపుణుడు డగ్లాస్ రాయస్ చెప్పారు. వచ్చే పదేళ్లలో యూరోఫైటర్ టైఫూన్‌లు 95, డసాల్ట్ రఫేల్ విమానాలు 158 బయటకు వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. భారత ప్రభుత్వం కుదుర్చుకున్న రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంలో అక్రమాలేమీ లేవని సుప్రీంకోర్టు స్పష్టం చేసినా కూడా దానిపై రాజకీయ రచ్చ కొనసాగుతూనే ఉంది. పార్లమెంటులో అధికార, విపక్షాలు తీవ్రస్థాయిలో విమర్శలు చేసుకుంటున్నాయి.



ఆమ్నెస్టీ ఆందోళన

ఆయుధ వ్యాపారం మానవహక్కులను కాలరాస్తోందని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆరోపిస్తోంది. యుద్ధాలను, తిరుగుబాట్లను అణిచివేసేందుకు వినియోగిస్తున్న ఆయుధాలు అమాయక పౌరులను బలితీసుకుంటున్నాయని.. ఆమ్నెస్టీ ఆయుధ వ్యాపార నిపుణుడు అలివర్ ఫీలే ఆవేదన వ్యక్తం చేశారు. ఆయుధ వ్యాపారం ఎంతగా పెరిగితే మానవాళికి ముప్పు అంతగా పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. యెమెన్ యుద్ధంతో స్వీడన్, జర్మనీ, నెదర్లాండ్స్, నార్వే వంటి దేశాలు పశ్చిమాసియాలో ఆయుధాల విక్రయంపై ఆంక్షలు విధించాయని అలివర్ తెలిపారు. ఆయుధ వ్యాపారానికి వ్యతిరేకంగా 'క్యాంపేయిన్ అగెనెస్ట్ ద ఆరమ్స్ ట్రేడ్ (సీఏఏటీ) పేరుతో ఉద్యమం కూడా నడుస్తోంది. సౌదీకి బ్రిటన్ ఆయుధాలు విక్రయించడం సీఏటీటీకి విరుద్ధమంటూ.. ఈ సంస్థ బ్రిటన్ న్యాయస్థానంలో కేసు వేసింది. అయితే, బ్రిటన్ ఆయుధ విక్రయాలు చట్టబద్ధమేనని గత జూలైలో ఆ కోర్టు తీర్పునిచ్చింది.

సమోసా, టీ, దిల్‌పసంద్..

- సంక్షేమ హాస్టళ్లలో టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక మెనూ
- రాత్రి పూట కూడా స్నాక్స్ ఇవ్వాలని నిర్ణయం
- నూరు రోజుల పాటు అమలు



సాక్షి, హైదరాబాద్: సంక్షేమ వసతి గృహాల్లోని పదో తరగతి విద్యార్థుల కోసంప్రత్యేక మెనూను ప్రభుత్వం అమలు చేస్తోంది. పదోతరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో అభ్యాసనకు ఎక్కువ సమయం కేటాయించేలా సంక్షేమ శాఖలు ప్రణాళికలు రూపొందించాయి. దీనిలో భాగంగా రాత్రి 11 గంటల వరకు స్టడీ అవర్స్ కొనసాగించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకు ఎస్సీ అభివృద్ధి శాఖ అదనంగా స్నాక్స్ ఇవ్వాలని నిర్ణయించింది. ప్రస్తుతం వసతి గృహాల్లోని విద్యార్థులకు ఉదయం అల్పాహారంతో పాటు సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనాన్ని ఇస్తున్నారు. మధ్యాహ్నం పూట మాత్రం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఇస్తున్నారు. విద్యార్థులకు రాత్రి భోజనం సాయంత్రం 7 గంటలకు ఇస్తుండటంతో 9 గంటల ప్రాంతంలో నిద్రకు ఉపక్రమిస్తారు.

టెన్త్ విద్యార్థులకు అదనం..

పదో తరగతి విద్యార్థులకు మాత్రం అదనంగా రాత్రి 9.30 గంటల ప్రాంతంలో మరోసారి ఇవ్వనున్నారు. పరీక్షలకు సన్నద్ధమయ్యే టెన్త్ విద్యార్థులకు సమోసా, దిల్‌పసంద్, టీ, పండ్లు తదితరాలు రోజుకో రకం చొప్పున ఇవ్వనుంది. ఇలా పరీక్షలు ముగిసే వరకు ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ప్రత్యేక బడ్జెట్‌ను ఎస్సీ అభివృద్ధి శాఖ విడుదల చేసింది. ఒక్కో విద్యార్థిపై రోజుకు రూ. 15 చొప్పున వంద రోజుల పాటు ఖర్చు చేయనుంది. ప్రస్తుతం ఎస్సీ అభివృద్ధి శాఖ పరిధిలో 715 సంక్షేమ హాస్టళ్లున్నాయి. వీటిలో పదో తరగతి చదువుతున్న వారు 22 వేలకుపైగా ఉన్నారు. ఎస్సీ అభివృద్ధి శాఖలో రెండ్రోజుల నుంచి కొత్త మెనూను అమలు చేస్తున్నారు. ఈ ప్రయత్నానికి మంచి స్పందన వస్తోంది. విద్యార్థులు కూడా ఉత్సాహంతో స్టడీ అవర్స్‌లో కొనసాగుతున్నారని ఎస్సీ అభివృద్ధి శాఖ సంచాలకులు పి.కరుణాకర్ 'సాక్షి'తో అన్నారు.

త్వరలో ఎస్టీ, బీసీ హాస్టళ్లలోనూ..

ఎస్సీ అభివృద్ధి శాఖ పరిధిలోని హాస్టళ్లలో పదో తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న ప్రత్యేక మెనూను వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, గిరిజన అభివృద్ధి శాఖలో కూడా అమలు చేసేందుకు ఆయా శాఖ చర్యలు తీసుకుంటున్నాయి. అత్యుత్తమ ఫలితాల కోసం వినూత్న కార్యక్రమాలు చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: మహేశ్‌దత్

సాక్షి, హైదరాబాద్: గిరిజన ప్రాంతాల్లో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి బెనూర్ మహేశ్ దత్ ఎక్కా అధికారులను ఆదేశించారు. శనివారం డీఎస్ఎస్ భవన్‌లో గిరిజన సంక్షేమ శాఖ కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలని, నవజాత శిశువుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధులు, నివారణ తదితరాలపై వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ యోగితా రాణా వివరించారు. అనంతరం మహేశ్‌దత్ తెలంగాణ గిరిజన చిత్రలేఖనాలతో కూడిన కేలండర్ ఆవిష్కరించారు. గిరిజన కమిషనరేట్ కార్యాలయంలో కొత్తగా ప్రారంభించిన ఈ–స్టూడియోను సందర్శించి విద్యాబోధన తీరును తెలుసుకున్నారు.

జనశక్తి నెట్‌వర్క్ బ్రేక్!

- భారీ స్థాయిలో వ్యూహాలు రచించిన కూర రాజన్న
- ప్రతీ గ్యాంగ్‌కు ఆయుధాలు అందజేత
- మళ్లీ పుంజుకునేందుకు విఫలయత్నం
- సిద్దిపేట, జగిత్యాల జిల్లాల్లో అరెస్టుల పరంపర

సాక్షి, హైదరాబాద్/జగిత్యాలక్రైం: ఓ ప్రభుత్వాధికారి, ఓ కాంట్రాక్టర్ బెదిరింపు వ్యవహారం.. మిలిటెంట్ మల్లన్న గ్యాంగ్‌కు పోలీసులు చెక్‌పెట్టేలా చేసింది. జనశక్తి పేరిట మళ్లీ నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుంటున్న కూరరాజన్న, ఆనంద్‌లకు భారీ షాక్ తగిలింది. సిద్దిపేట జిల్లా కొండపాక ఇంజనీర్‌ను బెదిరించిన వ్యవహారంలో జనశక్తి దళసభ్యుడు సాయికిరణ్ అరెస్ట్ వ్యవహారం సంచలనం రేపగా, ఈ ముఠా చేసిన ఆగడాలు భారీ స్థాయిలో బయటపడ్డాయి. సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, జగిత్యాలలో జనశక్తిని బలోపేతం చేసేందుకు కూరరాజన్న చేసిన వ్యూహాలు బెడిసికొట్టాయి. 'ఎవరన్నా.. మల్లన్న'శీర్షికన 'సాక్షి'ప్రచురించిన కథనం జనశక్తి నెట్‌వర్క్‌ను పోలీసులు బ్రేక్ చేసేలా చేసింది.

భారీ వ్యూహంతో..

ప్రతి జిల్లాలోని మారుమూల ప్రాంతాలను టార్గెట్‌గా ఎంచుకోవడం, అక్కడ జనశక్తి పేరిట పోస్టర్లు వేసి ప్రజలను భయబ్రాంతులకు గురిచేసేందుకు కూరరాజన్న, జనశక్తి నేత, నల్లగొండ వాసి ఆనంద్ వ్యూహం పన్నినట్లు పోలీసులు గుర్తించారు. ఇందులో భాగంగా సిరిసిల్ల, సిద్దిపేట, జగిత్యాల జిల్లాల్లో నెట్‌వర్క్ ఏర్పాటుచేసుకొని అత్యాధునిక ఆయుధాలు సైతం అందించినట్లు విచారణలో తేలింది. ఈ జిల్లాల్లో బీడీ కంపెనీలు, బడా కాంట్రాక్టర్లు, ప్రముఖ డాక్టర్లను టార్గెట్‌గా చేసుకొని వసూళ్లకు తెగబడ్డారు. ఇంజనీర్‌ను బెదిరించిన సాయికిరణ్.. సిరిసిల్లా, సిద్దిపేట, జగిత్యాలతో అనేక మందిని బెదిరించి డబ్బులు వసూలు చేశాడని, ఆ డబ్బులను జనశక్తి నేత కూర రాజన్నతో పాటు ఆనంద్‌లకు అందించినట్లు పోలీసులు గుర్తించారు. తుపాకీతో బెదిరించి రూ.2 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు డిమాండ్ చేసేవాడని జగిత్యాల అదనపు ఎస్పీ మురళీధర్ వెల్లడించారు.

వసూళ్ల పర్వం ఇలా..

- జనవరి 2018లో తాగూర్ బీడీ కంపెనీ మేనేజర్‌ను బెదిరించి రూ.1లక్ష డిమాండ్. ఈ ఘటన తర్వాత వారం రోజులకు నిజామాబాద్‌లోని మరో బీడీ కంపెనీకి రూ.1 లక్ష డిమాండ్ వసూలు.
- ఆగస్టు 2018లో కరీంనగర్‌లోని కాకతీయ పాఠశాల, కాలేజీ యాజమాన్యానికి బెదిరింపు, రూ.1.5 లక్షలు పార్టీ ఫండ్ పేరిట డిమాండ్. ఇదే నెలలో సిరిసిల్లలోని దేశాయి బీడీ కంపెనీ మేనేజర్ దగ్గరకు వెళ్లి నెలకు రూ.3.5 లక్షల చొప్పున ప్రతి నెలా పార్టీకి ఫండ్ ఇవ్వాలని బెదిరించారు. ఈ ఘటనకు తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్ సాగర్‌కు సంబంధం ఉన్నట్లు గుర్తించారు.
- జూన్ 2018లో అరుణోదయ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు దుడం లచ్చయ్యతో కలసి సిద్దిపేటలోని ఓ భూమి వివాదంలో అంజయ్య అనే వ్యక్తిని తుపాకీ పెట్టి బెదిరించి పంచాయితీ చేశారు. ఈ వ్యవహారంలో రూ.4 లక్షలు వసూలు చేశారు. ఇదే నెలలో లంగర్ బీడీ కంపెనీ మేనేజర్ రాజేశ్‌ను సాయికిరణ్ సంతోష్, బీడీల రాములుతో కలసి బెదిరించి రూ.50వేలు వసూలు చేసినట్టు విచారణలో బయటపడింది.
- జూలైలో జనశక్తి రాష్ట్ర కమిటీ సభ్యుడు సంతోష్, సాయికిరణ్ సిరిసిల్లలోని డాక్టర్ ప్రసాద్, డాక్టర్ రమణరావు, డాక్టర్ పెంచలయ్యను బెదిరించి రూ.60 వేలు వసూలు చేశారు.
- సెప్టెంబర్‌లో సిద్దిపేట జిల్ల దౌల్తాబాద్ జెడ్పీటీసీ భర్త భూపాల్‌రెడ్డి ద్వారా సాయికిరణ్, ఇతర దళ సభ్యులు జక్కుల బాబు, మహేందర్, కలసి కొండపాక ఇంజనీర్ ప్రసాద్‌తో పాటు మరో కాంట్రాక్టర్‌ను తుపాకీతో బెదిరించి రూ.10లక్షలు డిమాండ్ చేశారు.
- అక్టోబర్, 2018లో దుబ్బాకకు చెందిన చిందం రాజ్‌కుమార్ అనే వ్యక్తిని బెదిరించి రూ.10 వేలు, కోళ్ల ఫారం యజమాని నర్సింహులు నుంచి రూ.10 వేలు వసూలు చేశారు. అక్టోబర్ చివరి వారంలో సిద్దిపేట బీడీ కంపెనీ యజమాని బాలకృష్ణను బీడీల రాములుతో కలసి బెదిరించి రూ.4 వేలు, భూంపల్లికి చెందిన నాగభూషణం అనే వ్యక్తి నుంచి బలవంతంగా రూ.వెయ్యి వసూలుచేసినట్లు తెలిసింది.
- 2018 డిసెంబర్‌లో జగిత్యాల జిల్లా పరిధిలోని వైష్ణవి స్టోన్ క్రషర్స్ యజమానిని దళ సభ్యులు సంతోష్, మహేందర్, విష్ణుతో కలిసి రూ.5 లక్షలు ఇవ్వాలని బెదిరించారు. ఇంతలోనే బెదిరింపుల వ్యవహారం గుట్టురట్టు కావడంతో సాయికిరణ్ పోలీసులకు దొరికిపోయాడు.

అసెంబ్లీ ఎన్నికల్లో అలజడికి కుట్ర..

జనశక్తి సెంట్రల్ కమిటీ కార్యదర్శిగా ఉన్న కూర రాజన్న అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలను భయాందోళనకు గురిచేసేందుకు కుట్ర పన్నినట్లు పోలీసులు గుర్తించారు. ఇందుకు బ్యానర్లు, పోస్టర్లు సైతం సరఫరా చేసినట్లు జగిత్యాల పోలీసులు విచారణలో బయటపడింది. కొడిమ్యాల మండలంలోని సూరంపల్లిలో బ్యానర్లు కట్టారని, దీంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారని పోలీసులు వెల్లడించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న తుపాకీ, బులెట్లు

ఏడుగురు అరెస్ట్..

మల్లన్న గ్యాంగ్‌కు చెందిన ఏడుగురిని సిద్దిపేట జిల్లా పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేటకు చెందిన సంతోష్, మహేందర్, మల్లేశ్‌గౌడ్, లక్ష్మీనర్సయ్య, రాములు, రాజేశ్వర్, మల్లేశం అనే వారిని అరెస్ట్ చేసినట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ జోయల్ డేవిస్ మీడియాకు వెల్లడించారు. ఒక పిస్టల్‌తో పాటు 35 రౌండ్ల బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్టయిన వారిలో ముగ్గురు సిరిసిల్ల, జగిత్యాల, కామారెడ్డి ప్రాంతాల్లో పలు కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు సీపీ వెల్లడించారు.

యూజీసీ నెట్ ఫలితాలు విడుదల

అతి తక్కువ సంఖ్యలో అర్హత సాధించిన అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్: యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) పరీక్ష ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. దేశవ్యాప్తంగా నెట్ అర్హత పరీక్షకు 9,56,837 మంది దరఖాస్తు చేసుకున్నారు. 235 నగరాల్లో గతేడాది డిసెంబర్ 18నుంచి 22వ తేదీ వరకు నిర్వహించిన రాతపరీక్షకు 6,81,930 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ విభాగంలో 44,001 మంది, జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రెండింటికీ 3,883 మందే అర్హత సాధించినట్లు బోర్డు తెలిపింది. 6.8 లక్షలమంది పరీక్ష రాయగా కేవలం ఇంత తక్కువ స్థాయిలో అర్హత సాధించడంపై విద్యానిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వివిధ రూట్లలో ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్–విశాఖ (82733/82734) స్పెషల్ సువిధ రైలు ఈ నెల 11 సాయంత్రం 4.30 కి సికింద్రాబాద్ నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 4.50కి విశాఖ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 12 సాయంత్రం 5.35కు విశాఖ నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 5.30కి సికింద్రాబాద్ చేరుకుంటుంది. కాకినాడ–లింగంపల్లి (82730) సువిధ ట్రైన్ ఈ నెల 17 రాత్రి 9 గంటలకు కాకినాడ నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9.55కు లింగంపల్లి చేరుకుంటుంది. మచిలీపట్నం–సికింద్రాబాద్ (82729) సువిధ ట్రైన్ 20 రాత్రి 9.30కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.55కు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

ఈ ఏడాదీ అగ్ని ప్రమాదాల నివారణ సంవత్సరమే

- ప్రమాదాలను పసిగట్టేందుకు నేషనల్ రిమోట్‌సెన్సింగ్‌తో ఒప్పందం
- అగ్నిప్రమాదాలను సున్నా శాతానికి తెచ్చేందుకు అటవీ శాఖ ప్రయత్నాలు

సాక్షి, హైదరాబాద్ : అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు గతేడాది చేపట్టిన చర్యలు ఫలప్రదం కావడంతో, వాటిని కొనసాగించడంతో పాటు మరిన్ని జాగ్రత్తలు చేపట్టేందుకు రాష్ట్ర అటవీశాఖ చర్యలు చేపడుతోంది.ఈ నేపథ్యంలో ఈ ఏడాదినీ అగ్నిప్రమాదాల నివారణ సంవత్సరంగా పాటించాలని ఆ శాఖ నిర్ణయించింది. రాష్ట్రంలోని అడవుల్లో సంభవించే అగ్ని ప్రమాదాలను సున్నా శాతానికి తెచ్చే దిశగా ప్రయత్నాలు ప్రారంభించింది. ఉపగ్రహ చిత్రాల ద్వారా రాష్ట్రంలోని అడవుల్లో ఎక్కడా పొగ, లేదా అవాంఛనీయ పరిస్థితులు వంటివి కనిపించినా అప్రమత్తం చేసేలా నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ తో (ఎన్ఆర్ఎస్‌సీ) అటవీశాఖ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. అగ్ని ప్రమాదాలను ముందే పసిగట్టడం, నివారణ చర్యలతో పాటు వాటిపై అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండే ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు కొనసాగిస్తోంది.అడవిపై ఆధారపడి జీవించే వారి కార్యకలాపాలు రోజువారీ విధుల్లో భాగంగా గమనించటంతో పాటు, ప్రమాదాల నివారణలో వారినీ భాగస్వామ్యం చేయాలని అటవీ శాఖ నిర్ణయించింది.

రెండురోజుల శిక్షణ...

ప్రమాదాల నివారణ, ప్రమాద సమయాల్లో అవసరమైన యంత్ర సామాగ్రి, వినియోగంపై దూలపల్లి అటవీ అకాడమీలో అటవీశాఖ సిబ్బందికి ఇచ్చిన రెండు రోజుల శిక్షణ శనివారం ముగిసింది. మానవ నిర్లక్ష్యం వల్ల జరిగే అగ్ని ప్రమాదాల వల్ల అమూల్యమైన అటవీ సంపదను కోల్పోవటంతోపాటు, పర్యావరణానికి భారీ ముప్పు కలుగుతోందని వీటికి ముందస్తు జాగ్రత్త చర్యలే ముఖ్యమని ఈ కార్యక్రమంలో పాల్గొన్న పీసీసీఎఫ్ పీ. రఘువీర్ పేర్కొన్నారు. ఈ దిశగా అటవీ సమీప ప్రాంతాల్లో నివసించే వారిని, బీడీ ఆకులు, అటవీ ఉత్పత్తుల కోసం అడవుల్లోకి వెళ్లేవారిని సిబ్బంది నిత్యం అప్రమత్తం చేయాలన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్షేత్ర స్థాయి అటవీ సిబ్బందికి రీజనల్ ఫైర్ ఆఫీసర్ వర్ల పాపయ్య శిక్షణ ఇచ్చారు. మంటలను ఆర్పే సమయంలో ఎలా వ్యవహరించాలి, ఎలాంటి దుస్తులు, సామగ్రి వాడాలనే దానిపై అధికారులు లైవ్ డెమో నిర్వహించారు. అగ్ని ప్రమాదాల నివారణ దిశగా ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు రిటైర్డ్ టీచర్ వల్లంపట్ల నాగేశ్వర్‌రావు రూపొందించిన కళారూపకాన్ని కూడా ప్రదర్శించారు.

సార్వత్రిక సమ్మెకు టీటీఎఫ్ మద్దతు

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 8, 9 తేదీల్లో దేశవ్యాప్తంగా ఉద్యోగ, కార్మిక సంఘాలు నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ (టీటీఎఫ్) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఇందులో భాగంగా ఆ రెండ్రోజులు మండల, డివిజన్, జిల్లా కేంద్రాలలో జరిగే ర్యాలీలు, సమావేశాల్లో పాల్గొననున్నట్లు టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఇ.రఘునందన్, కె.రమణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792